ఈనాడు
విజయవాడ 18-7-2025 శుక్రవారం సిటీ సంపుటి 51 . సంచిక 339
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 16
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఆర్ఐసీ పునరుద్ధరణపై రష్యా, చైనా ఆసక్తి

బీజింగ్: రష్యా చొరవతో గతంలో ఏర్పాటై ప్రస్తుతం స్తబ్దుగా ఉన్న రష్యా-ఇండియా-చైనా (ఆర్ఐసీ) త్రైపాక్షిక కూటమిని పునరుద్ధరించాలన్న రష్యా ప్రతిపాదనకు చైనా సానుకూలంగా స్పందించింది. ఈ కూటమి మూడు దేశాల ప్రయోజనాలకే కాకుండా.. ప్రపంచ సుస్థిరతకు తోడ్పడుతుందని పేర్కొంది. ఆర్ఐసీని పునరుద్ధరించడంపై చైనా, భారత్‌లతో సంప్రదింపులు జరుపుతున్నామని రష్యా విదేశాంగశాఖ ఉపమంత్రి ఆండ్రీ రుడెంకో పేర్కొన్న నేపథ్యంలో చైనా విదేశాంగశాఖ ప్రతినిధిని స్పందించాలని కోరగా.. తామూ అందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఆర్ఐసీ సంబంధిత చర్చలు కరోనా కాలంలో నెమ్మదించగా.. 2020లో లద్దాఖ్‌లో చైనా, భారత్‌ల మధ్య తలెత్తిన సైనిక ఘర్షణలతో పూర్తిగా నిలిచిపోయాయి.

ఎండ వేడికి కాలుష్య కణాల చెక్!

దిల్లీ: మోటారు వాహనాలు, ఫ్యాక్టరీల నుంచి వెలువడే ఏరోసాల్స్ కాలుష్య కారకాలే. అయితే సూర్యకాంతిని అంతరిక్షంలోకి పరావర్తనం చెందించి వడగాలులను తగ్గించడంలో అవి దోహదపడుతుంటాయి. 1920 నుంచి వాహన, పారిశ్రామిక కాలుష్యాల వల్ల నగరాలు, పారిశ్రామిక ప్రాంతాల్లో ఏరోసాల్స్ పెరిగి ఉష్ణ ప్రభంజనాలను తగ్గిస్తూవచ్చాయి. కానీ ఇప్పుడు కాలుష్య నివారణ కృషి ఊపందుకోవడంతో ఏరోసాల్ ఉద్గారాలు తగ్గి ఎండ వేడి, వడగాలులు పెరిగిపోతున్నాయని అమెరికాలోని టెక్సాస్ విశ్వవిద్యాలయ పరిశోధకుల అధ్యయనం తెలిపింది. ఏరోసాల్స్ తగ్గి గాలి శుభ్రపడినకొద్దీ వడగాలులు పెరగనున్నాయి. ప్రస్తుతం ఏటా దాదాపు 40 హీట్‌వేవ్స్ సంభవిస్తుంటే 2080కల్లా అవి 110కి పెరగనున్నాయి. సహారా ఎడారి దిగువ దేశాల్లో, భారత్ వంటి దక్షిణాసియా దేశాలు, దక్షిణ అమెరికా ఖండం, పశ్చిమ ఐరోపా దేశాలలో హీట్‌వేవ్స్ అధికం కానున్నాయి. అలాగని ఏరోసాల్స్ వెలువడటం మంచిదని తాము చెప్పట్లేదని ప్రధాన పరిశోధకురాలు గీతా ప్రసాద్ పేర్కొన్నారు. కర్బన ఉద్గారాలను నిర్మూలించడం ద్వారా వాతావరణ సమతూకాన్ని కాపాడాలని సూచించారు.

జ్ఞాన నేత్రం

విశ్వ అసమతుల్యతపై లోతుగా పరిశోధన


దిల్లీ: మహా విస్ఫోటం (బిగ్ బ్యాంగ్) ద్వారా విశ్వం ఆవిర్భవించినప్పుడు పదార్థం (మ్యాటర్), విరుద్ధ పదార్థం (యాంటీమ్యాటర్) సరిసమానంగా ఏర్పడి ఉండాలి! కానీ వాస్తవంలో విశ్వంలో యాంటీ మ్యాటర్ కన్నా మ్యాటరే ఎక్కువగా ఉంది. ఈ అసమతూకానికి కారణమేంటనేది భౌతికశాస్త్రంలో కీలక ప్రశ్న. మ్యాటర్ కణాలకూ, యాంటీమ్యాటర్ కణాలకూ ద్రవ్యరాశి సమానమే అయినా, వాటికి పరస్పర విరుద్ధ విద్యుదావేశాలు ఉంటాయి. ఒక మ్యాటర్ పార్టికల్‌ను ఓ యాంటీమ్యాటర్ పార్టికల్ స్థానభ్రంశం చెందించినప్పుడు భౌతికశాస్త్ర నియమాలు ఉల్లంఘనకు లోనవుతాయి. దీన్ని ఛార్జ్ పారిటీ (సీపీ) అంటారు. గతంలో మీసాన్ సబ్ అటామిక్ పార్టికల్స్‌లో సీపీ కనిపించింది. మీసాన్ బరువు ఎలక్ట్రాన్, ప్రోటాన్లకు మధ్యస్థంగా ఉంటుంది. ప్రోటాన్లు, న్యూట్రాన్లను బేర్యాన్ అంటారు. మనకు తెలిసిన విశ్వంలోని మ్యాటర్ దాదాపు బేర్యాన్ కణాలతోనే ఏర్పడింది. బేర్యాన్ ప్రోటాన్, మీసాన్‌గా విడిపోయినపుడు సీపీ జరిగిందని ఐరోపా అధ్యయనం వెల్లడించింది. దీన్ని మరింత లోతుగా పరిశీలిస్తే మరిన్ని భౌతిక శాస్త్ర నియమాలు వెల్లడవుతాయి.

ఆ ఆస్తికి యజమాని.. మృతుని భార్యే: సుప్రీంకోర్టు

దిల్లీ: వీలునామాలో ప్రస్తావించనంతమాత్రాన భర్త ఆస్తికి భార్య యజమాని కాకుండాపోదని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. ఆమె హోదా గురించి వెల్లడించకపోవడం కూడా దీనికి అడ్డంకి కాదని తేల్చిచెప్పింది. భార్యే యజమాని అంటూ 2009లో పంజాబ్-హరియాణా హైకోర్టు వెలువరించిన తీర్పును సమర్థించింది. దీనిని సవాల్ చేసిన పిటిషన్‌ను జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీల ధర్మాసనం గురువారం కొట్టివేసింది. 1991 నవంబరులో ఓ వ్యక్తి మృతి చెందారు. ఆయనకు ఉన్న భూమి తనకే చెందుతుందని, ఆ మేరకు విల్లు ఉందని మృతుని మేనల్లుడు కేసు వేశారు. ఈ విల్లు అసలైనదేనని, దాని ప్రకారం మేనల్లుడే చట్టపరంగా ఆ భూమికి యజమాని అని ట్రయల్‌కోర్టు ప్రకటించింది. దీనిని, తొలి అప్పీలు న్యాయస్థానం తీర్పును హైకోర్టు కొట్టివేసింది. మృతుని భార్యే ఆ భూమికి యజమాని అవుతారని ప్రకటించింది. కోర్టులో కేసు విచారణలో ఉన్నకాలంలో మృతుని భార్య, మేనల్లుడు చనిపోయారు. వారి వారసులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

..ఇది మిగతా పత్రాల్లాంటిది కాదు

“వీలునామా అంటే మిగతాపత్రాల్లాంటిది కాదు. ఇది అమల్లోకి వచ్చేటప్పుడు దానిని రాసిన వారు భూమ్మీద ఉండరు. అందువల్ల ఇది సక్రమంగా అమలైందా లేదా తేల్చిచెప్పాల్సిన విహిత కర్తవ్యం కోర్టులపై ఉంది. భార్య హోదా గురించి రాయకపోవడం వంటి అనుమానాస్పద పరిస్థితులు, దానికి కారణాలు వంటివి విడిగా కాకుండా.. కేసులో మిగతా అంశాలతోపాటే చూడాలి.



వీలునామా తన పేరిట ఉందని ప్రకటించడానికి, మృతుడి భార్య హోదాలో ప్రతివాది లేదని తిరస్కరించడానికి మేనల్లుడు ప్రయత్నిస్తున్నారు. వీలునామా నిగూఢంగా ఉంది. ఆస్తుల రక్షణ బాధ్యతను మేనల్లుడికి అప్పగించారని ఇది చాటుతోంది. సొంత భార్య, సహజ వారసురాలైన మొదటి ప్రతివాది గురించి ఇది మౌనం దాల్చింది. మృతుడికి అంత్యక్రియల్ని భార్య నిర్వర్తించకపోవడం వారిమధ్య దెబ్బతిన్న సంబంధాలను చాటుతోందని ట్రయల్‌కోర్టు చెప్పడం తప్పిదమే. సాధారణంగా హిందువులు, సిక్కుల్లో అంత్యక్రియలను ‘సపిండ సంబంధ’ పురుషులు నిర్వర్తిస్తారు. ఈ ఆచారం ప్రకారం చూస్తే ఆమె తన భర్త అంత్యక్రియల్ని నిర్వర్తించకపోవడం ఆ భార్యాభర్తల మధ్య దెబ్బతిన్న సంబంధాలకు నిదర్శనంగా చూడకూడదు” అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.



భారీవర్షాలతో అమర్‌నాథ్ యాత్రకు అంతరాయం

దిల్లీ: గత రెండ్రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా అమర్‌నాథ్ యాత్రను నిలిపివేశారు. పహల్గాం, బాల్టాల్ శిబిరాల వద్దనుంచి ఈ యాత్రకు గురువారం తాత్కాలిక విరామం ఇచ్చినట్లు అధికారులు వెల్లడించారు. బుధవారం రాత్రే పంజ్‌తామి శిబిరానికి చేరుకున్నవారిని మాత్రం బాల్టాల్‌కు వెళ్లడానికి సహాయక బృందాల చేయూతతో అనుమతించినట్లు తెలిపారు. మిగిలిన రెండుమార్గాల్లో దెబ్బతిన్న ప్రాంతాలను సాధ్యమైనంత త్వరగా పునరుద్ధరించడానికి చర్యల్ని వేగవంతం చేశారు. వాతావరణ పరిస్థితులు మెరుగుపడితే యాత్రను శుక్రవారం పునరుద్ధరించే అవకాశం ఉంది. యాత్ర కొనసాగే మార్గాలు సహా జమ్మూకశ్మీర్‌లోని మరికొన్ని ప్రాంతాల్లో రెండ్రోజులపాటు భారీఎత్తున వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తాజాగా హెచ్చరించింది.

ఒక్కరోజు వ్యవధిలో 3 క్షిపణి పరీక్షలు

దిల్లీ: సైనిక పాటవాన్ని సగర్వంగా చాటిచెప్పేలా భారత్ ఒక్కరోజు వ్యవధిలో మూడు కీలక క్షిపణులు.. పృథ్వీ-2, అగ్ని-1, ఆకాశ్ ప్రైమ్‌లను విజయవంతంగా పరీక్షించింది. నిర్వహణ, సాంకేతికతకు సంబంధించి నిర్దేశిత పరామితులను అవి సజావుగా అందుకున్నాయని రక్షణ శాఖ వెల్లడించింది. స్వల్పశ్రేణి బాలిస్టిక్ క్షిపణులైన పృథ్వీ-2, అగ్ని-1లను ఒడిశాలోని చాందీపుర్‌లో సమీకృత పరీక్షా కేంద్రం నుంచి గురువారం స్ట్రాటెజిక్ ఫోర్సెస్ కమాండ్ పరీక్షించింది. పృథ్వీ-2 క్షిపణి 350 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను ఛేదిస్తుంది. అది 500 కిలోల పేలోడ్‌ను మోసుకెళ్లగలదు. అగ్ని-1 క్షిపణి 700-900 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను ఛేదించగలదు. వెయ్యి కిలోల పేలోడ్‌ను మోసుకెళ్లగలదు.

మరోవైపు- ఎత్తయిన ప్రాంతాల్లో పోరాట సామర్థ్యాలను మరింత పెంచుకునే లక్ష్యంతో దేశీయంగా అభివృద్ధి చేసిన ఆకాశ్ ప్రైమ్ క్షిపణిని లద్దాఖ్‌లో బుధవారం పరీక్షించారు. రెండు హైస్పీడ్ గగనతల లక్ష్యాలను అది విజయవంతంగా ఛేదించింది. ఆకాశ్ ప్రైమ్ అనేది భారత సైన్యం కోసం రూపొందించిన ఆకాశ్ ఆయుధ వ్యవస్థలోని అప్‌గ్రేడెడ్ వేరియంట్. సముద్ర మట్టం నుంచి 4,500 మీటర్లకుపైగా ఎత్తున్న ప్రాంతాల్లో లక్ష్యాలను కచ్చితత్వంతో ఛేదించేందుకు దీన్ని ప్రత్యేకంగా రూపొందించారు. దేశీయంగా అభివృద్ధి చేసిన రేడియో ఫ్రీక్వెన్సీ సీకర్‌ను తాజాగా అందులో పొందుపరిచారు. ప్రస్తుతం లద్దాఖ్‌లో వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ)కు చేరువగా ఈ క్షిపణిని పరీక్షించడం ప్రాధాన్యం సంతరించుకుంది.



లద్దాఖ్‌లో దూసుకెళ్తున్న ఆకాశ్ ప్రైమ్ క్షిపణి

శ్రీలంకలో బయటపడిన 65 అస్థిపంజరాలు

కొలంబో: శ్రీలంకలో 1990లో జరిగిన ఎల్‌టీటీఈ ఘర్షణలో మృతిచెందిన 65 మంది అస్థిపంజరాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. వీటిలో నాలుగైదేళ్ల చిన్నారి అవశేషాలు కూడా ఉన్నాయని గుర్తించినట్లు అధికారులు తెలిపారు. జాఫ్నా జిల్లాలోని చెమ్మానీ సమాధుల వద్ద ఈ ఏడాది ప్రారంభంలో పలు అభివృద్ధి పనులు చేస్తుండగా ఓ అస్థిపంజరాన్ని గుర్తించారు. అధికారుల పర్యవేక్షణలో ఆ ప్రదేశంలో మరిన్ని తవ్వకాలు చేపట్టాలని జాఫ్నా మెజిస్ట్రేట్ కోర్టు ఆదేశించింది. ఆ మేరకు చేపట్టిన తవ్వకాల్లో స్కూల్ బ్యాగులు, బొమ్మలు కనిపించాయి. అక్కడ మరో రెండు అస్థిపంజరాలు కూడా పిల్లలవేనని అనుమానం ఉన్నట్లు అధికారులు తెలిపారు. 1999లోనే అక్కడ 15 అస్థిపంజరాలు బయటపడినా ఇటీవలి తవ్వకాల వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. 26 ఏళ్లు కొనసాగి 2009లో ముగిసిన అంతర్యుద్ధంలో కొన్ని వేలమంది చనిపోగా, అనేకమంది ఆచూకీ గల్లంతయింది.



ఆలోచనలు ఉన్నతంగా ఉంటేనే గొప్ప ఫలితాలు

మీ ఆలోచనలు మీలో భావోద్వేగాలను కలగజేస్తాయి. ఆ భావోద్వేగాలే మీరు చేసే పనులను నిర్దేశిస్తాయి. మీ పనులే ఫలితాలను సృష్టిస్తాయి. ఆ ఫలితాలే మీలోని విశ్వాసాలను బలోపేతం చేస్తాయి. అందుకే మీ ఆలోచనలు ఉన్నతంగా ఉండేలా చూసుకోండి. అవే గొప్ప ఫలితాలను తీసుకురావడంతో పాటు మీపై మీకు విశ్వాసాన్ని పెంచుతాయి.

– శేషణ్, కాన్ఫిడెన్స్ మెంటార్

పూర్వీకుల ఆస్తిలో గిరిజన స్త్రీకి సమాన వాటా: సుప్రీంకోర్టు

దిల్లీ: గిరిజన మహిళకు లేదా చట్టబద్ధమైన ఆమె వారసులకు పూర్వీకుల ఆస్తిలో సమాన వాటా ఉంటుందని గురువారం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. మహిళ వారసులకు ఆస్తిలో హక్కును నిరాకరించడం లింగపరమైన విభజన, వివక్షలను తీవ్రతరం చేస్తుందని.. చట్టం దీన్ని అడ్డుకోవాలని జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీల ధర్మాసనం పేర్కొంది. ఈ కేసులో కింది కోర్టు అభిప్రాయాలను సమర్థిస్తే.. గిరిజన మహిళ, ఆమె వారసులకు ఆచార విరుద్ధం పేరిట ఆస్తిహక్కును నిరాకరించినట్లు అవుతుందని తెలిపింది. “చట్టంలాగే ఆచారాలు కూడా కాలంలో చిక్కుకుపోకూడదు. వీటి వెనుక దాగి ఆశ్రయం పొందేందుకు, ఇతరుల హక్కులను హరించడానికి మరొకరిని అనుమతించకూడదు” అని న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు. ఎస్టీ తెగకు చెందిన ఓ మహిళ వారసులు దాఖలు చేసిన అప్పీలు విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ తీర్పు చెప్పింది. తమ తల్లి తరపు.. తాతకు సంబంధించిన ఆస్తిని విభజించాలని పిటిషనర్లు కోరారు. వీరి అప్పీలును కింది కోర్టులు కొట్టివేయగా, సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ అంశంలో రాజ్యాంగంలోని 14వ అధికరణం (చట్టం ముందు అందరూ సమానులే) ఉల్లంఘన ప్రశ్న కూడా తలెత్తుతున్నట్లు సుప్రీంకోర్టు తన తీర్పులో పేర్కొంది.

బీఎల్ఏ దాడిలో 27 మంది పాక్ సైనికుల మృతి

లాహోర్: బస్సుపై దాడిచేసిన బలోచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) 27 మంది పాకిస్థాన్ సైనికుల ప్రాణాలు బలిగొంది. ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా గురువారం వెల్లడించింది. కరాచీ నుంచి క్వెట్టాకు దళాలను తరలిస్తున్న ఓ బస్సును లక్ష్యంగా చేసుకొన్న బీఎల్ఏకు చెందిన ఫతే బృందం ఈ దాడి చేసింది. మరో ఘటనలో క్వెట్టాలోని హజార్‌గంజ్‌లో బాంబుపేల్చినప్పుడు మరో ఇద్దరు సైనికులు మృతిచెందారు. మంగళవారం కలాత్‌లోని ఖజినా ప్రాంతంలో మరో బాంబుపేల్చి నలుగురిని, బుధవారం గుజ్రోకొర్ ఏరియాలో దాడిచేసి మరో ఆరుగురు సైనికులను హత్య చేసినట్లు బీఎల్ఏ ప్రకటించింది. వీరిలో మేజర్ సయిద్ రబ్ నవాజ్ తరీక్ కూడా ఉన్నట్లు చెప్పింది. ముగ్గురు బీఎల్ఏ దళ సభ్యులు చనిపోయినట్లు వచ్చిన వార్తలను ఖండించింది.

ఆధార్ ప్రక్రియను సరళీకరించాలన్న పీఏసీ

దిల్లీ: దేశంలో అనర్హులు, చొరబాటుదారులు.. ఆధార్ కార్డులు పొందుతున్నారని భాజపా ఎంపీలు ఆరోపించారు. ముందు అక్రమంగా ఆధార్ కార్డు పొంది.. ఆ తర్వాత ఓటరు గుర్తింపు కార్డు తదితర అధికారిక పత్రాలను పొందుతున్నారని, భారతీయ పౌరులకే దక్కాల్సిన ప్రయోజనాలను కొల్లగొడుతున్నారని విమర్శించారు. గురువారం జరిగిన ప్రజా పద్దుల కమిటీ (పీఏసీ) సమావేశంలో వారు ఈ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ నేతృత్వంలోని పీఏసీ.. ఈ సమావేశంలో యూఐడీఏఐ పని తీరును సమీక్షించింది. ఆధార్‌లో నమోదైన తప్పిదాలను సరి చేసే ప్రక్రియను సరళీకరించాల్సిన అవసరం ఉందని కొందరు సభ్యులు అభిప్రాయపడ్డారు. ప్రజలందరూ ఆధార్ పొందాలని సంబంధిత అధికారులు సర్క్యులర్ జారీ చేయాలని, ఆధార్ పొందే ప్రక్రియను సరళీకరించే మార్గాలను పరిశీలించాలని కమిటీ సూచించింది. ఆధార్ అనేది సామాన్యుడి సమస్య. దీనిపై సభ్యులు అనేక ప్రశ్నలు లేవనెత్తారని వేణుగోపాల్ అన్నారు.

దాడులు, దోపిడీలకు పాల్పడితే వీసా రద్దు కావచ్చు

- యూఎస్ ఎంబసీ వెల్లడి

దిల్లీ: అమెరికాలో దాడులు, దొంగతనాలు, దోపిడీల వంటి నేరాలకు పాల్పడితే చట్టపరమైన శిక్షలకు తోడు మళ్లీ అగ్రరాజ్యానికి వచ్చే అవకాశం లేకుండా శాశ్వత ఆంక్షలకు గురవుతారని భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం తాజా హెచ్చరికలు జారీ చేసింది. అటువంటి వ్యక్తులను భవిష్యత్తులోనూ అమెరికా వీసాలకు అనర్హులుగా పరిగణిస్తామని పేర్కొంది. అమెరికాలోని ఇల్లినోయీ స్టోర్‌లో భారత పర్యాటకురాలు ఒకరు దొంగతనం చేస్తూ పోలీసులకు దొరికిపోయిన వీడియో వైరల్‌గా మారింది. ఈ నేపథ్యంలో యూఎస్ వీసాలకు దరఖాస్తు చేసుకునేవారిని ఉద్దేశించి ఎంబసీ ఎక్స్ హ్యాండిలు ద్వారా ఈ కఠినమైన ప్రకటన వెలువడింది. శాంతిభద్రతలకు ప్రాధాన్యమిచ్చే అమెరికా అక్కడికి వచ్చే విదేశీయులు కూడా తమ చట్టాలను తప్పనిసరిగా పాటించాలని కోరుకొంటుందని ఎంబసీ తెలిపింది.

ఈనాడు

విజయవాడ 18-7-2025 శుక్రవారం సిటీ సంపుటి 51 . సంచిక 339
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 16
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

రాయలసీమను రతనాల సీమగా మారుస్తాం

ఒక పార్టీకి రాయలసీమ అంటే రాజకీయం, రక్తం. నాకు సీమ అంటే నీళ్లు, ప్రజల భవిష్యత్తు. రాయలసీమను రాష్ట్రానికి మణిహారంలా తయారుచేస్తా. - చంద్రబాబు





హంద్రీ నీవా జలాలకు హారతి ఇస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రులు జనార్దన్‌రెడ్డి, ఫరూక్, ఎమ్మెల్యే జయసూర్య, మంత్రి రామానాయుడు, మాజీ ఎమ్మెల్యే సుజాతమ్మ, ఎమ్మెల్యే చరితారెడ్డి, హంద్రీ నీవా సుజల స్రవంతి పంపింగ్ స్టేషన్‌లో మూడు పంపుల నుంచి విడుదలవుతున్న నీరు

- వంద రోజుల్లో కాలువ సామర్థ్యాన్ని రెట్టింపు చేశాం
- అసాధ్యమనుకున్న పనులను పూర్తి చేసి చరిత్ర సృష్టించాం
- ఆగస్టు 15 నుంచి వాట్సప్ గవర్నెన్స్‌లో 700 సేవలు
- ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి
- హంద్రీ నీవాకు నీరు వదిలి జలహారతి

ఈనాడు - కర్నూలు, నందికొట్కూరు, నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే: రాయలసీమను రతనాల సీమగా మారుస్తానని.. సీమలోని ప్రతి ఎకరాకూ నీళ్లివ్వడమే తన లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం మల్యాలలోని హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ (హంద్రీ నీవా సుజల స్రవంతి) పంపింగ్ స్టేషన్ నుంచి ఆయన గురువారం నీటిని విడుదల చేసి జలహారతి ఇచ్చారు. అనంతరం అల్లూరులో బహిరంగ సభలో మాట్లాడారు. 'రాయలసీమ చరిత్రలో నేడు ఒక శుభదినం. సీమను మార్చేది నీళ్లే. నేను ఇక్కడే పుట్టి పెరిగా. కరవు, కష్టాలు నాకు తెలుసు. అందుకే హంద్రీ నీవా పనులను వంద రోజుల్లోనే పూర్తి చేసి చూపించాం. కాలువలో ఇకపై 3,850 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుంది. (మిగతా 3లో)



అమెరికాలోని హ్యూస్టన్‌లో తన భార్య కామ్నాను అమితానందంతో హత్తుకున్న శుభాంశు శుక్లా

భార్యాబిడ్డల్ని హత్తుకొని భావోద్వేగం

హ్యూస్టన్‌లో కుటుంబాన్ని కలుసుకున్న శుభాంశు శుక్లా

23 వరకూ క్వారంటైన్‌లోనే ఉండనున్న భారత వ్యోమగామి

3లో

అక్రమ మైనింగ్ కేసులో

వంశీ ముందస్తు బెయిల్ రద్దు





- కేసును మళ్లీ విచారించండి
- ఇరుపక్షాల వాదనలు విన్నాకే తుది ఉత్తర్వులివ్వండి
- హైకోర్టుకు సుప్రీం ఆదేశం
- ఇలాంటి విచారణ గురించి ఎప్పుడూ వినలేదని వ్యాఖ్య

ఈనాడు, దిల్లీ: అక్రమ మైనింగ్ కేసులో గన్నవరం మాజీ ఎమ్మెల్యే, వైకాపా నేత వల్లభనేని వంశీకి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఈ కేసులో ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ ఏపీ హైకోర్టు మే 29న జారీ చేసిన ఉత్తర్వులను సర్వోన్నత న్యాయస్థానం కొట్టేసింది. కౌంటర్ దాఖలు చేస్తామని తాము చెప్పినా పట్టించుకోకుండా ఆరోజు కోర్టు ఉత్తర్వులు జారీ చేసిందన్న ఏపీ ప్రభుత్వ వాదనలను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు ఈ కేసును తిరిగి విచారించాలని హైకోర్టును ఆదేశించింది. జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్, జస్టిస్ సతీష్‌చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం గురువారం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. వంశీకి హైకోర్టు ఇచ్చిన ముందస్తు బెయిల్‌ను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం వేసిన పిటిషన్‌పై గురువారం విచారణ జరిగింది. ఏపీ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ హైకోర్టు తమకు కౌంటర్ దాఖలు చేయడానికి సమయం ఇవ్వకుండానే వారం రోజుల్లో కేసు విచారణ ముగించిందన్నారు. అందువల్ల ఈ కేసును పునర్విచారణ కోసం హైకోర్టుకు పంపాలని కోరారు. వంశీ తరపున మాజీ అడ్వొకేట్ జనరల్ శ్రీరాం వాదిస్తూ ఈ కేసులో తాము వాదనలు వినిపించడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రభుత్వం రెండుసార్లు చెప్పిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అలా ఎక్కడ చెప్పిందో చూపండని జస్టిస్ సతీష్‌చంద్ర శర్మ (మిగతా 3లో)

ఇలా దరఖాస్తు.. అలా అనుమతులు!

- నగరాలు, పట్టణాల్లో ఇళ్ల నిర్మాణం సులువే
- స్వీయ ధ్రువీకరణ పథకంతో పేద, మధ్య తరగతికి అనేక వెసులుబాట్లు
- కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం ఇక లేదు



ఈనాడు - అమరావతి

ఇళ్లు, భవనాలు (నాన్ హైరైజ్డ్) నిర్మించుకోవాలనుకునే వారి కోసం ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన స్వీయ ధ్రువీకరణ పథకం కింద వెంటనే అనుమతులు లభించనున్నాయి. దరఖాస్తును అప్‌లోడ్ చేయడమే తడవుగా అనుమతులు వచ్చేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. దీంతో పుర, నగరపాలక సంస్థల కార్యాలయాలకు వెళ్లాల్సిన పని ఉండదు. అనుమతుల కోసం కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, పట్టణ ప్రణాళిక సిబ్బంది చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన అవసరం లేదు.

ఏం చేయాలి?

■ నగరాలు, పట్టణాల్లో లైసెన్స్ కలిగిన సాంకేతిక నిపుణుల (ఎల్‌టీపీ)ను కలిస్తే పని పూర్తయినట్లే. ఇల్లు, భవనం నిర్మించాలనుకుంటున్న ఖాళీ స్థలం ఫొటో, దస్తావేజులు, వాటి లింక్ డాక్యుమెంట్లు, ఈసీ, ఖాళీ స్థలానికి చెల్లిస్తున్న పన్ను రసీదు... ఇలా ఎల్‌టీపీ అడిగిన వివరాలు, దస్త్రాలు అందించాలి. వాటిపై సంతకాలు చేసి, ఫీజులు చెల్లిస్తే చాలు.

■ ఇళ్ల నిర్మాణం కోసం సాంకేతిక నిపుణులు ప్లాన్ గీసి... దానితోపాటు దస్తావేజులు, ఇతర పత్రాలు, ఫీజులు చెల్లించిన చలానా సహా డెవలప్‌మెంట్ పర్మిషన్ మేనేజ్‌మెంట్ సిస్టం (డీపీఎంఎస్) పోర్టల్‌లో అప్‌లోడ్ (మిగతా 3లో)

పేద, మధ్య తరగతి కుటుంబాలకు లబ్ధి

పుర, నగరపాలక సంస్థల్లో ఏటా 40 వేల ఇళ్లు, భవన నిర్మాణాలకు అనుమతులు తీసుకుంటున్నారు. వీటిలో 100 నుంచి 200 చదరపు గజాల్లోపు స్థలాల్లో పేదలు, మధ్యతరగతి వారు నిర్మించుకునేవే 80% వరకూ ఉంటాయి. ఇప్పుడు నిర్మాణాలకు అనుమతులు సులభతరం చేయడంతో వీరికి లబ్ధి చేకూరనుంది. ప్రత్యేకించి అనుమతుల కోసం పట్టణ ప్రణాళిక సిబ్బందికి లంచాలు ఇచ్చే బెడద తప్పనుంది.

మార్కెట్ కమిటీ పీఠాలపై మహిళామణులు

66 ఛైర్మన్ పోస్టుల ప్రకటన.. వాటిలో 35 అతివలకే

మొత్తంగా తెదేపాకు 52, జనసేనకు 10, భాజపాకు 4

ఈనాడు, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా 66 వ్యవసాయ మార్కెట్ కమిటీలకు ఛైర్మన్లను ప్రభుత్వం గురువారం ప్రకటించింది. వీటిలో మహిళలకు పెద్దపీట వేసింది. వారికి 35 ఛైర్‌పర్సన్ పోస్టుల్ని కేటాయించింది. మొత్తం 66 ఛైర్మన్ పదవుల్లో 52 తెదేపాకు, 10 జనసేనకు, 4 భాజపాకు కేటాయించింది. ఇందులో 17 మంది బీసీలు, పది మంది ఎస్సీలు, ఐదుగురు ఎస్టీలు, ఐదుగురు మైనారిటీలకు అవకాశమిచ్చింది.

మార్కెట్ కమిటీల ఛైర్మన్ల వివరాలు 3లో

చిన్న పరిశ్రమలు.. చిగురించాలి!

- రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో ఎంఎస్‌ఎంఈలు కీలకం
- ఇతర రాష్ట్రాల్లోని మేలైన విధానాలు అనుసరించాలి
- రాష్ట్ర ప్రభుత్వానికి టాస్క్‌ఫోర్స్ కమిటీ సూచనలు



ఈనాడు, అమరావతి: రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమ(ఎంఎస్‌ఎంఈ)లు కీలకపాత్ర పోషిస్తాయని.. ఈ రంగం అభివృద్ధికి ఇతర రాష్ట్రాల్లోని అత్యుత్తమ విధానాలను అవలంబించాలని స్వర్ణాంధ్ర దార్శనిక పత్రం-2047 లక్ష్యంపై ఏర్పాటైన టాస్క్‌ఫోర్స్ కమిటీ సూచించింది. భారీ, మెగా పరిశ్రమలతో పోలిస్తే 10 రెట్లు ఎక్కువ ఉపాధి అవకాశాలు ఇందులో వస్తాయని, అందుకు అనుగుణంగా అనువైన వాతావరణం పెంపొందించాలని పేర్కొంది. "ఎంఎస్‌ఎంఈల కోసం ప్రతి పారిశ్రామిక పార్కులో కామన్ ఫెసిలిటీ సెంటర్ల ఏర్పాటుకు తక్కువ ధరకు 5 నుంచి 10 ఎకరాలు కేటాయించాలి. ఛార్టెడ్ ఎకౌంటెంట్, సివిల్ ఇంజినీర్, ఆర్థిక, సాఫ్ట్‌వేర్ నిపుణులతో ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలి. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా మెంటార్‌షిప్ అందించి సిక్ యూనిట్ల నిర్వహణ సమస్యలను పరిష్కరించాలి' అని కమిటీ తన నివేదికలో పేర్కొంది. ప్లగ్ అండ్ ప్లే విధానంలో పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతావరణం, ఉత్పత్తి సౌకర్యాలు కల్పించాలని, రంగాల వారీగా (మిగతా 3లో)

ఛాంపియన్


కరుణ్ నాయర్

'ప్రియమైన క్రికెట్.. రెండో అవకాశం ఇవ్వు' ఇది కొన్నేళ్ల క్రితం కరుణ్ నాయర్ సామాజిక మాధ్యమంలో రాసుకున్న మాట. అతడి స్థానంలో మరొకరు ఉండి ఉంటే రిటైరైపోయేవాళ్లే. కరుణ్ అలా చేయలేదు. ఆశ వదులుకోలేదు. పట్టుదలగా పోరాడాడు.. దేశవాళీలో పరుగుల వరద పారించాడు. సెలక్టర్లు తనను ఎంపిక చేయక తప్పని పరిస్థితిని కల్పించాడు. ఏకంగా ఎనిమిదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత టెస్టు జట్టులో పునరాగమనం చేశాడు. అది కూడా ఇంగ్లాండ్ లాంటి కఠిన పరిస్థితులు ఉండే సిరీస్‌లో! ఈ పర్యటనలో ఇప్పటికే అతడు మూడు టెస్టులు ఆడాడు. 6 ఇన్నింగ్స్‌ల్లో ఒక్క ప్రభావవంతమైన ఇన్నింగ్స్ లేదు. సిరీస్‌లో భారత్ 1-2తో వెనకబడింది. ఇప్పుడు అందరి దృష్టి విఫలమైన ఆటగాళ్లపైనే ఉంది. అందులో ముందు వరుసలో ఉంది కరుణ్ నాయరే! ఓల్డ్ ట్రాఫోర్డ్‌లో జరిగే నాలుగో టెస్టులో ఈ టాప్‌ఆర్డర్ బ్యాటర్ తుది జట్టులో చోటు దక్కించుకోవడం కష్టంగానే కనిపిస్తోంది.

కరుణ్‌కు ఇక కష్టమేనా!

ఈనాడు క్రీడావిభాగం

అద్భుతమైన ఫామ్‌తో ఇంగ్లాండ్‌కు వచ్చిన కరుణ్ నుంచి అభిమానులు ఎంతో ఆశించారు. కెరీర్ తొలి నాళ్లలో ట్రిపుల్ సెంచరీ చేసి ఈ ఘనత సాధించిన రెండో భారత బ్యాటర్‌గా చరిత్రలోకి ఎక్కిన ఈ కర్ణాటక బ్యాటర్.. తర్వాత కనీసం అర్ధసెంచరీ కూడా చేయలేకపోయాడు. ఇప్పుడు మంచి టచ్‌లో ఉన్న అతడు ఇంగ్లాండ్‌లో సత్తా చాటుతాడని అనుకున్నారు. ప్రాక్టీస్ మ్యాచ్‌లో డబుల్ సెంచరీతో అదరగొట్టాడు కూడా. పునరాగమన టెస్టునే కరుణ్ పేలవంగా ఆరంభించాడు. ఆరో స్థానంలో దిగి తొలి ఇన్నింగ్స్‌లో డకౌట్ అయ్యాడు. రెండో ఇన్నింగ్స్ (20)లోనూ రాణించలేకపోయాడు. భారత్ పరుగుల వరద పారించిన బర్మింగ్‌హామ్‌లో జరిగిన రెండో టెస్టులో కరుణ్‌కు బ్యాటింగ్‌లో ప్రమోషన్ ఇచ్చి మూడో స్థానంలో ఆడించారు. అయినా ఆకట్టుకోలేకపోయాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లో (22, 26) విఫలమయ్యాడు. మూడో టెస్టులోనూ అదే ఆట. తొలి ఇన్నింగ్స్‌లో కాస్త ఫర్వాలేదనిపించేలా 40 చేస్తే.. రెండో ఇన్నింగ్స్‌లో 14 పరుగులకే వెనుదిరిగాడు. రెండో ఇన్నింగ్స్‌లో ఔటైన తీరు మరీ పేలవం. కార్స్ వేసిన లెంగ్త్‌ను సరిగా అంచనా వేయలేకపోయిన అతడు.. ఏ షాట్ కొట్టకుండా వదిలేశాడు. ఆ బంతి స్వింగై అతడిని వికెట్ల ముందు దొరకబుచ్చుకుంది. ఇన్నింగ్స్‌ను ఆరంభించేటప్పుడు క్రీజులో కరుణ్ ఆత్మవిశ్వాసంతోనే ఉన్నట్లు కనిపిస్తోంది. స్టాన్స్, డిఫెన్స్, టైమింగ్ కూడా బాగానే ఉంటున్నాయి. ఆఫ్‌సైడ్ కొన్ని చక్కటి షాట్లు కూడా ఆడుతున్నాడు. కుదురుకున్నాడని అనుకునేలోపు ఔటవుతున్నాడు. 3 టెస్టుల్లో ఒక్కసారి మాత్రమే 40 పరుగులు చేయడం ఇందుకు నిదర్శనం. మూడో స్థానంలో దిగే బ్యాటర్‌కు పటిష్టమైన డిఫెన్స్ ఉండాలి. నియంత్రణతో కూడిన దూకుడుతో బ్యాటింగ్ చేయాలి. పరిస్థితి తగ్గట్టు ఆడుతూ ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లాలి. కానీ కరుణ్ ఈ పని చేయలేకపోతున్నాడు.

వేటు తప్పదా?: భారత జట్టులో చోటు కోసం చాలామంది కుర్రాళ్లు ఎదురు చూస్తున్నారు. దేశవాళీలో స్థిరంగా రాణిస్తూ సెలక్టర్లకు సవాల్ విసురుతున్నారు. అభిమన్యు ఈశ్వరన్ లాంటి వాళ్లు జట్టుకు ఎంపికైనా రిజర్వ్ బెంచ్‌పైనే ఉంటున్నారు. లేక లేక దొరికిన అవకాశాన్ని కరుణ్ ఉపయోగించుకోవట్లేదు. అతడి కోసం రెండు, మూడో టెస్టుల్లో యువ కెరటం సాయి సుదర్శన్‌ను మేనేజ్‌మెంట్ పక్కనపెట్టింది. గొప్ప ఫామ్‌లో ఉన్న సుదర్శన్.. సాంకేతికంగా బలమైన బ్యాటర్. పైగా భవిష్యత్ ఉన్న ఆటగాడు. అతడిని రిజర్వ్ బెంచ్‌పై కూర్చోబెట్టి కరుణ్‌ను కొనసాగించడంపై విమర్శలు కూడా వచ్చాయి. ఈ నేపథ్యంలో వరుసగా ఆరు ఇన్నింగ్స్‌ల్లో విఫలం కావడంతో ఓల్డ్‌ట్రాఫోర్డ్‌లో జరిగే నాలుగో టెస్టులో కరుణ్‌కు తుది జట్టులో చోటు దక్కడం కష్టమే. అతడి స్థానంలో సాయి సుదర్శన్‌ను తీసుకునే అవకాశాలు ఉన్నాయి. ఒకవేళ కరుణ్‌కు ఇంకా అవకాశాలు ఇవ్వాలనుకుంటే అతడికి మిగిలిన రెండు టెస్టులు అగ్నిపరీక్షే. "మూడో స్థానంలో ఆడిస్తున్న కరుణ్‌ను ఇంకా కొనసాగిస్తారా లేదా అనేది ప్రశ్న. అతడికి బాగానే అవకాశాలు వచ్చాయి. ఇక సాయి సుదర్శన్‌ను ఆడిస్తే మేలు. సాయి తొలి టెస్టులో క్రీజులో సౌకర్యంగా కనిపించాడు. కరుణ్ కొన్నిసార్లు మాత్రమే బాగా ఆడుతున్నాడు. స్వింగ్ అయ్యే పిచ్‌పై క్రీజులో పాదాలను ఎక్కువగా కదల్చకుండా ఆడితే కష్టం" అని బీసీసీఐ మాజీ సెలక్టర్ దీప్‌దాస్ గుప్తా విశ్లేషించాడు.

సరైన మార్గంలో ఉన్నాం


దీప్తి శర్మ

సౌతాంప్టన్: మహిళల వన్డే ప్రపంచకప్ సన్నాహాల విషయంలో తాము సరైన మార్గంలోనే ఉన్నట్లు భారత ఆల్‌రౌండర్ దీప్తిశర్మ తెలిపింది. ప్రస్తుతం తమ దృష్టంతా ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్‌పైనే ఉందని దీప్తి చెప్పింది. బుధవారం జరిగిన తొలి వన్డేలో భారత్ 4 వికెట్ల తేడాతో ఇంగ్లాండ్‌పై విజయం సాధించింది. 3 మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0తో ఆధిక్యం సంపాదించింది. సోఫియా డంక్లీ (83), అలైస్ రిచర్డ్స్ (53) రాణించడంతో తొలుత ఇంగ్లాండ్ 6 వికెట్లకు 258 పరుగులు చేసింది. భారత్ 48.2 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దీప్తి (62 నాటౌట్) జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. "ప్రపంచకప్ సన్నాహాల విషయంలో మేం సరైన మార్గంలోనే ఉన్నాం. శ్రీలంకలో సత్తాచాటాం. ఇక్కడ కూడా బాగా ఆడుతున్నాం. కానీ ప్రపంచకప్ చాలా దూరంలో ఉంది. మెగా టోర్నీ గురించి ఇప్పుడే ఆలోచించట్లేదు. ప్రస్తుతం ఒక్కో మ్యాచ్‌పైనే దృష్టిసారిస్తున్నాం" అని దీప్తి పేర్కొంది.

బుమ్రా.. మూడు టెస్టులే ఎందుకు?



బుమ్రా

బెకెన్‌హామ్: ఇంగ్లాండ్‌తో అయిదు టెస్టుల సిరీస్‌లో భారత్ 1-2తో వెనకబడింది. సిరీస్‌లో గెలవాలంటే మిగతా రెండు టెస్టుల్లో విజయం సాధించాలి. సిరీస్‌ను డ్రా చేసుకోవాలన్నా ఒకటి గెలిచి మరొక మ్యాచ్‌ను డ్రా ముగించాలి. ఇంగ్లాండ్‌ను సొంతగడ్డపై ఓడించడం అంటే మామూలు విషయం కాదు. అదీ ఎక్కువ అనుభవం లేని ప్రస్తుత భారత జట్టు సిరీస్ గెలవాలంటే అసాధారణ పోరాటం చేయాల్సిందే. జట్టులో కీలక ఆటగాళ్లంతా అత్యుత్తమ ప్రదర్శన కనబరిస్తేనే అది సాధ్యమవుతుంది. కానీ కీలకమైన జస్ప్రీత్ బుమ్రా సేవలను టీమ్‌ఇండియా ఒక మ్యాచ్‌లో పొందబోయేది. అతడు మిగతా రెండు మ్యాచ్‌ల్లో ఒకటే ఆడతాడు. అది ఏ మ్యాచ్ అన్నదానిపై ఇప్పటికీ స్పష్టత లేదు. అసలు బుమ్రా సిరీస్‌లో మూడు మ్యాచ్‌లే ఆడాలన్న నిర్ణయం ఎవరిది అన్నదే అంతుబట్టని ప్రశ్న. పనిభార నిర్వహణలో భాగంగా బుమ్రా మూడు టెస్టులు మాత్రమే ఆడతాడు.. జట్టు ఎంపిక సందర్భంగా బీసీసీఐ చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ చెప్పాడు. తొలి మ్యాచ్ ఆడిన బుమ్రా దాదాపుగా పది రోజుల విరామం లభించినా రెండో టెస్టు ఆడలేదు. మూడో టెస్టు ఆడిన అతడు నాలుగో టెస్టు ఆడేది లేనిది తెలియదు. "మిగతా రెండు మ్యాచ్‌ల్లో బుమ్రా ఒక మ్యాచ్ ఆడతాడు. మాంచెస్టర్‌లో జరిగే నాలుగో టెస్టులో అతడు బరిలో దిగే దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. సిరీస్‌లో ఈ మ్యాచ్ కీలకం కాబట్టి.. అతడు ఆడే అవకాశాలే ఎక్కువ" అని సహాయక కోచ్ టెన్ డస్కాటె అన్నాడు. ఈ సిరీస్‌లో ఇప్పటికి రెండే టెస్టులు ఆడిన బుమ్రా 28.09 సగటుతో 12 వికెట్లు పడగొట్టాడు. అత్యధిక వికెట్లు తీసిన వారిలో అతడిది రెండో స్థానం. బుమ్రా లాంటి బౌలర్ అన్ని మ్యాచ్‌లు ఆడాలని ఏ జట్టయినా కోరుకుంటుంది. కానీ.. కచ్చితంగా అతడిని మూడు మ్యాచ్‌లే ఆడించాలన్నది అర్థం కాని విషయం. ఫిట్‌నెస్ సమస్యల కారణంగా జట్టు నుంచి తప్పిస్తే సరే. కానీ ఎక్కువ మ్యాచ్‌లు ఆడితే గాయపడతాడని కారణంతో పక్కన పెడుతుంటే మాత్రం.. అది జట్టుకు చేసే నష్టమే. ఈ సిరీస్‌లో ఇంగ్లాండ్‌తో పోటాపోటీగా తలపడుతున్న భారత జట్టుకు బుమ్రా లాంటి ఆటగాడు మిగతా మ్యాచ్‌లన్నీ ఆడటం చాలా ముఖ్యం. "సిరీస్‌లో ఏ మ్యాచ్ ఆడాలన్న నిర్ణయం ఓ ఆటగాడికి ఇవ్వడం సరికాదు. ఫిట్‌గా లేకుంటే సిరీస్ మొత్తానికి దూరంగా ఉండాలి. కొన్ని మ్యాచ్‌లే ఆడతానంటే సరికాదు" అని టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ వెంగ్‌సర్కార్ విమర్శించాడు. బుమ్రా మూడు మ్యాచ్‌లే ఆడాలన్న నిర్ణయం వైద్య నిపుణులదా వ్యక్తిగతంగా బుమ్రా తీసుకున్నదా అన్నది తెలియదు. కానీ ఆ నిర్ణయం జట్టు ప్రదర్శనను ప్రభావితం చేస్తోంది. సిరీస్‌లో కీలకమైన చివరి రెండు టెస్టుల్లో బుమ్రా ఉండటం అవసరం. మరి టీమ్‌ఇండియా మేనేజ్‌మెంట్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

అర్ష్‌దీప్‌కు గాయం

బెకెన్‌హామ్: టీమ్‌ఇండియా పేసర్ అర్ష్‌దీప్ సింగ్ గురువారం నెట్స్‌లో గాయపడ్డాడు. సాయి సుదర్శన్ కొట్టిన షాట్‌ను అడ్డుకునే ప్రయత్నంలో అతడి చేతికి గాయమైంది. వెంటనే అతడిని డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లారు. చేతికి కుట్లు పడితే అతడు కొన్ని రోజులు ఆటకు దూరమవొచ్చని టీమ్ ఇండియా సహాయక కోచ్ టెన్ డస్కాటె చెప్పాడు.

క్వార్టర్స్‌లో అర్జున్, ప్రజ్ఞానంద


అర్జున్


ప్రజ్ఞానంద

లాస్‌వెగాస్: ఫ్రీస్టైల్ గ్రాండ్‌స్లామ్ టూర్ చెస్‌లో భారత గ్రాండ్‌మాస్టర్లు అర్జున్ ఇరిగేశి, ప్రజ్ఞానంద క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించారు. ప్రపంచ నం.1 మాగ్నస్ కార్ల్‌సన్ టైటిల్ రేసు నుంచి నిష్క్రమించాడు. గ్రూప్-బ్లాక్‌లో ఉన్న అర్జున్.. నాలుగో రౌండ్లో నకమురా చేతిలో ఓడి.. అయిదో రౌండ్లో కరువానాతో పాయింట్ పంచుకున్నాడు. ఆరు, ఏడో రౌండ్లలో (శామ్యూల్, రాబ్సన్) విజయాలు అందుకుని ముందంజ వేశాడు. మొత్తంగా ఫాబియనో కరువానాతో కలిసి 4 పాయింట్లతో అర్జున్ మూడో స్థానంలో నిలిచాడు. ఈ గ్రూప్‌లో అమెరికా జీఎంలు హికరు నకమురా (6), హన్స్ నీమన్ (4.5) తొలి రెండు స్థానాల్ని దక్కించుకున్నారు. 19 ఏళ్ల ప్రజ్ఞానంద.. మరోసారి ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే)ను ఓడించాడు. నాలుగో రౌండ్లో కార్ల్‌సన్‌పై నెగ్గిన అతడు.. అయిదో రౌండ్లో సిందరోవ్‌తో డ్రా చేసుకున్నాడు. ఆరో రౌండ్లో అరోనియన్ చేతిలో ఓడి.. చివరిదైన ఏడో రౌండ్లో వెస్లీ సోతో గేమ్‌ను డ్రాగా ముగించాడు. దీంతో ప్రజ్ఞానంద మొత్తం 4.5 పాయింట్లతో గ్రూప్ వైట్‌లో ఉజ్బెకిస్థాన్ గ్రాండ్‌మాస్టర్లు అబ్దుసత్తారోవ్, సందరోవ్‌తో కలిసి ఉమ్మడిగా అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. కార్ల్‌సన్ (4) అయిదో స్థానానికి పరిమితమయ్యాడు. దీంతో అతడు టైటిల్ రేసుకు దూరమయ్యాడు. ఇక అత్యుత్తమంగా మూడో స్థానం కోసం అతడు ఆడనున్నాడు. క్వార్టర్స్‌లో కరువానాతో ప్రజ్ఞానంద.. అబ్దుసత్తారోవ్‌తో అర్జున్ తలపడనున్నారు. 16 మంది గ్రాండ్‌మాస్టర్లు రెండు గ్రూప్‌లుగా విడిపోయి ఈ టోర్నీలో ఆడుతున్నారు. ప్రతి గ్రూప్‌లో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన ఆటగాళ్లు క్వార్టర్స్ చేరతారు.

ముగిసిన భారత్ పోరాటం

జపాన్ ఓపెన్

టోక్యో: జపాన్ ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత్ పోరాటం ముగిసింది. స్టార్ షట్లర్లు సాత్విక్ సాయిరాజ్- చిరాగ్ శెట్టి, లక్ష్యసేన్ సహా భారత క్రీడాకారులంతా ఇంటిముఖం పట్టారు. గురువారం పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సాత్విక్- చిరాగ్ జోడీ 22-24, 14-21తో లియాంగ్ వీ కెంగ్- వాంగ్ చాంగ్ (చైనా) జంట చేతిలో పరాజయం చవిచూసింది. పారిస్ ఒలింపిక్స్‌లో రజతం నెగ్గిన చైనా జంట 7-2తో భారత జోడీపై తన గెలుపోటముల రికార్డును మరింత మెరుగుపరుచుకుంది. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో లక్ష్యసేన్ 19-21, 11-21తో కొడయ్ నరవోక (జపాన్) చేతిలో ఓడాడు. మహిళల సింగిల్స్‌లో అనుపమ ఉపాధ్యాయాకు చుక్కెదురైంది. ప్రిక్వార్టర్స్‌లో అనుపమ 21-13, 11-21, 12-21తో రెండో సీడ్ వాంగ్ యి (చైనా) చేతిలో పోరాడి ఓడింది.

తేలాల్సింది టైబ్రేక్‌లోనే..

హంపి, హారిక, వైశాలి గేమ్‌లు డ్రా


హంపి

బటుమి (జార్జియా): ఫిడే మహిళల చెస్ ప్రపంచ కప్‌లో తర్వాతి రౌండ్‌కు వెళ్లాలంటే భారత అమ్మాయిలు టైబ్రేక్ ఆడక తప్పదు. గురువారం నాలుగో రౌండ్ రెండో గేమ్‌లో గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక, వైశాలి డ్రా చేసుకోగా.. ఇంటర్నేషనల్ మాస్టర్ దివ్య దేశ్‌ముఖ్ ఓడిపోయింది. జినర్ జు (చైనా)తో తొలి గేమ్‌లో గెలిచిన దివ్య.. రెండో గేమ్‌లో సత్తా చాటలేకపోయింది. అలెగ్జాండ్రా కోస్టెనుక్ (స్విట్జర్లాండ్)పై హంపి.. లాగ్నో కేతరినా (రష్యా)పై హారిక పాయింట్ పంచుకున్నారు. కమెలిదెనోవా మెరెట్ (కజకిస్థాన్)తో వైశాలి డ్రా చేసుకుంది. శుక్రవారం జరిగే టైబ్రేక్‌లో గెలిచిన వాళ్లు క్వార్టర్ ఫైనల్ చేరతారు.


రసెల్

అంతర్జాతీయ క్రికెట్‌కు రసెల్ వీడ్కోలు

కింగ్‌స్టన్: ప్రపంచ టీ20 క్రికెట్లో స్టార్ ఆల్‌రౌండర్.. వెస్టిండీస్ అగ్రశ్రేణి ఆటగాడు ఆండ్రీ రసెల్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలకనున్నాడు. ఆస్ట్రేలియాతో రెండో టీ20 మ్యాచ్ అనంతరం అంతర్జాతీయ కెరీర్‌కు రిటైర్మెంట్ ఇవ్వనున్నట్లు 37 ఏళ్ల రసెల్ ప్రకటించాడు. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న 2026 టీ20 ప్రపంచకప్‌నకు ఏడు నెలల ముందు రసెల్ ఈ నిర్ణయం తీసుకున్నాడు. ఆసీస్‌తో అయిదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం రసెల్‌ను ఎంపిక చేసినా.. తొలి రెండింట్లో మాత్రమే ఆడాలని అతను నిర్ణయించుకున్నాడు. ఈనెల 20, 22 తేదీల్లో జరిగే రెండు మ్యాచ్‌లకు రసెల్‌కు ఇష్టమైన సబీనా పార్క్ (కింగ్‌స్టన్) ఆతిథ్యమివ్వనుంది. 15 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో విండీస్ టీ20 జట్టులో రసెల్ కీలకంగా వ్యవహరించాడు. 2012, 2016 టీ20 ప్రపంచకప్‌లు గెలిచిన విండీస్ జట్టులో అతడు ముఖ్యభూమిక పోషించాడు. 2019 నుంచి రసెల్ పూర్తిగా టీ20లపై దృష్టిసారించాడు. కెరీర్‌లో ఒకేఒక్క టెస్టు ఆడిన రసెల్.. 56 వన్డేలు, 84 టీ20ల్లో విండీస్‌కు ప్రాతినిధ్యం వహించాడు. వన్డేల్లో 1034 పరుగులు చేసి.. 70 వికెట్లు తీశాడు. టీ20ల్లో 1078 పరుగులు రాబట్టి.. 61 వికెట్లు పడగొట్టాడు. "విండీస్‌కు ప్రాతినిధ్యం వహించడం నా జీవితంలో గర్వించదగ్గ విజయాలలో ఒకటి. ఆ అనుభూతిని మాటల్లో చెప్పలేను. ఈస్థాయికి చేరుకుంటానని చిన్నప్పుడు ఊహించలేదు. విండీస్ తరఫున ఆడటం నాకెంతో ఇష్టం. సొంతగడ్డపై కుటుంబ సభ్యులు, స్నేహితులు సమక్షంలో సత్తాచాటే అవకాశం లభిస్తుంది. కరీబియన్ నుంచి వచ్చే తర్వాతి తరం క్రికెటర్లకు మార్గదర్శకంగా ఉంటూనే నా అంతర్జాతీయ కెరీర్‌ను ఉన్నతంగా ముగించాలని అనుకుంటున్నా" అని రసెల్ తెలిపాడు.

తొలి పోరు భారత్‌తో.. ఫైనల్ ఆసీస్‌తో..!



బర్న్స్

దిల్లీ: టీ20 ప్రపంచకప్ మొదటి మ్యాచ్‌లో భారత్‌తో.. ఫైనల్లో ఆస్ట్రేలియాతో తలపడాలని కోరుకుంటున్నట్లు ఇటలీ కెప్టెన్ జో బర్న్స్ తెలిపాడు. ఐరోపా క్వాలిఫయర్స్‌లో సత్తా చాటిన ఇటలీ.. వచ్చే ఏడాది జరగనున్న పొట్టి కప్పునకు అర్హత సాధించింది. 23 టెస్టులు, ఆరు వన్డేల్లో ఆసీస్ తరఫున ఆడిన బర్న్స్.. ప్రస్తుతం ఇటలీకి సారథ్యం వహిస్తున్నాడు. "ప్రపంచకప్‌నకు అర్హత సాధించామంటే ఇప్పటికీ నమ్మలేకపోతున్నా. ఇందుకోసం చాలా శ్రమించాం. నెలలు, సంవత్సరాలు కలలు కంటూ.. నమ్మకంతో ఆ క్షణాల కోసం సిద్ధమవుతూనే ఉన్నాం. తొలిసారిగా ప్రపంచకప్‌నకు వెళ్లే ఏ జట్టైనా ప్రత్యేకంగా ఉండాలని భావిస్తుంది. తొలి మ్యాచ్‌లో భారత్‌తో.. ఫైనల్లో ఆసీస్‌తో తలపడాలని కోరుకుంటున్నా. ప్రపంచ వేదికపై ఇటలీ పతాకాన్ని నిలబెట్టే అవకాశం కోసం ఎదురు చూస్తున్నాం" అని బర్న్స్ వివరించాడు.

అర్జున్-ప్రశాంత్ జోడీ సంచలనం

దిల్లీ: స్విస్ ఓపెన్ టెన్నిస్ టోర్నీలో భారత జోడీ అర్జున్ ఖడే- విజయ్ సుందర్ ప్రశాంత్ జంట సంచలనం సృష్టించింది. రెండో సీడ్ జాకబ్ ష్నైటర్- మార్క్ వాల్నర్ (జర్మనీ) జంటకు షాకిచ్చి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. డబుల్స్ క్వార్టర్స్‌లో అర్జున్- ప్రశాంత్ జోడీ 6-3, 7-6 (7-5)తో జాకబ్- మార్క్ జంటను చిత్తు చేసింది. నిరుడు రిత్విక్ బొల్లిపల్లితో కలిసి ఏటీపీ 250 ఈవెంట్లో విజేతగా నిలిచిన అర్జున్ ఇప్పుడు మరో టైటిల్‌కు చేరువయ్యాడు.

ప్రో లీగ్ మేలుకొలుపు: శ్రీజేష్

దిల్లీ: ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్ హాకీలో ప్రదర్శన భారత పురుషుల జట్టుకు మేలుకొలుపు లాంటిదని మాజీ కెప్టెన్, దిగ్గజ గోల్ కీపర్ పి.ఆర్.శ్రీజేష్ అన్నాడు. ఐరోపా దశ లీగ్‌లో ఘోరంగా విఫలమైన భారత్.. ఎనిమిదో స్థానం (9 జట్లలో)తో సరిపెట్టుకుంది. "ఆటగాళ్లు నిజంగానే బాగా రాణించారు. చాలా అవకాశాలను సృష్టించుకున్నారు. మైదానంలో గట్టి పోటీ ఇచ్చారు. కానీ ఫలితం ప్రతికూలంగా వచ్చింది. కొన్నిసార్లు అలాగే జరుగుతుంది. ప్రో లీగ్ సన్నాహం బాగానే ఉన్నప్పటికీ.. ఫలితాలే అనుకున్నట్లు రాలేదు. ఆసియా కప్, ఆసియా క్రీడలు, ప్రపంచకప్‌నకు జట్టును సిద్ధం చేయడానికి కోచ్‌లకు కావాల్సినంత సమయం ఉంది. మెగా టోర్నీలకు సిద్ధం కావడానికి ఈ ప్రో లీగ్ ప్రదర్శన భారత్‌కు మంచి మేలుకొలుపు లాంటిదని భావిస్తున్నా" అని శ్రీజేష్ తెలిపాడు.

ఫుట్‌బాల్‌కు అదితి గుడ్‌బై


అదితి

దిల్లీ: భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు గోల్ కీపర్ అదితి చౌహాన్ ఆటకు వీడ్కోలు పలికింది. 17 ఏళ్ల పాటు కెరీర్‌ను కొనసాగించిన ఆమె.. ఐరోపాలో ప్రొఫెషనల్ ఫుట్‌బాల్ ఆడిన తొలి భారత క్రీడాకారిణిగా నిలిచింది. "ఇన్నాళ్ల కెరీర్ అందించిన ఫుట్‌బాల్‌కు కృతజ్ఞతలు. సుదీర్ఘ కాలం ఈ ఆటలో కొనసాగా. ఇక రిటైర్ అవుతున్నా. ఫుట్‌బాల్ నాకెంతో ఇచ్చింది. ఆడుతూనే చదువూ కొనసాగించా. గోల్‌కీపర్‌గా జట్టు విజయాల్లో నా వంతు పాత్ర పోషించా" అని అదితి తెలిపింది. ఐరోపా జట్టు వెస్ట్ హామ్‌కు రెండు సీజన్లు ఆడిన అదితి.. ఇండియన్ ఉమెన్స్ లీగ్‌లో గోకులం కేరళ ఎఫ్‌సీకి ప్రాతినిధ్యం వహించింది. 2019, 2021 సీజన్లలో గోకులం జట్టు ఇండియన్ ఉమెన్స్ లీగ్ నెగ్గడంలో కీలకపాత్ర పోషించింది. తర్వాత శ్రీభూమి ఎఫ్‌సీకి కూడా ఆడింది. ఒకవైపు ఫుట్‌బాల్ ప్లేయర్‌గా ఉంటూనే స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్‌లో అదితి మాస్టర్స్ చేసింది. అదితి 57 మ్యాచ్‌ల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించింది. 2012, 2016, 2019లో శాఫ్ మహిళల ఛాంపియన్‌షిప్ గెలిచిన భారత జట్టులో ఆమె సభ్యురాలు.

12 ఏళ్ల స్విమ్ చలనం


యు జిడి

సింగపూర్: పన్నెండేళ్ల వయసులో పిల్లలు ఏం చేస్తుంటారు? పుస్తకాలతో కుస్తీ పడుతుంటారు. లేదా మొబైల్స్ గేమ్స్ ఆడుతూ ఉంటారు. కానీ చైనా బాలిక యు జిడి ఇదే వయసులో స్విమ్మింగ్ పూల్‌లో రికార్డులు బద్దలుకొడుతోంది. పూల్‌లో స్థిరంగా రాణిస్తున్న ఆమె వచ్చే నెల సింగపూర్‌లో జరిగే ప్రపంచ స్విమింగ్ ఛాంపియన్‌షిప్‌నకు అర్హత సాధించింది. 200, 400 మీటర్ల వ్యక్తిగత మెడ్లే, 200 మీటర్ల బటర్‌ఫ్లైలో యు జిడి పోటీపడబోతోంది. ఈ మూడు విభాగాల్లోనూ ఆమె పతకానికి గట్టిపోటీదారుగానే ఉంది. చైనా ఛాంపియన్‌షిప్‌లో 200 మీటర్ల వ్యక్తిగత మెడ్లేని 2 నిమిషాల 10.63 సెకన్లలోనే పూర్తి చేసిందీ బాలిక. మహిళలు, పురుషుల విభాగాల్లో ఓ పన్నెండేళ్ల స్విమ్మర్ ఇంత తక్కువ సమయంలో ఈ రేసును పూర్తి చేయలేదు. ఆమె అక్కడితో ఆగలేదు.. 200 మీటర్ల బటర్‌ఫ్లైని 2 నిమిషాల 6.83 సెకన్లలో పూర్తి చేసింది. పారిస్ ఒలింపిక్స్‌లో ఇది నాలుగో స్థానంతో సమానమైన టైమింగ్. 2024 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో అయితే యు జిడికి పసిడి దక్కేది. ప్రస్తుతం 400 మీటర్ల వ్యక్తిగత మెడ్లేలో కెనడా స్విమ్మర్ సమ్మర్ మెకంతోష్‌దే హవా. 400, 200 మెడ్లేలో ప్రపంచ రికార్డులు ఆమె ఖాతాలో ఉన్నాయి. 12 ఏళ్ల వయసులో మెకంతోష్‌తో పోలిస్తే యు జిడి 12 నుంచి 15 సెకన్ల వేగంతో ఈ రేసులు పూర్తి చేస్తోంది. ఒక వాటర్ పార్కులో ఆరేళ్ల వయసులో యు జిడి స్విమ్మింగ్ నేర్చుకుంది. అదే క్రమంలో ప్రొఫెషనల్ స్విమ్మర్‌గా మారింది. "ఒక వేసవిలో నాన్న వాటర్ పార్కుకి తీసుకెళ్లేవాళ్లు. మిగిలిన పిల్లలతో కలిసి పూల్స్‌లో చాలా సరదాగా గడిపేదాన్ని. వేగంగా ఎలా స్విమ్ చేయాలో నేర్పిస్తానని ఒక కోచ్ అన్నారు. అప్పటి నుంచే నా కెరీర్ మారింది. 400 మీటర్ల మెడ్లే, 200 మీటర్ల బటర్‌ఫ్లై నాకు ఇష్టమైన ఈవెంట్లు. వయసు పెరిగాక మిగిలిన విభాగాల్లోనూ రాణించగల సత్తా సంపాదిస్తా" అని యు జిడి తెలిపింది. 2028 లాస్‌ఏంజెలెస్ ఒలింపిక్స్‌పై యు జిడి దృష్టి సారించింది. 2012 లండన్ ఒలింపిక్స్‌లో 800 మీటర్ల ఫ్రీస్టైల్‌లో స్వర్ణం సాధించే సమయానికి అమెరికా స్టార్ కేటీ లెడెకి వయసు 15 ఏళ్ల 139 రోజులు. ఆమె మాదిరే యు జిడి కూడా 2028 లాస్‌ఏంజెలెస్ ఒలింపిక్స్‌లో పతకంపై గురిపెట్టింది. ఒలింపిక్స్‌లో స్వర్ణం గెలిచిన చిన్న వయస్కురాలుగా ఇవాసాకి (14 ఏళ్ల 6 రోజులు, 1992 బార్సిలోనా ఒలింపిక్స్, 200 బ్రెస్ట్‌స్ట్రోక్ స్వర్ణం) రికార్డును మాత్రం యు జిడి బద్దలుకొట్టే అవకాశం లేదు.

మారథాన్ రన్నర్ రూత్‌పై సస్పెన్షన్ వేటు

మొనాకో: మహిళల మారథాన్‌లో ప్రపంచ రికార్డు సృష్టించిన కెన్యా అథ్లెట్ రూత్ చెప్‌గెటిచ్ డోపింగ్‌లో పట్టుబడింది. గురువారం ప్రపంచ డోపింగ్ సమగ్రత విభాగం ఆమెపై ప్రాథమిక సస్పెన్షన్ వేటు వేసింది. రూత్ నిషేధిత ఉత్ప్రేరకం డిరెటిక్‌ను వాడిందని.. ఆమెపై విచారణ కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు. గతేడాది అక్టోబర్‌లో జరిగిన చికాగో మారథాన్‌లో 2 గంటల 9 నిమిషాల 56 సెకన్లలో రేసు పూర్తి చేసి రూత్ ప్రపంచ రికార్డు నెలకొల్పింది.

ఈనాడు

విజయవాడ 18-7-2025 శుక్రవారం సిటీ సంపుటి 51 . సంచిక 339

THE LARGEST CIRCULATED TELUGU DAILY


రూ. 6-50 పేజీలు 16 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

విదేశీ విద్యార్థుల కోసం

స్టడీ ఇన్ ఏపీ

- ప్రత్యేక ప్రణాళిక రూపొందించిన ఉన్నత విద్యామండలి
- ప్రస్తుతం రాష్ట్రంలోని వివిధ విద్యా సంస్థల్లో 3,730 మంది విదేశీ విద్యార్థులు
- నేపాల్, సుడాన్, జింబాబ్వేలకు చెందిన వారే అత్యధికం



ఈనాడు, అమరావతి: 'స్టడీ ఇన్ ఏపీ' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం విదేశీ విద్యార్థులను ఆకర్షించేందుకు ఉన్నత విద్యామండలి చర్యలు చేపట్టింది. విద్యా సంస్థల ద్వారా విదేశాల్లో ఎడ్యుకేషన్ ఫెయిర్లు నిర్వహించడం, కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఉపకార వేతనాలు, ట్యూషన్ ఫీజులను వినియోగించుకుని రాష్ట్రంలో విదేశీ విద్యార్థుల సంఖ్యను పెంచాలని భావిస్తోంది. ఇండియాలో చదివేందుకు వచ్చే విద్యార్థులకు ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్(ఐసీసీఆర్) నుంచి 21 రకాల పథకాల ఉపకారవేతనాలు, ట్యూషన్ ఫీజు మినహాయింపులు అందిస్తున్నారు. గతంలో ప్రైవేటు కళాశాలలు, వర్సిటీలకు సైతం వీటిని అందించగా.. ఆ తర్వాత దీనిలో మార్పు తీసుకొచ్చారు. ఎన్ఐఆర్ ర్యాంకుల్లో వందలోపు, న్యాక్-ఎ గ్రేడ్ ఉన్న ప్రభుత్వ వర్సిటీల్లో చదివే విదేశీ విద్యార్థులకు అందిస్తున్నారు. ఇదికాకుండా స్టడీ ఇన్ ఇండియా, ఆయుష్ ఉపకారవేతనాల పథకం లాంటి వాటి ద్వారా ఉపకారవేతనాలు, పూర్తిగా ట్యూషన్ ఫీజు మినహాయింపులు ఇస్తున్నారు. కొన్ని ప్రైవేటు విశ్వవిద్యాలయాలు విదేశీ విద్యార్థులను ఆకర్షించేందుకు ఫీజుల్లో రాయితీలు అందిస్తున్నాయి. వీటిని వినియోగించుకుని ఎక్కువ సంఖ్యలో విదేశీ విద్యార్థులు ఏపీ వచ్చేలా ఉన్నత విద్యామండలి ప్రణాళిక రూపొందించింది.

ఏపీకి వచ్చే వారిలో..

ఏపీలో ప్రస్తుతం అఫ్గానిస్థాన్, బంగ్లాదేశ్, భూటాన్, అంగోలా, ఇండోనేసియా, కెన్యా, నేపాల్, ఇథియోపియా ఇలా 72 దేశాలకు చెందిన 3,730 మంది ఉన్నారు. అత్యధికంగా నేపాల్ విద్యార్థులు 595 మంది ఉండగా.. సుడాన్ 524, జింబాబ్వే 543 మంది విద్యార్థులు చదువుతున్నారు. నేపాల్ 178, నైజీరియా-154, ఇరాక్‌కు చెందిన 127 మంది చదువుతున్నారు.

ఇదీ ప్రణాళిక..

విదేశీ విద్యార్థులను ఆకర్షించేందుకు ఉన్నత విద్యామండలి ప్రణాళిక రూపొందించింది. ఏపీలో అర్హత కలిగిన విద్యా సంస్థలను గుర్తించి విదేశీ విద్యార్థులకు ప్రవేశాలు కల్పించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పిస్తుంది.

- విద్యార్థుల మార్పిడి కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. ఒక వర్సిటీ నుంచి మరో వర్సిటీకి, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి విద్యార్థులను ఎక్స్ఛేంజ్ కార్యక్రమం కింద పంపిస్తుంది.
- అధ్యాపకుల ఎక్స్ఛేంజ్ కార్యక్రమాన్ని చేపడుతుంది.
- క్యూఎస్ ర్యాంకింగ్‌లో మొదటి 500 స్థానాల్లో ఉన్న విద్యా సంస్థలతో రాష్ట్ర వర్సిటీలు, విద్యా సంస్థలు ఒప్పందాలు చేసుకునేందుకు సహకారం అందిస్తుంది.
- ఏపీ విదేశీ విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు ప్రభుత్వం ద్వారా ప్రయత్నాలు చేయడం, విదేశీ వర్సిటీలు దేశంలో పెట్టబోయే క్యాంపస్‌లలో ఒకటి, రెండింటిని ఏపీకి తీసుకురావడంపై ఉన్నత విద్యామండలి దృష్టిసారిస్తుంది.

విశ్వవిద్యాలయం/ కళాశాల	విదేశీ విద్యార్థుల ప్రవేశాలు
ఆంధ్ర	1,069
ఆచార్య నాగార్జున	78
విజ్ఞాన్(విశాఖపట్నం)	60
ఆదిత్య వర్సిటీ, కళాశాల	488
బొనం వెంకట చలమయ్య	49
కేఎల్	681
విజ్ఞాన్(గుంటూరు)	353
గీతం(విశాఖపట్నం)	306
సెంచూరియన్	219
ఎస్ఆర్ఎం	55
విట్	45
శ్రీవేంకటేశ్వర కళాశాల	197
శ్రీవేంకటేశ్వర ఫార్మాస్యూటికల్	13
రాఘవేంద్ర ఫార్మాస్యూటికల్	81
గోదావరి గ్లోబల్	36
మొత్తం	3,730

అనుమతుల్లేకుండానే రూ.వేల కోట్ల ధారబోత



- ఇప్పటికే రూ.5,750 కోట్ల ఖర్చు
- జాతీయ హరిత ట్రైబ్యునల్ ఆదేశాలతో ఎక్కడి పనులు అక్కడే
- వెంటాడుతున్న జగన్ సర్కార్ నీలినీడలు

సరైన ప్రణాళిక, అవసరమైన అనుమతులు లేకుండా జగన్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులు ఇప్పుడు ఎక్కడివక్కడ ఆగిపోగా, రూ.వేల కోట్లు వృథా అయ్యాయి. ఈ ప్రాజెక్టులపై ఇప్పటికే దాదాపు రూ.5,750 కోట్లు ఖర్చు చేసేశారు. అవి ముందుకు కదిలే పరిస్థితి లేదు. ఒకటి రెండు ప్రాజెక్టులకు అసలు అవసరం లేకపోయినా రూ.కోట్లు వెచ్చించారు. సుప్రీంకోర్టు తాజా తీర్పుతో కొన్ని ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు సాధించే ఆస్కారమూ కనిపించట్లేదు.

ప్రాజెక్టు	అంచనా వ్యయం	చేసిన ఖర్చు (రూ.కోట్లలో)	ఆగిపోవడానికి కారణాలు
1. రాయలసీమ ఎత్తిపోతల	3,825.00	739.00	హరిత ట్రైబ్యునల్ ఆదేశాలు
2. పోలవరం ఎత్తిపోతల	914.00	191.00	అవసరం లేని పనులు
3. చింతలపూడి ఎత్తిపోతల	9,458.00	4,120.00	పర్యావరణ అనుమతులు లేకపోవడం
4. బ్యాలెన్సింగ్ జలాశయాలు (ఉమ్మడి చిత్తూరు జిల్లాలో)	2,144.50	700.00	అసలు అవసరమైన నీళ్లే లేవు. అనుమతులూ లేవు

ఇది సుప్రీం తాజా మాట: ముందుగా పర్యావరణ అనుమతులు పొందని ఏ ప్రాజెక్టుకూ ఆ తర్వాత అనుమతులు ఇవ్వొద్దు. (2021 కేంద్ర అటవీ పర్యావరణశాఖ మెమో కొట్టివేత)

పోలవరం ఎత్తిపోతల

పోలవరం రిజర్వాయర్ నుంచి రోజూ టీఎంసీ నీటిని ఎత్తిపోసి కృష్ణా డెల్టాకు మళ్లించేందుకు రూ.914 కోట్లతో జగన్ సర్కార్ పాలనామోదం ఇచ్చి, రూ.191 కోట్లు ఖర్చుచేసింది. దీనివల్ల ఎలాంటి ఉపయోగమూ లేదు. దిగువన పట్టిసీమ ఎత్తిపోతల ఉంది. పోలవరం రిజర్వాయర్ రివర్ స్లూయిస్ గేట్ల నుంచి నీటిని దిగువకు పంపి ఆ నీటిని మళ్లించే ఆస్కారం ఉండగా మరో ఎత్తిపోతల చేపట్టడం విమర్శలకు దారితీసింది. ఈ ప్రాజెక్టూ ఆగిపోయింది.

రాయలసీమ ఎత్తిపోతల

ఈ ఎత్తిపోతలకు కోట్లు ఖర్చు చేసినా పనులు ముందుకు సాగలేదు. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 800 అడుగులు ఉన్నప్పుడు కూడా సీమ జిల్లాలకు నీటిని ఎత్తిపోసేలా జగన్ సర్కార్ ఈ ప్రాజెక్టుకు పాలనామోదం ఇచ్చింది. రోజుకు 3 టీఎంసీల నీళ్లు తీసుకెళ్లాలనేది యోచన. రూ.739 కోట్లు ఖర్చుచేశారు. ఎన్జీటీ ఈ ప్రాజెక్టు పనులు నిలిపివేసింది.

నీళ్లు లేకుండానే 3 జలాశయాలా

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ముదివీడు, నేతిగుంటపల్లి, ఆవులపల్లిల్లో 3 భారీ జలాశయాల నిర్మాణాన్ని జగన్ ప్రభుత్వం రూ.2,144.50 కోట్లతో 2020లో చేపట్టింది. వీటికి నీటి కేటాయింపులు లేవు. సాంఘిక, ఆర్థిక ప్రయోజనాలపై మదింపు చేయలేదు. రూ.700 కోట్లకు పైగా పనులు చేసేశారు. ఆవులపల్లి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు చెన్నైలోని జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్జీటీ)కి ఫిర్యాదుచేశారు. పర్యావరణ అనుమతులు లేకపోవడంతో వీటి నిర్మాణాన్ని నిలిపివేయాలని ఆదేశాలిచ్చి, రూ.100 కోట్ల జరిమానా విధించింది.

చింతలపూడి ఎత్తిపోతల

ఎప్పుడో 2008-09లో ఈ ప్రాజెక్టును రూపొందించారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లోని 2 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు, 2.80 లక్షల ఎకరాల స్థిరీకరణకు ఉద్దేశించారు. గోదావరి వరదజలాలు ఉపయోగిస్తారు. ఈ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు లేవంటూ వైఎస్ హయాంలో మంత్రిగా పనిచేసిన ఒక నాయకుడు ఎన్జీటీకి వెళ్లారు. జగన్ హయాంలో ఈ ప్రాజెక్టు స్వరూపం మార్చినా పర్యావరణ అనుమతులపైనా దృష్టి సారించలేదు. ఎన్జీటీ రూ.73.60 కోట్ల జరిమానా విధించింది. అనుమతులు తీసుకున్నాకే పనులు చేపట్టాలని ఆదేశించింది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం తొలుత రూ.1,700 కోట్ల నుంచి రూ.4,900 కోట్లకు, తాజాగా రూ.9,548 కోట్లకు చేరింది. రూ.4,120 కోట్ల వరకు ఖర్చుచేశారు.

- ఈనాడు, అమరావతి




రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా అవార్డు స్వీకరిస్తున్న మంత్రి నారాయణ, గుంటూరు మేయర్ రవీంద్ర, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్ ★ విజయవాడ మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ ధ్యాన్‌చంద్ ★ మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్, తిరుపతి మేయర్ శిరీష, కమిషనర్ నారపురెడ్డి మౌర్య

రాష్ట్రానికి 5 స్వచ్ఛ పురస్కారాలు

'సూపర్ స్వచ్ఛ లీగ్'లో విజయవాడ, గుంటూరు, తిరుపతి

- ప్రత్యేక విభాగంలో విశాఖపట్నం
- స్వచ్ఛ షెహర్ ఆఫ్ స్టేట్‌గా రాజమహేంద్రవరం
- దిల్లీలో అవార్డులు అందుకున్న మంత్రి నారాయణ, ఇతర ప్రజాప్రతినిధులు

ఈనాడు, దిల్లీ: కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్ 2024-25 పోటీలో ఏపీ ఐదు అవార్డులు కైవసం చేసుకుంది. 10 లక్షల జనాభా పైపడిన నగరాల సూపర్ స్వచ్ఛ లీగ్ కేటగిరీలో విజయవాడ, 3-10 లక్షల జనాభా కేటగిరీలో గుంటూరు, మూడు లక్షల లోపు జనాభా విభాగంలో తిరుపతి పురస్కారాలు గెలుచుకున్నాయి. దిల్లీలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్, ఆయా నగరాల మేయర్లు, కమిషనర్లు పురస్కారాలు అందుకున్నారు. ప్రత్యేక కేటగిరీలో జీవీఎంసీ విశాఖపట్నం, ప్రామిసింగ్ స్వచ్ఛ షెహర్ ఆఫ్ ది స్టేట్ కేటగిరీలో రాజమహేంద్రవరం మినిస్టీరియల్ అవార్డులను సొంతం చేసుకున్నాయి. ఇండోర్ వరుసగా ఎనిమిదోసారి పరిశుభ్ర నగరంగా అవార్డు గెలుచుకుంది. తర్వాత వరుసలో సూరత్, నవీ ముంబయి, విజయవాడలు నిలిచాయి. 3-10 లక్షల జనాభా కేటగిరీలో నోయిడా, చండీగఢ్, మైసూరు, ఉజ్జయిన్, గాంధీనగర్, గుంటూరులు, మూడు లక్షల లోపు జనాభా కేటగిరీలో కొత్త దిల్లీ, తిరుపతి, అంబికాపుర్, లోనావాలాలు అవార్డులను సొంతం చేసుకొన్నాయి. దేశవ్యాప్తంగా నిర్వహించిన ఈ సర్వేలో 14 కోట్ల మంది ప్రజలు పాల్గొన్నట్లు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ తెలిపింది. ఇందులో వచ్చిన ఫలితాలను అనుసరించి మొత్తం నాలుగు కేటగిరీల్లో 78 అవార్డులు ప్రకటించింది. గురువారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ పాల్గొని మంత్రిత్వ శాఖ స్థాయి అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి నారాయణ విలేకర్లతో మాట్లాడుతూ.. జాతీయస్థాయి అవార్డులు పొందేలా స్వచ్ఛ కార్యక్రమాలు చేపట్టిన అధికారులను అభినందిస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబు ప్రతినెలా మూడో శనివారం ఓ అసెంబ్లీ నియోజకవర్గంలో స్వచ్ఛ భారత్‌పై ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు గుర్తుచేశారు. తద్వారా సీఎం స్వచ్ఛతపై ప్రజలను చైతన్యపరుస్తున్నట్లు చెప్పారు. దానివల్లే ఇప్పుడు ఐదు అవార్డులు వచ్చాయన్నారు. పట్టాభిరాం మాట్లాడుతూ.. భవిష్యత్తులోనూ స్వచ్ఛత విషయంలో ఏపీని ఆదర్శంగా నిలుపుతామని వెల్లడించారు.



వాహన ప్రమాదాల కేసుల్లో బీమా పరిహారం నేరుగా బాధితుల ఖాతాల్లోకే

పరిపాలనాపరమైన ఉత్తర్వులు ఇచ్చిన హైకోర్టు

గుంటూరు లీగల్ న్యూస్‌టుడే: వాహన ప్రమాదాల్లో బాధితులకు నష్టపరిహారాన్ని బీమా సంస్థలు నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేయాలని హైకోర్టు పాలనాపరమైన ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసుల్లో కోర్టులు మంజూరు చేసే పరిహారాన్ని బీమా సంస్థలు నేరుగా బాధితులకు చెల్లించాలని సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చిన నేపథ్యంలో హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ వైవీఎస్‌బీజీ పార్థసారథి రాష్ట్రంలోని అన్ని న్యాయస్థానాలకు మార్గదర్శకాలు జారీ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. ఇకపై ఈ కేసుల్లో బాధితులు తమ బ్యాంకు ఖాతాల వివరాలు కూడా దరఖాస్తులో పొందుపరచాలి. బీమా సంస్థలు పరిహారాన్ని బాధితుల ఖాతాల్లో నేరుగా జమ చేసేలా న్యాయమూర్తులు తమ తీర్పుల్లో పేర్కొనాలని ఆయన వివరించారు. ఇప్పటి వరకు కొన్ని సంస్థలు నేరుగా బాధితులకు పరిహారం చెల్లిస్తుండగా, కొన్ని ప్రభుత్వ బీమా సంస్థలు జిల్లా న్యాయమూర్తుల ఖాతాల్లోకి చెక్కుల రూపంలో జమ చేస్తున్నాయి. తర్వాత వీటిని న్యాయమూర్తులు.. బాధితుల పత్రాలు పరిశీలించి, సొమ్మును వారి ఖాతాల్లోకి జమ చేయిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యేసరికి తీవ్ర జాప్యం జరుగుతోంది. దీనివల్ల బాధిత కుటుంబాలు, అంగవైకల్యానికి గురైన వారు, వృద్ధులు కూడా నష్టపరిహారం కోసం కోర్టుల చుట్టూ తిరుగుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హైకోర్టు తాజా ఉత్తర్వుల వల్ల బాధితులకు ఉపశమనం లభించనుంది.

పోలీసులను సంప్రదించకుండానే విజయోత్సవాలకు పిలుపు

- చిన్నస్వామి స్టేడియం ఘటనపై కర్ణాటక ప్రభుత్వం నివేదిక



తొక్కిసలాటకు ముందు మైదానం వెలుపలి కూడలిలో రద్దీ

బెంగళూరు (హలసూరు), న్యూస్‌టుడే: బెంగళూరులోని చిన్నస్వామి క్రికెట్ మైదానం వెలుపల జూన్ 4న జరిగిన తొక్కిసలాట ఘటనపై కర్ణాటక ప్రభుత్వం హైకోర్టుకు సమర్పించిన నివేదికలోని కీలక విషయాలను గురువారం వెల్లడించింది. పోలీసులను సంప్రదించకుండానే ఆర్సీబీ విజయోత్సవానికి పిలుపునిచ్చిందని పేర్కొంది. నివేదికను రహస్యంగా ఉంచాలని ప్రభుత్వం కోరినా.. ఉన్నత న్యాయస్థానం తిరస్కరించడంతో విడుదల చేయక తప్పలేదు. ఘటనకు ఐపీఎస్ అధికారులను బాధ్యులను చేస్తూ సస్పెండ్ చేయడాన్ని ప్రభుత్వం సమర్థించుకుంది. పోలీసు అధికారులు.. ఆర్సీబీ జట్టు యాజమాన్యం, డీఎన్ఏ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రతినిధులకు సేవకుల్లా ప్రవర్తించడంతోనే ఘటన తీవ్రత పెరిగిందని పేర్కొంది. "విజయోత్సవాలు నిర్వహించే విధానంపై మాత్రమే సమాచారం ఇచ్చాం. ఆర్సీబీ విజయం సాధిస్తుందో.. లేదో తెలియక, వేడుకలకు ఎంతమంది వస్తారో సమాచారం లేక అనుమతులు ఇవ్వలేదు. విజయం అనంతరం పోలీసులను సంప్రదించకుండానే ఆర్సీబీ తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో విక్టరీ పరేడ్ గురించి పోస్టు పెట్టింది. ఈ విజయాన్ని బెంగళూరు ప్రజలు, ఆర్సీబీ అభిమానులతో జరుపుకోవాలని కోహ్లి పోస్టు చేశారు. 35 వేల మంది పట్టే స్టేడియానికి 3.5 లక్షలకుపైగా అభిమానులు వచ్చారు. వేడుకను రద్దు చేయాలనుకున్నా.. భారీ సంఖ్యలో అభిమానులు రావడంతో కుదరక కార్యక్రమాన్ని కుదించాల్సి వచ్చింది' అని ప్రభుత్వం తన నివేదికలో పేర్కొంది. నాటి తొక్కిసలాటలో 11 మంది మృతి చెందారు.

రాష్ట్రానికి భారీ వర్ష సూచన



ఈ నెల 24 వరకు పలు ప్రాంతాల్లో భారీ వర్షాలకు అవకాశం

ఈనాడు, విశాఖపట్నం: వేడి, ఉక్కపోతతో కొద్ది రోజులుగా ఇబ్బందులు పడుతున్న రాష్ట్ర ప్రజలకు ఉపశమనం లభించనుంది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 24 వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం పేర్కొంది. రాబోయే రెండు రోజుల్లో ఈదురు గాలులు వీచే అవకాశముందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ సూచించారు. శుక్రవారం ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు, మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలకు అవకాశముందని తెలిపారు. శనివారం ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు, మిగిలిన చోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురుస్తాయని అంచనా వేస్తున్నారు. గురువారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు కొనసాగాయి. తుని, కాకినాడ, నరసాపురం, మచిలీపట్నం, నందిగామ, గన్నవరం, జంగమేశ్వరపురం, బాపట్ల, ఒంగోలు, నెల్లూరు తదితర ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 6 డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, డా. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కృష్ణా, శ్రీకాకుళం, ఏలూరు తదితర జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. రాత్రి 8 గంటల వరకు అత్యధికంగా ఎన్టీఆర్ జిల్లా ఉటుకూరులో 70.25 మి.మీ. వర్షపాతం నమోదైంది.

నాగార్జునసాగర్‌కు 67 వేల క్యూసెక్కుల విడుదల

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: శ్రీశైలం కుడి, ఎడమగట్టు జలవిద్యుత్తు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ.. 67,986 క్యూసెక్కుల వరద నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. పరీవాహక ప్రాంతాల్లోని జూరాల, సుంకేసుల జలాశయాల నుంచి 57,845 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం జలాశయానికి వస్తోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం గురువారం సాయంత్రం 6 గంటల సమయానికి 881.20 అడుగులు, నీటినిల్వ 194.7599 టీఎంసీలుగా నమోదైంది.

బసవతారకం ఆస్పత్రిలో అధునాతన రేడియేషన్ యంత్రం

దక్షిణ భారతదేశంలో తొలిసారి ఏర్పాటు



బసవతారకం ఆస్పత్రిలో అధునాతన రేడియేషన్ యంత్రం వద్ద డా.దిలీప్, డా.కె.కృష్ణయ్య, డా.ఫణికోటేశ్వరరావు

హైదరాబాద్, న్యూస్‌టుడే: క్యాన్సర్ రోగులకు అత్యుత్తమ చికిత్స అందించేందుకు బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో అధునాతన రేడియేషన్ యంత్రం అందుబాటులోకి వచ్చినట్లు ఆస్పత్రి వర్గాలు గురువారం ఓ ప్రకటనలో తెలిపాయి. హైపర్‌సైట్ సిస్టమ్ (ఎల్‌ఏ6) వేరియన్ హల్సియాన్ రేడియేషన్ యంత్రం దక్షిణ భారత దేశంలోనే మొట్టమొదటిది కాగా దేశంలో రెండోది. ఆసియాలో అత్యంత అధునాతన ఆరోగ్య వ్యవస్థల్లో ఒకటిగా నిలుస్తుంది. గురువారం ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో సీఈవో డా.కె. కృష్ణయ్య మాట్లాడుతూ, హల్సియాన్ వ్యవస్థ.. అల్ట్రా ఫాస్ట్ చికిత్సలను 10 నిమిషాల్లోపే పూర్తిచేసేందుకు వీలు కల్పిస్తుందన్నారు. మెరుగైన కణితి స్థానికీకరణ కోసం హై-రిజల్యూషన్ సాఫ్ట్ టిష్యూ ఇమేజింగ్‌ను అందించడమే గాకుండా ఆఫ్‌లైన్ అడాప్టివ్ థెరపీ కార్యకలాపాలకు ఈ యంత్రం ఉపకరిస్తుందని వివరించారు. డా.ఫణికోటేశ్వరరావు, డా.దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

తోతాపురి మామిడి రైతులకు రూ.260 కోట్ల విడుదల

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని తోతాపురి మామిడి రైతులకు ప్రోత్సాహక ధర కింద జమ చేయనున్న నగదు రూ.260 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసిందని ఉద్యాన శాఖ డీడీ మధుసూదనరెడ్డి తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని తోతాపురి మామిడి టన్నుకు రూ.4 వేలు ప్రోత్సాహక నగదు చొప్పున మొత్తం 6.50 లక్షల టన్నులకు రూ.260 కోట్లు మంజూరు చేసింది. ఈ మొత్తాన్ని రైతుల ఖాతాల్లో త్వరలో జమ చేయనున్నామని డీడీ పేర్కొన్నారు.

నేడు ఎస్‌ఆర్‌ఎంలో గ్రీన్ హైడ్రోజన్ సమిట్-2025

ముఖ్యఅతిథిగా హాజరుకానున్న సీఎం చంద్రబాబు

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలోనే మొదటిసారిగా అమరావతిలోని ఏపీ-ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో శుక్రవారం గ్రీన్ హైడ్రోజన్ సమిట్-2025 జరగనుంది. దీనికి ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌లతో పాటు నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వీకే సారస్వత్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, హైడ్రోజన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ డా.ఆర్కే మల్హోత్రా, సీఎస్ఐఆర్ నేషనల్ కెమికల్ లేబొరేటరీ డైరెక్టర్ డా. ఆశిష్ లేలే, జర్మనీ, నెదర్లాండ్స్ దేశాల నుంచి పలువురు నిపుణులు, ఇతర ప్రముఖులు హాజరుకానున్నారు.

రెచ్చగొట్టే వ్యాఖ్యల కేసులో పేర్ని నానికి షాక్

- అరెస్ట్ నుంచి రక్షణ కల్పించేందుకు హైకోర్టు నిరాకరణ
- విచారణ 22కు వాయిదా

ఈనాడు, అమరావతి: వైకాపా కార్యకర్తల సమావేశంలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి, వైకాపా నేత పేర్ని వెంకటరామయ్య (నాని)కి హైకోర్టు షాకిచ్చింది. పోలీసులు నమోదు చేసిన కేసులో అరెస్ట్‌తో పాటు తొందరపాటు చర్యలు తీసుకోకుండా నిలువరిస్తూ మధ్యంతర ఉత్తర్వులివ్వాలన్న నాని అభ్యర్థనను తోసిపుచ్చింది. పూర్తి వివరాలు సమర్పించేందుకు పోలీసులు సమయం కోరడంతో విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. ఈ నెల 11న కృష్ణా జిల్లా పామర్రులో వైకాపా కార్యకర్తల సమావేశంలో పేర్ని నాని మాట్లాడుతూ 'చెప్పి కాదు, చెప్పకుండా నరికివేయాలి.. చీకట్లో కన్ను కొడితే పని అయిపోవాలి. ఇప్పుడు అరవడం కాదు. తప్పు చేసినవాడు ఎవరైనా ఉంటే మన ప్రభుత్వం వచ్చాక వేసేయండి' అంటూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారంటూ మచిలీపట్నం తెదేపా పట్టణ అధ్యక్షుడు లోగిశెట్టి వెంకటస్వామి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పామర్రు పోలీసులు కేసు నమోదు చేశారు. దాన్ని కొట్టేయాలంటూ పేర్ని నాని హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేశారు. గురువారం జరిగిన విచారణలో పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది సి.రఘు వాదనలు వినిపించారు. వైకాపా కార్యకర్తల సమావేశంలో చేసిన వ్యాఖ్యల్లో కొంత భాగాన్ని మాత్రమే ప్రచారం చేస్తున్నారన్నారు. పోలీసులు నమోదు చేసిన సెక్షన్లు ఏడేళ్లలోపు జైలుశిక్షకు వీలున్నవేనని.. మరి కొన్ని సెక్షన్లను చేర్చాలని భావిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో అరెస్ట్ విషయంలో తొందరపాటు చర్యలు తీసుకోకుండా పోలీసులను నిలువరించాలని కోరారు. పోలీసుల తరఫున పీపీ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ.. పిటిషన్ మొదటిసారి విచారణకు వచ్చిందన్నారు. వివరాలు సేకరించి కోర్టు ముందు ఉంచేందుకు సమయం కావాలని కోరారు. దీంతో హైకోర్టు సింగిల్ జడ్జి విచారణను మంగళవారానికి వాయిదా వేశారు.

పీఎస్సార్ బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

రఘురామను చిత్రహింసలకు గురిచేసిన కేసు..

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో అప్పటి ఎంపీ, ప్రస్తుత శాసనసభ ఉపసభాపతి రఘురామ కృష్ణరాజును కస్టడీలో చిత్రహింసలు పెట్టిన వ్యవహారంపై నమోదైన కేసులో ముందస్తు బెయిలు కోసం ఐపీఎస్ అధికారి పీఎస్సార్ ఆంజనేయులు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ రెండు వారాలకు వాయిదా పడింది. అంతకుముందు పోలీసుల తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా స్పందిస్తూ.. రఘురామను చిత్రహింసలకు గురిచేయడంపై సుప్రీం కోర్టు విస్మయం వ్యక్తం చేసిందన్నారు. ఇలాంటి తీవ్ర కేసుల్లో ముందస్తు బెయిలు ఇవ్వొద్దని కోరారు. పూర్తిస్థాయి వాదనలు వినిపించేందుకు విచారణను వాయిదా వేయాలని కోరారు. పీఎస్సార్ తరఫు న్యాయవాది నగేష్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. కేసు నమోదు చేసి చాలాకాలం అవుతోందన్నారు. చిత్రహింసలకు గురిచేశారనేది ఆరోపణ మాత్రమేనని చెప్పారు.



నితిన్ గడ్కరీ నుంచి అవార్డు అందుకుంటున్న రాళ్లపల్లి సతీష్

రాజన్న ఫౌండేషన్‌కు సీఎస్‌ఆర్ టైమ్స్ అవార్డు

రేణిగుంట, న్యూస్‌టుడే: అమరరాజ సౌజన్యంతో నడిచే రాజన్న ఫౌండేషన్‌కు సీఎస్ఆర్ టైమ్స్ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని ఆ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గల్లా రామచంద్రనాయుడు తెలిపారు. గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పనలో ఫౌండేషన్ అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా సీఎస్ఆర్ మార్కెటింగ్, బ్రాండ్ హానాక్ సంస్థ దీన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. గురువారం దిల్లీలో జరిగిన గ్లోబల్ సీఎస్ఆర్ అవార్డు కార్యక్రమంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ నుంచి ఫౌండేషన్ హెడ్ రాళ్లపల్లి సతీష్ ఈ అవార్డు అందుకున్నట్లు వివరించారు. అనంతరం అమరరాజ సంస్థల ఛైర్మన్ గల్లా జయదేవ్ మాట్లాడుతూ.. ఈ అవార్డు రాజన్న ఫౌండేషన్ నిబద్ధతకు నిదర్శనమని, రానున్న కాలంలో మరిన్ని సేవలు అందిస్తామని తెలిపారు.

పొగాకు కొనుగోళ్లపై దుష్ప్రచారం తగదు

- బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ పోలీస్ స్టేషన్‌లో రైతుల ఫిర్యాదు



పర్చూరు ఎస్సై జీవీ చౌదరికి ఫిర్యాదు చేస్తున్న పొగాకు రైతులు

పర్చూరు, మార్టూరు, న్యూస్‌టుడే: తమ ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా సాక్షి దినపత్రిక తప్పుడు కథనాలు ప్రచురిస్తోందంటూ పొగాకు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం నల్లబర్లీ రైతులను ఆదుకునేందుకు పొగాకు కొనుగోళ్లు చేపడుతుంటే.. దాన్ని వక్రీకరిస్తూ అసత్య కథనాలు రాయడం తగదంటూ మండిపడ్డారు. బాపట్ల జిల్లా పర్చూరులోని బొమ్మల కూడలి వద్ద గురువారం సాక్షి దినపత్రిక ప్రతులను దహనం చేసి, నిరసన తెలిపారు. జగన్ డౌన్.. డౌన్.. అంటూ నినాదాలు చేశారు. రైతు సుబ్బారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. "కారంచేడు మండలం యర్రంవారిపాలేనికి చెందిన నేను స్వగ్రామంతో పాటు పర్చూరు మండలం నూతలపాడులో 40 ఎకరాల్లో నల్లబర్లీ పొగాకు సాగు చేశా. గ్రేడింగుల్లో వచ్చే గుల్ల ఆకును ఎరువుగా వాడేందుకు వీలుగా పొలాన్ని ట్రాక్టరుతో బాగు చేయించుకుంటున్నా. చేను వద్ద నేను లేని సమయంలో సదరు పత్రికా విలేకరి పేరుతో ఓ వ్యక్తి వచ్చి ఫొటో తీసుకున్నారు. దాంతో సాక్షిలో అసత్య కథనం ప్రచురించారు. నేను పండించిన పొగాకును అమ్మేందుకు వ్యవసాయ శాఖ, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రంలో ఇప్పటికే నమోదు చేసుకున్నా. ఆ పత్రికలో కథనం వచ్చేంతవరకు దాని గురించి నాకు తెలియదు" అని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి సంబంధించి ఆ పత్రికా యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సుమారు 100 మంది రైతులు పర్చూరు ఎస్సై జీవీ చౌదరికి ఫిర్యాదు అందజేశారు.



విజేతలను పాతాళానికి తోసేది అదే..

ఒక్కసారి విజయం సాధించగానే చాలా మంది చేసే పొరపాటు ఏంటంటే, సంతృప్తికర భావనకు లోనై పోరాట పటిమను వదిలేయడం. విజేతలను మళ్లీ పాతాళానికి తోసేసేది ఆత్మసంతృప్తే. విజయాన్ని ఓ మజిలీగా మాత్రమే చూడాలి తప్ప అంతిమ స్థానంగా కాదు. మరో కొత్త లక్ష్యాన్ని విధించుకొని ముందుకు కదలండి. లేకపోతే మీ గత విజయాలకు కారణం అదృష్టమే తప్ప మీ ఘనత ఏమీ లేదని భావించే పరిస్థితి వస్తుంది.

– షేన్ పారిష్, పాడ్‌కాస్టర్

రూ.27,691 కోట్ల రెవెన్యూ లోటు

వెల్లడించిన కాగ్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఈ ఆర్థిక సంవత్సరం తొలి 3 నెలల్లో రూ.27,691 కోట్ల మేర రెవెన్యూ లోటు ఏర్పడింది. పన్నుల రాబడి రూ.33,505 కోట్లు ఉండగా మొత్తం రెవెన్యూ రాబడి రూ.36,239.37 కోట్లుగా ఉంది. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) విభాగం తొలి మూడు నెలల లెక్కలను ఖరారు చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి మూడు నెలల్లో రూ.37,093 కోట్ల రుణం సమీకరించింది. ఏడాది మొత్తానికి రూ.79,926.89 కోట్ల అప్పులు అవసరమవుతాయని బడ్జెట్ అంచనాల్లో పేర్కొన్నారు. తొలి మూడు నెలల్లోనే 46% మేర రుణాలు తీసుకోవాల్సి వచ్చింది. మరో వైపు రూ.40,635.72 కోట్లు మూలధన వ్యయంగా వెచ్చించాలని అంచనా వేసుకున్నారు. తొలి మూడు నెలల్లో రూ.6,053 కోట్లు ఇందుకోసం ఖర్చు చేయగలిగారని కాగ్ గణాంకాలు పేర్కొంటున్నాయి.

పోలవరం ఎత్తు కుదింపు పాపం జగన్‌దే

ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల ధ్వజం

ఈనాడు, అమరావతి: పోలవరం ప్రాజెక్టు ఎత్తు కుదింపు పాపం ముమ్మాటికీ మాజీ సీఎం జగన్‌దేనని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల మండిపడ్డారు. భాజపాకు అమ్ముడుపోయి మోదీ కోసం పోలవరం ప్రయోజనాలు తాకట్టుపెట్టి .. ఇప్పుడు ప్రాజెక్టు ఎత్తు పెంచాలని జగన్ మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని గురువారం ఓ ప్రకటనలో ఆమె విమర్శించారు. 'వైఎస్సార్ కుమారుడై ఉండి ఐదేళ్ల వైకాపా పాలనలో పోలవరంలో తట్టెడు మట్టి తీశారా? వైఎస్ ఆశయ సాధకుడివైతే పోలవరం ప్రాజెక్టును ఎందుకు నిర్లక్ష్యం చేశారు? 2022లో పోలవరం నీటి నిల్వ సామర్థ్యం 41.15 మీటర్లకు కుదించిన పాపం మీ ప్రభుత్వానిది కాదా? అంచనా వ్యయం రూ.55 వేల కోట్ల నుంచి రూ.37 వేల కోట్లకు తగ్గిస్తుంటే వేడుక చూసింది మీరు కాదా?' అని షర్మిల ప్రశ్నించారు. 'కూటమి ప్రభుత్వం బనకచర్ల ప్రయత్నాలు ఆపి.. ముందు పోలవరం ప్రాజెక్టు సంగతి తేల్చాలి. పాత డీపీఆర్ ప్రకారమే పోలవరాన్ని 45.7 మీటర్ల ఎత్తులో నిర్మించాలి' అని షర్మిల డిమాండ్ చేశారు.

రష్యా మహిళ కోసం ఇజ్రాయెల్ నుంచి ప్రియుడు రాక!

బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే: కర్ణాటక తీర పట్టణం గోకర్ణ సమీప అడవిలోని గుహలో రహస్యంగా నివసించిన రష్యా మహిళ నీనా కుటినా(40).. తన ప్రేయసి అని ఇజ్రాయెల్ నుంచి డ్రోర్ గోల్డ్ స్టైనిన్(38) అనే వ్యక్తి గురువారం బెంగళూరు వచ్చారు. ఆమెతో మాట్లాడేందుకు పోలీసుల సాయం కోరారు. వారికి సంబంధించిన పలు వివరాలు వెల్లడించారు. "గోవాలో ఇద్దరం ఒకే కంపెనీలో పని చేశాం. అప్పుడే ప్రేమించుకున్నాం. ఇద్దరు కుమార్తెలు జన్మించిన అనంతరం కూడా కలిసే ఉన్నాం. గతేడాది పనిపై ఇజ్రాయెల్ వెళ్లా. తరచూ ఫోన్‌లో మాట్లాడుకునే వాళ్లం. ఉన్నట్లుండి మార్చి నుంచి నీనా ఫోన్‌కు స్పందించడం మానేశారు. ఈ విషయంపై పణజీ పోలీసులకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశా. ఇటీవల గుహలో రహస్యంగా ఉన్న ఆమెను, పిల్లల్ని పోలీసులు రక్షించారని తెలిసి.. వెంటనే ఇక్కడికి వచ్చా' అని పోలీసులకు వివరించారు. కుటుంబ నిర్వహణకు ప్రతి నెలా రూ.3.5 లక్షలు పంపుతున్నానని తెలిపారు. ఆమె తరచూ ప్రకృతి మధ్యలోనే పిల్లలను పెంచాలనేదని.. అందుకే అడవిలోకి వెళ్లి ఉండొచ్చని తెలిపారు.

ప్రియుడితో కలిసి భర్త హత్య

నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



శీనయ్య

రాపూరు, న్యూస్‌టుడే: పెళ్లికి ముందే ఆమెకు ఒకరితో వివాహేతర సంబంధం ఉన్నా మరొకరితో ఏడడుగులు వేసింది. తాళి కట్టిన భర్త ఇంటికే ప్రియుడిని తరచూ పిలిపించుకొనేది. వీరి బంధానికి భర్త అడ్డుగా ఉన్నాడని భావించి పథకం వేసి ప్రాణాలు తీసింది. ఏమీ తెలియనట్లుగా నటించింది. చివరకు పోలీసుల ఎదుట నిజం అంగీకరించింది. ఈ ఘటన శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రాపూరు ఎస్సీ కాలనీలో (అరుంధతీయవాడ) బుధవారం రాత్రి జరగ్గా గురువారం వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం మేరకు.. అరుంధతీయవాడకు చెందిన ఎల్.శీనయ్య (25)కు మండలంలోని పంగిలికి చెందిన ధనమ్మతో ఐదేళ్ల క్రితం వివాహమైంది. ధనమ్మకు పంగిలికి చెందిన కల్యాణ్‌తో పెళ్లి కాక ముందు నుంచే సంబంధం ఉంది. తరచూ అతను ఇంటికొచ్చేవాడు. తమ బంధానికి భర్త అడ్డుగా ఉన్నాడని తలచి ప్రియుడితో కలిసి హత్య చేయాలని పథకం వేసింది. బుధవారం రాత్రి ఇంటికి కల్యాణ్ రాగా, అదే సమయంలో శీనయ్య మద్యం మత్తులో ఉండటంతో అంతమొందించాలనుకున్నారు. ఇద్దరూ కలసి మెడకు తీగ బిగించి వేలాడదీయడంతో శీనయ్య మృతి చెందాడు.

ఏమీ తెలియనట్లుగా...: పొద్దెక్కినా శీనయ్య లేవకపోయేసరికి పక్కనే ఉంటున్న తల్లిదండ్రులు వచ్చి అడిగారు. ఏమీ తెలియనట్లుగా ధనమ్మ వారితో కలిసి లేపేందుకు వెళ్లింది. ఎంత పిలిచినా లేవకపోయేసరికి తల్లిదండ్రులు బంధువులను పిలిచారు. వారు వచ్చి చూసి సాధారణ మరణంగా భావించి, అంత్యక్రియలకు ఏర్పాట్లుచేశారు. కాసేపటికి శీనయ్య ఒంటిపై గాయాలను చూసి అనుమానించారు. బంధువులు ఎంత ప్రశ్నించినా తనకేమీ తెలియదని ధనమ్మ బుకాయించింది. పోలీసులు వచ్చి విచారించడంతో హత్య చేసినట్లు అంగీకరించింది. ఆమెతో పాటు ప్రియుడు కల్యాణ్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ సత్యనారాయణ వివరించారు. మృతుడికి మూడేళ్ల వయసున్న కుమార్తె ఉంది.

చిన్న పరిశ్రమలు.. చిగురించాలి!

(మొదటి పేజీ తరువాయి)

ఎంఎస్ఎంఈలను స్థాపించాలని సూచించింది. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ వంటి ప్రధాన పారిశ్రామిక కేంద్రాలకు సమీపంలో మనం ఉండటంతో పాటు సముద్ర ఉత్పత్తులు, ప్లాస్టిక్ రంగాల వంటి వాటిపైనా మనకు వెసులుబాటు ఉందని పేర్కొంటూ మరికొన్ని సూచనలు చేసింది. అవి ఇలా ఉన్నాయి.

తమిళనాడు విధానాలు మేలు

- ఎంఎస్ఎంఈ సెక్టార్‌లో విదేశీ పెట్టుబడులకు సహకరించేందుకు ప్రత్యేక విభాగం ఏర్పాటు.
- నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే అన్ ఎంప్లాయిడ్ యూత్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం (యూవైఈజీపీ), న్యూ ఎంటర్‌ప్రెన్యూర్, ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ స్కీం(ఎన్ఈఈడీఎస్)ల కింద రుణాలు ఇవ్వడం.
- పారిశ్రామిక ప్రాంతాల్లో ఎంఎస్ఎంఈల కోసం ప్రత్యేక బ్యాంకు శాఖలు ఏర్పాటు చేయడం. క్రెడిట్ గ్యారంటీ ఫండ్ ట్రస్ట్ కింద రుణాలు అందించేలా బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో ఒప్పందం చేసుకోవడం.

వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న మరికొన్ని విధానాలు

రాష్ట్రం	అత్యుత్తమ విధానాలు
తమిళనాడు	★ విపత్తులు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఎంఎస్ఎంఈల భద్రతకు ప్రత్యేక బీమా పథకం
ఉత్తర్‌ప్రదేశ్	★ సూక్ష్మ, చిన్న పరిశ్రమలకు ఎక్స్‌ప్రెస్‌వే కారిడార్‌లలో 50 శాతం ప్లాట్‌లు ★ రాష్ట్ర చిన్న పరిశ్రమల అభివృద్ధి సంస్థ ఏర్పాటు చేసే పారిశ్రామిక వాడల్లో కనీసం 30 శాతం కేటాయింపు ★ ఎంఎస్ఎంఈ యూనిట్ ఉత్పత్తిలోకి వచ్చినప్పటి నుంచి ఐదేళ్ల పాటు ఈపీఎఫ్ తిరిగి చెల్లింపు ★ ఎంఎస్ఎంఈల విస్తరణ, స్టార్టప్‌ల కోసం వెంచర్ క్యాపిటల్ ఫండ్ ఏర్పాటు
తెలంగాణ	★ భూమి లభ్యత, సౌలభ్యం, తక్కువ ధరకు భూములు, ఆర్థిక సహకారం, ముడిసరకు లభ్యత, కార్మికుల అందుబాటు, సాంకేతికత వినియోగం, మార్కెటింగ్ అవకాశాలు ★ స్టార్టప్ నుంచి ఉత్పత్తిలోకి వచ్చే వరకు సహకారం

అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక

● సూక్ష్మ, చిన్న తరహా వ్యాపారుల కోసం క్రెడిట్ గ్యారంటీ ఫండ్ ట్రస్ట్ నుంచి దేశంలో సగటున రూ.9 లక్షల వరకు ఒక్కొక్క యూనిట్‌కు అందుతోంది. ఆ జాతీయ సగటుకు సమానంగా రాష్ట్రంలోనూ ఉండాలి (ప్రస్తుతం రూ.లక్ష మాత్రమే ఉంది). ● తమిళనాడులో మాదిరే ఎంఎస్ఎంఈ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బ్యూరో ఏర్పాటు చేయాలి. ● జిల్లా పరిశ్రమల కేంద్రాలు, పరిశ్రమల సంఘాలు, ఎన్జీవోల భాగస్వామ్యంతో కేంద్ర ప్రభుత్వ ఉద్యమ్ పోర్టల్‌లో ఎంఎస్ఎంఈలను నమోదు చేయించాలి.

భార్యాబిడ్డల్ని హత్తుకొని భావోద్వేగం

హ్యూస్టన్‌లో కుటుంబాన్ని కలుసుకున్న శుభాంశు శుక్లా



తన భార్య కామ్నాను ఆనందంగా ఆలింగనం చేసుకుంటున్నశుభాంశు శుక్లా



తన కుమారుడిని ముద్దాడుతున్న శుభాంశు శుక్లా

లఖ్‌నవూ: యాక్సియం-4 మిషన్‌తో భారత రోదసి చరిత్రలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న వ్యోమగామి శుభాంశు శుక్లా ఎట్టకేలకు తన కుటుంబాన్ని తిరిగి కలుసుకున్నారు. అమెరికాలోని హ్యూస్టన్‌లో తానున్న పునరావాస కేంద్రంలో భార్య కామ్నా, కుమారుడు కైశ్‌ను ఆయన బుధవారం కలిశారు. వారిని హత్తుకొని భావోద్వేగానికి లోనయ్యారు. సంబంధిత ఫొటోలను శుభాంశు ఇన్‌స్టాగ్రామ్‌లో స్వయంగా పోస్టు చేశారు. "అంతరిక్షయానం అద్భుతం. చాలా రోజుల తర్వాత కుటుంబ సభ్యులను కలుసుకోవడం సైతం అంతే అద్భుతం. రోదసియానం కోసం రెండు నెలలు క్వారంటైన్‌లో గడిపాను. ఈ సమయంలో నా కుటుంబ సభ్యులను 8 మీటర్ల దూరం నుంచి చూడాల్సి వచ్చింది. చేతులపై సూక్ష్మక్రిములు ఉంటాయి కాబట్టి నాన్నను తాకొద్దని నా కుమారుడికి చెప్పేవారు. 'చేతులు కడుక్కొని నాన్నను తాకొచ్చా' అని మా బాబు నన్ను చూడటానికి వచ్చిన ప్రతిసారీ తన తల్లిని అడిగేవాడు. అది ఎంతో కష్టంగా అనిపించేది. ఇప్పుడు రోదసియానం పూర్తిచేసుకొని వారిని హత్తుకోవడంతో నిజంగా ఇంటికి వచ్చినట్లు అనిపిస్తోంది" అని శుభాంశు తన పోస్టులో రాసుకొచ్చారు. "కొన్నిసార్లు మనం బిజీగా ఉంటాం. మన జీవితాల్లోని వ్యక్తులు ఎంత ముఖ్యమైనవారో మర్చిపోతుంటాం. ఈరోజు నాకు ఎంతో ఇష్టమైనవారిని కలిశాను. అంతరిక్ష ప్రయాణాలు మాయాజాలంగా అనిపిస్తాయి. అయితే మనుషుల వల్లే అవి అలా మారాయి" అని కూడా పేర్కొన్నారు.

ఆరోగ్యంపై ఆందోళనకర పరిస్థితుల్లేవు: ఇస్రో

శుభాంశు ఈ నెల 23 వరకూ క్వారంటైన్‌లోనే ఉంటారని కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ తెలిపారు. ఆలోగా ఆయనకు అన్ని వైద్య పరీక్షలు చేస్తారని, భూమిపై జీవనానికి తిరిగి అలవాటుపడే ప్రక్రియ కూడా పూర్తవుతుందని చెప్పారు. 24 నుంచీ శుభాంశు ఇస్రో, యాక్సియం, నాసాలతో మాట్లాడతారని పేర్కొన్నారు. మరోవైపు- శుభాంశు ఆరోగ్యానికి సంబంధించి ఆందోళనకర పరిస్థితులేవీ లేవని ప్రాథమిక పరీక్షల్లో తేలినట్లు ఇస్రో గురువారం ఓ ప్రకటనలో తెలిపింది.

భూమిపై జీవనానికి తిరిగి అలవాటు పడుతున్నాడు: శుభాంశు తండ్రి

భూమిపై జీవనానికి శుభాంశు తిరిగి అలవాటు పడుతున్నారని ఆయన తండ్రి శంభు దయాల్ తెలిపారు. ఆయనకు స్వాగతం పలికేందుకు లఖ్‌నవూలో తాము ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. అయితే శుభాంశు రాకకు మరికొంత సమయం పడుతుందన్నారు. ఆయన ఎప్పుడొచ్చినా భారీస్థాయిలో వేడుక నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

ఇష్టమైన ఆహారం వండిపెడతా: శుభాంశు భార్య

అంతరిక్షయానం తర్వాత శుభాంశును తిరిగి కలుసుకోవడం తనకు పెద్ద పండగలాంటిదని ఆయన భార్య కామ్నా అన్నారు. అంతరిక్షంలో ఉన్నప్పుడు శుక్లా ఇంటి ఆహారాన్ని చాలా మిస్సయ్యారని, ఇంటికొచ్చాక ఆయనకు ఇష్టమైన ఆహారం వండిపెడతానని పేర్కొన్నారు. ఐఎస్ఎస్ నుంచి శుభాంశు తనతో ఫోన్‌కాల్ మాట్లాడటం బాగా ఆనందాన్నిచ్చిందని ఆమె తెలిపారు.

మార్కెట్ కమిటీల ఛైర్మన్ల వివరాలు

మార్కెట్ కమిటీ	ఛైర్మన్
తెదేపా నుంచి	
ఆదోని	జిండే శారద
అమలాపురం	ఎ.జయవెంకటలక్ష్మి
అరకులోయ	బి.లక్ష్మి
ఆత్మకూరు	ఎ.జనార్దన్‌నాయుడు
ఆత్మకూరు (శ్రీశైలం)	వి.వెంకటకృష్ణారెడ్డి
భీమవరం	కలిదిండి సుజాత
చీపురుపల్లి	రేగన రామారావు
చిలకలూరిపేట	షేక్ కరీముల్లా
చింతపల్లి	కిల్లో ఊర్మిళ
చిత్తూరు	వయ్యాసి యూన్నీరాణి
గుత్తి	గుర్రాల సూర్యప్రతాప్
గోరంట్ల	ఇ.శైలజావెంకటేశ్
గూడూరు	సిహెచ్.నీరజ
గురజాల	బెల్లంకొండ భారతి
జగ్గయ్యపేట	కె.సత్యనారాయణప్రసాద్
కైకలూరు	పి.త్రినాథరాజు
కంచిలి	మద్దిలి విజయలక్ష్మి
కావలి	పోతుగంటి అలేఖ్య
కోడుమూరు	ఎ.సుగుణమ్మ
కోయిలకుంట్ల	జి.మధులత
కొండపి	కె.తిరుపతమ్మ
క్రోసూరు	షేక్ జరీనా
కర్నూలు	అజ్మతి బీ
లక్కిరెడ్డిపల్లి	ఎస్ఎండీ షఫీ నాయక్
మాచర్ల	ఆర్.మల్లేశ్వరి
మంత్రాలయం	సిహెచ్.నర్సిరెడ్డి
మెరకముడిదాం	టి.చంద్రశేఖర్
నరసాపురం	జక్కం శ్రీమన్నారాయణ
నెల్లూరు	మనుబోలు శ్రీధర్‌రెడ్డి
నిడదవోలు	జె.జిన్నబాబు
పామర్రు	జన్ను శోభన్‌బాబు
పార్వతీపురం	గొట్టపు గౌరి
పాతపట్నం	చిన్నింటి గౌరమ్మ
పెందుర్తి	ఎన్.జ్యోతి
పెనుగొండ	బడేటి వీరబ్రహ్మం
పెనుకొండ	బి.రామకృష్ణచౌదరి
పెనుమూరు	వై.కృష్ణమనాయుడు
పోలవరం	పొట్ట రామారావు
పొన్నూరు	పఠాన్ రిజ్వానా
పుంగనూరు	ఎన్.సెమిపతి
పూసపాటిరేగ	గేదెల గాయత్రి
రామచంద్రపురం	ఎ.రిష్వంత్‌రాయ్
రాజానగరం	టి.వెంకటరమణమ్మ
రాపూరు	ఎ.వాణి
రాయచోటి	బి.రాంప్రసాద్‌రెడ్డి
సామర్లకోట	ఎ.మణికుమారి
సూళ్లూరుపేట	ఆకుతోట రమేశ్
తాడికొండ	నీలాల ధనలక్ష్మి
తనకల్లు	బి.చంద్రకళ
తిరుచానూరు	యు.మౌనిక
వాకాడు	మర్రి ప్రమీల
వెంకటగిరి	పి.విశ్వనాథ్
జనసేన నుంచి	
ఆళ్లగడ్డ	మైలేరి సురేఖ
చోడవరం	అల్లం మాధవి
హిరమండలం	ఎం.రామకృష్ణారావు
కదిరి	ఎం.అనసూయ
మదనపల్లె	జంగాల శివరాం
ముమ్మిడివరం	ఓగూరి భాగ్యశ్రీ
ఫిరంగిపురం	తడవర్తి కేశవరావు
పుట్టపర్తి	పూల శివప్రసాద్
శ్రీకాకుళం	దారపు జ్యోత్స్న
నాయుడుపేట	ఉయ్యాల ప్రవీణ్
భాజపా నుంచి	
బద్వేలు	పి.విజయలక్ష్మి
నందిగామ	పిట్టల శ్రీదేవి
రొంపిచెర్ల	కె.సుజాత
నూజివీడు	కుంపటి అరుణ



నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం అల్లూరు వద్ద సభలో ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు

రాయలసీమను రతనాల సీమగా మారుస్తాం



సభకు హాజరైన రైతులు, రైతు సంఘం ప్రతినిధులు

(మొదటి పేజీ తరువాయి)

నంద్యాల జిల్లా మల్యాల నుంచి చిత్తూరు వరకు నీళ్లందుతాయి. మిగిలిన పనులు కూడా పూర్తి చేస్తాం. వంద రోజుల్లో కాలువ సామర్థ్యాన్ని రెట్టింపు చేయడం సాధ్యం కాదన్నారు. చేసి తీరాలని చెప్పి పూర్తి చేయించి రికార్డు సృష్టించాం. ఫలితంగా 40 టీఎంసీలను రాయలసీమకు పంపేందుకు అవకాశం కలిగింది. ప్రజాప్రతినిధులు, అధికారుల చిత్తశుద్ధికి అభినందనలు' అని ప్రశంసించారు.

కుప్పంలో పెద్ద డ్రామా నడిపించారు

హెచ్ఎన్ఎస్ఎస్ నుంచి పది వేల క్యూసెక్కుల నీరు పారిస్తామని ప్రగల్భాలు పలికిన గత ప్రభుత్వం పది పైసలు కూడా ఖర్చు పెట్టలేదని ముఖ్యమంత్రి ఎద్దేవా చేశారు. 'అదొక ఫేక్ పార్టీ. కుప్పం కాలువలో నీళ్లు లేకపోయినా సినిమా సెట్టింగ్ వేశారు. ట్యాంకర్లతో నీళ్లు తెచ్చి పోశారు. ప్రారంభోత్సవం పూర్తయి వాళ్లు వెళ్లగానే నీళ్లన్నీ ఇంకిపోయాయి. అలాంటి డ్రామాలు కావాలా?' అని ప్రశ్నించారు.

రాయలసీమ డిక్లరేషన్ అమలుచేస్తాం

రాయలసీమ అభివృద్ధికి నారా లోకేశ్ ప్రత్యేక డిక్లరేషన్ ప్రకటించారని.. వాటన్నింటినీ అమలు చేస్తామని చంద్రబాబు పేర్కొన్నారు. గతంలో ఎప్పుడూ రానన్ని సీట్లు తెదేపాకు వచ్చాయని.. ప్రజలు చూపించిన ఆదరణను నిలబెట్టుకుంటామన్నారు. కేంద్రం రైతు భరోసా నిధులు విడుదల చేసిన వెంటనే అదేరోజు రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడుల కారణంగా 8.50 లక్షలమందికి ఉద్యోగాలొస్తాయని తెలిపారు. వాట్సప్ గవర్నెన్స్‌లో ప్రస్తుతం 550 సేవలు అందిస్తున్నామని, ఆగస్టు 15 నుంచి 700 సేవలు అందుతాయని తెలిపారు.

ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లోనూ పనులు చేశారు

జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ హంద్రీ నీవా పనులను ఎలాగైనా పూర్తి చేయాలన్న లక్ష్యంతో రాత్రి వేళలో ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లోనూ పనులు చేశారన్నారు. నంద్యాల జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ తాము వంద రోజుల్లో హెచ్ఎన్ఎస్ఎస్ సామర్థ్యాన్ని రెట్టింపు చేస్తే జగన్ ఐదేళ్లలో ఎందుకు చేయలేకపోయారని ప్రశ్నించారు. 'చంద్రబాబు ఎగిరిపోతాడు' అంటూ నీచపు మాటలు మాట్లాడుతున్నారని.. కానీ ఆయన గల్లీ నుంచి దిల్లీ వరకు ఎదిగిపోతున్నారని గుర్తుచేశారు. ఎవరు ఎగిరిపోతారో చరిత్ర చూస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, ఫరూక్, ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, ఎంపీ బైరెడ్డి శబరి, కలెక్టర్ రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

వారు ఏం చేసినా సందేహంగానే చూస్తా

'వివేకానందరెడ్డి గుండెపోటుతో చనిపోయారని చెప్పారు. సాయంత్రానికి మాటమార్చారు. మర్నాడు 'నారాసుర రక్తచరిత్ర' అని రాయించి నేరాన్ని నాపై మోపేందుకు యత్నించారు. అలాంటి వారికి సామాన్యులు ఓ లెక్కా?' అని చంద్రబాబు వైకాపా నాయకులను ఉద్దేశించి పేర్కొన్నారు. ఇలాంటి వాళ్లు రాజకీయాల్లో ఉంటే ఆడబిడ్డలకు రక్షణ ఏముంటుందని ప్రశ్నించారు. 'ఇకపై వారు ఏం చేసినా సందేహంగానే చూస్తా. సీసీ టీవీ కెమెరాలు, డ్రోన్లు పెట్టిస్తా. ప్రజాహితాన్ని దృష్టిలో ఉంచుకుని పని చేస్తా. ఎవరైనా తోక జాడిస్తే కత్తిరిస్తా. ఒక పార్టీకి రాయలసీమ అంటే రాజకీయం, రక్తం. నాకు సీమ అంటే నీళ్లు, మీ భవిష్యత్తు. రాయలసీమను రాష్ట్రానికి మణిహారంలా తయారు చేస్తా' అని సీఎం హామీ ఇచ్చారు.



హంద్రీ నీవా సుజల స్రవంతి పంపింగ్ స్టేషన్‌లో స్విచ్ నొక్కుతున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి పయ్యావుల, ఎంపీ బైరెడ్డి శబరి, మంత్రి నిమ్మల

జీవితంలో మరచిపోలేని రోజు ఇది

కర్నూలు జిల్లాలో 77,000 ఎకరాలకు, నంద్యాలలో 2,900 ఎకరాలు, అనంతపురంలో 1.18 లక్షల ఎకరాల చొప్పున ఫేజ్-1లో 1.98 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందుతుందని ముఖ్యమంత్రి చెప్పారు. ఫేజ్-2లో అనంతపురం జిల్లాలో 33,617 ఎకరాలు, శ్రీ సత్యసాయిలో 1,93,383 ఎకరాలు, ఉమ్మడి కడప జిల్లాలో 37,500 ఎకరాలు, చిత్తూరులో 1.40 లక్షల ఎకరాలకు నీరందుతుందన్నారు. 554 కి.మీ. పొడవునా కాలువ కింద జలాశయాల ద్వారా 6.02 లక్షల ఎకరాలకు సాగునీరు, 33 లక్షల మందికి తాగునీరు అందించనున్న ప్రాజెక్టుకు జలహారతి ఇచ్చిన ఈ రోజు తన జీవితంలో మరచిపోలేనిదని తెలిపారు. శ్రీశైలం మల్లన్న దగ్గర ప్రారంభమైన నీరు తిరుపతి వేంకటేశ్వరస్వామి సమక్షానికి వెళ్లే పరిస్థితి రాబోతుందన్నారు. హంద్రీ నది నుంచి నీవా నది వరకు కాలువ నిర్మిస్తామంటే నాడు హేళన చేశారని, దానిని సుసాధ్యం చేశామని చంద్రబాబు గుర్తుచేశారు. ఆ కలను కన్నది ఎన్టీఆర్ అయితే, దానిని సాకారం చేసింది తెదేపా అని వివరించారు.

వచ్చే ఏడాదిలో 23 అంతరిక్ష మిషన్లు

ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి.నారాయణన్



ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి.నారాయణన్‌కు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ పర్యవేక్షకుడు ప్రసాద్

విశాఖపట్నం (సింహాచలం), న్యూస్‌టుడే: వచ్చే ఏడాదిలో 23 మిషన్‌లు చేపట్టబోతున్నట్లు ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ తెలిపారు. గురువారం ఆయన శాస్త్రవేత్తల బృందంతో కలిసి సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. స్వదేశీ సాంకేతికతతో రూపొందించిన తొలి ఎన్-1 రాకెట్‌ను త్వరలోనే ప్రయోగించబోతున్నట్లు తెలిపారు. 2027లో చేపట్టబోయే భారత తొలి మానవ సహిత అంతరిక్ష యాత్ర మంచిగా జరగాలని స్వామిని కోరుకున్నట్లు తెలిపారు. ఈ నెలలో ఇస్రో, నాసా సంయుక్తంగా ఎన్ఐఎస్ఏఆర్ (నాసా-ఇస్రో సింథటిక్ అపెర్చర్ రాడార్) మిషన్‌ను ప్రయోగించనున్నట్లు పేర్కొన్నారు. ఇది పూర్తిగా భారత్ తయారు చేసిందన్నారు. తొలుత శాస్త్రవేత్తలతో కలిసి ఆలయానికి విచ్చేసిన నారాయణన్ కప్పస్తంభం ఆలింగనం చేసుకుని బేడా మండపం ప్రదక్షిణం చేశారు. ఆలయ పర్యవేక్షకుడు జీవీఎస్‌కే ప్రసాద్ స్వామి వారి ప్రసాదం, శేషవస్త్రాలు, చిత్రపటం అందజేశారు.

గ్రహం అనుగ్రహం

18-7-2025 శుక్రవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; గ్రీష్మ రుతువు, ఆషాఢ మాసం, బహుళపక్షం
అష్టమి: మ. 3-56 తదుపరి నవమి
అశ్విని: రా. 1-56 తదుపరి భరణి
వర్జ్యం: రా. 10-11 నుంచి 11-41 వరకు
అమృత ఘడియలు: రా. 7-12 నుంచి 8-42 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-13 నుంచి 9-04 వరకు
రాహుకాలం: ఉ. 10-30 నుంచి 12-00 వరకు
సూర్యోదయం: ఉ.5.38; సూర్యాస్తమయం: సా.6.34

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	41.0	27.0
నెల్లూరు	39.2	25.8
ఒంగోలు	39.1	29.2
నరసాపురం	39.0	29.5
విజయనగరం	39.0	27.0
తాడేపల్లిగూడెం	38.0	27.9
విజయవాడ	37.2	27.6
సూర్యాపేట	37.0	29.0
కడప	37.0	26.0
తిరుపతి	36.4	24.2
గుంటూరు	36.0	26.0
విశాఖపట్నం	35.4	26.4
కర్నూలు	35.3	26.3
హైదరాబాద్	34.4	24.6
రామగుండం	33.2	27.4
శ్రీకాకుళం	33.0	27.0
అనంతపురం	33.0	23.5
హనుమకొండ	33.0	23.1
నిజామాబాద్	31.4	26.3

ఇలా దరఖాస్తు.. అలా అనుమతులు!

(మొదటి పేజీ తరువాయి)

చేస్తారు. ఆ వెంటనే ఇంటి నిర్మాణానికి అనుమతులు ఇస్తున్నట్లుగా ప్రొసీడింగ్ కాపీ వస్తుంది. వెంటనే పనులు మొదలు పెట్టొచ్చు.

గీత దాటితే అనుమతుల రద్దు

- ఇళ్ల నిర్మాణానికి అనుమతులు సులభతరం చేసిన ప్రభుత్వం నిబంధనలు ఉల్లంఘించే వారి విషయంలోనూ కఠినంగా వ్యవహరించనుంది. ప్లాన్ ప్రకారమే నిర్మాణ పనులు చేపట్టాలి. ఇళ్లు, భవనాల చుట్టూ ఖాళీ స్థలం (సెట్ బ్యాక్) విడిచిపెట్టే విషయంలో ఉల్లంఘనలు జరిగినా, అనుమతులకు మించి అదనపు ఫ్లోర్లు (అంతస్తులు) వేసినా అనుమతులు రద్దు చేస్తారు.
- ఇళ్ల నిర్మాణ పనుల్లో భాగంగా పునాదులు (ప్లింత్ బీం) వేశాక బిల్డింగ్ ప్లాన్ అప్‌లోడ్ చేసిన సాంకేతిక నిపుణులే వచ్చి పరిశీలించి వారం రోజుల్లోగా పట్టణ ప్రణాళిక విభాగానికి నివేదిక ఇవ్వాలి.
- అప్పటివరకు జోక్యం చేసుకోని పట్టణ ప్రణాళిక అధికారులు.. సాంకేతిక నిపుణులు ఇచ్చే నివేదికల్లో నుంచి సుమారుగా 10% నిర్మాణాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నట్లు గుర్తిస్తే నోటీసులిచ్చి అనుమతులు రద్దు చేస్తారు.
- తప్పుడు దస్తావేజులతో నిర్మాణాలకు అనుమతులు తీసుకున్నట్లయితే.. వాటిని అప్‌లోడ్ చేసినందుకు సాంకేతిక నిపుణుల లైసెన్స్‌ను ఐదేళ్లపాటు రద్దు చేయనున్నారు.

స్వీయ ధ్రువీకరణ పథకంలో ఇచ్చే అనుమతులివి

- నగరపాలక సంస్థల్లో 237 చదరపు గజాల్లోపు (200 చదరపు మీటర్లు) ఇళ్లు, భవన నిర్మాణాలకు పార్కింగ్+3 ఫ్లోర్లకు అనుమతులివ్వనున్నారు.
- పట్టణాభివృద్ధి సంస్థలు, పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో 360 చదరపు గజాల్లోపు స్థలంలో(300 చదరపు మీటర్లు) నిర్మాణాలకు పార్కింగ్+3 ఫ్లోర్లకు అనుమతులిస్తారు.
- 200 చదరపు మీటర్లలోపు ఇళ్లు, భవనాల నిర్మాణాలకు సంబంధించి ముందు వైపున ఖాళీ స్థలం (సెట్ బ్యాక్) ఒక మీటరు వదలాలి. మిగతా మూడు వైపులా 0.75 మీటర్లు విడిచిపెట్టాలి
- 200 నుంచి 300 చదరపు మీటర్లలోపు నిర్మాణాలకు ముందు వైపు 1.5 మీటరు, మిగిలిన మూడు వైపులా మీటరు స్థలం విడిచిపెట్టాలి.
- 200 చదరపు మీటర్ల విస్తీర్ణంలోపు నిర్మాణాలపై నగరపాలక సంస్థలకు నిర్మాణ ప్రాంతంలో 10% స్థలం తనఖా పెట్టాల్సిన అవసరం లేదు.
- పట్టణాభివృద్ధి సంస్థలు, పురపాలక, నగర పంచాయతీల్లో 300 చదరపు మీటర్లలోపు నిర్మాణాలకు తనఖా అవసరం లేదు.

అక్రమ మైనింగ్ కేసులో వంశీ ముందస్తు బెయిల్ రద్దు

(మొదటి పేజీ తరువాయి)

అడగడంతో ఆయన హైకోర్టు ఉత్తర్వులను చదివి వినిపించారు. అందులో ఎక్కడా వాదనలకు సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పినట్లు లేదు కదా? అని న్యాయమూర్తి ప్రశ్నించారు. రోహత్గీ జోక్యం చేసుకుంటూ హైకోర్టు ఈ కేసును రోజువారీగా వాయిదా వేసుకుంటూ పోయింది తప్ప, ఎప్పుడూ తమ వాదనలు వినిపించడానికి అవకాశం ఇవ్వలేదన్నారు. జస్టిస్ సతీష్‌చంద్ర శర్మ స్పందిస్తూ ఇలాంటి విచారణ గురించి తాము ఎప్పుడూ వినలేదన్నారు.

ప్రభుత్వానికి ఎందుకు అవకాశమివ్వకూడదు?

అంతకుముందు జస్టిస్ సంజయ్‌కుమార్ మాట్లాడుతూ.. తమ వాదనలను వినకుండానే హైకోర్టు తీర్పు వెలువరించిందన్న రోహత్గీ వాదనలతో ఏకీభవించారు. రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్‌కు సమయం అడిగినట్లు హైకోర్టు ఉత్తర్వుల్లో ఉందన్నారు. ప్రతివాదికి మధ్యంతర రక్షణ ఉన్న సమయంలో కౌంటర్ దాఖలు చేయాలనుకున్న రాష్ట్ర ప్రభుత్వానికి అవకాశం ఎందుకు ఇవ్వకూడదని ప్రశ్నించారు. రోహత్గీ చెప్పిన వాదనలు హైకోర్టు ఉత్తర్వుల్లో ప్రతిఫలిస్తున్నాయంటూ మే 29న జారీ చేసిన ఉత్తర్వులను కొట్టేస్తున్నామని తేల్చిచెప్పారు. ఈ కేసును పునర్విచారణ కోసం హైకోర్టుకు తిప్పి పంపుతున్నట్లు పేర్కొన్నారు. వారంలోపు కౌంటర్ దాఖలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది చెప్పారన్నారు. ఆ వెంటనే దీనిపై ఇరుపక్షాల వాదనలు విని సాధ్యమైనంత త్వరగా విచారణ ముగించాలని హైకోర్టుకు నిర్దేశించారు.

మధ్యంతర రక్షణ కల్పించలేం

ఈ దశలో వంశీ తరఫు న్యాయవాది జోక్యం చేసుకుంటూ తమ క్లయింట్ జైల్లో ఉన్నప్పుడు పీటీ వారంట్ అమలుపై స్టే ఇచ్చారని, ఇప్పుడు ఆయన బెయిల్‌పై బయటికొచ్చినందున అరెస్ట్ చేసే అవకాశం ఉందన్నారు. మధ్యంతర రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అందుకు ధర్మాసనం నిరాకరించింది.

ఈనాడు

ఏదీ టీకా భద్రత?

చిన్నారులను చుట్టుముట్టడానికి సదా పొంచి ఉండే భయానక వ్యాధుల నుంచి రక్షణ కల్పించే టీకాలు- మానవాళికి విజ్ఞానశాస్త్రం అందించిన గొప్ప వరాలు. గడిచిన యాభై ఏళ్లలో ప్రపంచవ్యాప్తంగా 15 కోట్లకు పైగా పసిబిడ్డలకు అవి ఆయువు పోశాయి. ఒక్క తట్టు టీకా వల్లే తొమ్మిది కోట్ల మంది పిల్లల ప్రాణాలు నిలబడ్డాయి. నవతరం భవితకు భరోసానిచ్చే టీకాల పంపిణీ కార్యక్రమం కొవిడ్ కల్లోల కాలంలో పట్టాలు తప్పింది. మహమ్మారి బెడద తొలగిపోయిన తరవాతా అది గాడిన పడకపోవడం కలవరపరుస్తోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ, యునిసెఫ్ తాజా నివేదిక ప్రకారం- నిరుడు ప్రపంచవ్యాప్తంగా 1.40 కోట్ల మంది పసివారికి ఒక్క టీకా కూడా అందలేదు. రెండు కోట్ల మంది చిన్నారులకు డిఫ్తీరియా, ధనుర్వాతం, కోరింతదగ్గులకు సంబంధించి కనీసం ఒక వ్యాక్సిన్ డోసు దక్కలేదు. దక్షిణాసియా మొత్తమ్మీద ఏ ఒక్క టీకాకూ నోచుకోని చంటిబిడ్డల్లో దాదాపు సగం మంది ఇండియాలోనే ఉన్నారన్న విశ్లేషణలు- ఆరోగ్యంగా జీవించే హక్కుకు బాలభారత మెంతగా దూరమవుతోందో కళ్లకుకడుతున్నాయి!

దేశీయంగా 2023లో 14.4లక్షల మంది పిల్లలకు సమయానుగుణంగా పడాల్సిన టీకా ఒక్కటీ అందలేదని 'లాన్సెట్'లో ప్రచురితమైన అధ్యయనం ఇటీవల వెల్లడించింది. అంతకంటే ఎక్కువగా ఆ సంవత్సరం 16 లక్షల మంది భారతీయ చిన్నారులకు ఎలాంటి వ్యాక్సిన్లూ పడలేదని తాజాగా నివేదించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ- నిరుడు అలాంటి వారి సంఖ్య తొమ్మిది లక్షలకు తగ్గిందని పేర్కొంది. ఏతావాతా ఏటా ఎంతోమంది పసిబిడ్డలు టీకా రక్షణ చత్రంలోకి రాలేకపోతున్నారన్నది చేదు వాస్తవం. ఈ దురదృష్టకర పరిస్థితులను చక్కదిద్దాల్సిన యంత్రాంగమేమో దేశీయంగా సార్వత్రిక టీకా కార్యక్రమం జోరుగా సాగుతోందనే ప్రకటనలకే పరిమితమవుతోంది. దానివల్ల నవజాత శిశువులకు హెపటైటిస్-బి, క్షయ రాకుండా నివారించే టీకాల పంపిణీలో చాలాచోట్ల నిర్లక్ష్యం తాండవిస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వ్యాక్సిన్ల కొరత కారణంగా ఎంతోమంది పిల్లల జీవితాలు జబ్బుల ముప్పును ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలోనే డిఫ్తీరియా, తట్టు వంటివి నేటికీ కోరలు చాస్తున్నాయి. పుట్టిన ఏడాది వ్యవధిలో వ్యాక్సిన్లకు నోచుకుంటున్న చిన్నారుల్లో చాలామందికి ఆపై నాలుగైదేళ్లలో తప్పనిసరిగా అందాల్సిన టీకాలేవీ దరిచేరట్లేదన్న కథనాలూ ఆందోళన రేపుతున్నాయి. ఇలాంటి లోటుపాట్లను సరిదిద్ది టీకా కార్యక్రమాన్ని పటిష్ఠపరచడం- ప్రభుత్వాల విధ్యుక్తధర్మం!

ఏ దేశానికైనా వెలకట్టలేని ఆస్తి అక్కడి బాలబాలికలే. చక్కటి ఆరోగ్యంతో దృఢంగా ఎదిగే భావితరం దేశ పురోగతికి చోదక శక్తిగా నిలుస్తుంది. పిల్లల బంగారు భవిష్యత్తును బుగ్గిచేసే వ్యాధులకు ఆదిలోనే అడ్డుకట్ట వేయకపోతే ఇన్నాళ్లుగా మనం సాధించిన వైజ్ఞానిక ప్రగతి అంతా నిష్ప్రయోజనమవుతుంది. అధికారిక లెక్కల ప్రకారమే, 2023-24లో పలు ఈశాన్య రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ముప్పైశాతం చిన్నారులకు పూర్తిస్థాయిలో టీకా భద్రత లభించలేదు. బిహార్, ఒడిశా వంటి చోట్లా అలాంటివారు పదిహేను శాతం దాకా ఉన్నారు. జనవర్గాలను ఇప్పటికీ వదిలిపోని భయం, అపోహల కారణంగా దేశీయంగా కొన్ని ప్రాంతాల్లో వ్యాక్సిన్ల పంపిణీ మందకొడిగా సాగుతుంటే- మరికొన్ని చోట్ల సరఫరాలో సమస్యలు ముప్పిరిగొంటున్నాయి. పిల్లలకు టీకాలు వేయించడం ఎంత ప్రాణావసరమో వాడవాడలా అవగాహన కల్పించడంతోపాటు ప్రభుత్వాసుపత్రుల్లో అన్ని రకాల వ్యాక్సిన్లను అందుబాటులో ఉంచాలి. నానా రకాల రోగాలకు కారణమవుతున్న పోషకాహార లోపాన్ని అరికట్టేందుకు ప్రభుత్వాలు యుద్ధప్రాతిపదికన సిద్ధం కావాలి!



ఏదైనా సవాలు ఎదురవగానే చాలామంది 'ఈ కష్టం నుంచి ఎలా బయటపడటం' అనుకుంటారు. 'ఎంత బాగా బయటపడగలం' అనుకోండి. సమస్యను చూసే మన దృష్టి కోణమే మారిపోతుంది.

– జియా మోదీ, కార్పొరేట్ న్యాయవాది

హృదయంతో వినాలి!

'వినదగునెవ్వరు చెప్పిన' అన్నాడు సుమతీ శతకకారుడు. 'ఎక్కువగా వినాలి, తక్కువగా మాట్లాడాలి' అంటారు పెద్దలు. అందుకే భగవంతుడు మనకు రెండు చెవులు, ఒకటే నోరు ఇచ్చాడు. శ్రద్ధగా వినడం, అర్థం చేసుకోవడం, ప్రతిస్పందించడం... ఇదంతా ఒక కళ.

ఒక రాజు తన కుమారుడికి పట్టాభిషేకం చేయదలచి, ముందు కొన్ని జీవిత పాఠాలు నేర్చుకోమని రాజగురువు దగ్గరికి పంపాడు. ఆ గురువు 'ఈ అడవి అంతా కలియతిరుగు. ఏయే శబ్దాలు విన్నావో వచ్చి చెప్పు' అన్నాడు. 'అలాగే స్వామీ' అంటూ వెళ్లిన యువరాజు సాయంత్రం వరకూ అడవంతా తిరిగొచ్చాడు. 'గురువుగారూ... సింహాల గర్జన విన్నాను, మరో వైపునుంచి ఆవుల అంబారావాలు ఆలకించాను. చెంగున గెంతుతూ పరుగెత్తే లేగదూడల కాలిగిట్టల చప్పుడూ విన్నాను. పక్షుల కిలకిలారావాలు, పిట్టలు పాడే పాటలూ విన్నాను' అన్నాడు. రాజగురువు చిరునవ్వు నవ్వి- 'మళ్లీ వెళ్లు, ఇంకా విను' అన్నాడు. ఈసారి వచ్చి 'పూలచుట్టూ తుమ్మెద చేసే విన్యాసపు సడి విన్నాను. తొండకు ఆహారం కాబోతున్న చిరు కీటకం ఆక్రందన ఆలకించాను. నదీప్రవాహానికి కొట్టుకుపోతున్న గడ్డిపోచల చప్పుడు నా చెవులకు వినబడింది. గూడు చెదిరినా మరోసారి మౌనంగా తన సామ్రాజ్యాన్ని నిర్మించుకునే సాలీడు సహనపు సవ్వడి నా మనసును తాకింది' అన్నాడు. 'మరోసారి వెళ్లి, మరింత జాగ్రత్తగా విను' చెప్పాడు గురువు.



అంతర్యామి

యువరాజు ఏమాత్రం విసుగు చెందకుండా చీకటి రాత్రిలో అడవిలోకి పయనమయ్యాడు. ఒక చెట్టుకింద కూర్చుని ధ్యానముద్రలోకి వెళ్లాడు. సూర్యుడి లేలేత కిరణాలు తన కళ్లమీద పడిన తరవాత లేచివచ్చి గురువు ముందు వినమ్రుడై చెప్పడం మొదలెట్టాడు. 'కిరణాలు భూమిని తాకే శబ్దం విన్నాను. మొగ్గ పూబాలగా మారే క్రమంలో కలిగే ప్రకంపనలను ఆలకించగలిగాను. కొండ, కోన, గాలి, నీరు... ఈ సమస్త ప్రకృతీ చెప్పే పాఠాలన్నీ విన్నాను. నిశ్శబ్దంగా ప్రవహించే సెలయేరు చెప్పే నీతిపాఠం తెలుసుకున్నాను' యువరాజు మాటలకు సంతృప్తి చెందాడు గురువు. 'రాజు ప్రజలకు తండ్రి లాంటివాడు. రాజ్యంలోని ఇతర ప్రాణులకు, సమస్త వృక్షజాలానికి అతడే తల్లీ, తండ్రీ, దైవం. కాబట్టి అవన్నీ చెప్పేది వినగలగాలి, అర్థం చేసుకోవాలి, తగిన విధంగా స్పందించాలి' చెప్పాడు గురువు. అలాగేనంటూ యువరాజు గురువుకు నమస్కరించి, తన రాజ్యానికి ప్రయాణమయ్యాడు.

ఆయనెవరో కాదు, ప్రజలను కన్నబిడ్డల్లా చూసుకుని, రామరాజ్యంగా నేటికీ చెప్పుకొనేలా ఏలిన ప్రభువు- శ్రీరామచంద్రమూర్తి. ఇప్పుడు పాలనావ్యవస్థ మాత్రమే మారింది. అవసరం ఎప్పుడూ అదే... ప్రజల విన్నపాలను శ్రద్ధగా వినడం. నవ భక్తి మార్గాలలో శ్రవణమే మొదటిది. పెద్దలు చెప్పిన మాటలను చెవిన పెట్టని వారివల్లే భారత, రామాయణ యుద్ధాలు జరిగాయి. అందుకే... చెవులతో కాదు, హృదయంతో వినాలి. అర్థం చేసుకుని స్పందించాలి. అప్పుడే వినడమనే కళకి న్యాయం చేసినవాళ్లమవుతాం.

– డాక్టర్ ఎమ్.సుగుణరావు

వృద్ధుల వేదన విందామా?

తాజా అంచనాల ప్రకారం దేశ జనాభాలో దాదాపు 13 కోట్ల మంది 60 ఏళ్ల లేదా ఆపై వయసులోని వారే. వృద్ధుల జనాభా 2050 నాటికి 20.8 శాతానికి పెరుగుతుందని, వారి సమస్యలు మరింత సంక్లిష్టంగా మారనున్నాయి. 2046 నాటికల్లా జనాభాలో వృద్ధుల సంఖ్య పిల్లల సంఖ్యను దాటిపోతుందని ఐరాస జన నిధి గతంలోనే ప్రకటించింది. దేశంలోని వృద్ధుల్లో 40శాతం దారిద్య్రంలో మగ్గుతున్నారని ఆ సంస్థ నివేదిక పేర్కొంది. 2022-50 మధ్య దేశంలో 80 ఏళ్ల పైబడినవారి సంఖ్య 279శాతం పెరగనుంది. దక్షిణ భారతంలో జనాభా నియంత్రణను కఠినంగా అమలుపరచిన కారణంగా మొత్తం జనాభా రేటు పడిపోయింది. దీంతో ఈ ప్రాంతంలో వృద్ధుల సంఖ్య మిగతా ప్రాంతాలకన్నా అధికం కానుంది. అందులో తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ రాష్ట్రాలు వయోవృద్ధుల సంరక్షణ కోసం నిధులు కేటాయించాలని కేంద్రాన్ని కోరుతున్నాయి.

దీర్ఘాయుష్షు సామాజిక పురోగతికి సంకేతం. కానీ, మన దేశంలో అది కడగండ్ల ప్రయాణం. మరీ ముఖ్యంగా పండుటాకుల పట్ల అంతులేని నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. వారు సాధారణ జీవనానికీ నోచుకోలేని దుస్థితి నెలకొంది. ఆయుర్దాయం పెరుగుతూ, జననాల సంఖ్య తగ్గుతుండటంతో మనదేశంలో వృద్ధుల సంఖ్య మరింత పెరగనుంది. ఈ క్రమంలో వారి సంరక్షణకు సమగ్ర కార్యాచరణతో సంసిద్ధమవ్వాల్సిందే!

ఆదాయం కరవై...

మన దేశంలో వృద్ధుల్లో చాలామందికి స్థిరమైన ఆదాయ వనరులు కొరవడ్డాయి. పింఛను విధానం వంటి విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులలాంటి కొంతమందికే ప్రయోజనం కలిగిస్తోంది. అసంఘటిత రంగంలో పనిచేసే వారికి ఇలాంటి భద్రత ఉండటం లేదు. జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం (ఎన్ఎస్ఏపీ) వంటి సంక్షేమ పథకాలు నామమాత్రంగానే సాయపడుతున్నాయి. అనేక రాష్ట్రాల్లో ఈ పథకం కింద అందుతున్న పింఛను రూ.200-500 వరకే ఉంటోంది. ఈ డబ్బులతో కనీస అవసరాలూ తీరవు. ఫలితంగా గణనీయ సంఖ్యలో సీనియర్ సిటిజన్లు దారిద్య్ర రేఖకు దిగువనే బతుకీడుస్తున్నారు. కుటుంబ సభ్యులు, దాతల సాయంపై ఆధారపడాల్సి వస్తోంది. స్వతంత్ర జీవనానికి దూరమవుతున్నారు. పట్టణీకరణ, వలసలతో యువత పట్టణాల వైపు సాగుతుండగా, ఆదరణ కరవైన వృద్ధులు ఉన్నచోటనే దుర్భర జీవనం సాగించాల్సి వస్తోంది. వృద్ధులు ఎదుర్కొంటున్న మరో ప్రధాన సమస్య వైద్యసేవల లేమి. వయసు పెరిగే కొద్దీ మధుమేహం, రక్తపోటు, కీళ్లవాతం, మతిమరుపు వంటి దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. ఆరోగ్య సంరక్షణకు అవసరమైన వైద్య సదుపాయాలు కొరవడుతున్నాయి. వృద్ధుల కోసమే ప్రత్యేకించిన ఆరోగ్య వసతుల ఏర్పాటు చాలా అరుదు. గ్రామీణ ప్రాంతాల్లో శిక్షణ పొందిన వైద్య సిబ్బంది అందుబాటు, రోగ నిర్ధారణ సదుపాయాలు అంతంతే. ఆయుష్మాన్ భారత్ వంటి ఆరోగ్య బీమా పథకాలు వృద్ధులకు బాసటగా నిలుస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉంటున్నాయి. వైద్య సేవల కోసం సొంతంగా ఖర్చు పెట్టుకోవాల్సి వస్తోంది. ప్రైవేటు రంగంలో వైద్య చికిత్స వ్యయాల్ని భరించే శక్తి అందరికీ ఉండటం లేదు. ఇలాంటివన్నీ సమస్యను జటిలం చేస్తున్నాయి.

ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో వృద్ధులకు కావాల్సిన సేవలు, భద్రత అందుబాటులో ఉండేవి. ఆధునిక జీవనశైలితో ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై వృద్ధులకు సంరక్షణ కొరవడింది. మాట్లాడటానికి, తోడుగా ఉండటానికి, భావోద్వేగాలు పంచుకోవడానికి, వినేందుకు ఎవరూ ముందుకు రావట్లేదు. ఫలితంగా దేశంలో 82శాతం వృద్ధులు కుటుంబ సభ్యులతోనే జీవిస్తున్నా, వారి చేతుల్లోనే అనేక దురాగతాలకు గురవుతున్నారని హెల్పేజ్ ఇండియా సంస్థ నివేదిక వెల్లడించింది. 35శాతం కుమారుల చేతుల్లో, 21 శాతం కోడళ్ల చేతుల్లో దౌర్జన్యానికి గురవుతున్నారని ఆ సంస్థ సర్వేలో తేలింది. అగౌరవం, సూటిపోటి మాటలు, తిట్టు, నిర్లక్ష్యం, భౌతిక దాడులు వంటి వాటిని మౌనంగా భరించాల్సి వస్తోందని తెలిపింది. ఒంటరి జీవనం పెద్దల మానసిక ఆరోగ్యంపై తీవ్ర దుష్ప్రభావం చూపుతోంది. వారిలో కుంగుబాటు, ఆందోళన, ఆత్మహత్యలకు అదే కారణమవుతోంది. తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల నిర్వహణ, సంక్షేమ చట్టం ఉన్నా, అమలు సమర్థంగా లేదు. చాలామందికి తమకు సంబంధించిన చట్టపరమైన హక్కులపై అసలు అవగాహనే లేదు. భావోద్వేగ, ఆర్థిక, భౌతిక దురాగతాలపై కేసులు పెడితే సామాజికంగా, కుటుంబ సభ్యుల నుంచి ఇబ్బందులు పడాల్సి వస్తుందని భయం వృద్ధుల్ని వెనక్కిలాగుతోంది. సరైన రీతిలో చట్టరక్షణ కల్పించలేకపోవడం, సంక్షేమ పథకాలకు తగిన కేటాయింపులు కొరవడటం పండుటాకులపట్ల అధికార యంత్రాంగంలో నెలకొన్న నిర్లక్ష్యానికి నిదర్శనాలు!



అత్యవసర అంశం...

ప్రపంచ ఆర్థిక శక్తిగా ఎదగాలని ఆకాంక్షిస్తున్న ఇండియా వృద్ధుల ఆరోగ్య సంరక్షణ చర్యలపై మరింతగా దృష్టి సారించాలి. దేశంలో వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలను, తక్షణ చర్యలకు ఉపక్రమించాల్సిన అత్యవసర అంశంగా పరిగణించాలి. సీనియర్ సిటిజన్లందరికీ పింఛను పథకాన్ని వర్తింపజేయాలి. పింఛను నిర్ణయంలో ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వృద్ధుల కోసం ప్రత్యేక ఆరోగ్య సదుపాయాలు కల్పించాలి. ఒంటరితనంతో బాధపడకుండా డే కేర్ సెంటర్లు, క్లబ్బులు వంటి వాటిద్వారా సామాజిక జీవన సౌకర్యాల్ని ఏర్పాటు చేయాలి. సీనియర్ సిటిజన్లకు సంబంధించిన వివాదాల పరిష్కారానికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను అందుబాటులోకి తీసుకురావాలి. సంరక్షణ చట్టంపై అవగాహన పెంపొందించాలి. ప్రాథమిక ఆరోగ్య సేవల్లో మానసిక ఆరోగ్య సేవలను కూడా జోడించాలి. పండుటాకులకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన, గౌరవప్రదమైన జీవితాన్ని అందించడం నైతిక బాధ్యత మాత్రమే కాదు, నాగరిక సమాజ మౌలిక లక్షణం. ఈ విషయాన్ని ప్రభుత్వ వర్గాలు, ప్రజలందరూ గుర్తించినప్పుడే వృద్ధుల సంరక్షణలో మెరుగైన మార్పుల దిశగా అడుగులు పడతాయి.




పీవీ రావు

ఆర్థిక, సామాజిక విశ్లేషకులు

'ఈ దేహం నీదే కానీ, దానిపై నీకు హక్కు లేదు. ఈ దేశం నీదే కానీ, ఈ భూమి నీది కాదు. నీ శరీరాన్ని నువ్వు సొంతం చేసుకునేందుకు నీ చర్మపు రంగే అడ్డు'... జాతి వివక్ష తీవ్రంగా ఉన్న కాలంలో దక్షిణాఫ్రికాలో నల్ల జాతీయుల దుస్థితిని చెప్పే మాటలివి!

ఆసియా నుంచి సరకులు తీసుకెళ్లే యూరప్ వాణిజ్య నౌకల విశ్రాంతి కేంద్రంగా ఉండేది ఒకప్పటి దక్షిణాఫ్రికా. బంగారం గనులు బయట పడ్డాక డచ్, బ్రిటిష్ వలసలు పెరిగాయి. క్రమక్రమంగా వారు దేశాన్నీ అధికారాన్నీ హస్తగతం చేసుకున్నారు. 1948లో అక్కడి శ్వేత జాతి ప్రభుత్వం వర్ణ వివక్షను అధికారికంగా అమలుచేసింది. స్థానికులను ద్వితీయ శ్రేణి పౌరులుగా మార్చింది. బయట తిరగాలన్నా

నిజమైన నాయకుడు



గుర్తింపు పత్రాలు వెంట ఉండాలని చట్టం చేసింది. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా, అక్కడి ప్రజలు సొంత దేశంలోనే బానిసలుగా బతికారు. అలాంటి చోట లా విద్యార్థిగా వివక్షను ఎదుర్కొన్న మండేలా క్రమంగా ఉద్యమాలవైపు మొగ్గారు. నల్లజాతీయుల హక్కుల ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. మహాత్మా గాంధీ స్ఫూర్తితో అహింసా మార్గాన్ని ఎంచుకున్నారు. ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీలో కీలక నేతగా ఎదిగారు. ఆయనను అడ్డుకునేందుకు శ్వేతజాతి ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించింది. గృహనిర్బంధాలు, అరెస్టులు చేసింది. అంతటితో సంతృప్తి చెందక 1963లో అరెస్టు చేసి అట్లాంటిక్ మహాసముద్రంలోని దీవులకు తరలించింది. 1990 దాకా అంటే 27 సంవత్సరాలు మండేలా జైలులో మగ్గిపోయారు. ఉద్యమాన్ని విడిచిపెడితే విడుదల చేస్తామని ప్రభుత్వం ఎన్నిసార్లు చెప్పినా ఆయన అంగీకరించలేదు. ప్రభుత్వ ఆంక్షలు, సృష్టించిన ఇబ్బందులు, జైల్లో చదివిన పుస్తకాలు... ఆయనను మరింత గొప్ప నేతగా మలచాయి. ప్రపంచవ్యాప్తంగా ఆయన పోరాటానికి మద్దతు పెరిగిందే తప్ప తగ్గలేదు. దేశవ్యాప్తంగా ఉద్యమాలు ఉద్ధృతమయ్యాయి. తప్పనిసరి పరిస్థితుల్లో నాటి ప్రభుత్వాధినేత ఎఫ్‌డబ్ల్యూడీ క్లార్క్ మండేలాను జైలు నుంచి విడుదల చేశారు.

అనంతరం ఏర్పాటైన తాత్కాలిక ప్రభుత్వంలో మండేలా కీలకపాత్ర పోషించారు. అందరికీ ఓటు హక్కు, రాజ్యాంగ రూపకల్పన వంటి నిర్ణయాల్లో దేశంలోని అన్ని రాజకీయ పార్టీలను భాగస్వాములను చేశారు. వర్ణ వివక్షకు చరమగీతం పాడారు. ఆయన చేసిన సేవలకుగాను 1993లో ఎఫ్‌డబ్ల్యూడీ క్లార్క్‌తో కలిసి నోబెల్ శాంతి బహుమతి అందుకున్నారు. 1994 ఎన్నికల్లో విజయం సాధించి ప్రజాస్వామికంగా ఎన్నికైన తొలి నల్లజాతి అధ్యక్షుడయ్యారు. 1999లో క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకొన్న మండేలా విశ్రాంత జీవితం గడుపుతూ 2013 డిసెంబరు 5న కన్నుమూశారు. మండేలా ఆదర్శాలను, సేవలను గుర్తు చేసుకునేందుకు 2009లో ఐక్యరాజ్యసమితి ఆయన పుట్టిన రోజైన జులై 18ని 'మండేలా డే'గా ప్రకటించింది.

'నేను పైనుంచి ఊడిపడ్డ దైవదూతను కాను.. మామూలు మనిషిని. అసాధారణ పరిస్థితులే నన్ను నాయకుణ్ని చేశాయి' అని వినమ్రంగా ప్రకటించిన మండేలా ఎందరికో స్ఫూర్తిప్రదాత.

– మధుసూదన్‌రెడ్డి శానాల

వాటాలో భాగంగా...

పహల్గాంలో పర్యాటకులపై పాశవిక ఉగ్రదాడి తరవాత సింధు నదీజల ఒప్పందాన్ని కేంద్ర ప్రభుత్వం నిలిపేసిన సంగతి తెలిసిందే. ఈ ఒప్పందం ప్రకారం సింధు ఉపనదుల్లో తూర్పున ప్రవహించే రావి, బియాస్, సట్లెజ్‌లపై ఇండియాకి; సింధుతో పాటు దాని పశ్చిమ నదులైన జీలం, చినాబ్‌లపై పాక్‌కు హక్కులు లభించాయి. అయితే, ఈ ఒప్పందం ప్రకారం పశ్చిమ నదీజలాలను పలు ప్రయోజనాలకు ఇండియా వినియోగించుకోవచ్చు. ఈ క్రమంలో ఆ నదులపై 5,846 మెగావాట్ల సామర్థ్యంలో ఇండియా నిర్మించతలపెట్టిన పలు ప్రధాన ప్రాజెక్టులు పూర్తిస్థాయి ప్రణాళిక లేదా పరిశీలన దశలో ఉన్నాయి. ఆ ప్రాజెక్టులు, వాటి విద్యుదుత్పత్తి సామర్థ్యం...

(మెగావాట్లలో)

సావల్‌కోట్ స్టేజ్ 1, 2	1856
కిరు	660
బర్సర్	1020
కిర్తాయ్ స్టేజ్ 1	290
కిర్తాయ్ స్టేజ్ 2	990
క్వార్	520
సచ్‌ఖాస్	210
గిప్సా	300

(ఆధారం: కేంద్రం నివేదిక)

ఎగుమతుల వృద్ధిలో ఒడుదొడుకులు

జపాన్ అనగానే బులెట్ రైళ్లు, శుభ్రమైన రహదారులు, హైటెక్ పరిశ్రమలు గుర్తుకొస్తాయి. జపనీయుల ఉన్నత జీవన ప్రమాణాలు మదిలో మెదులుతాయి. మరి భారతదేశం నాలుగో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిన తరవాత ప్రజల జీవితాలు ఎంతవరకు మారాయనే ప్రశ్న తలెత్తుతుంది. చైనా గతంలో నాలుగు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగినప్పుడు అక్కడి ప్రజల తలసరి ఆదాయం 3500 డాలర్లకు పెరిగింది. దశాబ్దాల పర్యంతం ఆర్థిక సంస్కరణల వల్ల ఇప్పుడు చైనా తలసరి ఆదాయం 13వేల డాలర్లకు పైగానే ఉంది. నేడు చైనా జీడీపీ 19.23 లక్షల కోట్ల డాలర్లకు చేరుకుంది. భారత్ జీడీపీ నాలుగు లక్షల కోట్ల డాలర్లను మించినా, అందులో 40శాతం (1.6 లక్షల కోట్ల డాలర్ల) వాటా జనాభాలో ఒక శాతమైన అతి సంపన్నుల గుప్పిట్లోనే ఉంది. మిగిలిన 2.5 లక్షల కోట్ల డాలర్లను 99శాతం జనాభా పంచుకోవాలన్న మాట. అలా 140 కోట్లమందికి పంచితే తలసరి ఆదాయం 1710 డాలర్లుగా లెక్కతేలుతుంది.



స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ)లో భారతదేశం జపాన్‌ను అధిగమించిందని ఐఎంఎఫ్ ఇటీవల తెలిపింది. జపాన్ జీడీపీ 4.186 లక్షల కోట్ల డాలర్లయితే ఇండియాది అంతకు కాస్త ఎక్కువని తేల్చింది. అయితే అంతర్జాతీయ వాణిజ్యంలో 2023లో భారత్ వాటా కేవలం 2.1శాతమే. ప్రపంచ ఎగుమతుల్లో తన వాటాను 2027కల్లా మూడు శాతానికి, 2047కల్లా పది శాతానికి పెంచుకోవాలని భారత్ లక్షిస్తోంది.

వెనకబాటుకు ఎన్నో కారణాలు

జీడీపీ వృద్ధికి ఊతమిచ్చే రంగాలు అత్యధిక ప్రజానీకానికి ఉపాధి కల్పించకపోవడం వల్లనే మన తలసరి ఆదాయం తక్కువగా ఉంది. ఇప్పటికీ ఇండియా జనాభాలో 50శాతం మంది వ్యవసాయం, అనుబంధ రంగాలపై ఆధారపడి జీవిస్తున్నారు. అయినా జీడీపీలో సాగు రంగం వాటా కేవలం 18శాతమే. పైగా దేశీయంగా వ్యవసాయం తీవ్ర ఒడుదొడుకులు ఎదుర్కొంటోంది. సాగుదారుల ఆదాయాలు పెరగట్లేదు. సేద్యం దండగలా మారింది. పైగా, దేశీయంగా హెక్టారు పంట భూమి ఉత్పాదకత పాశ్చాత్య సంపన్న దేశాలకన్నా, తోటి ఆసియా దేశాలకన్నా చాలా తక్కువ. స్వీయ వాణిజ్య రక్షణ విధానాలు విదేశీ పెట్టుబడులకు, సాంకేతికతలకు అడ్డుగా నిలిచాయి. స్వదేశంలోనే వస్తుసేవల వినియోగానికి పెద్దపీట వేసి ఎగుమతులకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం వల్ల అంతర్జాతీయ వాణిజ్యంలో భారత్ తన వాటా పెంచుకోలేకపోయింది. మనకు భిన్నంగా చైనా ఎగుమతి కేంద్రిత ఆర్థిక వ్యవస్థతో దూసుకుపోయింది.

భారత్‌లో పరిశ్రమలు విస్తరించకపోవడానికి ప్రధాన కారణాల్లో ఇంధన కొరత కూడా ఒకటి. ఇంధన అవసరాలకు దిగుమతులపైనే ఆధారపడటం వల్ల ఇండియాలో పారిశ్రామిక ఉత్పత్తి వ్యయం అధికంగా ఉంటోంది. చమురు, గ్యాస్ దిగుమతులపై ఆధారపడాల్సిన అగత్యాన్ని అధిగమించాలంటే పునరుత్పాదక ఇంధన వనరులను అభివృద్ధి చేసుకోవాలి. ఈ విషయంలో భారత్ సాధించాల్సింది ఇంకా చాలా ఉంది. సౌర ఫలకాలను సొంతంగా తయారుచేసుకుంటే తక్కువ ఖర్చుకే సౌర విద్యుదుత్పాదన చేయవచ్చు. కానీ, ఆ ఫలకాల కోసం ఇప్పటికీ చైనాపైనే ఆధారపడటం వల్ల మన సౌర విద్యుదుత్పాదన వ్యయం ఎక్కువగా ఉంటోంది. పరిశోధన, అభివృద్ధి(ఆర్అండ్‌డీ)కి భారత్ తగినంతగా నిధులు కేటాయించకపోవడం వల్ల పారిశ్రామిక ప్రగతి కుంటుపడుతోంది. శాస్త్ర, సాంకేతిక పరిశోధనలకు అత్యధిక ప్రాధాన్యమిచ్చి, దండిగా నిధులు కేటాయించిన అమెరికా, జర్మనీ, చైనాలు ఆర్థికంగా అగ్రస్థానాల్లో ఉన్నాయి. భారత్ దిగుమతులకు ప్రత్యామ్నాయాలను కనుగొని, స్వదేశంలో వినియోగాన్ని పెంచడంపై చూపిన శ్రద్ధ ఎగుమతులపై చూపకపోవడం ఆర్థికంగా సత్ఫలితాలను ఇవ్వలేదు. అంతర్జాతీయ వాణిజ్యంలో మన వాటా పెరగలేదు.

సుంకాల సమరం ప్రతికూలమే

భారత్ మొదటి నుంచీ రేవులు, రహదారులు, రవాణా, విద్యుత్ కేంద్రాల వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యమివ్వకపోవడం వల్ల పరిశ్రమలు, ఎగుమతులు వృద్ధి చెందలేదు. ఇతర దేశాలు సుంకాల రూపంలో అడ్డంకులు సృష్టించడమూ మన ఎగుమతులను నీరుగార్చింది. స్వదేశంలోను రాష్ట్రాల మధ్య వాణిజ్యపరమైన అడ్డంకులు ఉన్నాయి. ప్రస్తుతం అమెరికా చేస్తున్న సుంకాల సమరం ఆందోళన రేపుతోంది. వాణిజ్య యుద్ధాలు ముదరడం భారతీయ ఎగుమతులకు శుభపరిణామం కాదు. అమెరికా, బ్రిటన్, ఈయూలతో సానుకూలమైన వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకోవడానికి భారత్ కృషిచేస్తోంది. దీంతోపాటు ఆధునిక మౌలిక వసతులను విస్తరించి, పరిశోధన-అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించి ఎగుమతులను ప్రోత్సహించే విధానాలకు పెద్దపీట వేయాలి. తద్వారా జీడీపీని, తలసరి ఆదాయాలను మరింత పెంచుకోవడానికి అవకాశం లభిస్తుంది.



శ్రీరామ్ వేమూరి

ఆర్థిక రంగ నిపుణులు

కెమెరాలకూ మ్యూజియం!

హాయ్ నేస్తాలు..! ఎక్కడికెళ్లినా ఫొటోలు తీయడం, దిగడం మనకు బాగా అలవాటే కదా! వాటిని గుర్తుగా దాచుకుని అప్పుడప్పుడు చూసుకుంటూ తెగ మురిసిపోతుంటాం. కానీ ఓ వ్యక్తి మాత్రం కెమెరాలనే దాచుకుంటున్నాడట! అతనెవరో ఇంతకీ ఎన్ని కెమెరాలు కలెక్ట్ చేశాడో తెలుసుకుందామా!

ఆర్కాట్ వసంతరావు అరుణ్.. చెన్నైకి చెందిన డెంటిస్ట్. అసలు ఆయనకీ కెమెరాలకీ సంబంధమేంటి అనుకుంటున్నారా? ఆయనే ఈ కెమెరాలు కలెక్ట్ చేసేది. మొదటిసారిగా 1997లో ట్విన్ లెన్స్ కెమెరాను కొన్నారు. దాంతో ఆయనకు కెమెరాలంటే ఇష్టం పెరిగిందట. అప్పటి నుంచి కెమెరాలు కలెక్ట్ చేస్తూనే ఉన్నారు. ఆయన ఏ కొత్త ప్రదేశానికి వెళ్లినా అక్కడ ఒక కొత్త మోడల్ కెమెరా కొంటారట.





ఇప్పటి వరకు 5,707 కెమెరాలు కలెక్ట్ చేశారు. మరి ఇవన్నీ పెట్టడానికి స్థలం కావాలి కదా! అందుకే సొంతంగా ఒక మ్యూజియం కూడా ఏర్పాటు చేసి.. అందులో ప్రదర్శనకు పెట్టారు. అందులో 1895లో తయారైన పాత కెమెరాల నుంచి ఇప్పుడు కొత్తగా వచ్చిన కెమెరాల వరకు అన్నీ ఉన్నాయి. దాంతో అరుణ్ ఎక్కువ కెమెరాలు కలెక్ట్ చేసిన విభాగంలో 'గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో కూడా స్థానం సంపాదించారు. స్నేహితుడి సాయంతో వీటన్నింటి వివరాలు డాక్యుమెంట్ చేశారు. దానికి దాదాపు ఎనిమిది నెలలు పట్టిందట. అన్ని కెమెరాలు ఒకే చోట చూస్తుంటే భలేగా అనిపిస్తుంది కదా ఫ్రెండ్స్! ★

గడుల్లో గప్‌చుప్!

ప్రతి చతురస్రంలో ఒక్క అక్షరం తప్ప మిగతావి రెండు సార్లు ఉంటాయి. ఆ ఏకాకి అక్షరాలను ఒక చోట చేరిస్తే అర్థవంతమైన పదం వస్తుంది. ఓ సారి ప్రయత్నించండి.

1	చ	చు	చె	కా	కీ	కు	3
	చే	చ	చీ	కీ	క్రై	కొ	
	చు	చీ	చే	కు	కా	క్రై	
	టీ	టు	ట	మీ	ము	మా	
2	ట్టు	టీ	ట్టే	మా	మ	ము	4
	ట	ట్టే	టు	మ	మీ	మ్మ	



నగరవాసికి ఉపశమనం...

గత 10 రోజులుగా ఎండలు మండిపోవడంతో విపరీతమైన ఉక్కపోతతో జనం అవస్థలు పడ్డారు. గురువారం సాయంత్రం ఆకాశం మేఘావృతమై దాదాపు అరగంట పాటు కురిసిన వర్షంతో నగరవాసులు వేడి నుంచి ఉపశమనం పొందారు.. ఉదయం ఎండగా ఉండి అనుకోకుండా కురిసిన వర్షంతో కాస్తంత ఇబ్బందులు తప్పలేదు.

– ఈనాడు, అమరావతి

ఆషాఢ సారె.. అందుకోమాయమ్మ..





ఆషాఢ మాసం సందర్భంగా గురువారం ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మకు రికార్డు స్థాయిలో 72 మహిళా బృందాలు సంప్రదాయ పద్ధతిలో సారె సమర్పించాయి. మల్లికార్జున మహా మండపం మెట్ల మార్గం నుంచి వచ్చి.. ఆరో అంతస్తులోని దుర్గమ్మ ఉత్సవ మూర్తి వద్ద అర్చకులకు సారె అందజేశారు. అనంతరం వారికి వేద పండితులు సామూహిక ఆశీర్వచనం చేశారు.

–న్యూస్‌టుడే, ఇంద్రకీలాద్రి

రైతుబజార్ల ప్రక్షాళనకు చర్యలు



ఇలక్కియా

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో మొత్తం 15 రైతు బజార్లు ఉన్నాయి, వీటి ప్రక్షాళనకు అన్ని చర్యలు తీసుకోనున్నట్టు జేసీ ఇలక్కియా పేర్కొన్నారు. విధుల్లో అలసత్వం వహించినా, ఫిర్యాదులు వచ్చినా సహించే ప్రసక్తే లేదన్నారు. ఉదయం 6 గంటల కల్లా ఎస్టేట్ అధికారులు ధరల పట్టికతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. వ్యాపారాలు నిర్వహించే రైతులు, స్వయం సహాయ సంఘాల సభ్యులు గుర్తింపు కార్డులు కలిగి ఉండాలని పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులు, రైతుబజార్ల ఈవోలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. వినియోగదారులతో దుకాణదారులు స్నేహపూర్వకంగా మెలిగేలా చూడాలన్నారు. దళారులను నిరోధించాలని, నిర్ణయించిన ధరల ప్రకారమే కూరగాయల విక్రయాలు జరగాలన్నారు. క్యారీ బ్యాగుల వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలన్నారు. రైతుబజారు పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఏడీఎం బి. రాజాబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దందా.. ఆపే దమ్ముందా

నల్లబజార్లో యూరియా, డీఏపీకి అదనపు వసూళ్లు

ఈనాడు, అమరావతి– న్యూస్‌టుడే, కంకిపాడు

ఉమ్మడి కృష్ణా జిల్లాలో యూరియా, డీఏపీ అమ్మకాల్లో వ్యాపారులు దందా చేస్తున్నారు. కేంద్రం మిశ్రమ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించడంతో ఈ రెండింటి సరఫరా తగ్గించారు. దీంతో వ్యాపారులు నల్లబజార్లో అడ్డగోలుగా అమ్మేస్తున్నారు. వ్యవసాయ అధికారులు ఉదాశీనంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా అన్నదాతలు ఆర్థికంగా చితికిపోతున్నారు.

లెక్కల్లో ఉన్నా..నిల్వల్లో నిండుకున్నాయి: ఎరువుల కొనుగోలుకు రైతులు ఆధార్ కార్డుతో వచ్చి వేలి ముద్ర వేయాలి. 70శాతం రైతులకు ఆధార్, వేలి ముద్ర లేకుండానే ఎరువులు ఇస్తున్నారు. దీంతో డీలర్లు ఎరువులు విక్రయించినా, నిల్వలు లేకున్నా.. అధికారుల లెక్కల్లో మాత్రం ఉన్నట్లు చూపిస్తోంది. ఉమ్మడి జిల్లాలో 50శాతం పీఏసీఎస్‌లలో యూరియా, డీఏపీ లేదు. కంకిపాడు మండలంలో తొమ్మిది సంఘాల్లో ఏరిటిలో నిండుకున్నాయి. నిల్వలు ఉన్నా కొన్నిట్లో అదనపు వసూళ్లు మామూలే.

ఇష్టారాజ్యంగా అమ్మకాలు.. ✪ కంకిపాడు మండల పరిధిలో వరి సాగు ముమ్మరంగా సాగుతోంది. అక్కడ 90 శాతం దుకాణాల్లో ఎరువులు అందుబాటులో లేవని కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. డీఏపీ బస్తా రూ.1350కి అమ్మాల్సి ఉండగా.. రూ.1500 తీసుకుంటున్నారు. యూరియా రేటు రూ.266 కాగా రూ.350 వరకు అమ్మేస్తున్నారు. గుడివాడ, గుడ్లవల్లేరు తదితర మండలాల్లో ఇదే పరిస్థితి.

✪ నందిగామ పరిధిలో దుకాణాల్లో సైతం ఇదే దందా సాగుతోంది. యూరియా బస్తాపై రూ.70 వరకు అదనంగా తీసుకుంటున్నారు. డీఏపీపై రూ.150 ఎక్కువ వసూలు చేస్తున్నారు. కొన్ని దుకాణాల్లో ఏడాది మొత్తం అక్కడే ఎరువులు కొనుగోలు చేస్తామన్న రైతులకే ఆ అదనపు ధరకైనా విక్రయిస్తున్నారు.



కంకిపాడు: ఎరువుల దుకాణంలో అధికారుల తనిఖీలు

అధికారులు ఏం చేస్తున్నట్లో.. ఈ తతంగం చాలా రోజులుగా జరుగుతున్నా వ్యవసాయ అధికారులు మాత్రం అరకొర తనిఖీలతో మమ అనిపిస్తున్నారు. నల్లబజారు విక్రయాలపై కఠిన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. కొన్ని దుకాణాల్లో ఎరువుల కొరత లేదని చెప్పుకొస్తున్నారు. ఈ అంశంపై కృష్ణా, ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయాధికారులు మనోహరరావు, విజయకుమారి మాట్లాడుతూ నల్లబజారు విక్రయాలపై చర్యలు తీసుకుంటామన్నారు.

నల్లబజారులో కొనాల్సిందే..

-మద్దాలి సాయిబాబు, రైతు, పునాదిపాడు

యూరియా, డీఏపీ కొరత తీవ్రంగా ఉంది. నిల్వలు ఉన్నాయన్న అధికారులు, వ్యాపారుల ప్రకటనల్లో వాస్తవం లేదు. కొన్ని సొసైటీల్లోనే అదీను కొద్ది పరిమాణంలోనే యూరియా అందుబాటులో ఉంది. లోడు వచ్చిన గంట సమయంలోనే అయిపోతోంది. ఇక డీఏపీ పూర్తిగా మాయమైంది. దీంతో రైతులు నల్లబజార్లో కొనాల్సి వస్తోంది.

మనసు బంగారం.. మురిసే భవితవ్యం

ఉమ్మడి కృష్ణాలో 4,326 మంది మార్గదర్శులు..★ ఇప్పటికీ పీ-4లో 38,621 కుటుంబాల దత్తత

ఈనాడు, అమరావతి

ఎన్టీఆర్ జిల్లాలో 86,398 బంగారు కుటుంబాలను గుర్తించారు. ఇప్పటికి 19,782 బంగారు కుటుంబాలను 2,793 మంది మార్గదర్శులు దత్తత తీసుకున్నారు. ★ కృష్ణా జిల్లాలో 68,948 బంగారు కుటుంబాలను గుర్తించారు. ఇప్పటికి 18,839 కుటుంబాలను దత్తత తీసుకోవడానికి 1,533 మంది మార్గదర్శులు ముందుకొచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని.. సమాజంలో అట్టడుగున ఉన్న పేద కుటుంబాలను ఆర్థికంగా పైకి తెచ్చేందుకు చేపడుతున్న పీ-4 విధానం సత్ఫలితాలు ఇస్తోంది. ఇప్పటికి ఉమ్మడి జిల్లాలో.. 4,326 మంది పారిశ్రామికవేత్తలు, ఆర్థికంగా ఉన్నత స్థానంలో ఉన్న వాళ్లు ముందుకొచ్చారు. వీరంతా 38,621 కుటుంబాలను దత్తత తీసుకున్నారు. ఆ కుటుంబాల ఆర్థిక వృద్ధికి అవసరమైన.. ఉపాధి మార్గాలను చూపిస్తున్నారు. మరో 1,16,725 కుటుంబాలు దాతల కోసం ఎదురు చూస్తున్నాయి. ఈ నేపథ్యంలో మార్గదర్శుల కోసం రెండు జిల్లాల్లోనూ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.



పీ4 పథకంపై మార్గదర్శులకు వివరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ఎన్టీఆర్ జిల్లాలో వివరాలు..
- ★ బంగారు కుటుంబాలు: 86,398
- ★ కుటుంబ సభ్యులు: 2,45,942
- ★ దత్తత తీసుకున్నవి: 19,782
- ★ దత్తత తీసుకోవాల్సినవి: 66,616
- ★ మార్గదర్శులు: 2,793

ప్రత్యేక కార్యాచరణతో.. కలెక్టర్ లక్ష్మీశ ఆధ్వర్యంలో గత నెల రోజుల నుంచి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తూ.. మార్గదర్శులను ముందుకొచ్చేలా చేసేందుకు అవగాహన కల్పిస్తున్నారు. తాజాగా విజయవాడ సహా జిల్లాలో ఉన్న పారిశ్రామికవేత్తలు, స్వచ్ఛంద సంస్థలు, ఆసుపత్రుల యజమానులు, వాణిజ్య, వ్యాపార సంఘాల ప్రతినిధులతో వరుస సమావేశాలను నిర్వహిస్తూ పీ4పై అవగాహన కల్పిస్తున్నారు. వారిని ముందుకొచ్చి.. ఎంత సాయం చేయగలరో అంత చేయాలని.. కోరుతున్నారు. ఎలా ఆదుకోవచ్చు.. అనేది పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వారికి వివరిస్తున్నారు. ఈ ప్రయత్నాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని కలెక్టర్ లక్ష్మీశ వెల్లడించారు.

సహృదయానికి వందనం..

✦ **విజయవాడ పశ్చిమ:** అత్యధికంగా 1089 మంది మార్గదర్శులు ముందుకొచ్చి.. 7,488 కుటుంబాలను దత్తత తీసుకున్నారు. ✦ **జగ్గయ్యపేట:** అతి తక్కువగా 57 మంది దాతలే వచ్చారు. వీళ్లు 8,543 కుటుంబాలను దత్తత తీసుకోవడం గమనార్హం. ✦ **మైలవరం:** 180 మంది దాతలు కలిసి.. 5,455 కుటుంబాలను ఆదుకునేందుకు ముందుకొచ్చారు. ✦ **నందిగామ:** 79 మంది మార్గదర్శులు ముందుకొచ్చి.. 7,565 కుటుంబాలను ఆదుకుంటామన్నారు. ✦ **తిరువూరు:** 115 మంది దాతలు వచ్చి.. 9,376 కుటుంబాలకు సాయం అందించేందుకు సిద్ధమయ్యారు. ✦ **విజయవాడ మధ్య:** 497 మంది కలిసి.. అత్యధికంగా 14,088 కుటుంబాలకు తోడ్పాటు అందిస్తామని ముందుకొచ్చారు. ✦ **విజయవాడ తూర్పు:** 764 మంది దాతలు.. 11,024 కుటుంబాలను వెన్నుదన్నుగా నిలుస్తామని వచ్చారు. ✦ **గన్నవరం:** నున్న సహా కొంత ప్రాంతం ఎన్టీఆర్ జిల్లాలో ఉండగా.. ఇక్కడ 12 మంది మార్గదర్శులు ముందుకొచ్చి.. 3,077 కుటుంబాలను దత్తత తీసుకున్నారు.

మార్గదర్శులుగా ముందుకొచ్చేందుకు చాలామందే సిద్ధంగా ఉన్నారన్నారు. కృష్ణా జిల్లాలోనూ మార్గదర్శుల కోసం కలెక్టర్ డి.కె.బాలాజీ ఆధ్వర్యంలో పారిశ్రామికవేత్తలు సహా అన్ని వర్గాలకూ ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నారు.

ఎక్కలేక ఆయాసం.. దిగలేక నీరసం



లిఫ్ట్ పనిచేయక అడ్డంగా తాళ్లు కట్టారిలా..



రెండో ప్లాట్‌ఫాం వద్ద పనిచేయని ఎస్కలేటర్

దక్షిణ మధ్య రైల్వేలో సికింద్రాబాద్ తర్వాత రెండో పెద్ద స్టేషన్‌గా ఉన్న విజయవాడ రైల్వేస్టేషన్లో సమస్యలూ అదే స్థాయిలో ఉన్నాయి. నిత్యం వేల ప్రయాణికులతో రద్దీగా ఉండే విజయవాడ స్టేషన్‌లో వృద్ధులు, దివ్యాంగులు, నడవలేని వారికి లిఫ్ట్‌లు, ఎస్కలేటర్లు ఉన్నా సరిగా పనిచేయవు. కొద్దిసేపు పనిచేస్తాయి. మళ్లీ మొరాయిస్తాయి. దీంతో ప్రయాణికులు వివిధ ప్లాట్‌ఫాంలకు వెళ్లేందుకు మెట్లు ఎక్కలేక, దిగలేక ఇలా ఆపసోపాలు పడుతున్నారు.

–ఈనాడు, అమరావతి



మెట్లు ఎక్కలేని వృద్ధురాలిని వీల్‌ఛైర్‌లో కూర్చోబెట్టి మోసుకొస్తూ..




నడవలేక.. మెట్లు దిగలేక..

కొండపల్లి బొమ్మ.. ఖ్యాతి చూడమ్మ

ప్రత్యేక వసతులతో ఎక్స్‌పీరియన్స్ సెంటర్


కొండపల్లి, ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే

కొండపల్లి బొమ్మ ఔన్నత్యాన్ని దేశ విదేశాల్లో చాటేందుకు ప్రభుత్వం ఆచరణాత్మక వ్యూహం చేస్తుంది. శతాబ్దాల చరిత్ర కలిగిన కొయ్య బొమ్మ కథను నేటి తరానికి చెప్పేందుకు జిల్లా యంత్రాంగం అడుగు ముందుకేస్తూ శ్రమిస్తోంది. ఆ వారసత్వ సంపద ప్రతి పర్యాటకుడికి అర్థమయ్యేలా చెప్పడంతో పాటు ఆ ఖ్యాతిని దేశమంతా వ్యాపింపజేసేందుకు స్థానికంగా ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. పరిసర ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించడం మినహాయించి అన్ని పనులు పూర్తి అయ్యాయని ఇప్పటికే అధికారులు ప్రకటించారు. ★ కొండపల్లి కొయ్య బొమ్మల కళ, దాని నైపుణ్యత, చారిత్రక ఆధారాలు, కళాకారుల జీవన వైవిధ్యాన్ని తెలిపే మ్యూరల్ పెయింటింగ్స్‌ను అక్కడ ఏర్పాటు చేసిన ఎక్స్‌పీరియన్స్ సెంటర్ గోడలపై చిత్రీకరించారు. రహదారి పక్కనున్న ప్రాంగణంతో పాటు లోపల గదుల్లో వీటిని పూర్తి చేశారు.



బొమ్మల కొనుగోలు కేంద్రానికి వెళ్లే ముఖద్వారం నమూనా

మధురానుభూతి పొందేలా.. ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో బొమ్మల కళ యొక్క తీరు తెన్నులు పర్యాటకులకు తెలియజేయడం ముఖ్య ఉద్దేశం. బొమ్మ రూపొందే ప్రక్రియను ఆద్యంతం చూపిస్తూ పర్యాటకులు మధురానుభూతి పొందేలా చేయడం ప్రథమం. దీంతోపాటు బొమ్మకు అద్దే రంగులు సహజసిద్ధంగా తీసి వాటికి ఏర్పరిచే క్రమంలో చేసే నైపుణ్యత పర్యాటకులకు తెలియజేస్తారు. ఎన్ని రకాల బొమ్మలున్నాయో తెలియజేయడంతో పాటు ఆకృతుల వివరాలు కళాకారులు పర్యాటకులకు వివరిస్తారు. బొమ్మ తయారీకి ఉపయోగించే తెల్ల పొనికి విశిష్టత, అది కొండపల్లిలోనే లభించడానికి గల కారణాలు పర్యాటకులకు సుస్పష్టంగా ఈ సెంటర్ వివరిస్తుంది.



ఆ ప్రాంతమంతా అభివృద్ధి: ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు చేయడంతో పాటు బొమ్మల అమ్మకాలు పెంచేందుకు యంత్రాంగం కృషి చేస్తుంది. ఆ ప్రాంతంలో మౌలిక వసతులు కల్పించి పర్యాటకులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటుంది. ఇందుకు సంబంధించి అన్ని పనులను ఈ నెలలో అధికారులు పూర్తి చేయనున్నారు.

కీర్తిని గుర్తుచేసుకునేందుకు కృషి

నాలుగు శతాబ్దాల చరిత్ర కలిగిన కొండపల్లి బొమ్మల కూడలి ఎక్కడ ఉందో పర్యాటకులకు తెలియకపోవడం విచారకరం. అందుకే జాతీయ రహదారి(30) కొండపల్లి ఖిల్లా రోడ్డు వద్ద ముఖద్వారాన్ని అట్టహాసంగా ఏర్పాటు చేస్తున్నాం. ఇందు కోసం అన్ని ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ప్రతి పర్యాటకుడికి మంచి అనుభూతిని కలిగిస్తుంది. కొండపల్లి కోటకు అనుసంధానంగా ఉన్న బొమ్మల ఖ్యాతి అందరూ మరోసారి గుర్తుచేసుకునేలా పనులు జరుగుతున్నాయి. – కలెక్టర్ లక్ష్మీశ

ఇగ్నో ప్రవేశాలకు గడువు పొడిగింపు

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఇగ్నో జులై-2025 సెషన్‌కు పోస్ట్ గ్రాడ్యుయేట్, డిగ్రీ డిప్లమో, సర్టిఫికేట్ కోర్సుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ గడువు జులై 31 వరకు పొడిగించినట్లు విజయవాడ ప్రాంతీయ కేంద్రం రీజనల్ డైరెక్టర్ డాక్టర్ కె.సుమలత గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ రెండో సంవత్సరం, డిగ్రీ రెండో, మూడో సంవత్సరం చదివే విద్యార్థులు కూడా రీ-రిజిస్ట్రేషన్ రుసుమును ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 31వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఇతర వివరాలకు 0866-2565253 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఏఎంసీ ఛైర్మన్ల నియామకం

గొల్లపూడి, న్యూస్‌టుడే: ఉమ్మడి కృష్ణాజిల్లాలో వ్యవసాయ మార్కెట్‌యార్డు ఛైర్మన్‌లను నియమించారు. జగ్గయ్యపేట ఏఎంసీ ఛైర్మన్‌గా కొత్తారు సత్యనారాయణప్రసాద్(తెదేపా), నందిగామకు పిట్టల శ్రీదేవి(భాజపా), పామర్రుకు జన్ను శోభన్‌బాబు(తెదేపా)ను ఎంపిక చేశారు. త్వరలో ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేయనుంది.

ఉద్యోగోన్నతుల జాబితాలో ఏసీపీలు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో పని చేస్తున్న ఇద్దరు మహిళా ఏసీపీలను ఉద్యోగోన్నతుల జాబితాలో చేరుస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా డీఎస్పీ స్థాయి అధికారులకు అదనపు ఎస్పీ స్థాయి అధికారులుగా పదోన్నతులు కల్పించేందుకు జాబితా సిద్ధం చేశారు. ఇందులో ఎన్టీఆర్ కమిషనరేట్‌కు చెందిన మహిళా పోలీస్‌స్టేషన్ ఏసీపీ కె.లతాకుమారి, నార్త్ ఏసీపీ కె.స్రవంతిరాయ్‌లు ఉన్నారు. సీనియారిటీ ప్రకారం వీరు ఏడీసీపీలుగా పదోన్నతులు పొందుతారు. పదోన్నతులకు అర్హత పొందిన వారిపై ఉన్న శాఖాపరమైన విచారణలు, క్రమశిక్షణా చర్యలు, పెండింగ్‌లో ఉన్న కేసులు తదితర వివరాలను పంపించాలంటూ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆయా జిల్లాల సీపీలు, ఎస్పీలకు ఆదేశాలు జారీ చేశారు. ఆయా జిల్లాల నుంచి వచ్చిన నివేదికల అనంతరం వారికి పదోన్నతులు కల్పిస్తారు.



స్రవంతిరాయ్ లతాకుమారి

రారెత్తిస్తున్న.. ధార్ ముఠా!

పోలీసులకు సవాలుగా మారిన చోరీలు

ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, విజయవాడ నేరవార్తలు

నగరంలోని గుణదల గేటెడ్ కమ్యూనిటీలో ఈ నెల 5న చోరీకి పాల్పడింది మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ధార్ ముఠాగా ప్రాథమికంగా తేలింది. సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాల్లో వారు చోరీ చేసిన విధానం, శారీరక దారుఢ్యం ఆధారంగా ఈ అంచనాకు వచ్చారు. ముగ్గురు సభ్యుల ముఠా రైళ్లలో ప్రయాణిస్తూ మార్గమధ్యలోని ప్రాంతాలను ఎంచుకుని వరుసగా నేరాలు చేస్తున్నట్లు గుర్తించారు. రెండేళ్ల కిందటా ఇదే ముఠా కమిషనరేట్ పరిధిలో ఒకే రోజు పట్టపగలు మూడు వరుస చోరీలకు పాల్పడింది. పగటి పూటే తాళం వేసి ఉన్న ఫ్లాట్లనే లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడ్డారు. మూడు ఘటనల్లో దాదాపు 12.98 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, నగదు చోరీ చేశారు. గుంటుపల్లి, గొల్లపూడి మధ్య రెండు, మూడు అపార్ట్‌మెంట్లలోనూ ఈ దొంగలు చోరీకి ప్రయత్నించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు దొంగల ఆనవాళ్లు దొరకలేదు.



చోరీ జరిగిన ఇంటి వాష్‌రూమ్ గ్లాసులు తొలగించారిలా..

బృందాలుగా విడిపోయి..

ఒకే ప్రాంతం నుంచి దాదాపు 30 మంది వరకు రాష్ట్రానికి వచ్చినట్లు అనుమానిస్తున్నారు. ముగ్గురు, నలుగురు చొప్పున బృందంగా విడిపోయి తెలంగాణ, ఆంధ్రలో వరుసగా చోరీలకు పాల్పడుతున్నట్లు లభించిన వేలిముద్రల ఆధారంగా పోలీసులు అంచనాకు వచ్చారు. వీరు రైల్వే లైన్ వెంబడి ప్రాంతాలనే ఎంచుకుంటారు. పని ముగిసిన వెంటనే మరో ప్రాంతానికి వెళ్లిపోతారు. ఈ నెల 1 నుంచి వరుసగా రెండు రాష్ట్రాల్లో ఈ ముఠాకు చెందిన వారే చోరీలకు పాల్పడ్డారు. ఇదే రీతిలో మూడు చోరీలు జరిగాయి. ఈ నెల 1న తెలంగాణలోని ఖమ్మం, ఆ తర్వాత భద్రాచలం, ఏపీలోని శ్రీసత్యసాయి హిందూపురంలో జరిగాయి. 5న విజయవాడ నగరంలోని గుణదల, 15న శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి పట్టణంలో వరుసగా తొమ్మిది ఇళ్లల్లో దొంగతనాలు జరిగాయి. అక్కడి నుంచి పొరుగునే ఉన్న కర్ణాటకలోకి ప్రవేశించినట్లుగా భావిస్తున్నారు.

కిటికీ గ్రిల్స్ తొలగించి ప్రవేశిస్తారు..

చోరీలు చేయడంలో ఈ ముఠా సభ్యులది విభిన్న శైలి. ప్రధాన ద్వారం గుండా కాకుండా.. వాష్‌రూమ్స్, హాల్ ఇనుప గ్రిల్స్‌ను వంచేసి తొలగించి ఇళ్లల్లోకి ప్రవేశిస్తారు. మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉండే వీరు శారీరకంగా దృఢంగా ఉంటారు. గుణదలలో నేరం జరిగిన విల్లాతో పాటు మరో ఇంట్లోనూ చోరీకి ప్రయత్నించారు. ఆ ఇంటి కిటికీ గ్రిల్‌ను దాదాపు విరగ్గొట్టారు. 209 గ్రాముల బంగారం, రూ.20వేలు నగదు దోచుకెళ్లారు. ఈ ముఠా చేతులతోనే ఇనుప చట్రాలను వంచేస్తుంది.



దొంగలు వంచేసిన కిటికీ ఇనుప గ్రిల్

వేలిముద్రల వడపోత..

గుణదలలో ముగ్గురికి సంబంధించి ఏడు వేలిముద్రలు లభ్యమయ్యాయి. మిగిలిన ప్రాంతాల్లో జరిగిన నేరాల్లో లభ్యమైన వాటితో సరిపోలలేదు. వీటిని నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరోకి పంపించారు. ఇతర ప్రాంతాల్లో దొరికిన వేలిముద్రలను సైతం ఎన్‌సీఆర్‌బీకి పంపించారు. వీటికి సంబంధించి కీలక సమాచారం వస్తే ముఠా గుట్టురట్టు అవుతుందని భావిస్తున్నారు.

ఆయువు తీసిన అక్రమ తవ్వకాలు

యువకుడిని బలిగొన్న చెరువు గుంత

మైలవరం, న్యూస్‌టుడే: తండ్రికి దూరంగా ఉంటున్న తల్లికి చిన్న వయసులోనే అండగా మారాడు. తల్లితో కలిసి కష్టపడి సంపాదించిన డబ్బుతో సొంతిల్లు కట్టుకున్నారు. చదువుకు దూరమైనా, కష్టార్జితాన్ని నమ్ముకుని పశువులను మేపుతున్న బాలుడిని చెరువులో గుంతలు మింగేశాయి. ఎస్సై కె.సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మొర్సుమిల్లికి చెందిన జెట్టి మల్లేశ్వరి తనయుడు శివకృష్ణ (16) పది తర్వాత చదువు మానేసి, తల్లికి చేదోడుగా ఉంటున్నాడు. బుధవారం ఉదయం గ్రామంలోని చెరువు వైపు తమ గేదెలను మేపడానికి తోలుకెళ్లాడు. సాయంత్రానికి అవి ఇంటికి వచ్చినా..కుమారుడు రాకపోవడంతో 7 గంటల వరకు ఎదురు చూసిన తల్లి..ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. విషయాన్ని ఆమె బంధువులకు చెప్పడంతో వారంతా చెరువు వద్దకు వెళ్లి చూడగా గట్టున చెప్పులు చూసి..చెరువులో మునిగి ఉంటాడని భావించి గాలించగా..అర్ధరాత్రికి మృతదేహం దొరికింది. వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



శివకృష్ణ (పాతచిత్రం)

మట్టి తవ్వకాలతో ప్రమాదాలు: చెరువుల్లో మట్టి అమ్మకాల కోసం సుదీర్ఘంగా చేపడుతున్న తవ్వకాలతోనే పెద్ద ఎత్తున గోతులు ఏర్పడుతున్నాయి. మొర్సుమిల్లి చెరువులోనూ గతంలోనే తవ్వకాలు జరగ్గా, బుధవారం చెరువులోకి దిగిన గేదెలు బయటకు రాకపోవడంతో వాటి కోసం లోపలకు వెళ్లి మునిగి ఉంటాడని గుర్తించారు. ఒంటి మీద దుస్తులు, అతని సెల్‌ఫోన్‌ను చెరువు కట్టపై ఉంచిన బాలుడు, చెప్పులను మాత్రం చెరువులో నీటి సమీపం వరకు వేసుకున్నాడు. చెరువులోకి పశువులు దిగే సమయంలో చూసిన స్థానికులు ఆ విషయాన్ని చెప్పగా, గాలింపు చేపట్టేందుకు వచ్చిన వారికి చెరువు కట్టపై దుస్తులు, ఫోన్ దొరకలేదు. అటువైపుగా వచ్చిన వ్యక్తులు దొంగిలించి, ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

తారస్థాయికి విద్యుత్తు వినియోగం

వేసవిని తలపిస్తున్న ఎండలు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే

సాధారణంగా మే నెలలో ఎండలు భగభగమంటాయి. జూన్‌లో కొంత తగ్గుతాయి. జులై నెల వచ్చేసరికి మరింత తగ్గి జనం కాస్తంత సేద తీరుతారు. కానీ ఈ ఏడాది జులై వచ్చి.. సగం రోజులు గడిచినా ఎండలు తగ్గలేదు. వానలు తక్కువగా పడడం, భిన్న వాతావరణం నెలకొనడంతో ఈ పరిస్థితి కనిపిస్తోంది. పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతున్నాయి. బయటకు రావాలంటేనే జనాలు బెంబేలెత్తిపోతున్నారు. ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. దీంతో విద్యుత్తు వినియోగం గతంలో ఎన్నడూ లేని విధంగా జులైలో అత్యధికంగా నమోదైంది. ఒక్కసారిగా డిమాండ్ పెరిగిపోయింది. ఏసీల వినియోగం వల్ల అత్యధికంగా నమోదైందని అధికారులు అంటున్నారు. డిమాండ్‌కు సరిపడా విద్యుత్తు అందుబాటులో ఉండడంతో ఎక్కడా కోతలు పెట్టకుండా సరఫరా ఇవ్వగలిగారు.

ఉమ్మడి కృష్ణా జిల్లా వివరాలు..

తేదీ	విద్యుత్తు వాడకం
జులై 1	1.59
2	1.58
10	1.98
11	2.00
12	1.95
13	2.00
14	2.13
15	2.17
16	2.24

(కోట్ల యూనిట్లు)

ఒకటో తేదీ నుంచే..

ఉమ్మడి కృష్ణా జిల్లాలో జులై మొదటి తేదీ నుంచే వినియోగం పెరిగింది. 1న 1.59 కోట్ల యూనిట్లు వాడగా.. 16వ తేదీకి 2.24 కోట్ల యూనిట్లకు పెరిగింది. మే నెలతో పోటీపడింది.

ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతమొందిద్దాం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ నెల 19వ తేదీన 'ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతమొందిద్దాం' ఇతివృత్తంతో కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ విషయమై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కె.విజయానంద్ గురువారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ (వీసీ) నిర్వహించి దిశానిర్దేశం చేశారు. నగరంలోని కలెక్టరేట్ నుంచి కలెక్టర్ జి.లక్ష్మీశ వీసీలో పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. పలు సూచనలు చేశారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థల సమష్టి భాగస్వామ్యంతో ప్లాస్టిక్ కాలుష్యాన్ని సమాజం నుంచి దూరం చేద్దామని పిలుపునిచ్చారు. స్వయం సహాయక సంఘాల మహిళలు, విద్యార్థులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. ర్యాలీలు, సమావేశాలు, కరపత్రాల పంపిణీ, కళా ప్రదర్శనలు, డిజిటల్ కంటెంట్ తదితరాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో గ్లాస్ సీసాలు, వస్త్ర సంచులు, పేపర్ ప్యాకింగ్ వంటి వాటిని ప్రోత్సహించాలని కోరారు. రైతుబజార్లు, ఇతర అన్ని రకాల దుకాణాల్లో పాలిథీన్ సంచులను వినియోగించకుండా పర్యవేక్షించాలని చెప్పారు. డీపీవో పి.లావణ్య కుమారి తదితరులు పాల్గొన్నారు.

జి.కొండూరులో 25.4 మి.మీ. వర్షం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలోని పలు మండలాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిశాయి. బుధవారం సాయంత్రం నుంచి గురువారం ఉదయం వరకు నమోదైన వివరాలు ఇలా ఉన్నాయి. జి.కొండూరు 25.4 మి.మీ., ఇబ్రహీంపట్నం 20.2, వీరులపాడు, కంచికచర్ల 7.2, విజయవాడ సెంట్రల్, పశ్చిమ 6.4, విజయవాడ తూర్పు 6.2, విజయవాడ ఉత్తరం 6, విజయవాడ గ్రామీణ 5.2, నందిగామలో 0.2 మిల్లీమీటర్ల వర్షం పడింది. జిల్లా సగటు వర్షపాతం 4.52 మి.మీ.గా ఉంది.

మూగజీవాలకు సాంత్వన

వెటర్నరీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఆధునిక వైద్యసేవలు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే



శస్త్రచికిత్స చేస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు తదితరులు

ఎంతో ప్రేమగా పెంచుకునే మూగజీవాలకు ఏదైనా అనారోగ్య సమస్య వస్తే పోషకులు అల్లాడిపోతారు. ఎక్కడ వైద్యం చేయించాలో తెలియక ఆందోళనకు గురవుతారు. అలాంటి జంతుప్రేమికుల కోసమే విజయవాడలోని ఎన్టీఆర్ వెటర్నరీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు చేశారు. ఇక్కడ నిత్యం వందలాది మూగ జీవాలకు అత్యాధునిక శస్త్రచికిత్సలు అందిస్తున్నారు.

విజయవాడ ఎంజీరోడ్డులోని ఎన్టీఆర్ వెటర్నరీ సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలో వెటర్నరీ సహాయ సర్జన్లు ఐదుగురు, సహాయ సంచాలకులు ముగ్గురు, సిబ్బంది 30 మంది విధులు నిర్వహిస్తున్నారు. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు, మధ్యాహ్నం రెండు నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు రెండు షిఫ్టులుగా వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటారు. ప్రాణాంతక వ్యాధులకు శస్త్రచికిత్సలు చేసి యజమానులు, పోషకుల మన్ననలు పొందుతున్నారు. రోజూ ఓపీ 250 నుంచి 300 వరకు ఉంటుందని హాస్పిటల్ సంయుక్త సంచాలకులు డాక్టర్ పి.ప్రేమ్‌చంద్ తెలిపారు.

అత్యధిక శస్త్రచికిత్సలతో..

మూగజీవాలకు మూత్రాశయంలో రాళ్లు, వివిధ రకాల క్యాన్సర్లు, సంతాన నియంత్రణ శస్త్రచికిత్సలు, తోక, ఎముకలు, హెర్నియా, చెవి, కంటి సంబంధిత శస్త్రచికిత్సలు చేస్తున్నారు. ఇక్కడ పని చేస్తున్న సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీనివాసరావు ఇప్పటివరకు 2500కు పైగా శస్త్రచికిత్సలు చేసి 95 శాతం సక్సెస్ రేటు సాధించారు. పశుసంవర్ధక శాఖ నిర్వహించే ఆస్పత్రుల్లో అత్యధిక శస్త్రచికిత్సలు చేసి రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచారు. శస్త్రచికిత్సలు చేసినందుకు శ్రీనివాసరావుకు ఇటీవల జిల్లా కలెక్టర్ నుంచి ఉత్తమ ప్రతిభా పురస్కారం, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ వెటర్నరీ సర్జన్, ఉత్తమ వెటరినేరియన్ అవార్డులను పశుసంవర్ధకశాఖ సంచాలకుల నుంచి అందుకున్నారు. దీంతోపాటు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే 350 మందికి పైగా పశువైద్యులకు ఇక్కడ శిక్షణ ఇచ్చారు.

ఉచితంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు

వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయడానికి ఆసుపత్రిలో అత్యాధునిక ల్యాబ్ ఉంది. ఇక్కడ రక్తం, మూత్రం, మూత్రపిండాలు, కాలేయం తదితర పరీక్షలు చేస్తారు. అత్యాధునిక డిజిటల్ ఎక్స్‌రే, స్కానింగ్ కూడా ఉంది. బయట వేలాది రూపాయలు ఖర్చయ్యే వైద్య పరీక్షలు ఇక్కడ ఉచితంగా చేస్తున్నారు.

అక్షర కోవెలకు.. ఆనంద పయనం

ఈనాడు కథనానికి స్పందన

కేతనకొండ మోడల్ కాలనీ నుంచి నిత్యం 10 కి.మి దూరం నడుచుకుంటూ కాచవరం పాఠశాలకు వెళ్లి వస్తున్న విద్యార్థుల కష్టాలు తీరాయి. చిన్నారులు పడుతున్న సమస్యను 'ఈనాడు'లో బుధవారం 'అక్షరమే స్ఫూర్తి..అవస్థలు ఏపాటి..?' శీర్షికన ప్రచురించిన చిత్ర వార్తకు విద్యాశాఖ అధికారులు స్పందించారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఉత్తర్వుల మేరకు మండల విద్యాశాఖ అధికారులు పుష్పలత, వీరస్వామిలు మోడల్ కాలనీలో తల్లిదండ్రుల ప్రత్యేక సమావేశం నిర్వహించి ప్రభుత్వం రవాణా భత్యం కింద ఒక్కో విద్యార్థికి నెలకు రూ.600 మేర.. పది నెలలకు రూ.6000 చొప్పున తల్లి ఖాతాకు జమ చేస్తుందని వారికి వివరించారు. ప్రభుత్వం మంజూరు చేసిన రవాణా భత్యం తల్లులే ఆటోకు చెల్లిస్తారని, రోజూ విద్యార్థులను పాఠశాలకు తీసుకువచ్చి తిరిగి ఇంటికి తీసుకుపోయే విధంగా ఆటో డ్రైవరుతో ఒప్పందం కుదిర్చి ఆటో ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీ నాగేశ్వరరావు, ఉపాధ్యాయుడు ఇర్ఫాన్ పాషాలు పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం



ఒప్పందం కుదిరిన ఆటోతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఫోన్ చేసి దొరికిపోయాడు!

జంట హత్యల కేసు నిందితుడి అరెస్టు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : గవర్నర్‌పేటలో ఇద్దరు హోటల్ కార్మికులను హతమార్చి పారిపోయిన రౌడీషీటర్.. ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. హత్య చేసిన తర్వాత రైలులో సికింద్రాబాద్ పారిపోయాడు. సౌత్ ఏసీపీ పావన్‌కుమార్ నేతృత్వంలో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. నిందితుడి కుటుంబ సభ్యుల వివరాలు సేకరించారు. అతడి స్నేహితుడిని బుధవారం రాత్రి స్టేషన్‌కు పిలిపించారు. కిషోర్ ఫోన్ చేస్తే తమ సమాచారం ఇవ్వాలని చెప్పి.. నిఘా ఉంచారు. ఈ క్రమంలోనే నిందితుడు గురువారం ఉదయం తన మిత్రుడికి ఫోన్ చేశాడు. ఆ కాల్‌ను ట్రేస్ చేసిన పోలీసులు.. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ సమీపం నుంచి ఫోన్ వచ్చినట్లు గుర్తించారు.

ఏపీ, తెలంగాణ పోలీసుల సంయుక్త ఆపరేషన్

విజయవాడ పోలీసులు వెంటనే సికింద్రాబాద్ పోలీసులను అప్రమత్తం చేశారు. డీసీపీ స్థాయి అధికారితో పాటు సికింద్రాబాద్ సీఐకి సమాచారం అందించారు. నిందితుడి లొకేషన్, ఫొటో పంపగా.. అక్కడి పోలీసులు రంగంలోకి దిగారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పరిసరాలను జల్లెడపట్టారు. దాదాపు మూడు గంటల గాలింపు తర్వాత జమ్మ కిషోర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈలోగా విజయవాడ నుంచి కొత్తపేట కానిస్టేబుల్, నలుగురు గవర్నర్‌పేట పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కూడిన ప్రత్యేక బృందం సికింద్రాబాద్ వెళ్లింది. నిందితుడిని తమ సంరక్షణలోకి తీసుకుని విజయవాడకు తీసుకువచ్చారు.

గొడవలే కారణం: నిందితుడు కిషోర్, రాజు, వెంకట నారాయణలు ఒకే గదిలో ఉంటారు. మద్యం మత్తులో తరచూ గొడవ పడుతుండేవారు. నువ్వెంతంటే నువ్వెంత అనుకునేవారని పోలీసుల విచారణలో తేలింది. ఈ క్రమంలో బుధవారం రాజు(40), వెంకట నారాయణ(40)లు బాషా, మరో యువకుడిని తమ గదికి తీసుకువచ్చారు. నలుగురూ కలిసి మద్యం తాగుతుండగా కిషోర్ వచ్చాడు. అందరూ తాగుతుంటే.. నేను ఎక్కడ పడుకోవాలంటూ వారితో గొడవకు దిగాడు. దీంతో బాషా, మరో యువకుడు వెళ్లిపోయారు. గదిలో ఉన్న ముగ్గురి మధ్య మాటామాటా పెరిగింది. కిషోర్ కత్తితో విచక్షణారహితంగా వారిద్దరినీ పొడిచి చంపి పారిపోయాడు. కొద్ది సేపటి తర్వాత వచ్చిన బాషా.. రక్తపు మడుగులో పడి ఉన్న ఇద్దరిని చూశారు. వెంటనే గవర్నర్‌పేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. హత్య విషయం వెలుగులోకి వచ్చింది. కాగా.. విజయనగరానికి చెందిన గాదె వెంకట నారాయణ పనుల నిమిత్తం విజయవాడకు వచ్చారు. తాను సంపాదించిన సొమ్ములో ఎక్కువ భాగం తల్లిదండ్రులకు పంపేవాడు. మరో హతుడు రాజుది వై.ఎస్.ఆర్.జక్కంపూడి కాలనీ. భార్యతో విడిపోయి ఒంటరిగా ఉంటున్నాడని, పదేళ్లుగా ఇంటికి రాకుండా విజయవాడలోనే గది అద్దెకు తీసుకుని ఉంటున్నాడని అతని తమ్ముడు అప్పలనాయుడు తెలిపారు.

రైతులకు అండగా ఉంటాం



సమావేశంలో నర్రావాసు, సభ్యులు

గొల్లపూడి, న్యూస్‌టుడే: రైతులకు అండగా ఉంటూ.. వారి సమస్యలను పరిష్కరిస్తామని విజయవాడ వ్యవసాయ మార్కెట్‌యార్డు ఛైర్మన్ నర్రా వాసు పేర్కొన్నారు. విజయవాడ వ్యవసాయ మార్కెట్‌యార్డు ఛైర్మన్ నర్రా వాసు, సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమం గొల్లపూడిలోని మార్కెటింగ్ శాఖ కార్యాలయంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. గత వైకాపా ప్రభుత్వంలో రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని, వారిని పట్టించుకునే వారే లేరన్నారు. రైతులు పండించిన ధాన్యం డబ్బులు సైతం సకాలంలో అందేవి కాదన్నారు. [illegible] చేపడుతున్నట్లు తెలిపారు. మార్కెట్‌యార్డు పరిధిలో రైతులకు ఉపయోగంగా అభివృద్ధి పనులను చేపడతామని చెప్పారు. అనంతరం వారికి పలువురు అభినందనలు తెలిపారు. మార్కెట్ కమిటీ కార్యదర్శి ఎ.శారదారాణి, తెదేపా నాయకుడు బొమ్మసాని సుబ్బారావు, నాయకులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో ఒక రూ.లలో)

[illegible]

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 520 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

ప్రాంగణ ఎంపికల్లో ప్రతిభ



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో కళాశాల అధ్యాపకులు

పరిటాల(కంచికచర్ల): జులై మొదటి వారంలో ప్రముఖ నిర్మాణ సంస్థలు నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో తమ కళాశాల విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని ఎంవీఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ [illegible] తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు [illegible] ను కళాశాల ఛైర్మన్ [illegible] అభినందించారు. కళాశాల విద్యార్థుల నైపుణ్యాలు మెరుగుపరిచేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

కాలువలకు 13,361 క్యూసెక్కుల సాగునీరు

ఎన్టీఆర్ కలెక్టరేట్: నగరంలోని ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా డెల్టాలోని పంట కాలువలకు గురువారం 13,361 క్యూసెక్కులు విడుదల చేశారు. కృష్ణా తూర్పు (కేఈ) ప్రధాన కాలువకు 9,855 క్యూసెక్కులు, కృష్ణా పశ్చిమ (కేడబ్ల్యూ) ప్రధాన కాలువకు 3,506 క్యూసెక్కులు ఇచ్చారు. కేఈ ప్రధాన కాలువ నుంచి రైవస్ కాల్వకు 4,717, ఏలూరు 1,404, బందరు 2,190, కేఈబీ (దివిసీమ) కాల్వకు 1,544 క్యూసెక్కుల చొప్పున నీరు అందిస్తున్నారు.

'చంద్రబాబుపై నోరుపారేసుకుంటే రాజకీయ భవిష్యత్తు గల్లంతే'



మాట్లాడుతున్న బుద్ధా వెంకన్న

విద్యాధరపురం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబుపై నోరు పారేసుకుంటే వైకాపా వారికి రాజకీయ భవిష్యత్తు ఉండదని మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న హెచ్చరించారు. మల్లికార్జునపేటలోని తెదేపా కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యలు సృష్టించి పెట్టుబడులు రాకుండా చేయాలని చూస్తున్న వారు తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుందన్నారు. తమ పార్టీ అధినేత కుటుంబం గురించి చెడుగా ఒక్క మాట మాట్లాడినా బుద్ధి చెప్పడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. జైలుకు వెళ్లి వచ్చిన వంశీ వంటి వారిని చూస్తే ఎంతటి యువకులో అర్థమవుతుందని ఎద్దేవా చేశారు. రేషన్ బియ్యం దోచేసిన పేర్ని నాని వంటి వారు మైకుల వద్ద ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ప్రజలు నమ్మరన్న విషయం గత ఎన్నికల్లో స్పష్టమైందన్నారు. రేషన్ బియ్యం స్కామ్‌లో పేర్ని నాని భార్యను అరెస్టు చేయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆపారని చెప్పిన నోటితోనే.. ఇప్పుడు ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం అతడి నైజాన్ని తెలియజేస్తోందన్నారు.

ఆక్వా, పౌల్ట్రీ ప్రదర్శన ప్రారంభం



ప్రదర్శన ప్రారంభిస్తున్న ఎంపీ మస్తాన్‌రావు

విజయవాడ సిటీ: లబ్బీపేటలోని ఎస్.ఎస్.కన్వెన్షన్‌లో ఇండియా ఇంటర్నేషనల్ ఆక్వా కల్చర్, పౌల్ట్రీ ఎక్స్‌పో-2025ను గురువారం ప్రారంభించారు. ప్రదర్శనను రాజ్యసభ సభ్యుడు బీద మస్తానరావు ప్రారంభించారు. ప్రదర్శనలో వివిధ దేశాల రొయ్యలను ప్రదర్శించారు. ఆక్వాకల్చర్, పౌల్ట్రీ రైతులకు సాంకేతికత, ఆధునిక పద్ధతుల్లో అందుబాటులో వచ్చిన సేవలు, పరికరాలను ప్రదర్శించారు.

సార్వత్రిక విద్య వినియోగించుకోండి

విజయవాడ సిటీ: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా నిర్వహించే ఓపెన్ స్కూల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి యు.వి.సుబ్బారావు సూచించారు. ఎంజీరోడ్డులోని కార్యాలయంలో ఆయన ఇందుకు సంబంధించిన బ్యానర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ 14 సంవత్సరాల వయసు పైబడిన వారు, చదువు మధ్యలో మానేసినవారు, అక్షర జ్ఞానం కలిగిన వారు ఓపెన్‌స్కూల్‌లో పదో తరగతి చదువుకోవచ్చన్నారు. 15 సంవత్సరాలు నిండిన వారు దూరవిద్య ద్వారా ఇంటర్ పరీక్షలు రాయొచ్చన్నారు. ఓపెన్ స్కూల్ రాష్ట్ర, జిల్లా సమన్వయకర్తలు శ్రీనివాస్, ఖాజావలి పాల్గొన్నారు.

రణరంగంగా వరకట్న వేధింపుల పంచాయితీ

వైకాపా నేత కుమారుడైన ఎస్‌ఐ కుటుంబ వివాదంలో 11 మందికి గాయాలు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో ఎస్‌ఐగా పని చేస్తున్న ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం వేదాద్రికి చెందిన చల్లా ప్రవీణ్‌కుమార్‌పై నమోదైన వరకట్న వేధింపుల వివాదం పంచాయితీ రణరంగంగా మారింది. ఈ ఘటనలో ఇరువర్గాలకు చెందిన 11 మందికి గాయాలయ్యాయి. చిల్లకల్లు ఎస్‌ఐ సూర్యశ్రీనివాస్ కథనం ప్రకారం.. వేదాద్రికి చెందిన వైకాపా నాయకుడు చల్లా వైకుంఠరావు, ఆయన సతీమణి మాజీ జడ్పీటీసీ సభ్యురాలు దుర్గ పెద్దకుమారుడైన ప్రవీణ్‌కుమార్ బంజారాహిల్స్ కమాండ్ కంట్రోల్ ఆర్ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు ఖమ్మం జిల్లా మధిరకు చెందిన చప్పిడి రాజ్యలతతో ఏడాది క్రితం వివాహమైంది. కుటుంబ కలహాల నేపథ్యంలో ప్రవీణ్ వరకట్నం కోసం వేధిస్తున్నాడని రాజ్యలత తల్లిదండ్రులు గతంలోనే ఫిర్యాదు చేశారు. వివాహ సమయంలో చెప్పిన పొలం, స్థలం, ఇల్లు ఇవ్వకుండా కాలయాపన చేయడమే కాకుండా.. ప్రవీణ్ నుంచి చాలా డబ్బులు కాజేశారని వైకుంఠరావు కుటుంబం అభియోగం. గతంలోనే పలుమార్లు దీనిపై పోలీస్ స్టేషన్లలో జరిగిన పంచాయితీలు కొలిక్కి రాకపోవడంతో గురువారం చిల్లకల్లు పాలకేంద్రం వేదికగా పెద్దమనుషుల సమక్షంలో పరిష్కరించుకోవడానికి నిర్ణయించి కలుసుకున్నారు. తొలుత వాగ్వాదంగా మొదలైన చర్చలు ఆర్ఎస్‌ఐ సోదరుడు దురుసుగా మాట్లాడడం వల్లే మాటామాట పెరిగి ఘర్షణకు దారితీసింది. చేతులు, అందుబాటులో ఉన్న కుర్చీలు, రాళ్లతో పరస్పరం దాడి చేసుకున్నారు. దీంతో రాజ్యలతతో పాటు ఆమె తల్లిదండ్రులు చప్పిడి వెంకట్రామయ్య, రమాదేవి, సోదరుడు రాజేంద్ర, వదిన ఇంద్రాణి, మేనమామలు సత్యశేఖర్, రత్నశేఖర్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రవీణ్‌తో పాటు అతడి తల్లిదండ్రులు చల్లా వైకుంఠరావు, దుర్గ, సోదరుడు నరేంద్రలకు తీవ్ర గాయాలయ్యాయి. ఇరుపక్షాలను జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేసి పంపారు. తలకు బలమైన గాయాలైనవారిని మెరుగైన వైద్యం కోసం ఖమ్మం పంపించారు. ప్రవీణ్ కుటుంబం దురుసు ప్రవర్తన వల్లే ఘర్షణ జరిగిందని రాజ్యలత కుటుంబ సభ్యులు, పంచాయితీకి ఎక్కువ సంఖ్యలో వచ్చిన వెంకట్రామయ్య కుటుంబ సభ్యులే ఘర్షణకు కాలు దువ్వారని ప్రవీణ్ కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఇరువర్గాల ఫిర్యాదులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పశ్చిమ బైపాస్‌లో రోడ్డు ప్రమాదం

యువకుడి మృతి, అపస్మారక స్థితిలో యువతి



ఈడే పవన్ (పాతచిత్రం)

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: స్నేహితురాలిని ఇంటి వద్ద దించేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా రోడ్డు ప్రమాదం జరిగిన ఘటన విజయవాడ పశ్చిమ బైపాస్‌లో గన్నవరం మండలం మర్లపాలెం రైల్వేగేట్ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం ఈదులగూడెంకు చెందిన ఈడే పవన్(25) విజయవాడలో నివసిస్తూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. అతనికి ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నానికి చెందిన గరికపాటి భాగ్యలక్ష్మి స్నేహితురాలు. పని నిమిత్తం బుధవారం రాత్రి గన్నవరం వెళ్లిన పవన్‌కు.. స్థానికంగా ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న భాగ్యలక్ష్మి ఫోన్ చేసి ఇంటివద్ద దించాలని కోరింది. అతను ఆమెను తన ద్విచక్రవాహనంపై ఎక్కించుకొని పశ్చిమ బైపాస్ మీదుగా బయలుదేరాడు. మార్గమధ్యలో మర్లపాలెం రైల్వేగేట్ దాటగానే ఎదురుగా వెళ్తున్న లేక నిలిపిన వాహనాన్ని వీరి వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో పవన్, భాగ్యలక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన తోటి వాహనదారులు పోలీసులకు సమాచారం ఇచ్చి స్థానికంగా ఉన్న ఓ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే పవన్ మృతిచెందగా.. భాగ్యలక్ష్మి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ఎండీయూ ఆపరేటర్ల తొలగింపు సరికాదు'



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణ తదితరులు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం కక్షపూరితంగా 9260 మంది ఎండీయూ ఆపరేటర్లను తొలగించడం సరికాదని ఎండీయూ ఆపరేటర్ల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రౌతు సూర్యనారాయణ అన్నారు. గురువారం ఆయన విజయవాడ ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. మంత్రి నాదెండ్ల మనోహర్ ఆపరేటర్లనుద్దేశించి రేషన్ మాఫియా జరిగిందనడం దారుణమన్నారు. ఈ వ్యాఖ్యలతో తమ మనోభావాలు దెబ్బతిన్నాయని వాపోయారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం తమ గురించి తప్పుగా మాట్లాడడం మనోవేదనకు గురిచేసిందని పేర్కొన్నారు. ఆపరేటర్ల తొలగింపుతో ప్రభుత్వానికి రూ.300 కోట్ల ఆదాయం మిగిలిందని చెప్పడం సిగ్గుచేటన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిషోర్ మాట్లాడుతూ.. యోగాంధ్ర పేరుతో ఒక్క రోజులోనే రూ.350 కోట్లు కూటమి ప్రభుత్వం ఖర్చు చేసిందని విమర్శించారు. తాము వైకాపా కార్యకర్తలమని. . జగన్ అనుచరులమని పేర్కొనడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. వాహనాలను కేంద్రం ప్రభుత్వం ఇచ్చిందని, వాటిని తిరిగి ఇచ్చేయమని చెప్పడం తగదన్నారు. రాయితీ మొత్తం వెనక్కి ఇవ్వాలనడం, ఇంకా 20 నెలల కాలపరిమితి ఉందని ఉండగా.. పర్సంటేజీ వాటాదారులైన ఆపరేటర్లను ముందస్తు సమాచారం లేకుండా ప్రభుత్వం తొలగించడం అన్యాయమన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు సాంబశివరావు, సతీష్, సుధాకర్‌రెడ్డి, వెంకట్, పురుషోత్తం, దేవసహాయం తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? జి.కొండూరు శివారు పినపాక రోడ్డులోని కాలువల్లో మురుగునీరు పారక దుర్వాసన, దోమలతో అవస్థలు పడుతున్నాం. -బి.రాజు, గ్రామస్థుడు ✔ పారిశుద్ధ్య సిబ్బందిని పంపి కాలువల్లో పూడిక తీయించి దోమల నివారణకు బ్లీచింగ్ చల్లిస్తాం. -బసవలింగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి -న్యూస్‌టుడే, జి.కొండూరు



✦ గడ్డమణుగులో నెలల తరబడి కాలువల్లో పూడిక తీయకపోవడంతో మురుగు పారక దోమలు, దుర్వాసనతో అవస్థలు పడుతున్నామన్న స్థానికుల సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన 10వ తేదీన ఈనాడులో ప్రచురించగా స్పందించిన సర్పంచి, కార్యదర్శి కాలువలు పూడిక తీయించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. -న్యూస్‌టుడే, జి.కొండూరు

స్పందనకు వందనం



✦ స్థానిక పంచాయతీలోని పలు ప్రాంతాల్లో మురుగు కాలువల్లో నీరు పారక ఇబ్బందిగా ఉన్న వైనంపై పలువురు చేసిన ఫిర్యాదులను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. గురువారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది అయ్యప్పనగర్, సూరిబాబుపేట ప్రాంతాల్లో కాలువల్లో పూడిక తొలగించి, బ్లీచింగ్, సున్నం చల్లారు. -న్యూస్‌టుడే, మైలవరం ✦ పట్టణంలోని 3వ వార్డు పరిధి ఎరుకుల కాలనీలో రహదారి పక్కన పిచ్చిమొక్కలు పెరిగి, చెత్తతో అపరిశుభ్రంగా ఉందని స్థానికులు మేమున్నాం.. మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. పురపాలిక సిబ్బందిని పంపి చెత్త, పిచ్చి మొక్కలు తొలగింపజేసి శుభ్రం చేయించారు. ✦ పట్టణంలోని పీటీ కొత్తూరుకు వెళ్లే దారిలో బోర్లు, నీటి పంపుల వద్ద పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగి నీరు పట్టుకునేందుకు ఇబ్బందికరంగా ఉందని స్థానికులు చేసిన ఫిర్యాదుపై శానిటరీ అధికారి స్పందించి కార్మికులతో శుభ్రం చేయించారు. ✦పట్టణంలోని మధిర రోడ్డులో కాల్వల్లో మురుగునీరు నిలిచి దోమలు వృద్ధి చెంది అవస్థలు పడుతున్నామని స్థానికులు చేస్తున్న ఫిర్యాదును శానిటరీ అధికారులకు తెలుపగా స్పందించారు. పురపాలిక కార్మికులతో డ్రెయినేజీలో పూడిక తీయించి దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. ✦ పట్టణంలోని 1వ వార్డు పరిధి రాజుపేటలో మురుగునీరు పారుదల లేక ఇబ్బందిగా ఉందన్న స్థానికుల సమస్యపై పారిశుద్ధ్య అధికారులు స్పందించారు. కార్మికులతో డ్రెయినేజీలో పూడిక తీయించారు. - న్యూస్‌టుడే, తిరువూరు

ఇష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

జి.కొండూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థినులు ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు. కుంటముక్కల డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. విద్యార్థినులు కష్టపడి చదివి ఐఐటీ, నీట్ పరీక్షల్లో మంచి ర్యాంకులు సాధించాలని సూచించారు. గురుకులం ప్రాంగణం, తరగతి గదులు, వంటగది, భోజనశాల, సరకుల గదిని పరిశీలించారు. అనంతరం జేఈఈ, నీట్ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థినులతో చర్చించి త్వరలోనే పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చేందుకు సబ్జెక్టు నిపుణులను నియమిస్తామన్నారు. గతేడాది వరదలకు ప్రహరీ పడిపోయిందని, అంతర్గత రహదారులు బాగు చేయించాలని ఆయన దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్ సుభాషిణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

కంచికచర్ల, న్యూస్‌టుడే: మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ వ్యక్తిగత కార్యదర్శి కట్టా నరసింహారావు గురువారం గుండెపోటుతో మరణించారు. స్వగ్రామమైన నక్కలంపేటలో నరసింహారావు మృతదేహానికి ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పేదల పక్షాన నిలవాలి



న్యాయవాదుల సన్మాన కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

మైలవరం, న్యూస్‌టుడే: అంతర్జాతీయ న్యాయవాదుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం లయన్స్‌క్లబ్ ఆఫ్ మైలవరం ఆధ్వర్యంలో పలువురు న్యాయవాదులకు సన్మానం చేశారు. మైలవరం బార్ అసోసియేషన్‌లో సీనియర్ న్యాయవాదులు ఏడీ ప్రసాద్, వీటీ కిషోర్, బి.వెంకట్రావు, న్యాయవాదులు పి.దినేష్, తనుజ్‌లను సన్మానించారు. న్యాయవాదులు పేదల పక్షాన నిలిచి వృత్తికి పేరు తీసుకురావాలని ప్రోగ్రాం కోఆర్డినేటర్ జాస్తి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లబ్ నాయకులు చనమోలు నాగభూషణం, రామిరెడ్డి, హరీష్‌కుమార్, జి.వెంకటేశ్వరరావు, కిషోర్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ బడిలో.. ఆటపాటల సవ్వడి

ప్రత్యేక పుస్తకాలతో చిన్నారులకు విద్యాబోధన

గంపలగూడెం, న్యూస్‌టుడే

ఎన్డీయే ప్రభుత్వం అధికారం చేపట్టాక బాలల భవిష్యత్తును తీర్చిదిద్దే అంగన్‌వాడీ కేంద్రాల్లో మార్పులకు శ్రీకారం చుట్టింది. పౌష్టికాహారం అందజేత, పర్యవేక్షణ యాప్‌లు ఇప్పటికే కొత్తవి అమలు చేసింది. తాజాగా చిన్నారుల అభ్యాసన సామర్థ్యాలను బలోపేతం చేసేందుకు కొత్త పుస్తకాలను సరఫరా చేసింది. బాల్యానికి భరోసా ఇవ్వడానికి ప్రాధాన్యం కల్పిస్తోంది. చిన్నారులు మానసికంగా, శారీరకంగా, ఆరోగ్యంగా ఎదిగేలా కూటమి ప్రభుత్వం కేంద్రాల్లో మార్పులకు శ్రీకారం చుడుతోంది. ఇందులో భాగంగా 'నవ చేతన, ఆధార్‌శిల' అనే పుస్తకాలను (హ్యాండ్ బుక్స్) రూపొందించి అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బందికి అందజేసింది. వీటిలోని అంశాలను వారు అమలు చేయడంతో పాటు తల్లిదండ్రులకు వివరించాల్సి ఉంటుంది.

అర్థమయ్యేలా..



'నవ చేతన'.. పుస్తకంలో పసిబిడ్డల పెంపకంలో తల్లి, కుటుంబ సభ్యులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వారితో ఎలా ప్రవర్తించాలి. చిట్టి బుర్రలకు అర్థమయ్యేలా ఎలా కబుర్లు, కథలు చెప్పాలి అనేది చిత్రాలతో సహా ఇచ్చారు. చిన్నారికి మూడేళ్లు వయసు వచ్చే వరకు ఏం చేస్తే వారు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యకరంగా పెరుగుతారో వివరించారు. పిల్లలకు ఏ నెలలో ఎలాంటి అంశాలు నేర్పించాలో కూడా ఈ పుస్తకంలో వివరించారు. ఇందులోని అంశాలపై అంగన్‌వాడీ కార్యకర్త తమ వద్దకు వచ్చే బాలింతలకు అవగాహన కల్పించాల్సి ఉంటుంది. 36 నెలలలోపు వయసు చిన్నారులకు పుస్తకంలో పొందుపరిచిన అంశాలను నేర్పిస్తారు.


నియోజకవర్గంలో కేంద్రాలు, 36 నెలలలోపు, 3-6 సంవత్సరాల మధ్య పిల్లల వివరాలు ఇలా

మండలం	కేంద్రాలు	36 నెలలోపు	3-6 ఏళ్ల మధ్య
గంపలగూడెం	78	1593	855
విస్సన్నపేట	72	1368	673
తిరువూరు	64	1692	790
ఎ.కొండూరు	51	1219	650



ఊటుకూరులో చిన్నారులకు పాఠాలు నేర్పుతున్న అంగన్‌వాడీ కార్యకర్త

వినోదాత్మకంగా..



'ఆధార్ శిల'.. పుస్తకంలో అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే మూడు నుంచి ఆరేళ్ల పిల్లలకు వినోదాత్మకంగా పాఠాలు ఎలా బోధించాలో వివరించారు. అభ్యాసనం పూర్తిగా ఆటలు ఆడించే ప్రక్రియగానే ఉంటుంది.

• కార్యకర్తలకు శిక్షణ ఇచ్చాం: పి.కృష్ణకుమారి, సీడీపీవో తిరువూరు

నియోజకవర్గంలోని 265 అంగన్‌వాడీ కేంద్రాలకు నవచేతన, ఆధారశిల పుస్తకాలు అందజేశారు. వీటిలోని అంశాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం, చిన్నారులకు నేర్పించడంపై అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు శిక్షణ ఇచ్చాం. అమలు తీరును పర్యవేక్షిస్తాం.

బాధ్యతలు స్వీకరించిన సొసైటీ అధ్యక్షులు



శ్రీనివాసరావుతో తెదేపా నాయకులు

జి.కొండూరు, న్యూస్‌టుడే: జి.కొండూరు సొసైటీ అధ్యక్షుడిగా సీనియర్ తెదేపా నాయకుడు పజ్జూరు శ్రీనివాసరావు, కుంటముక్కల సొసైటీ అధ్యక్షుడిగా సుఖవాసి శ్రీహరి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారిని సొసైటీ సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు పజ్జూరు రవికుమార్, లంకా రామకృష్ణ, ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఉయ్యూరు వెంకటనరసింహారావు, కార్యదర్శి వీ.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలకు కార్యశాలలతో ప్రయోజనం

మైలవరం, న్యూస్‌టుడే: అధ్యాపకుల పరిశోధనలకు కళాశాలల్లో నిర్వహించే కార్యశాలలు ఎంతగానో దోహదపడతాయని లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ కె.అప్పారావు తెలిపారు. గురువారం కళాశాలలో 'అడ్వాన్స్‌మెంట్స్ ఇన్ కెమిస్ట్రీ అండ్ హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్ యూజింగ్ కెమ్‌డ్రా' అంశంపై అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్లు, విద్యార్థులకు రెండ్రోజుల కార్యశాల ప్రారంభించారు. ఆయా అంశాల ప్రయోజనాలను రిసోర్స్ పర్సన్లు వివరించారు. కార్యక్రమ కన్వీనర్ సత్యనారాయణ, కోఆర్డినేటర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పార్టీ బలాన్ని రెట్టింపు చేయండి



తెదేపా మండల శాఖ అధ్యక్షుడు మానుకొండ రామకృష్ణను సన్మానించిన ఎమ్మెల్యే శ్రీనివాసరావు, నాయకులు

గంపలగూడెం, న్యూస్‌టుడే: తెదేపా మండల, అనుబంధ సంఘాలు, 24 గ్రామశాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, సభ్యులుగా నియమితులైన నాయకులు గ్రామాల్లో, మండలంలో పార్టీ బలాన్ని రెట్టింపు చేయాలని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని తోటమూల ఎస్సార్ కల్యాణ మండపంలో గురువారం రాత్రి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తెదేపా మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికైన మానుకొండ రామకృష్ణ, కోట వెంకటేశ్వరరావు, గ్రామ కమిటీల ప్రతినిధులతో ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..గత ఏడేళ్లుగా మండల తెలుగు యువత అధ్యక్షుడిగా ఉన్న మానుకొండ రామకృష్ణ పార్టీకి అందించిన సేవలు, కృషి, పనితీరు వల్లే ఈ పదవి వరించిందన్నారు. మండల, గ్రామ శాఖలకు నూతనంగా ఎన్నికైన కమిటీల సభ్యులందరూ జన్మభూమి పని ప్రతి రోజూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని కోరారు. తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు చెరుకూరి రాజేశ్వరరావు, ఏఎంసీ అధ్యక్షురాలు ఆర్.లక్ష్మీఅనిత, పార్టీ మండల మాజీ అధ్యక్షులు ఆర్.వీరారెడ్డి, ఇను గంటి మధుసూదనరావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు జి.వెంకటేశ్వరరెడ్డి, కె.రఘునాథ్, పి.రాంబాబు, మాజీ ఎంపీపీ వై.పుల్లయ్యచౌదరి, రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి బి.నారాయణ పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా పురపాలన సాగాలి



గజమాల స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, ఛైర్మన్ చిట్టిబాబు

కొండపల్లి, న్యూస్‌టుడే: అభివృద్ధే లక్ష్యంగా పుర పాలన సాగాలని ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ అన్నారు. కొండపల్లి పురపాలిక కౌన్సిల్ తొలి సమావేశం సందర్భంగా ఇబ్రహీంపట్నం రింగ్ నుంచి బైపాస్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆయన పాల్గొని మాట్లాడారు. తొలి సమావేశంలో తీర్మానించిన అంశాలను చిత్తశుద్ధితో నిర్వహించాలని, పార్టీలకు అతీతంగా పుర అభివృద్ధి ఉండాలని సూచించారు. అనంతరం కొండపల్లిలో ఆయన కేటాయించిన కౌన్సిల్ సమావేశ మందిరాన్ని ఛైర్మన్ చిట్టిబాబు ప్రారంభించి తొలి సమావేశం నిర్వహించారు. రూ.5.92 కోట్లతో కూడిన అభివృద్ధి పనుల తీర్మానాలను సమ్మతంగా ఆమోదించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ..రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 2047 విజన్‌తో వెళుతున్నట్లు కొండపల్లి పురపాలిక కూడా అదే విధానంలో ముందుకెళుతుందని చెప్పారు. పురపాలికకు మిగిలిన ఉన్న 18 నెలల్లోనే ఏదు సంవత్సరాలకు ఉన్న అభివృద్ధిని చూపించాల్సి ఉందన్నారు. ఎన్టీటీపీఎస్ నుంచి పురపాలికకు రావాల్సిన అన్ని నిధులను రాబట్టేందుకు పాటు సామాజిక కార్యక్రమాలు నిర్వహించాలనేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

తీర్మానాలపై చర్చ జరగాలి: వైకాపా కౌన్సిలర్లు

మొదటి కౌన్సిల్ సమావేశంలో ప్రవేశపెట్టిన రూ.5.92 కోట్ల నిధుల పనులపై చర్చ జరగాలని వైకాపాకు చెందిన కౌన్సిలర్లు 7 గురు పట్టుబట్టారు. అయితే అభివృద్ధి పనులు అడ్డుకోవద్దని, అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులకు సహకరించాలని ఛైర్మన్ సమాధానమిచ్చారు.

ముగ్గురు మినహాయింపు: తొలి సమావేశానికి ముగ్గురు కౌన్సిలర్లు హాజరుకాలేదు. 29 డివిజన్లకు గాను 7వ డివిజన్ కౌన్సిలర్ గతంలో చనిపోగా మూడు, తొమ్మిది, 27వ డివిజన్ కౌన్సిలర్లు రాలేదు.

గండ్ల పూడ్చివేతకు తాత్కాలిక చర్యలు



వర్షాకాలం నేపథ్యంలో నీటి నిల్వలు చేసేందుకు మండలంలోని గ్రామాల్లో నాయకులు చెరువులకు పడిన గండ్ల పూడ్చివేతకు తాత్కాలిక చర్యలు చేపట్టారు. మండలంలోని చంద్రాల మంత్రి చెరువుకు పలు చోట్ల భారీగా గండ్లు పడ్డాయి. వేసవిలోనే పూడ్చివేతకు నిర్ణయించినా, పనులు సాగలేదు. తాజాగా చెరువులోని మట్టిని తవ్వి, కట్టకు బలోపేతానికి, గండ్ల పూడ్చివేతకు చర్యలు చేపట్టినట్లు ఆ గ్రామ మాజీ సర్పంచి లీలాప్రసాద్ తెలిపారు. మండలంలోని గణపవరం తూర్పు చెరువు మరమ్మతులను ఆ గ్రామ నాయకుడు బుజ్జిరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు. వాస్తవానికి నియోజకవర్గ వ్యాప్తంగా 126 పనులను పాలనా మోదం లభించి రెండు నెలలు దాటినా, నేటికీ టెండర్లు కొలిక్కి రాలేదు. దాంతో ఆయా గ్రామాల్లోని నాయకులే తాత్కాలిక చర్యలు చేపట్టారు. -న్యూస్‌టుడే, చంద్రాల(మైలవరం)

అధిక లోడు.. అడిగేవారులేరు



పరిమితికి మించిన లోడుతో రవాణా చేస్తున్న వాహనాల దాటికి రహదారులు ఛిద్రమవుతున్నాయి. కంకర, ఇసుక, బూడిద, స్టోన్ క్రషర్ డస్ట్ వరకు వాహన సామర్థ్యానికి మించిన లోడులతో జాతీయ రహదారి, ప్రధాన రహదారులపై తిరుగుతున్నా రవాణా, పోలీస్ శాఖలు పట్టడంలేదు. జక్కంపూడి జిల్లాలోని పలు క్వారీల నుంచి ఇసుకను రవాణా చేస్తున్న టిప్పర్లలో 20 టన్నుల సామర్థ్యానికి అనుమతులు తీసుకుని 40 టన్నుల వరకు రవాణా చేస్తున్నారు. మరోవైపు అపరిమిత లోడుతో వెళ్తున్న టిప్పర్ల నుంచి ఎక్కడికక్కడే రహదారులపై కంకర జారిపడుతుంటే ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇలా ప్రజలకు ఇబ్బంది కలిగిస్తూ ప్రయాణాలు సాగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, మైలవరం

పెచ్చులూడుతున్నాయ్.. దస్త్రాలు తడుస్తున్నాయి



శిథిలావస్థకు చేరిన మూలపాడు పశువైద్యశాల

శిథిలావస్థకు చేరిన మూలపాడు పశువైద్యశాలను పునర్నిర్మించాలని పశుపోషకులు కోరుతున్నారు. దాదాపు 40 ఏళ్ల కిందట గ్రామానికి చెందిన నిమ్మగడ్డ వంశీయులు నదీతీర గ్రామాలకు చెందిన పశుపోషకుల అవసరాల కోసం జాతీయరహదారి పక్కన రెండు గదులతో పశువైద్యశాలను నిర్మించి పశుసంవర్ధకశాఖకు అప్పగించారు. ఆనాటి నుంచి నేటి వరకు అక్కడే నదీతీర ఆరు గ్రామాలకు చెందిన వందలాది పశువులకు, జీవాలకు ఒక వైద్యుడు, సిబ్బంది వైద్యసేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం భవనం పైకప్పు పెచ్చులూడి పడుతోంది. చినుకు పడితే చమ్మ దిగుతోంది. దీంతో పరికరాలు, ఆసుపత్రి దస్త్రాలు తడిచిపోతున్నాయని సిబ్బంది చెబుతున్నారు. ప్రభుత్వ ప్రజా భాగస్వామ్యంతో అని వసతులతో కూడిన నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. -న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: వ్యవసాయ శాఖ కమిషనరేట్ మంగళగిరి కార్యాలయం అధికారి ఏడీఏ ఆర్.శశిధర్‌రెడ్డి, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ఏలూరు సీఐ సిహెచ్.రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో రెడ్డిగూడెం మండలంలోని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల దుకాణాలు ఆకస్మికంగా గురువారం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. 0 ఫామ్స్ లేని రూ.18.77లక్షలు విలువ గల ఎరువులను, ప్రిన్సిపల్ సర్టిఫికెట్ లేని రూ.1.06 లక్షల విలువైన అమ్మకాలను తాత్కాలికంగా నిలిపేసినట్లు మండల వ్యవసాయ అధికారి డి.శ్రీనివాసరావు తెలిపారు. తనిఖీల్లో విస్సన్నపేట ఏడీఏ కె.శశికళ, తహసీల్దార్ సుశీలాదేవి, ఏఈవో పవన్‌కుమార్, వీఏలు, వీహెచ్‌ఏలు పాల్గొన్నారు.

కృత్రిమ కొరత సృష్టించొద్దు

మైలవరం: రైతులకు కావాల్సిన మేరకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని, వాటికి కృత్రిమ కొరత సృష్టించి, అధిక ధరలకు అమ్మి ఇబ్బందులు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారిణి సంధ్యారాణి పేర్కొన్నారు. స్థానిక రైతుసేవాకేంద్రంలో గురువారం మండలంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డీలర్లు వారి దుకాణాల్లో నిల్వలకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో పొందుపరచాలని తెలిపారు.

ఇబ్రహీంపట్నం: ఎరువుల అమ్మకాలు, కొనుగోలు క్రమపద్ధతిలోనే జరగాలని వ్యవసాయాధికారిణి యడవల్లి రజని అన్నారు. ఇబ్రహీంపట్నం వ్యవసాయ కార్యాలయంలో ఎరువుల డీలర్స్, పీఏసీఎస్ కార్యదర్శుల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎరువుల అమ్మకాలు పారదర్శకంగా ఉండాలని..అందుకు సంబంధించిన జాబితాను డీలర్లు పక్కాగా భద్రపరచాలని సూచించారు. రసాయన ఎరువుల వాడకం తగ్గింపుపై ఉద్దేశించిన పీఎం ప్రణమ పథకం గురించి రైతులకు పీఏసీఎస్ కార్యదర్శులు తెలియజేయాలన్నారు.

మునిగిన వీధులు



జలమయమైన రహదారి

తిరువూరు, గంపలగూడెం మండలాల్లో గురువారం సాయంత్రం కుండపోతగా వర్షం కురిసింది. గంపలగూడెం, ఊటుకూరు తదితర గ్రామాల్లో వరద నీరు రహదారిపై ప్రవహించింది. మురుగు కాల్వ నీరు కూడా వరద నీటితో రహదారులపైకి ప్రవహించడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మరో వైపు పత్తి, వరినారు, మిరపనారుకు ఈ వర్షం జీవం పోసిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

-న్యూస్‌టుడే, తిరువూరు, గంపలగూడెం



వరద నీటిలోనే నడిచి వెళ్తున్న ప్రజలు

స్పందించారు.. నీరందించారు



చెవుటూరు లొద్ది కాలనీలో నీరు పట్టుకుంటున్న స్థానికులు

చెవుటూరు గ్రామంలోని లొద్ది కాలనీలో గత కొన్ని రోజులుగా నీటి సరఫరా సక్రమంగా లేదని స్థానికులు బుధవారం ఖాళీ బిందెలు, బక్కెట్లతో నిరసన వ్యక్తం చేశారు. దీనిపై 'కుళాయిలు ఉన్నా నీటి సరఫరాకు ఇబ్బందే' శీర్షికన గురువారం ఈనాడులో వార్త ప్రచురితమైంది. స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ సహాయక ఇంజినీర్ నవీన్‌కుమార్ యుద్ధప్రాతిపదికన మోటార్లు మరమ్మతులు చేయించి నీటి సరఫరా పునరుద్ధరించారు. దీంతో ఆ ప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేశారు. కాలనీలో ఇంటింటికీ లూజ్ వాటర్ మోటార్లు ఉండడంతో నీటి ఇబ్బంది తలెత్తుతోందని తక్షణమే వాటిని తొలగించాలని ఏఈ పంచాయతీ అధికారులకు సూచించారు. -న్యూస్‌టుడే, జి.కొండూరు

స్పందనకు వందనం

పంచాయతీ బిల్‌కలెక్టర్‌కు స్థానచలనం

గొల్లపూడి, న్యూస్‌టుడే: గొల్లపూడి గ్రామ పంచాయతీలో బిల్ కలెక్టర్‌గా పని చేస్తున్న జి.రంగారావును బదిలీ చేస్తూ డీపీవో ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన్ని ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామ పంచాయతీకి బదిలీ చేయగా గురువారం అక్కడ జాయిన్ అయ్యారు. గత పదేళ్లుగా గొల్లపూడి గ్రామ పంచాయతీలోనే ఇద్దరు ఉద్యోగులు పని చేస్తున్నారంటూ 'పంచాయతీలో పాతుకుపోయారు..' శీర్షికన ఈనెల 7న 'ఈనాడు'లో కథనం ప్రచురితమవగా అందుకు స్పందించిన డీపీవో..జూనియర్ అసిస్టెంట్ అజయ్‌కుమార్‌ను కొన్ని రోజుల కిందట బదిలీ చేశారు. పంచాయతీ రికార్డులు, పన్నుల వివరాలను తీసుకున్న పిదప బిల్ కలెక్టర్ రంగారావును బదిలీ చేశారు. వాస్తవానికి గత ఏడాది సెప్టెంబరులోనే ఎనికేపాడుకు ఇతడిని బదిలీ చేసినప్పటికీ గొల్లపూడిలోనే విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే...ఎనికేపాడులోనే బిల్లు కలెక్టర్‌గా పని చేస్తున్నట్లుగా డీపీవో బదిలీ ఉత్తర్వుల్లో పేర్కొనడం విశేషం.

మహిళ మృతిపై అనుమానం

పూడ్చిన మృతదేహం వెలికితీసి శవపరీక్ష

చుంచుపల్లి, న్యూస్‌టుడే: మహిళ మృతిపై అనుమానాలున్నాయని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కోర్టు ఆదేశాలతో పూడ్చిన మృతదేహాన్ని అధికారులు బయటకు తీయించి పోస్టుమార్టం నిర్వహించిన సంఘటన గురువారం కొత్తగూడెం భద్రాద్రి జిల్లా చుంచుపల్లి మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై రవికుమార్ కథనం ప్రకారం.. కొత్తగూడెంకు చెందిన ప్రిష్కల్లా కుమారి (66) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరువూరులో మెడికల్ ఆఫీసర్‌గా 2016 నుంచి 2018 వరకు విధులు నిర్వహించారు. అవివాహిత అయిన ఆమె రిటైర్డ్ అనంతరం అక్కడే నివాసం ఉన్నారు. సహోద్యోగి ప్రకాశ్ ఆమె బాగోగులు చూసుకునేవారు. గతేడాది అక్టోబర్ 10న ఆమె ఇంట్లోనే మృతిచెందారని ప్రకాశ్ కొత్తగూడెంలో ఉంటున్న ప్రిష్కల్లా కుమారి కుటుంబసభ్యులకు సమాచారామిచ్చాడు. అనంతరం ఆమె మృతదేహాన్ని కొత్తగూడెం తరలించి వెంకటేశ్వరకాలనీ క్రిస్టియన్ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. ఆమెకు రావాల్సిన ఇతర బెనిఫిట్స్ రాకపోవడంతో కుటుంబ సభ్యులు విచారించారు. ప్రకాశ్ వాటిని వాడుకొన్నట్లు గుర్తించారు. దీంతో ఆమె మృతిపై అనుమానం ఉందంటూ తిరువూరు పోలీస్ స్టేషన్‌లో కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. కోర్టు ఆదేశాలతో తిరువూరు పోలీసులు కొత్తగూడెం చేరుకొని చుంచుపల్లి పోలీసులు, చుంచుపల్లి తహసీల్దార్ కృష్ణ సమక్షంలో మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు.

80 మందికి కంటి వైద్య పరీక్షలు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: శ్రీరాంపురం గ్రామంలో ఎంఆర్‌పీఎస్ ఆర్థిక సహకారంతో అభ్యుదయ యువశక్తి సంఘం ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించి 80 మందికి పరీక్షలు నిర్వహించినట్లు సంఘం అధ్యక్షుడు సిహెచ్.వెంకటేశ్వరరావు తెలిపారు. 15 మందిని శస్త్రచికిత్సల నిమిత్తం విజయవాడ చైతన్య కంటి ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు వివరించారు.

మహిళలకు వ్యాసరచన పోటీలు

గొల్లపూడి, న్యూస్‌టుడే: జనశిక్షణ సంస్థాన్, నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మహిళలకు వ్యాసరచన పోటీలను గొల్లపూడి బొడ్డురాయిసెంటర్ వద్ద ఉన్న శిక్షణ కేంద్రంలో గురువారం నిర్వహించారు. సంస్థ డైరెక్టర్ పూర్ణిమ, మహిళా పోలీసు వెంకటలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మె



ఇంజినీరింగ్ కార్మికుల నినాదాలు

తిరువూరు: నగర పంచాయతీ ఇంజినీరింగ్ కార్మికులు ఐదో రోజైన గురువారం తమ నిరవధిక సమ్మెను కొనసాగించారు. పురపాలిక కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో తమ సమస్యలు పరిష్కరించాలని.. డిమాండ్లను ఆమోదించాలని నినాదాలు చేశారు. నాయకులు బాజీ, శ్రీనివాసరావు, అబ్దుల్‌రఫీ, వెంకటేశ్వరరావు, పావని, సుజాత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భాగస్వామ్యంతోనే పర్యావరణ రక్షణ



చిన్నారులతో మొక్కలు నాటిస్తున్న క్లబ్, సొసైటీ సభ్యులు

గుంటుపల్లి (ఇబ్రహీంపట్నం గ్రామీణం), న్యూస్‌టుడే: విద్యార్థులను పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములను చేసేందుకు వారితో మొక్కలు నాటించడం మంచి ఫలితాలను ఇస్తుందని గుంటుపల్లి కేంద్రీయ విద్యాలయ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ బి.రమేష్ బాబు అన్నారు. గుంటుపల్లి కేంద్రీయ విద్యాలయంలో గురువారం రోజ్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ విజయవాడ సంయుక్తంగా విద్యార్థులతో మొక్కలు నాటించారు. ప్రభుత్వం పర్యావరణం పరిరక్షణలో భాగంగా విద్యాలయాల ప్రాంగణాల్లో మొక్కలు నాటి సంరక్షించాలన్న పిలుపు మేరకు తాము ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ప్రతినిధులు ఉషా, ప్రవీణ తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ, క్లబ్ సభ్యులు విద్యాలయం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రీమియం తక్కువ భరోసా ఎక్కువ

కుమార్ మెట్లు దిగుతుండగా తూలి పడ్డాడు. కుడికాలు ఎముక చిట్లింది. కనీసం నాలుగు వారాలు విశ్రాంతి తీసుకోవాలని వైద్యుడు సూచించారు. ప్రవీణ్ ఒక ప్రైవేటు సంస్థలో ఉద్యోగి. ఆఫీసుకు వెళ్తుండగా బైకు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు... ఇలాంటి ప్రమాదాలు ఎప్పుడు ఎలా జరుగుతాయన్నది ఎవరూ ఊహించలేరు. ఆర్జించే వ్యక్తి కొన్నాళ్లపాటు ఇంటికే పరిమితమైతే.. ఆదాయం ఎలా? ఇలాంటప్పుడే వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీ నేనున్నానంటూ భరోసానిస్తుంది.

అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరితే ఆరోగ్య బీమా చికిత్స ఖర్చులను చెల్లిస్తుంది. దురదృష్టవశాత్తూ మరణిస్తే.. జీవిత బీమా పాలసీలున్న వారికి అవి పరిహారం చెల్లిస్తాయి. ఇదే తరహాలో ప్రమాదం బారిన పడినప్పుడు ఆర్థికంగా ఆదుకునేదే వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీ. ఇందులో ఉండే ప్రయోజనాలు కాస్త భిన్నంగా ఉంటాయి.

ఆదాయం ఆగిపోకుండా

గాయాలపాలై, ఉద్యోగం లేదా వ్యాపారం నిర్వహించలేని సందర్భంలో ఆదాయం ఆగిపోతుంది. ఇలాంటి పరిస్థితుల్లో పాలసీ తీసుకున్న వ్యక్తికి కొన్ని వారాల పాటు నిర్ణీత మొత్తంలో ఇది కొంత పరిహారం చెల్లిస్తుంది. ఉదాహరణకు ఒక సాధారణ బీమా సంస్థ అందిస్తున్న రూ.50లక్షల విలువైన పాలసీ తీసుకున్నారనుకుందాం. వారానికి రూ.10వేల చొప్పున గరిష్ఠంగా 104 వారాల పాటు చెల్లించే ఏర్పాటు ఉంటుంది. అదే రూ.కోటి పాలసీ తీసుకుంటే.. వారానికి రూ.20వేల వరకూ ఇస్తుంది. ఆసుపత్రిలో ఉన్నప్పుడూ 30 రోజుల వరకూ రోజుకు నిర్ణీత మొత్తాన్ని అందించే పాలసీలూ ఉన్నాయి.

ఎందుకు అవసరం?

అనుకోకుండా ప్రమాదం జరిగినప్పుడు మరణం సంభవించవచ్చు. కొన్నిసార్లు శాశ్వత, పాక్షిక వైకల్యం ఏర్పడవచ్చు. ఇలాంటి సందర్భాల్లో ఈ పాలసీలు పరిహారం చెల్లిస్తాయి. పాలసీదారుడు మరణిస్తే అతని నామినీకి పాలసీ విలువ మేరకు పరిహారం అందుతుంది. కుటుంబానికి ఆర్థికంగా ఇబ్బంది ఏర్పడకుండా ఇది కాపాడుతుంది. వైకల్యం బారిన పడినప్పుడూ.. పాలసీలో ముందుగానే పేర్కొన్న మేరకు చెల్లింపులు ఉంటాయి.

ఎంత చెల్లించాలి?

టర్మ్ పాలసీలతో పోల్చి చూస్తే వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీలకు ప్రీమియం తక్కువే. టర్మ్‌తోపాటు ఈ పాలసీని అనుబంధంగానూ ఎంచుకోవచ్చు. జీవిత, ఆరోగ్య బీమా పాలసీలకు వయసును బట్టి, ప్రీమియం మారుతుంది. కానీ, ఈ పాలసీల్లో సాధారణంగా అన్ని వయసుల వారికీ ప్రీమియం ఒకే విధంగా ఉంటుంది. వ్యక్తుల ఆదాయం, వారికి ఎదురయ్యే ప్రమాదాల జాబితాను బట్టి, పాలసీ విలువ, ప్రీమియాన్ని బీమా సంస్థలు నిర్ణయిస్తుంటాయి. ఉదాహరణకు ఒక ప్రముఖ సాధారణ బీమా సంస్థ అందిస్తున్న వ్యక్తిగత ప్రమాద బీమాను రూ.50లక్షల వరకూ తీసుకుంటే.. ప్రీమియం ఏడాదికి రూ.7,920 వరకూ ఉంది. అదే కోటికి రూ.14,279 చెల్లించాలి. రూ.5 కోట్ల పాలసీకి రూ.60,660 వరకూ ప్రీమియం ఉంటుంది.

ఎవరికి కావాలి?

వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీని 30 రోజుల వయసు నుంచి 70 ఏళ్ల వరకూ తీసుకునే వీలుంది. ఈ పాలసీ ప్రతి ఒక్కరికీ అవసరమనే చెప్పాలి. ఉద్యోగులు, వ్యాపారులు అనే తేడా లేదు. ప్రయాణాలు అధికంగా చేసే వారు ఈ పాలసీని మర్చిపోకూడదు. ముఖ్యంగా గృహరుణాల్లాంటివి తీసుకున్న వారికి ఈ పాలసీ కచ్చితంగా ఉండాలి. ఆదాయం ఆగిపోయిన సందర్భంలో ఈ పాలసీ ద్వారా వచ్చే మొత్తంతో వాయిదాలు చెల్లించేందుకు వీలవుతుంది.

రూ.25 కోట్ల వరకూ

ఒక వ్యక్తికి ఎంత విలువైన వ్యక్తిగత పాలసీని ఇవ్వాలనేది బీమా సంస్థల విచక్షణ మేరకు ఆధారపడి ఉంటుంది. ఈ విషయంలో బీమా సంస్థలు ఒకే తరహా నిబంధనలు పాటించవు. కొన్ని సాధారణ సంస్థలు వ్యక్తుల నెలవారీ ఆదాయానికి 72 రెట్ల వరకూ పాలసీని అందిస్తుంటాయి. కొన్ని వార్షికాదాయానికి 5 రెట్ల వరకూ విలువైన పాలసీని ఇస్తున్నాయి. కొన్ని సంస్థలు గరిష్ఠంగా రూ.25 కోట్ల వరకూ పాలసీని తీసుకునే అవకాశాన్ని కల్పిస్తున్నాయి. ఇప్పుడు చాలా బీమా సంస్థలు నిర్ణీత మొత్తాన్ని ముందే నిర్ణయించి అందిస్తున్నాయి. రూ.5 లక్షల నుంచీ తీసుకునే వెసులుబాటు ఉన్నా.. కనీసం రూ.50 లక్షలు లేదా రూ.కోటి పాలసీని ఎంచుకోవడం మంచిది.

ఏయే సందర్భాల్లో..

- ✦ ప్రమాదంలో మరణించినప్పుడు పాలసీ విలువ మేరకు
- ✦ ఒక వ్యక్తి ఆరు నెలలకు మించి కనిపించని సందర్భాల్లో పాలసీ విలువ
- ✦ ప్రమాదం బారినపడి కోమాలోకి వెళ్లినప్పుడు.. పాలసీ విలువలో సగం
- ✦ శాశ్వత వైకల్యం సంభవిస్తే పూర్తిగా
- ✦ పాక్షిక వైకల్యం బారిన పడితే.. కొన్ని వారాల పాటు కొంత మొత్తం చెల్లింపు
- ✦ అత్యవసర వైద్య ఖర్చుల కోసం రూ.50వేల వరకూ
- ✦ ఆధారపడిన పిల్లల చదువులు/తల్లిదండ్రుల సంరక్షణకు నిర్ణీత మొత్తం



siri@eenadu.net

డిజిటల్ చెల్లింపులు సురక్షితంగా

నగదు రహిత చెల్లింపు సేవలను దేశ వ్యాప్తంగా కోట్లాదిమంది వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో వినియోగదారులు ఈ డిజిటల్ చెల్లింపులపై అవగాహన పెంచుకొని, సురక్షితమైన విధానాలను పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. యూపీఐ ఆధారిత లావాదేవీలపై నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) కొన్ని చిట్కాలను సూచిస్తోంది.



▼ **తనిఖీ చేయండి:** చెల్లింపులు చేసే ముందు మీ ఫోన్ స్క్రీన్ మీద కనిపించే పేరును ఒకటికి రెండుసార్లు తనిఖీ చేసుకోవాలి. మీరు చెల్లించాలనుకున్న వ్యక్తి పేరు వచ్చిందని ధ్రువీకరించుకున్నాకే లావాదేవీ పూర్తి చేయండి. కొద్ది సెకన్ల సమయం తీసుకొని, చెల్లించడం వల్ల తప్పులు జరగవు.

▼ **సరైన యాప్‌లు:** డిజిటల్ చెల్లింపులను అధికారిక లేదా ప్రముఖ యాప్‌ల నుంచే చేయాలి. మీకు తెలియని యాప్‌ల లింకులను డౌన్‌లోడ్ చేసుకోవద్దు. వాటితో చెల్లింపులు చేయొద్దు.

▼ **ఓటీపీ:** మీ యూపీఐ పిన్, ఓటీపీ లేదా బ్యాంకు వివరాలు గోప్యంగా ఉంచుకోవాలి. ఎవరికీ చెప్పొద్దు. బ్యాంకు నుంచి లేదా ప్రభుత్వ అధికారులం అంటూ వచ్చే ఫోన్లు మోసపూరితం. ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మొద్దు.

▼ **సందేశాలు చూడండి:** మీరు చేసిన ప్రతి చెల్లింపు వివరాలూ మీ ఫోన్‌కు సందేశం వచ్చేలా ఏర్పాటు చేసుకోండి. ప్రతి అలర్ట్‌నూ జాగ్రత్తగా చదవండి. తేడా వస్తే బ్యాంకును లేదా పేమెంట్ యాప్‌ను సంప్రదించండి.

అన్ని రకాలైన సాధనాల్లో

ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ నుంచి ఫ్రాంక్లిన్ ఇండియా మల్టీ అసెట్ అలకేషన్ ఫండ్ అందుబాటులోకి వచ్చింది. ఎన్‌ఎఫ్‌ఓ చివరి తేదీ ఈ నెల 25. కనీస పెట్టుబడి రూ.5,000. ఈ పథకం కింద సమీకరించిన నిధులను ఈక్విటీ, రుణ పత్రాలు, బంగారం, వెండిలో మదుపు చేస్తారు. ఈక్విటీకి కేటాయించిన నిధుల కోసం లార్జ్, మిడ్, స్మాల్ క్యాప్ తరగతులకు చెందిన అన్ని కంపెనీలను పరిగణనలోకి తీసుకుంటారు. ఈక్విటీ పెట్టుబడుల కోసం ప్రధానంగా బాటమ్-అప్ క్యూజీఎస్‌వీ ఫ్రేమ్‌వర్క్ (క్వాలిటీ, గ్రోత్, సస్టైనబిలిటీ, వాల్యుయేషన్) విధానాన్ని అనుసరిస్తుంది. నిఫ్టీ 500 సూచీ 65 శాతం, నిఫ్టీ షార్ట్ డ్యూరేషన్ ఇండెక్స్ ఫండ్ 20 శాతం, దేశీయ మార్కెట్లో బంగారం-వెండి ధరలు 5 శాతం, ఐకామ్‌డెక్స్ కాంపోజిట్ ఇండెక్స్ 5 శాతం ఈ పథకం పనితీరుకు కొలమానంగా ఉంటాయి.

'మొమెంటమ్'పై ఆసక్తి ఉంటే

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ యాక్టివ్ మొమెంటమ్ ఫండ్ అనే పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకం ఎన్‌ఎఫ్‌ఓ ముగింపు తేదీ ఈ నెల 22. కనీసం రూ.5,000 పెట్టుబడి పెట్టాలి. 'మొమెంటమ్ థీమ్' అనుసరించే మ్యూచువల్ ఫండ్ పథకం ఇది. దీనికి నిఫ్టీ 500 టీఆర్‌ఐ సూచీ కొలమానంగా ఉంటుంది. దీనికి ఫలానా రంగానికి చెందిన కంపెనీల్లోనే పెట్టుబడి పెట్టాలనే పరిమితి ఏమీ ఉండదు. ఎక్కడ 'మొమెంటమ్' కనిపిస్తే, అక్కడ పెట్టుబడి పెట్టే అవకాశం ఉంటుంది. అది లార్జ్‌క్యాప్ అయినా మిడ్, స్మాల్ క్యాప్ షేర్ అయినా పెట్టుబడి పెట్టొచ్చు.



రిఫండు కోసం తప్పులు చేయొద్దు

ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేస్తున్నారా? రిఫండు రావాలనే లక్ష్యంతో తప్పుడు సమాచారం ఇవ్వొద్దని ఆదాయపు పన్ను శాఖ హెచ్చరిస్తోంది. ఆదాయాన్ని తక్కువ చేసి చూపడం, మినహాయింపులు లేకున్నా క్లెయిం చేయడంలాంటివి నేరాలని పేర్కొంది. జరిమానా, కొన్నిసార్లు జైలు శిక్షలాంటివీ ఉంటాయని తెలిపింది. ఈ నేపథ్యంలో ఐటీఆర్ సమర్పిస్తున్న వారు కాస్త జాగ్రత్తగా ఉండటం తప్పనిసరి.

గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఆర్జించిన ఆదాయానికిగాను ప్రస్తుత మదింపు సంవత్సరం (2025-26)లో రిటర్నులు దాఖలు చేసే సమయం ఇది. గడువు తేదీ సెప్టెంబరు 15 వరకూ ఉంది. పరిమితికి మించి ఆదాయం ఉన్న వారు కొత్త, పాత పద్ధతుల్లో తమకు ప్రయోజనం కలిగించే విధానాన్ని ఎంచుకొని, రిటర్నులు సమర్పించే వీలుంది. ఇక్కడే కొంతమంది తప్పుడు క్లెయింలకు పాల్పడుతున్నారు.

బోగస్ క్లెయిం అంటే..

పన్ను చెల్లింపుదారులు తమ ఆదాయాన్ని తక్కువగా నివేదించడం, వివిధ సెక్షన్ల కింద పెట్టుబడులు, ఖర్చులను నమోదు చేయడంలాంటివి మోసపూరిత చర్యల కిందకు వస్తాయి. ఉదాహరణకు ఒక వ్యక్తి పాత పన్ను విధానంలో పన్ను రిటర్నులు దాఖలు చేయాలని నిర్ణయించుకున్నారు. వాస్తవంగా అతనికి సెక్షన్ 80సీ కింద రూ.50వేల వరకే మినహాయింపులున్నాయి. కానీ, రూ.1,50,000 క్లెయిం చేసుకునే ప్రయత్నం చేశారు. మరోవైపు సెక్షన్ 80డీ కింద మెడికల్ పాలసీ లేకపోయినా.. రూ.25,000 ప్రీమియం చెల్లించినట్లు దాఖలు చేశారు. వీటివల్ల రిఫండు వచ్చేందుకు అవకాశం ఉంది. కానీ, ఆదాయపు పన్ను శాఖ ప్రతి పెట్టుబడి, ఖర్చుకూ ఆధారాలు ఉండాలని చెబుతోంది. పేర్కొన్న ఆధారాలు తప్పు అని తెలిస్తే.. నోటీసులు అందుకోవాల్సి వస్తుంది.

ఆధారాలు ఉండాలి..

పాత పన్ను విధానంలో క్లెయిం చేసిన ప్రతి మినహాయింపును తగిన ఆధారాలతో ధ్రువీకరించాలి. నోటీసులు వస్తే సంబంధిత పత్రాలను పన్ను అధికారులకు సమర్పించాల్సి వస్తుంది. ఇప్పటికే రిఫండు వచ్చింది కదా.. ఇబ్బందేమీ లేదు అని అనుకోవడానికి వీల్లేదు.

- ◆ ముఖ్యంగా విరాళాలకు సంబంధించి సెక్షన్ 80జీ, సెక్షన్ 80జీజీసీలను చాలామంది క్లెయిం చేస్తున్నట్లు ఐటీ విభాగం గుర్తించింది. మీరు ఇవ్వని విరాళాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ క్లెయిం చేసుకోవద్దు.

ఏం చేయాలి?

- ◆ మీ ఆదాయం, మినహాయింపులు నివేదించేప్పుడు సరైన సమాచారాన్ని నమోదు చేయండి.
- ◆ రిఫండులు ఇప్పిస్తామని చెప్పే వారి మాటలు నమ్మొద్దు.
- ◆ ఆదాయపు పన్ను శాఖ కృత్రిమ మేధ (ఏఐ)లాంటి అధునాతన సాంకేతికతలను వాడి, సమాచారాన్ని విశ్లేషిస్తోంది. కాబట్టి, ఎక్కడ పొరపాటు ఉన్నా తెలుసుకోగలదు.
- ◆ ఆదాయపు పన్ను శాఖ నుంచి వచ్చిన నోటీసులకు సకాలంలో స్పందించండి.
- ◆ అనుమానాలున్నప్పుడు పన్ను నిపుణుల సహాయం తీసుకోవడం మంచిది.

గృహరుణం టాపప్ తీసుకోండి



అత్యవసరంలో దీర్ఘకాలిక వ్యవధికి రుణం కావాలా? మీకు ఇప్పటికే గృహరుణం ఉందా? అయితే మీకు ఇబ్బంది లేనట్లే. ఈ అప్పుపైనే టాపప్ తీసుకునే వీలుంది. కొత్తగా మరో ఆస్తిని తాకట్టు పెట్టాల్సిన అవసరం లేకుండానే సులువుగా రుణం తీసుకునే మార్గం ఇది.

ఓవర్‌డ్రాఫ్ట్: మీకు అప్పుడప్పుడూ డబ్బు అవసరం అనుకుంటే.. ఒకేసారి రుణం తీసుకోవడం వల్ల ఫలితం ఉండదు. టాపప్‌లోనే ఉండే ఓవర్‌డ్రాఫ్ట్ సౌకర్యాన్ని ఇందుకోసం ఉపయోగించుకోవచ్చు. కొన్ని బ్యాంకులు గృహరుణం టాపప్‌పైనా ఓవర్‌డ్రాఫ్ట్ సౌకర్యాన్ని అందిస్తున్నాయి. దీనికి వర్తించే వడ్డీ గృహరుణం కన్నా కాస్త అధికంగానూ, వ్యక్తిగత రుణం కన్నా తక్కువగానూ ఉంటుంది. అదే సమయంలో దీర్ఘకాలం వరకూ అవసరమైనప్పుడు మాత్రమే డబ్బును తీసుకునే ప్రయోజనమూ కల్పిస్తుంది. కాబట్టి, ఓవర్ డ్రాఫ్ట్ సౌకర్యంతో వచ్చే టాపప్ హోంలోన్ మేలు.

వ్యవధి ఎక్కువ: వ్యక్తిగత రుణం, బంగారంపై అప్పులాంటివి తీసుకున్నప్పుడు ఆయా రుణాలను బట్టి, 1-5 ఏళ్ల దాకా వ్యవధి ఉంటుంది. టాపప్ రుణాల విషయంలో ఇది కాస్త భిన్నంగా ఉంటుంది. ఇంటి అప్పు వ్యవధికి ఇది అనుసంధానం అవుతుంది. ఉదాహరణకు గృహరుణ వ్యవధి 20 ఏళ్లుంటే.. టాపప్ రుణానికీ 20 ఏళ్ల వ్యవధి వర్తిస్తుంది. దీనివల్ల దీర్ఘకాలంలో అప్పు తీర్చే వెసులుబాటు ఉంటుంది. బ్యాంకు నిబంధనలను బట్టి, అది ఆధారపడి ఉంటుంది.

సులువుగా: ఇప్పటికే రుణగ్రహీతకు సంబంధించిన అన్ని వివరాలూ బ్యాంకు దగ్గర ఉంటాయి. రుణ వాయిదాలను ఎలా చెల్లిస్తున్నారనేదీ తెలుస్తుంది. రుణగ్రహీత వాయిదాలన్నీ సరిగ్గా చెల్లించిన వివరాలు, ఆదాయం ధ్రువీకరణ, ఇతర కొన్ని పత్రాలు అందిస్తే చాలు. టాపప్ రుణం ఎంతివ్వాలన్నది ఆదాయం, గృహరుణం మొత్తం, తనఖా పెట్టిన ఆస్తి మార్కెట్ విలువ తదితరాలను బట్టి, ఆధారపడి ఉంటుంది.

తక్కువ వడ్డీ రేటు: సాధారణంగా టాపప్ రుణాలపై వడ్డీ రేట్లు గృహరుణం వడ్డీ రేటుకు సమానంగా ఉంటాయి. కాబట్టి, ఇప్పుడున్న పరిస్థితుల్లో తక్కువ వడ్డీ రేటుకే లభిస్తున్న రుణాలుగా వీటిని చెప్పొచ్చు.

ఇప్పుడు కొన్ని బ్యాంకులు/రుణ సంస్థలు టాపప్ రుణాలను ముందుగానే మంజూరు చేస్తున్నాయి. అధిక వడ్డీకి అప్పులు తీసుకునే బదులు.. డబ్బు అవసరం ఉన్నప్పుడు హోంలోన్ టాపప్‌ను పరిశీలించడమే మేలు.

పెట్టుబడి.. సంపాదనలో 25 శాతం

నాకు ఇద్దరు అమ్మాయిలు. ఇద్దరి పేరుమీదా సుకన్య సమృద్ధి యోజన ఖాతాలను ప్రారంభించాను. దీంతోపాటు పెద్దమ్మాయి పేరుమీద ఏడాదికి రూ.25వేల ప్రీమియంతో పాలసీలు తీసుకున్నాను. ఇప్పుడు చిన్నమ్మాయి పేరుమీదా ఇలాంటి పాలసీ తీసుకోవచ్చా? ప్రణాళిక ఎలా ఉండాలి? - శ్యామ్



■ ప్రస్తుతం మధ్య తరగతి వర్గాల ఆదాయంలో అధిక భాగం పిల్లల చదువులకే వెళ్తోంది. విద్యా ద్రవ్యోల్బణం దాదాపు 10 శాతం పైనే ఉంటోంది. కాబట్టి, పెట్టే పెట్టుబడులు దీనికి మించి రాబడినిచ్చేలా చూసుకోవడం తప్పనిసరి. లేదంటే భవిష్యత్తులో ఇబ్బందులు రావొచ్చు. సుకన్య సమృద్ధి యోజనలో పెట్టుబడి మంచిదే. ఇది సురక్షితమైన పథకం. మీ పెద్దమ్మాయి పేరుమీద ఏడాదికి రూ.25వేల ప్రీమియంతో బీమా పాలసీ తీసుకున్నా అంటున్నారు. ఇది సంప్రదాయ పాలసీ అయితే, దీనివల్ల పెద్దగా రాబడి ఉండదు. ముందుగా మీ పేరుపై తగిన మొత్తానికి జీవిత బీమా తీసుకోండి. మీరు మదుపు చేయాలనుకుంటున్న మొత్తాన్ని డైవర్సిఫైడ్ ఈక్విటీ ఫండ్లకు మళ్లించండి. మీ సంపాదనలో కనీసం 25 శాతం పెట్టుబడులకు వెళ్లాలి. ఏటా 10 శాతం చొప్పున మదుపు పెరగాలి.

మేమిద్దరమూ ప్రభుత్వ ఉద్యోగులం. నా పేరు మీద రూ.కోటి టర్మ్ పాలసీ ఉంది. ఆరోగ్య బీమా తీసుకున్నాం. మాకు అయిదేళ్ల బాబు, ఏడాది అమ్మాయి ఉన్నారు. వీరి కోసం నెలకు రూ.20,000 వరకూ ఈక్విటీ ఫండ్లలో పెట్టుబడులు పెడుతున్నాం. దీంతోపాటు రూ.4వేలను సుకన్య సమృద్ధిలో, రూ.4వేలను పీపీఎఫ్‌లో జమ చేస్తున్నాం. ఈ మొత్తం సరిపోతుందా? లేకపోతే ఇంకా పెంచాలా? - ప్రేమ్

■ పిల్లల చదువులకు ఎంత మొత్తం సరిపోతుందని అంచనా వేయడం చాలా కష్టం. వారు ఏ కోర్సులు ఎంచుకుంటారనే విషయంపై ఇది ఆధారపడి ఉంటుంది. కొన్ని కోర్సులకు రూ.15లక్షలు సరిపోతే.. కొన్నింటికి రూ.కోట్లలోనే అవసరం. మీరు మొత్తం రూ.28వేలు పెట్టుబడి పెడుతున్నారు. పిల్లల అవసరాలతో పాటు, మీ పదవీ విరమణ ప్రణాళికలనూ వేసుకోండి. వీలైనప్పుడల్లా పెట్టుబడులను పెంచుకునే ప్రయత్నం చేయండి. మీరు ప్రస్తుతం పెట్టుబడి పెడుతున్న నెలకు రూ.28వేలు 18 ఏళ్ల తర్వాత సగటున 12 శాతం వార్షిక రాబడి అంచనాతో.. రూ.1,87,31,904 అయ్యేందుకు అవకాశం ఉంది. అప్పటి అవసరాలకు ఇది సరిపోకపోవచ్చు. కాబట్టి, వీలైనంత వరకూ పెట్టుబడులు పెంచుకునే ప్రయత్నం చేయండి.

నేను సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని. వయసు 24. నాకు నెలకు రూ.25వేల వరకూ వస్తున్నాయి. నేను ఆర్థికంగా ఉన్నత స్థానంలోకి చేరాలనుకుంటున్నాను. ఎలాంటి పెట్టుబడులు పెట్టాలి? ఆరోగ్య, జీవిత బీమా పాలసీలు ఎంత వరకూ తీసుకోవాలి? క్రెడిట్ కార్డుల్లాంటివి తీసుకుంటే మంచిదేనా? - రుబెన్

■ చిన్న వయసులోనే ఆర్థికంగా ఉన్నత స్థానంలోకి రావాలనే మీ ఆలోచన ఆలోచన అభినందనీయం. మీ కోరిక తప్పకుండా ఫలిస్తుంది. కావాల్సిందల్లా అంకిత భావం, లక్ష్యంపై స్పష్టత, క్రమశిక్షణ. దీంతోపాటు మీ ఉద్యోగంపైనా దృష్టి పెట్టండి. ఆదాయం పెంచుకునే ప్రయత్నం చేయాలి. ముందుగా మీరు రూ.50లక్షల టర్మ్ ఇన్సూరెన్స్ తీసుకోండి. మీ తల్లిదండ్రులకు, మీకూ ఒక ఆరోగ్య బీమా పాలసీ ఉండాలి. రూ.25లక్షల వ్యక్తిగత ప్రమాద బీమా తీసుకోండి. క్రెడిట్ కార్డులను తీసుకోవడం వల్ల ఇబ్బందేమీ లేదు కానీ, వాటిని అత్యంత జాగ్రత్తగా వాడితేనే ప్రయోజనం. చాలా మంది క్రెడిట్ కార్డులను కోరికల కోసమే వాడుతుంటారు. ఇది పొరపాటు. వీలైనంత వరకూ మీ సొంత డబ్బునే ఖర్చు చేయండి. ఆరు నెలలకు సరిపోయే అత్యవసర నిధిని దాచి పెట్టుకోండి. మీ సంపాదనలో కనీసం 20 శాతాన్ని హైబ్రిడ్ ఈక్విటీ ఫండ్లలో మదుపు చేయండి.

– తుమ్మ బాల్‌రాజ్, సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్

(ఆర్థిక విషయాల్లో మీకున్న సందేహాలను siri@eenadu.netకు మెయిల్ చేయండి.)

పెట్టుబడులూ ఓ సుదీర్ఘ ప్రయాణమే

ఏ మ్యూచువల్ ఫండ్ పథకంలో మదుపు చేయాలి? పెట్టుబడి గురించి ఆలోచించించడం ప్రారంభించగానే ప్రతి ఒక్కరి మనసులో ఇదే ప్రశ్న. ఈ సందేహానికి సమాధానం తేలికే. ప్రతి ప్రయాణానికీ ఒక గమ్యం ఉంటుంది. ఇదే విధంగా ఫండ్ల పెట్టుబడులకూ ఒక లక్ష్యం ఉండాలి. మనం ఏం సాధించాలనే విషయంలో స్పష్టత ఉంటే.. ఎలా ముందుకెళ్లాలన్నది తెలుసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు.



నేను మదుపు చేయాలి.. ఇలా ఆలోచిస్తూ ఉంటేనే సరిపోదు. ఏదో ఒక విధంగా దాన్ని ప్రారంభించాలి. మ్యూచువల్ ఫండ్లలో ఉన్న అవకాశాలేమిటో తెలుసా? నెలనెలా క్రమానుగత విధానంలో (సిప్) రూ.500లతోనూ పెట్టుబడిని ప్రారంభించవచ్చు. పెట్టుబడి రూ.500లైనా.. రూ.5లక్షలైనా.. ఇక్కడ గుర్తుంచుకోవాల్సింది ఏమిటంటే.. దాన్ని ఎంత స్థిరంగా కొనసాగిస్తున్నామన్నదే ప్రధానం. ఇక్కడే మ్యూచువల్ ఫండ్లతో ఏం సాధించాలనే అవగాహన వస్తుంది. ప్రతి ఆర్థిక లక్ష్యానికీ ఒక నిర్ణీత సమయం పెట్టుకోవాలి. అప్పుడే పెట్టుబడులతో సరైన దిశలో ప్రయాణం చేస్తున్నారా? లేదా? అర్థమవుతుంది.

ఎంత దూరం

మనలో చాలామంది ఆర్థిక లక్ష్యాలు దాదాపుగా ఒకేలా ఉంటాయి. వాటిని సాధించేందుకు ఉన్న సమయం, ఎంచుకుంటున్న మార్గం మాత్రం భిన్నంగా ఉంటాయి. ప్రతి లక్ష్యానికీ ఒక్కో రకం మ్యూచువల్ ఫండ్‌లో మదుపు చేయాల్సి ఉంటుంది. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లు.. పదవీ విరమణలాంటి దీర్ఘకాలిక లక్ష్యాలను సాధించేందుకు ఉపయోగపడతాయి. స్వల్పకాలిక లక్ష్యాల కోసం లిక్విడ్ ఫండ్లు ఎంచుకోవాలి.

మధ్యకాలిక లక్ష్యాలను సాధించేందుకు అంటే.. ఇల్లు కారు కొనడం అందుకు అవసరమైన మార్జిన్ మనీని కూడబెట్టేందుకు ఫిక్స్‌డ్ ఇన్‌కం ఫండ్లు ఎంచుకోవచ్చు. సాధారణంగా ఇవి కార్పొరేట్ బాండ్లు, ప్రభుత్వ బాండ్లు, డిబెంచర్లలో మదుపు చేస్తుంటాయి. ఫిక్స్‌డ్ డిపాజిట్లతో పోలిస్తే ఇవి కాస్త ఆసక్తికరంగానే ఉంటాయి.

వ్యవధి చూసుకోండి..

మనం ఎంత దూరం వెళ్లాలనుకుంటున్నామన్న దాన్నిబట్టి, ఆ ప్రయాణానికి ఎంత సమయం పడుతుందన్నది తెలుసుకోవచ్చు. 5-7 ఏళ్ల వ్యవధి ఉన్నప్పుడు మ్యూచువల్ ఫండ్లలో మంచి లాభాలను ఆర్జించేందుకు అవకాశం ఉంటుంది. మనం తరచూ వార్తల్లో వింటుంటాం.. ఒక్క రోజులో మదుపరుల సంపద కొన్ని కోట్ల రూపాయలు ఆవిరి అంటూ.. నిజానికి ఒక్క రోజు, ఒక్క నెల అనేది మార్కెట్లో పరిగణనలోకి తీసుకునేందుకు ఏమాత్రం పనికిరాదు. 20 ఏళ్ల చరిత్రలో ఇచ్చిన లాభాలతో పోలిస్తే ఇది లెక్కలోకి తీసుకోవాల్సిన అంశంగానూ తోచదు. ఎందుకంటే.. మార్కెట్‌ను ఎప్పుడూ స్వల్పకాలిక దృష్టితో చూడకూడదు. చిన్న చిన్న ఇబ్బందులు వచ్చాయని ప్రయాణాన్ని ఆపుతామా... ఫండ్లలో పెట్టుబడికీ ఇదే సూత్రం వర్తిస్తుంది.

ఒకవేళ మీకు నష్టభయం భరించే శక్తి కాస్త అధికంగా ఉంటే.. అప్పుడు అగ్రెసివ్ హైబ్రిడ్ ఫండ్లను పరిశీలించండి. ఇవి ఈక్విటీ, డెట్ రెండింటిలోనూ పరిస్థితులకు అనుగుణంగా మదుపు చేస్తాయి. 5 ఏళ్లలో ఇవి దాదాపు 8.4-9.5 శాతం వరకూ రాబడినిచ్చే అవకాశం ఉంటుంది. ఇవి దీర్ఘకాలంలో స్థిరంగా పెట్టుబడి వృద్ధికి అవకాశం కల్పిస్తాయి.

ఇక దీర్ఘకాలిక పెట్టుబడులు అంటే.. పిల్లల ఉన్నత చదువులు, వారి పెళ్లి, పదవీ విరమణ ప్రణాళికల కోసం ఈక్విటీ ఆధారిత ఫండ్లను ఎంచుకోవడమే మార్గం.

ఏ విభాగంలో ఎంత శాతం మదుపు చేయాలన్నది ఒక వ్యక్తి వయసును బట్టి ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు ఈక్విటీ, డెట్ నిష్పత్తి 50:50 ఉందనకుందాం. 60 ఏళ్ల వయసు వచ్చే నాటికి ఇది 20:80 ఉండేలా చూసుకోవాలి. మార్కెట్లో ఉండే హెచ్చుతగ్గుల వల్ల పెట్టుబడికి నష్టం రాకుండా కాపాడుకోవచ్చు. మీ దగ్గర ఉన్న మొత్తాన్ని బట్టి, ఆయా నిష్పత్తిలో ఈక్విటీ, డెట్‌లకు మళ్లించడం ద్వారా నష్టభయాన్ని తగ్గించుకోవచ్చు.

పెంచుతూ వెళ్లండి..

చిన్న మొత్తం అంటే. రూ.500లతోనూ నెలనెలా ఫండ్లలో మదుపు ప్రారంభించే అవకాశం ఉంది. వాహనం నడిపేటప్పుడు ప్రారంభంలో మొదటి గేరునే వాడుతాం. అంతమాత్రాన ఎప్పుడూ అదే గేరులో వెళ్లం కదా.. పెట్టుబడుల తీరూ అంతే. మీ ఆదాయం పెరిగినప్పుడల్లా.. ఆ మేరకు సిప్ మొత్తాన్నీ పెంచాలి. మీరు నెలకు రూ.5,000 చొప్పున 20 ఏళ్లపాటు మదుపు చేస్తే 12 శాతం రాబడి అంచనాతో.. రూ.49.9 లక్షల వరకూ సమకూరుతాయి. దీనికి బదులు ఏడాదికోసారి 10 శాతం పెట్టుబడి పెంచారనుకుందాం. అప్పుడు 20 ఏళ్ల తర్వాత దాదాపు 99.4 లక్షల వరకూ జమ అవుతాయి.

నష్టభయం ఎంత?

దీర్ఘకాలంలో మీ పెట్టుబడి ప్రయాణం ఎలాంటి ఇబ్బందులకూ లోనుకాకుండా మ్యూచువల్ ఫండ్లు తోడ్పడతాయి. అయితే, నష్టం వచ్చే సందర్భాలనూ ఒకసారి గమనించాలి. ముఖ్యంగా మీ నష్టభయం భరించే సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. మీ వయసు, ఆదాయం, ఆర్థిక బాధ్యతలను చూడాలి. యువకులుగా ఉన్నప్పుడు 80-90 శాతం వరకూ ఈక్విటీ ఫండ్లలో మదుపు చేయొచ్చు. 35-40 ఏళ్ల వయసుకు వచ్చే సరికి 50 శాతమే ఈక్విటీల్లో మదుపు చేయాలి. ఈక్విటీ ఫండ్లలో మదుపు చేసేటప్పుడూ70 శాతం వరకూ డైవర్సిఫైడ్ ఫండ్లలో మదుపు చేయడం ద్వారా నష్టభయాన్ని పరిమితం చేసుకోవచ్చు.



చీరంటే ఏ అమ్మాయికైనా ఆరో ప్రాణమే! ఎన్ని ఫ్యాషన్లు రానీ... ఎన్ని కొత్త వస్త్రాలు దూసుకురానీ... అమ్మాయి మనసు దానివైపే లాగుతుంది. ప్రత్యేక సందర్భాలంటే పట్టుకే ఆమె ఓటు. దీనికి తగ్గట్టే మనకి ఎన్నెన్ని నేతరకాలు అందుబాటులో ఉన్నాయో! తాజాగా ఆ చీరకి జాతీయస్థాయిలో గుర్తింపు వచ్చింది. 'వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్' అవార్డుల్లో భాగంగా వెంకటగిరి, కుప్పడం చీరలు స్వర్ణాలు దక్కించుకుంటే ధర్మవరం పట్టు రజతాన్నీ, పెద్దాపురం పట్టు కాంస్యాన్నీ గెలుచుకున్నాయి. వాటి ప్రత్యేకతలేంటో ఓసారి చూసేయండి.

తెలుగింటి నేతకు... పురస్కారాల పంట!

నిజాం గుర్తించిన కుప్పడం



క్లిష్టమైన నేత, సున్నితమైన మోటిఫ్‌లు, లగ్జరీలుక్... కుప్పడం చీరల ప్రత్యేకత. ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా దీనికి పుట్టిల్లు. చీరాల సిల్క్, సీకో చీరలుగానూ పిలుస్తారు. మిగతా నేతలతో పోలిస్తే కుప్పడం ప్రత్యేకంగా ఉంటుంది. ఈ చీరల అంచు 18 అంగుళాలు ఉంటుందట. వీటిని సిల్క్, కాటన్ దారాల మేళవింపుతో సంప్రదాయ మోటిఫ్‌లతో తీర్చిదిద్దుతారు. ఇంటర్ లాకింగ్ పద్ధతిలో నేయడం వల్ల ఈ చీరలు తేలికగా ఉంటాయి. కాంట్రాస్ట్ కలర్లు, వివిధ షేడ్‌లతో తీర్చిదిద్దడం వల్ల ఆధునికత అద్దుకున్నట్లుగా కనిపిస్తాయి. వీటికి నిజాం కాలంలోనే గుర్తింపు దక్కింది. జాతీయోద్యమ సమయంలో గాంధీ ఇచ్చిన పిలుపును అనుసరిస్తూ చీరాల ప్రజలు విదేశీ వస్త్రాలను బహిష్కరించడమే కాదు, స్వయంగా నేసి మరీ ప్రజలకు వస్త్రాలను అందుబాటులోకి తెచ్చారట.

రాణులు మెచ్చిన వెంకటగిరి

చకాచకా కట్టేసుకోవాలి, శరీరానికి హాయిని వ్వాలి... ఇలా కోరుకునే చాలామంది మహిళల ఎంపిక వెంకటగిరి చీరలే. తిరుపతి జిల్లాకు ప్రత్యేకమైన వీటి ఉనికి 17వ శతాబ్దం నాటిదట. వెలుగోడు, బొబ్బిలి, పిఠాపురం రాజుల ఆధ్వ ర్యంలో ఈ నేతకు ఆదరణ ఉండేదని చెబుతారు. తయారైన ప్రాంతం 'వెంకటగిరి' ఆధారంగానే ఈ చీరలకు పేరొచ్చింది. నిజానికి వీటిని తొలిరోజుల్లో రాణుల కోసమే నేసేవారట. గోల్కొండ నవాబులూ వీటిపై మనసు పారేసుకున్నారని చెబుతారు చరిత్రకారులు. వీటి ప్రత్యేకత జాందానీ తరహా నేతే! పత్తిదారాలకు వెండి, బంగారు జరీలను మేళవిస్తూ నేస్తారు. చుక్కలు, ఆకులు, మామిడి పిందెలు, కలువలు, నెమళ్లు, చిలుకలు, జామెట్రికల్ ప్యాటర్న్‌లు కొంగుపై కనిపిస్తుంటాయి. తక్కువ బరువు, మృదువుగా ఉండటం, ఏ కాలానికైనా అనువుగా ఉండటం... మగువలు వీటిపై మనసు పారేసుకోవడానికి కారణమవుతున్నాయి. అన్నింటికంటే కట్టుకున్నవారికి రాయల్ లుక్‌ని తెచ్చిపెడతాయి. వీవ్ కౌంట్, బ్లెండ్ చేసిన విధానాన్ని బట్టి వీటిని భిన్న రకాలుగా విభజిస్తారు కూడా. ఈ చీరలకు భౌగోళిక గుర్తింపూ దక్కింది.



పెళ్లంటే ధర్మవరం వైపే!



ఒకప్పుడు పెళ్లి, వేడుకలంటే చీరల కోసం ధర్మవరం ప్రయాణం కట్టేవారట. ఇప్పటికీ దేశంలో పట్టుచీరలంటే ముందు వరసలో ఉండేవాటిల్లో సత్యసాయి జిల్లాకు మకుటమైన ధర్మవరం చీర తప్పక ఉంటుంది. దేశీయంగానే కాదు, విదేశాల్లోనూ దీనికి ఆదరణ ఎక్కువే. 19వ శతాబ్దం నుంచీ ఇవి తయారవుతున్నాయంటారు చరిత్రకారులు. తొలిరోజుల్లో దేవాలయ నాట్యకారిణులు, రాజకుటుంబీకుల కోసమే తయారుచేసేవారట. అప్పుడు పసుపు, ఎరుపు రంగుల్లోనే తయారయ్యేవి. తరవాత కాలానికి తగ్గట్టుగా ఎన్నో మార్పులు వచ్చాయి. మల్బరీ సిల్క్ నుంచే తయారయ్యే దీనికీ కంచిపట్టుకీ దగ్గర పోలికలుంటాయి. కానీ రంగులు, డబుల్ షేడ్ ధర్మవరం చీరలను ప్రత్యేకంగా నిలుపుతాయి. సింగిల్ థ్రెడ్, డబుల్ థ్రెడ్, వెండి, బంగారు జరీ చీరలు, జకాడ్ డిజైన్లతో సిద్ధమవుతుంటాయి. రూ.10లక్షల వరకూ ఖరీదైనవీ దొరుకుతాయి. ఈ చీరలు, పట్టుపావడాలకు భౌగోళిక గుర్తింపూ దక్కింది.

పెద్దాపురం... స్వదేశీ పట్టు

కాకినాడ జిల్లాలోని పెద్దాపురం పట్టుదీ ఏళ్ల చరిత్ర. ఒకప్పుడు ఈ చీరల్ని బంగారంతో సమానంగా భావించేవారట. ముడిసరకును బెంగళూరు నుంచి తెప్పించుకుని, శుభ్రం చేసి, రంగులద్ది చీరలుగా నేసేవారు. పెద్దాపురం అనగానే చాలా మంది ఉప్పాడ పట్టు అనుకుంటారు కానీ, రెండింటికీ చాలా వ్యత్యాసం ఉంటుందంటారు నేతకారులు. ఈ చీరల్ని చేత్తో తాకితే చాలు ఎవరైనా వాటితో ప్రేమలో పడతారట. అంత మృదువుగా ఉంటాయివి. ఏరికోరి పెద్దాపురం పట్టే కావాలని పెళ్లిళ్లకు తెప్పించుకునే వధువులుండేవారట. విదేశీ వస్త్ర బహిష్కరణలో ఈ ఊరి ప్రజలూ పాల్గొన్నారు. అప్పుడు ఈ ప్రాంతాన్ని సందర్శించిన గాంధీజీ ఈ పట్టుకు 'స్వదేశీ పట్టు' అని నామకరణం చేశారట. స్వచ్ఛమైన సిల్క్ దారాలు, మెరిసే అందంతో ఆకట్టుకునేలా ఉంటాయీ చీరలు. సంప్రదాయ మోటిఫ్‌లు వీటికి ప్రత్యేక ఆకర్షణ.



వసుంధర

vasundhara@eenadu.in

ప్రభుత్వ శాఖలో... మహిళా డ్రైవర్!

అందరూ నడిచే దారిలో నడవాలి అనుకోవట్లేదు నేటి మహిళలు. ఆసక్తినే కెరియర్‌గా మలుచుకుంటున్నారు. తమకంటూ ఓ గుర్తింపును తెచ్చుకుంటున్నారు. అలాంటి కోవకే చెందుతారు సంధ్యారాణి మాఝీ! ఒడిశా ప్రభుత్వ శాఖలో డ్రైవర్‌గా చేరడమే కాదు... ఆ ఘనత సాధించిన తొలి మహిళగానూ నిలిచారు.


సంధ్యారాణి

బస్సులో ప్రయాణిస్తూ వచ్చిపోయే వాహనాలు, ప్రకృతిని గమనిస్తుంటారంతా. సంధ్య మాత్రం అందుకు భిన్నం. డ్రైవర్ స్టీరింగ్ నడిపేతీరు, ఎక్కడ వేగం తగ్గిస్తున్నారు... ఇలాంటివి గమనించేవారట. ఈమెది ఒడిశాలోని కెందుఝార్. నాన్న ఎలక్ట్రికల్ టెక్నీషియన్, అమ్మ గృహిణి. ఆ ఆసక్తితోనే ఇంట్లో తెలియకుండా బైక్‌నీ నేర్చుకున్నారామె. చదువయ్యాక మేకప్ ఆర్టిస్ట్‌గా మారారు. పెళ్లయ్యాక ఆమె ఆసక్తిపై దృష్టిపెట్టే అవకాశం వచ్చింది. అందుకు కారణం భర్తే. ఆయన డ్రైవర్. సంధ్య కోరిక మేరకు కారు నేర్పారాయన. అది ఆమెలో ఆత్మవిశ్వాసాన్ని నింపింది. ఆపై హెవీ మోటార్ వెహికల్స్ నడపడమూ నేర్చుకుని లైసెన్స్ పొందారు. దీంతో విదేశాల్లో ఉద్యోగావకాశం వచ్చింది. అయితే వ్యక్తిగత కారణాల రీత్యా వెళ్లలేకపోయారు. కానీ కొన్నేళ్లపాటు వివిధ ప్రైవేటు స్కూళ్లకు బస్సు డ్రైవర్‌గా సేవలందించారు. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో డ్రైవర్ల పోస్టులకు నోటిఫికేషన్ చూశారామె. ప్రయత్నించడమే కాదు, కొలువునీ సాధించారు. ఒడిశాలో ప్రభుత్వ శాఖలో ఉద్యోగం సాధించిన తొలి మహిళా డ్రైవర్‌గానూ గుర్తింపు తెచ్చుకున్నారు సంధ్య. 'బండ్లు, కార్లు నడుపుతోంటే మగరాయుడు అనేవారంతా. కానీ మా ఆయన నాకు తోడుగా నిలిచారు. నేర్పడమే కాదు, నాకో కారునీ బహుమతిగా ఇచ్చారు. అదే నా జీవితాన్ని మలుపు తిప్పింది. దానిలో స్నేహితులను దూరప్రాంతాలకు తిప్పేదాన్ని. ఆ ఆత్మవిశ్వాసంతోనే హెవీ వెహికల్స్ నడపడం నేర్చుకున్నా. ప్రభుత్వ కొలువుకీ ప్రయత్నించా'నవే సంధ్య ప్రస్తుతం ఒడిశా వాణిజ్య, రవాణా, గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి ఉషా పధీకి డ్రైవర్‌గా చేస్తున్నారు. ఈమె ప్రయాణాన్ని ఉషానే ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అలా ప్రపంచానికి పరిచయం అవ్వడమే కాదు, అందరి అభినందనలూ అందుకున్నారు సంధ్య. 'ఏం చేసినా ఎవరో ఒకరు ఏదో ఒకటి అంటూనే ఉంటారు. మనం చేయాల్సిందల్లా మనకు నచ్చిందేంటో తెలుసుకోవడం... ప్రయత్నిస్తూ సాగడమే. అప్పుడు అవకాశాలే మనల్ని వెతుక్కుంటూ వస్తాయి' అంటోన్న సంధ్యని అభినందించాల్సిందే కదూ!



పులికాట్‌ని కాపాడుతున్నారు!

ప్రకృతి... జీవకోటికి అవసరమైన ప్రాణవాయువు, ఆహారం, నీటిని అందిస్తుంది. అలాంటి ప్రకృతికి హాని తలపెడితే ఒక్కసారిగా ప్రకోపిస్తుంది కదా! అది జరగకూడదు అనుకున్నారు పులికాట్ సరస్సు తీర ప్రాంత మహిళలు. పర్యావరణ పరిరక్షణకి నడుం బిగించారు. అక్రమ వేటగాళ్ల నుంచి సరస్సును కాపాడుకుంటున్నారు.

ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల సరిహద్దులో ఉండే పులికాట్ సరస్సు దేశంలోనే రెండో అతి పెద్ద ఉప్పునీటి సరస్సు. ఇది సముద్ర తీరరేఖకు సమాంతరంగా ఉండటం వల్ల సముద్ర జీవులకు, వలస పక్షులకు ఆవాసం. అంతేకాదు, సరస్సు చుట్టూ ఉండే మత్స్యకార కుటుంబాలకు జీవనాధారం కూడా. అలాంటిది కొంత మంది అక్రమవేటగాళ్లు పర్యావరణానికి వ్యతిరేకంగా దీన్ని నాశనం చేస్తున్నారు. ఈ సరస్సులో పాలీకీట్స్ పురుగులను చట్టవిరుద్ధంగా సేకరించి, అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. వాటిని పట్టుకునేందుకు తీర ప్రాంతాల్లో గుంతలు తవ్వుతున్నారు. వీటివల్ల సరస్సు దాని ఉపరితలాన్ని కోల్పోవడమే కాకుండా, మత్స్యకారులకు ప్రమాదాలూ సంభవిస్తున్నాయి. కొందరు ప్రాణాలను కోల్పోయారు. దీనికి కొంతమేరైనా అడ్డుకట్ట వేయాలనుకున్నారు అక్కడి స్థానిక మహిళలు. ఇందుకు ప్రమాదాల్లో కుటుంబ సభ్యులను కోల్పోయిన బాధితులు, స్థానిక మత్స్యకార మహిళలు భవిష్యత్తుని కాపాడుకోవడానికి ఒక్కటయ్యారు. విడతల వారీగా తీరప్రాంతంలో గస్తీ కాస్తున్నారు. 'పాలీకీట్స్ పురుగులు తగ్గిపోతే చేపల నాణ్యత తగ్గిపోతుంది. చేపలకు, పక్షులకు ఇవి సహజంగా లభించే ఆహారం. ఇవి తగ్గిపోతే మాకు ఆదాయం ఉండదు. మేము బతకడమే కష్టం అవుతుంది. ఈ పురుగులను వేటాడటం వల్ల జీవావరణంలో వాటి ఉనికి తగ్గిపోతుంది. ఆహార గొలుసుకు అంతరాయం ఏర్పడుతుంది. జలచరాల మనుగడ కష్టం అవుతుంది' అంటున్నారు వీరంతా. పహారా కాస్తూనే ఇప్పటి వరకూ దెబ్బతిన్న తీర ప్రాంతాలను పునరుద్ధరిస్తున్నారు. ప్రమాదంలో ఉన్న పులికాట్ సరస్సునీ, వైవిధ్యమైన సముద్ర జీవులనీ కాపాడుకుంటున్నారు. ఆటుపోట్ల నుంచి తీరాన్ని కాపాడేందుకు మొక్కలు నాటి ప్రకృతికి రక్షణ కవచంలా మారుతున్నారు. అంతేకాదు, చేపల సంతానోత్పత్తికి గుంతలు తవ్వుతున్నారు. ఈ సరస్సుపై ఆధారపడి జీవించే నలభై ఊళ్లలోని మత్స్యకార కుటుంబాలు వలసలు వెళ్లకుండా అండగా నిలుస్తున్నారు.

హలో అనడం లేదట..!

మనం ఫోన్ ఎత్తితే... వెంటనే వాడే మాట హలో..! అది ఏ నెంబర్ అయినా కావొచ్చు. తెలిసినా, తెలియకపోయినా కాల్ లిఫ్ట్ చేశాక హలో అనాల్సిందే. కానీ జెన్‌జీ అమ్మాయిలు అలా అనడం లేదట. దానికి కారణం రక్షణట. 'తెలిసో తెలియకో ఉద్యోగ, వ్యాపార, విద్య సంబంధిత విషయాల్ని తెలుసుకోవడానికి ఆన్‌లైన్‌నే ఎక్కువగా ఉపయోగిస్తున్నాం. ఈ క్రమంలో కొన్ని వెబ్‌సైట్లను ఆశ్రయిస్తున్నప్పుడు నెంబర్లు ఇస్తున్నాం. సంబంధిత సైట్లలో ఏవి మంచివో, ఏవి మన సమాచారాన్ని సైబర్ నేరగాళ్లకు లీక్ చేస్తున్నాయో తెలియడం లేదు. పర్యవసానంగా రోజులో కనీసం రెండు మూడు స్పామ్ కాల్స్ అయినా ఫోనుకి వస్తున్నాయి. కొత్త టెక్నాలజీలు వాడి వాయిస్ కమాండ్‌ను రికార్డు చేసుకుంటున్నారు. వాటిని ఉపయోగించి మనకు తెలిసిన వాళ్లదగ్గర ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారు. వీటన్నింటికీ అడ్డుకట్ట వేయడానికే తెలియని నెంబర్ల నుంచి ఫోన్ వస్తే ఎత్తడం లేదు. ఒకవేళ లిఫ్ట్ చేసినా అవతలి వారు వివరాలు చెప్పేవరకూ మౌనంగా ఉంటున్నాం' అంటున్నారు జెన్‌జీ అమ్మాయిలు. దీనివల్ల మహిళల్ని లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేస్తున్నాం అంటున్నారట. ఎంతైనా జెన్‌జీ అమ్మాయిలు తెలివైన వాళ్లు కదూ! మీరూ వాళ్ల జాబితాలో చేరండి మరి..!



మహిళలు ఏ స్థానానికైనా సమర్థులైన అభ్యర్థులు. వాళ్లకు నా సలహా ఏంటంటే... ఉద్యోగిగా సంస్థలో మీ ఉనికిని చాటుకోవాలి. అభిప్రాయం చెప్పడానికీ, ఆలోచనల్ని పంచుకోవడానికీ వెనకాడొద్దు. నిర్ణయాత్మక స్థానాల్లో ఉండండి. సమస్యను పరిష్కరించడానికి ముందు నిలవండి. నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్(ఎన్ఎస్‌డీఎల్) నియామకాల్లో మహిళా ఉద్యోగులు కచ్చితంగా ఉండేట్టు చూస్తోంది. డాక్టర్స్ ఆన్ కాల్, కేంద్ర కార్యాలయంలో పూర్తిస్థాయిలో వైద్య సదుపాయాలు ఉన్నాయి. ఇవి అందరి ఉద్యోగుల కోసమూ అయినా మహిళలకు వీటితో ఎక్కువ మేలు జరుగుతోంది.



- పద్మజ చుండూరు, ఎండీ, సీయీవో, ఎన్ఎస్‌డీఎల్

బంగారం - వెండి



17న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,00,570	91,450	1,14,525
విజయవాడ	97,540	91,050	1,14,600
ప్రొద్దుటూరు	97,600	89,840	1,13,600
రాజమహేంద్రవరం	99,330	91,150	1,24,000
విశాఖపట్నం	98,970	91,050	1,20,000
తమిళనాడు	------	91,050	1,24,000

సంబంధాలు చూస్తున్నారు!

ఇంటర్ అయిపోయింది. ఇంట్లో సంబంధాలు చూస్తున్నారు. నాకేమో ఇష్టం లేదు. చెప్తే వినట్లేదు. ఇంట్లోంచి వెళ్లిపోవాలని ఉంది. ఏం చేయాలో అర్థం కావట్లేదు.

– ఓ సోదరి

ఈరోజుల్లో అంత చిన్న వయసులో పెళ్లిళ్లు చేయట్లేదు. ఆడపిల్లను చదివించాలనే అనుకుంటున్నారు. నీ విషయంలో అమ్మానాన్నలు పెళ్లి చేయాలని ఎందుకు తొందర పడుతున్నారో కారణం తెలియదు. మీ కుటుంబ పరిస్థితి, ఆర్థిక కారణాలు, తల్లిదండ్రులకు ఉన్న బాధ్యతలు, ఇతర అంశాలేమైనా కారణమేమో! నీ అభిప్రాయాన్ని చెప్పినా వాళ్లు వినట్లేదంటే ఇంకెవరి సాయమైనా తీసుకో. వాళ్లతో నచ్చజెప్పించే ప్రయత్నం చెయ్యి. మీ టీచర్లు, బంధువులు ఈ విషయంలో సాయపడతారేమో చూడు. ఏ దారీ కనిపించకపోతే అధికారుల సాయం తీసుకో. వాళ్లు మీ అమ్మానాన్నలకి కౌన్సెలింగ్ చేస్తారు. భయపడటం, పారిపోవడం నీ సమస్యకు పరిష్కారం కాదు. సానుకూలంగా ఆలోచించు. పరిష్కారం తప్పక దొరుకుతుంది.

డియర్ వసుంధర



డా. స్వాతి పైడిపాటి
మానసిక నిపుణురాలు

చులకన అవుతానని అబద్ధం చెప్పా!

గత వారం నా స్నేహితురాలి పుట్టినరోజు. జ్వరం వచ్చి రాలేకపోయానని చెప్పా. నిజానికి ఆరోజు అమ్మతో చిన్న గొడవ. తను చెయ్యి కూడా చేసుకునేసరికి బాధతో ఏడుస్తూ గదిలోనే ఉండిపోయా. ఈ విషయం చెబితే స్నేహితురాలి ముందు చులకన అవుతా అనిపించి నిజం దాచా. కానీ తనకి అబద్ధం చెప్పానే అన్న భావన మాత్రం వేధిస్తోంది. ఏం చేయను?

– ఓ సోదరి

అమ్మతో ఎవరికైనా చిన్న చిన్న గొడవలు రావడం సహజం. మీ గొడవకు కారణం తెలీదు కానీ... కొట్టింది అమ్మే కదా! దాన్ని మనసులో పెట్టుకోకుండా... దాన్నుంచి బయట పడటానికైనా నీ స్నేహితురాలి పుట్టినరోజుకు వెళ్లాల్సింది. సరే... వేడుకకు వెళ్లే ఆసక్తి లేక నీ ఫ్రెండ్‌కి జ్వరమని అబద్ధం చెప్పావు. ఇందులో మళ్లీ నువ్వు ఇంతలా బాధపడాల్సిన అవసరం ఏముంది? ప్రతి విషయాన్నీ అందరికీ విడమరిచి చెప్పలేం... అది స్నేహితులైనా! అయినా నువ్వు రాలేదని నీ స్నేహితురాలు బాధపడొద్దనేగా నీకు ఒంట్లో బాగోలేదని చెప్పావు. దీనివల్ల ఎవరికీ హాని జరగలేదు కాబట్టి పర్లేదు. ఇంకా గిల్టీగా అనిపిస్తే... నీ ఫ్రెండ్‌తో చనువు ఉందా? అయితే నిజమే చెప్పు. చెప్పడానికి ఇబ్బంది పడతాను అనిపిస్తే ఈ విషయాన్నిక వదిలేయ్. ప్రతి విషయాన్నీ మరీ ఇంత అతిగా ఆలోచించకూడదు. మనసు పాడవడం మినహా ఏమీ ఉండదు. ఇలాంటివి జీవితంలో ముందుముందు ఇంకా చూస్తావు. అన్నింటికీ ఇలా బేలగా అయిపోకుండా ఆ పరిస్థితిని ఎలా దాటాలో చూడు. ముఖ్యంగా అబద్ధానికి చోటివ్వకుండా ఎలా సాగాలో ఆలోచించు. అప్పుడిలా గిల్టీ ఫీలింగే ఉండదు.

గంటలకొద్దీ నీళ్లలో ఊపిరి బిగపట్టి...



డైవింగ్... పర్యటకులకు ఓ సరదా. సాగర పరిశోధకులకు వృత్తిలో భాగం... కానీ జెజు ద్వీపంలో ఉండే మహిళలకు మాత్రం ఇదే జీవనాధారం. అంతేకాదు, ఈ మహిళా డైవర్ల శక్తిసామర్థ్యాలు అపారం. అవే ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.

పైకి ప్రశాంతంగా ఉంటూ... లోతుల్లో ఎన్నో వింతలూ, వైరుధ్యాలు, జీవరాశులకు చోటిస్తుంది సముద్రం. ఈ అందాలన్నీ చూడాలంటే డైవింగ్ చేయాల్సిందే. అయితే, ఇది అందరికీ సాధ్యమయ్యే పని కాదు. ఏళ్లపాటు శిక్షణ అవసరం. మెలకువలు నేర్చుకుని సముద్రం లోతుల్లోకి వెళ్లినా సాధారణ డైవర్లు నిమిషం వరకే నీటిలో ఉండగలరు. అది కూడా ఆక్సిజన్ సహాయం ఉంటేనే. కానీ దక్షిణ కొరియాలోని జెజు ద్వీపంలో నివసించే మహిళలకు ప్రత్యేక శిక్షణ అవసరం లేదు. దీనికి సంబంధించిన నైపుణ్యాలన్నీ జన్మతః వారసత్వంగా వస్తున్నాయట. తరతరాలుగా ఇక్కడి ఆడవాళ్లు దీన్నే వృత్తిగా చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వీళ్లలో ఎక్కువమంది 60 నుంచి 80 వయసున్నవాళ్లే. పైగా వీరంతా ఆక్సిజన్ అవసరం లేకుండా గంటల తరబడి డైవ్ చేస్తారట. గడ్డకట్టే చలి, దట్టమైన మంచు గడ్డలు ఆవరించిన సముద్ర అంతర్భాగంలోనూ అలవోకగా ఈదుతారట. కఠోరశ్రమ, పట్టుదల, శ్వాసమీద నియంత్రణ, డైవింగ్ రిఫ్లెక్షన్స్ లాంటివి వీళ్ల జన్యువుల్లోనే మిళితమయ్యాయి... అందుకే వీరికిది సాధ్యమవుతోంది అంటున్నారు పరిశోధకులు. వీళ్ల శక్తిసామర్థ్యాలపై పరిశోధనలు చేసి... తాజాగా నివేదికనూ విడుదల చేశారు. అందులో... సాధారణ డైవర్ల కంటే... ఈ ద్వీపానికి చెందిన మహిళలు గుండె కొట్టుకునే వేగాన్ని రెట్టింపు తక్కువ చేసుకోగలరు. పైగా వీళ్ల జన్యువుల్లో డైవింగ్ రిఫ్లెక్షన్‌ను తట్టుకోగలిగే శక్తి ఉంది. సాధారణ డైవర్లు ఊపిరిబిగబట్టి 30 సెకన్ల నుంచి 1 నిమిషం వరకూ నీటిలో ఉండగలిగితే... వీళ్లు మాత్రం 2 నుంచి 3 నిమిషాలు ఉండగలుగుతున్నారు. వీళ్ల డీఎన్ఏలు పరీక్షించి దీనికి గల కారణాలు తెలుసుకోగలిగితే... బీపీ, గుండె సంబంధిత వ్యాధులకు గల కారణాలూ, నియంత్రణ మార్గాలూ తెలుసుకునే వీలుంది అంటున్నారు పరిశోధకులు. అన్నట్టూ వీళ్లని 'హెనియాలు' అంటారు. దీనికి 'సముద్ర మహిళలు' అని అర్థమట.

వన్నె తెచ్చే వెదురు బుట్టలు!





సహజంగా ప్రకృతిలో దొరికేవి ఏవైనా ఒంటికి ఆరోగ్యాన్నీ, ఇంటికి అందాన్నీ తెచ్చిపెడతాయనడంలో సందేహమే లేదు. అలాంటివే ఈ వెదురు, గడ్డితో చేసిన బుట్టలు కూడా. ఇప్పుడివి గృహాలంకరణలో భాగమై అలరిస్తున్నాయి. ఆధునిక సౌకర్యాలు ఎన్ని ఉన్నా... వంటగది, మాడ్యులర్ మోడల్ అంటూ ఏం చెప్పినా సరే... వెదురు ఉండాల్సిందే. ముఖ్యంగా అల్మారాల్లో వికర్ బుట్టల్ని తప్పక చేరుస్తున్నారు. ఉల్లి, వెల్లుల్లి, పండ్లు, కూరగాయలు... వంటివి తాజాగా ఉండేందుకు తగినంత గాలి తగిలేలా ఈ బుట్టల్ని ఎంచుకుంటున్నారు. వినియోగదారుల అభిరుచిని బట్టి ఎన్నెన్నో ఆకృతుల్లో సందడి చేస్తున్నాయివి. వాటిని మీరు చూస్తే మెచ్చుకుండా ఉండలేరు. ఓసారి ఇటు లుక్కేయండి!



శోధిత

తల్లిపాలూ కలుషితమేనా?

బిడ్డకు తల్లిపాలే ఆహారం. ముఖ్యంగా ఆరు నెలల లోపు వారికి. ఇందులోనే వారి పెరుగుదలకు కావాల్సిన పోషకాలన్నీ ఉంటాయి. అయితే, పర్యావరణ కాలుష్యం అమృత తుల్యమైన అమ్మపాలనీ కలుషితం చేస్తోందని యూనివర్సిటీ ఆఫ్ ఆరిజోనా తాజా అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ పరిశోధన కోసం గ్వాటెమాలలోని వేర్వేరు లేక్ అటిట్లాన్ కమ్యూనిటీలకు చెందిన 80మంది తల్లులు, వారి శిశువులను అధ్యయనం చేశారు పరిశోధకులు. ఆ తల్లుల నుంచి పాల శాంపిళ్లను తీసుకుని విశ్లేషించారు. అలానే, పిల్లల ఎదుగుదలనూ పరిశీలించారు. అక్కడి వాళ్లు తాగే నీటిలో ఆర్సెనిక్, సీసం, బేరియం... వంటివాటి సాంద్రత ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ఇవి శిశువులకు తల్లి పాల ద్వారా చేరి, వారిలో న్యూరలాజికల్ డెవలప్‌మెంట్‌ను ఆలస్యం చేయటమేకాదు, రోగనిరోధక శక్తి తగ్గటానికీ కారణమవుతున్నాయట. కాబట్టి, తినే ఆహారమేకాదు, తాగే నీరూ సురక్షితంగా ఉన్నప్పుడే అమ్మపాలూ అమృతమవుతాయంటున్నారు నిపుణులు. బిడ్డ ఎదుగుదలలో పర్యావరణానిదీ కీలకపాత్ర అనీ దానిపై అవగాహన కలిగి ఉండాలనీ చెబుతున్నారు.



అయినవారికి ఆపన్నుహస్తం!



- వైకాపా ప్రభుత్వంలో నేతల ఇష్టారాజ్యం ● 30,065 నిర్మాణాలకు ఆస్తి పన్నే లేదు
- మరో 38,770 ఇళ్లకు తగ్గించి విధింపు ● పుర సర్వేలో వెలుగులోకి అక్రమాలు

ఈనాడు – అమరావతి

విశాఖ నగర పరిధిలో 4,485 ఇళ్లు, ఇతర నిర్మాణాలకు ఆస్తి పన్ను విధించలేదంటే నమ్ముతారా? వీటిలో 50 శాతానికిపైగా నిర్మాణాలు పన్ను పరిధిలోకి రాకుండా వైకాపా ప్రభుత్వంలో ఆ పార్టీకి చెందిన కొందరు కార్పొరేటర్లు, మరికొందరు నేతలు అడ్డుకున్నారు. అధికారులు, సిబ్బందిపై ఒత్తిడి తెచ్చి వారి జోలికెళ్లకుండా చేశారు. విశాఖలోనే కాదు గుంటూరులో 1,618, నెల్లూరులో 1,005, విజయవాడలో 990, కడపలో 901 ఇళ్లు, ఇతర నిర్మాణాలకు ఇప్పటికీ ఆస్తి పన్ను లేదు. రాష్ట్ర వ్యాప్తంగా పుర, నగరపాలక సంస్థల్లో ఇటీవల నిర్వహిస్తున్న సర్వేలో ఇలాంటి అక్రమాలు అనేకం వెలుగులోకి వస్తున్నాయి.

నగరాలు, పట్టణాల్లో ఆస్తి పన్ను పరిధిలోకి రాని ఇళ్లు, ఇతర నిర్మాణాల గుట్టు రట్టవుతోంది. పుర, నగరపాలక సంస్థల్లో, నగర పంచాయతీల్లో 45 రోజులుగా నిర్వహిస్తున్న సర్వేలో ఇప్పటివరకు ఆస్తి పన్ను విధించని 30,065 నిర్మాణాలు వెలుగు చూశాయి. వీటిలో ఇళ్లు, అదనపు అంతస్తులు, వాణిజ్య కేటగిరీ పరిధిలోకి వచ్చే దుకాణాలు ఉన్నాయి. వైకాపా ప్రభుత్వంలో నిర్మించినవే 80 శాతానికిపైగా ఉన్నాయి. ఆ పార్టీ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, కొన్ని చోట్ల చెప్పారని పుర, నగరపాలక సిబ్బంది సైతం వాటికి పన్ను విధించే ప్రయత్నం చేయలేదు. వీటిపై అందుతున్న ఫిర్యాదులపై రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సర్వేలో ఆస్తి పన్ను విధింపులో అనేక లోపాలు బయటపడుతున్నాయి. నగరపాలక సంస్థల నుంచి నగర పంచాయతీల వరకు ప్రతి చోటా ఆస్తి పన్ను వేయని ఇళ్లు ఎక్కువగా వెలుగులోకి వస్తున్నాయి. కొన్ని చోట్ల క్షేత్రస్థాయి సిబ్బంది కుమ్మక్కైనట్లు గుర్తించారు. ఎంతో కొంత లంచం తీసుకుని పన్ను వేయకుండా వదిలేశారు. పలు చోట్ల కమిషనర్లపైనా ఆరోపణలు ఉన్నాయి.


రూ.24.59 కోట్ల ఆస్తి పన్ను పెరుగుదల

సర్వేలో గుర్తించిన 30,065 ఇళ్లు, ఇతర నిర్మాణాలకు ఆస్తి మూల ధన విలువ ఆధారంగా 2025-26 నుంచి పన్ను విధిస్తున్నారు. వీటికి కొత్తగా ఎసెస్‌మెంట్ నంబర్లు కేటాయించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే ప్రక్రియ మొదలైంది. ఈ విధంగా రూ.24.59 కోట్ల ఆస్తి పన్ను ఆదాయం పెరుగుతున్నట్లుగా అధికారులు అంచనా వేశారు. త్వరలోనే వీరందరికీ నోటీసులిచ్చి పన్ను వసూలు చేయనున్నారు. ఇన్నాళ్లూ ఇలాంటివి గుర్తించడంలో విఫలమైన కొందరు కమిషనర్లకు నోటీసులిచ్చే విషయాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు.

పన్ను విధింపులోనూ లొసుగులు

ఇంటి నిర్మాణ విస్తీర్ణం ఎక్కువ ఉంటే తక్కువగా చూపించి ఆస్తి పన్ను విధించడం, వాణిజ్య అవసరాలకు వినియోగించే భవనాలను నివాస భవనాలుగా చూపుతూ పన్ను వేసినట్లు కూడా సర్వేలో గుర్తించారు. 123 పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో ఇలాంటివి 38,770 వరకు వెలుగు చూశాయి. ఇందులోనూ రాజకీయ నేతల జోక్యం లేకపోలేదు. ప్రత్యేకించి విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, కాకినాడ, నెల్లూరు, కడపలో వైకాపా నేతలు కొందరు బినామీ పేర్లతో చేసిన నిర్మాణాలకు పన్ను విధింపులో ఇలాంటి లొసుగులు బయటపడ్డాయని తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటివి సరి చేయడం ద్వారా మరో రూ.24.56 కోట్ల ఆదాయం పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

పురపాలక ప్రాంతీయ కార్యాలయం
పన్ను పరిధిలో లేని నిర్మాణాలు



నేడు తెదేపా పార్లమెంటరీ పార్టీ సమావేశం

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఉండవల్లి నివాసంలో తెదేపా పార్లమెంటరీ పార్టీ సమావేశం శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు జరగనుంది. ఈ నెల 21 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉభయ సభల్లో లేవనెత్తాల్సిన అంశాలు, అనుసరించాల్సిన వ్యూహాలు, చర్చల్లో ప్రస్తావించాల్సిన అంశాలపై తెదేపా ఎంపీలకు చంద్రబాబు దిశానిర్దేశం చేయనున్నారు.

భార్య, ఇద్దరు బిడ్డలను బావిలోకి తోసి హత్య

- పాకాలలో హృదయ విదారక ఘటన


హేమంతకుమారి, తనుశ్రీ, తేజశ్రీ

పాకాల, న్యూస్‌టుడే: కట్టుకున్నవాడే కాలయముడయ్యాడు.. కన్నతండ్రే కడ అన్న నమ్మకంతో వెంటనడిచిన సొంతబిడ్డలను బావిలోకి తోసేశాడు. ఈ దారుణం తిరుపతి జిల్లా పాకాల మండలంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. మద్దినాయునిపల్లి పంచాయతీ పెద్దూరుకు చెందిన శీనివాసులు గిరికి మేనత్త కుమార్తె, పులిచెర్ల మండలం కల్లూరు సమీపంలోని తలారివారిపల్లెకి చెందిన హేమంత కుమారి (35)తో 12 ఏళ్ల కిందట వివాహమైంది. వారికి తనుశ్రీ(11), తేజశ్రీ(7) కుమార్తెలు. కొంత కాలం క్రితం జీవనం నిమిత్తం వెళ్లిన అక్కడ భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు తలెత్తడంతో స్వగ్రామం పెద్దూరుకు వచ్చారు. మధ్యాహ్నం బంధువుల ఇంటికి వెళ్లాలని చెప్పి భార్యాపిల్లలతో ద్విచక్ర వాహనంపై బయలుదేరిన గిరి.. కొమ్మిరెడ్డిగారిపల్లి మార్గంలోని కోనేటయిన ఇండ్ల గ్రామ సమీపంలో రింగరోడ్డు పక్కన ఉన్న వ్యవసాయ బావివద్దకు వారిని తీసుకెళ్లాడు. గుట్టుచప్పుడు కాకుండా ముగ్గురినీ బావిలోకి తోసేశాడు. కాసేపటికి భార్య హేమంతకుమారి, చిన్నకుమార్తె తేజశ్రీ మృతదేహాలు తేలడంతో వారిని గట్టుకు చేర్చాడు. మరో కుమార్తె కోసం వెతుకుతుండగా స్థానికులు గమనించి అక్కడికి రావడంతో గొంతు కోసుకుంటానంటూ వారిని బెదిరించాడు. ఇంతలో వారిచ్చిన సమాచారంతో పాకాల సీఐ సుదర్శన ప్రసాద్, పోలీసులు అక్కడికి చేరుకున్నారు. గొంతుకు కొద్దిగా గాయమైన నిందితుడిని అదుపులోకి తీసుకుని ఆసుపత్రికి తరలించారు. విపత్తుల నిర్వహణశాఖ సహకారంతో తనుశ్రీ మృతదేహాన్ని సైతం వెలికితీశారు.

ప్రణాళికతోనే హత్య చేశాడు

తన అల్లుడు గిరి ముందస్తు ప్రణాళికతోనే తన కుమార్తెతోపాటు మనవరాళ్లను హత్య చేశాడని మామ గంగాధరం ఆరోపించారు. అతని ఆగడాలు ఎక్కువైనట్లు తెలిసినా మంచిమాటలతోనే హెచ్చరించామని, జల్సాలకు డబ్బులు కావాలంటే అప్పుచేసి రూ.25 వేలు ఇచ్చామన్నారు. పిల్లలను మంచిగా చూసుకుంటాడని భావించి అన్నీ భరించామని, చివరకు అందరినీ పొట్టనపెట్టుకున్నాడంటూ మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు విలపించడం అందరినీ కలచివేసింది.

మళ్లీ బెంగళూరుకు జగన్

ఈనాడు, అమరావతి: వైకాపా అధ్యక్షుడు జగన్ గురువారం బెంగళూరుకు బయల్దేరి వెళ్లారు. సోమవారం బెంగళూరు నుంచి తాడేపల్లికి వచ్చిన ఆయన.. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో కరేడు గ్రామ రైతులతో భేటీ అయ్యారు. ఎంపిక చేసి, తన కార్యాలయానికి పిలిపించుకున్న విలేకరులతో బుధవారం మాట్లాడారు. గురువారం బెంగళూరుకు వెళ్లారు.

శ్రీలక్ష్మి బాధ్యతలు స్వీకరించాకే లీజులు

ఓఎంసీ కేసులో తెలంగాణ హైకోర్టుకు నివేదించిన సీబీఐ

ఈనాడు, హైదరాబాద్: ఓబుళాపురం మైనింగ్ కంపెనీకి లీజుల మంజూరు వ్యవహారం అంతా పరిశ్రమల శాఖ కార్యదర్శిగా 2006 మే 17న వై.శ్రీలక్ష్మి బాధ్యతలు స్వీకరించిన తర్వాతే ముందుకు సాగిందంటూ సీబీఐ గురువారం తెలంగాణ హైకోర్టుకు నివేదించింది. గాలి జనార్దన్‌రెడ్డికి చెందిన ఓఎంసీకి లీజులు కట్టబెట్టడానికి శ్రీలక్ష్మి అన్ని విధాలుగా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని పేర్కొంది. డిశ్చార్జి పిటిషన్‌ను సీబీఐ కోర్టు కొట్టివేయడాన్ని సవాలు చేస్తూ ఓఎంసీ కేసులో 6వ నిందితురాలైన ఐఏఎస్ అధికారి వై.శ్రీలక్ష్మి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ గురువారం విచారణ కొనసాగించారు. సీబీఐ ప్రత్యేక న్యాయవాది శ్రీనివాస్ కపాటియా వాదనలు వినిపిస్తూ శ్రీలక్ష్మి బాధ్యతలు తీసుకునే నాటికే ఓఎంసీకి లీజులు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వాదన వాస్తవ దూరమని పేర్కొన్నారు. ఆమె బాధ్యతలు స్వీకరించకముందు దరఖాస్తు స్థాయిలోనే ఉన్నాయని, ఆ తర్వాతే మొత్తం లీజుల వ్యవహారం జరిగిందన్నారు. జీపెక్స్ శతవాహన లాంటి ప్రముఖ కంపెనీలు సహా 30 కంపెనీల దరఖాస్తులపై తిరస్కరణ నోటీసులు జారీ చేసి వివరణకు 10 రోజులు కూడా గడువు ఇవ్వకుండా, వారి వాదన వినకుండా తిరస్కరించారన్నారు. ఇతర కంపెనీల దరఖాస్తులను తిరస్కరించిన రోజే ఓఎంసీకి లీజులు మంజూరు చేస్తూ జీవోలు జారీ చేశారని తెలిపారు. లీజు నోటిఫికేషన్‌లో లేని ప్రాంతానికి కూడా లీజులు మంజూరు చేశారంటే అధికారుల ఉద్దేశాన్ని అర్థం చేసుకోవచ్చన్నారు. ఓఎంసీ దరఖాస్తుకు ఆమోదం చెప్పడానికి ఆమే ఫైలు మీద కదిలిన అధికారులు ప్రభుత్వానికి చెందిన ఏపీఎండీసీ చేసుకున్న దరఖాస్తును పక్కన పెట్టేశారన్నారు. శ్రీలక్ష్మి పాత్రపై అన్ని ఆధారాలు ఉన్నాయని అందువల్ల ఈ పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు.

అన్యాక్రాంతమైన దేవాదాయ శాఖ భూమిని చట్టపరంగా స్వాధీనం చేసుకుంటాం: మంత్రి ఆనం

కనిగిరి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఒక్క సెంటు దేవాదాయశాఖ భూమి ఆక్రమణకు గురైనా స్వాధీనం చేసుకుంటామని ఆ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. గురువారం ప్రకాశం జిల్లా కనిగిరి పట్టణంలో విజయమార్తాండేశ్వరస్వామి దేవస్థానం కాంప్లెక్స్ గదుల నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో దేవాదాయ శాఖకు చెందిన 1.8 లక్షల ఎకరాలు అన్యాక్రాంతం అయ్యాయని తెలిపారు. ఏడాది పాలనలో అన్ని వివరాలపై నివేదికలు తెప్పించామన్నారు. అన్యాక్రాంతమైన దేవాలయ భూములను జిల్లా కలెక్టర్లు, జేసీలు అవసరమైతే కోర్టుల్లో పిటిషన్లు వేసి చట్టపరంగా వాటిని స్వాధీనం చేసుకోవాలన్నారు. కనిగిరి విజయమార్తాండేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించిన భూములు ఇతర ప్రాంతాల్లో ఉన్నాయని, వాటినీ స్వాధీనం చేసుకుంటామన్నారు.


ఐవోసీఎల్ అందించిన ఎంఆర్ఐ యంత్రాన్ని పరిశీలిస్తున్న బీఆర్ నాయుడు, వి.సతీష్‌కుమార్, దివాకర్‌రెడ్డి, ఆర్వీ కుమార్ తదితరులు

స్విమ్స్‌ను అత్యుత్తమ వైద్యసంస్థగా తీర్చిదిద్దుతాం: బీఆర్ నాయుడు

రూ.22 కోట్ల విలువైన వైద్య పరికరాలు ప్రారంభం

తిరుపతి(గాంధీరోడ్డు), తిరుమల, న్యూస్‌టుడే: తిరుపతిలోని స్విమ్స్‌ను అత్యుత్తమ వైద్యసేవా సంస్థగా తీర్చిదిద్దుతామని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు పేర్కొన్నారు. స్విమ్స్‌లోని శ్రీపద్మావతి వైద్య కళాశాలకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐవోసీఎల్) కార్పొరేట్ సామాజిక బాధ్యతగా రూ.22.01 కోట్ల విలువైన అత్యాధునిక 3టెస్లా ఎంఆర్ఐ స్కానర్, 4డీ సీటీ సిమ్యులేటర్‌ను అందించింది. వాటిని గురువారం స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్, ఐవోసీఎల్ మార్కెటింగ్ డైరెక్టర్ వి.సతీష్‌కుమార్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఆర్ నాయుడు మాట్లాడుతూ.. ఐవోసీఎల్ అందించిన అధునాతన వైద్య పరికరాలతో సంవత్సరానికి 2.5 లక్షల మందికి తక్కువ ఖర్చుతో ఎంఆర్ఐ, రేడియోథెరపీ సేవలు అందించవచ్చన్నారు. కార్యక్రమంలో తుడా ఛైర్మన్, తితిదే పాలక మండలి సభ్యుడు దివాకర్‌రెడ్డి, స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ రామ్, రేడియాలజీ విభాగాధిపతి విజయలక్ష్మి, ఐవోసీఎల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

★ ఐవోసీఎల్ తితిదేకు రెండు దశాబ్దాలుగా ఎల్పీజీని సరఫరా చేస్తోందని, తాజాగా మరో 30 సంవత్సరాలకు ఆ సంస్థతో ఒప్పందం కుదిరిందని బీఆర్ నాయుడు తెలిపారు. దేవస్థానం భవిష్యత్తు అవసరాల నిమిత్తం తిరుమలలోని ఔటర్ రింగ్ రోడ్డులో 45 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గ్యాస్ నిల్వ కేంద్రం నిర్మాణానికి గురువారం ఆయన భూమిపూజ చేశారు.

మంత్రి నిమ్మలపై కేసు కొట్టివేత

పాలకొల్లు, న్యూస్‌టుడే: మంత్రి నిమ్మల రామానాయుడితోపాటు మరికొందరు తెదేపా నాయకులపై 2019లో నమోదు చేసిన కేసును కొట్టివేస్తూ విజయవాడలోని ప్రజాప్రతినిధుల కోర్టు గురువారం తీర్పునిచ్చింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో నిరసన వ్యక్తం చేయడానికి బయల్దేరిన ఆశా కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు స్టేషన్‌కు తరలించారు. వారికి అండగా నిలిచేందుకు వెళ్లిన నిమ్మల రామానాయుడు, ఇతర తెదేపా శ్రేణులపై అక్రమ కేసులు బనాయించారు. పలు వాయిదాల అనంతరం గురువారం వెలువడిన తీర్పులో న్యాయమూర్తి కేసును కొట్టేశారని మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

అన్నపూర్ణా... ఆయుష్మాన్‌భవ!

అమ్మా... బ్రేక్‌ఫాస్ట్ రెడీ అయిందా!
ఏమోయ్... బాక్స్ సర్దడం ఇంతసేపా!
అమ్మాయ్... కాస్త కాఫీ ఇవ్వమ్మా!
...ఇదిగో అయిపోతుంది



జవాబుచెప్పేది ఆ ఇంటి ఇల్లాలే!
సమాధానం వచ్చేది వంటింట్లోంచే...
కానీ ఆ వంటిల్లు ఎలా ఉందో మీరు గమనిస్తున్నారా...
అక్కడి వాతావరణం కలుషితమైతే
మన ఇంటి దీపానికి జరిగే నష్టమేంటో తెలుసా?
కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే
ఆమె ఆరోగ్యాన్ని, మనం చక్కగా కాపాడుకోవచ్చు.

భారతీయ మహిళలు రోజుకు మూడున్నర గంటలు వంటింటికే కేటాయిస్తున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. చాలా ఇళ్లల్లో వంటగదిలోకి సరిపడా గాలి, వెలుతురు వచ్చేందుకు.. అక్కడ విడుదలైన పొగ, వాయువులు బయటకు వెళ్లేందుకు సరైన ఏర్పాట్లు ఉండడం లేదు. దీంతో అతివలు అనేక దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నట్లు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.

● వంట చేసే సమయంలో వెలువడే పొగ, వాయువుల ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా కోట్ల మంది ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి. సురక్షితంగాని వంట పద్ధతుల కారణంగా ఇంట్లో వెలువడే కాలుష్యం వల్ల ఏటా 32 లక్షల మరణాలు సంభవిస్తున్నట్లు 2020లో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) అంచనా వేసింది. ఇందులో 32% మందికి గుండె జబ్బులు, 23% స్ట్రోక్, 21% శ్వాసకోశ సంబంధిత వ్యాధులు, 19% సీఓపీడీ, 6% మందికి ఊపిరితిత్తుల క్యాన్సర్ వస్తున్నట్లు పేర్కొంది. దీర్ఘకాలం గ్యాస్ నుంచి విడుదలయ్యే నైట్రోజన్ డైఆక్సైడ్ పీల్చడం వల్ల వేల మంది ఆస్తమా బారినపడుతున్నారని కారణం కావొచ్చింది.

కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన టైమ్ యూజ్ సర్వే ప్రకారం దేశంలో 76.3 శాతం మంది మహిళలు రోజుకు సగటున 209 నిమిషాలు వంట గదిలోనే ఉంటున్నారు.

పొంచి ఉన్న సమస్యలు...

● వంట గదిలో వాయువులు బయటకు వెళ్లకపోతే చాలా సమస్యలు వస్తాయి.
● ఆ ఉద్గారాల ప్రభావంతో శ్వాసకోశ వ్యాధులు, తలనొప్పి, నీరసం, కళ్ల మండడం, నీరు కారడం, అలర్జీలు పెరుగుతాయి.
● ఆస్తమా ఉన్నవారిలో దీనికి, వాపు ప్రక్రియ పెరిగే ప్రమాదముందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.
● ఎల్‌పీజీ మండించడం వల్ల నైట్రోజన్ డైఆక్సైడ్, కార్బన్ డైఆక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్ గదిలో చేరతాయి. అధిక ఉష్ణోగ్రత ఉన్న నూనెలో ఆహారం వేయించే సమయంలో ఎక్కువ కాలుష్య కారకాలు విడుదలవుతాయి.
● ఇప్పటికీ కొంతమంది కట్టెలు, బొగ్గులతో వంట చేస్తున్నారు. దీనివల్ల కార్బన్ డైఆక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్, మసి గదిలో చేరతాయి.
● వంట గదిలో వేడి వాతావరణం వల్ల డీహైడ్రేషన్, హార్మోన్ల అసమతుల్యం వంటి సమస్యలు రావడానికి ఆస్కారం ఉంది.
● ఎక్కువ సేపు నిలబడి వంట చేయడం వల్ల నడుము కింది భాగం, మడమలపై ఒత్తిడి పడుతుంది.
● బయోమాస్ ఫ్యూయల్ ఎక్కువగా పీల్చడం వల్ల మహిళల్లో సీఓపీడీ (క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్) వచ్చే ప్రమాదం ఉంది. దీనివల్ల ఊపిరితిత్తుల్లోని కణజాలానికి శాశ్వత నష్టం జరుగుతుంది.

– ఈనాడు, అమరావతి, విశాఖపట్నం

ఇలా నివారిద్దాం..



● వంట సమయంలో విడుదలయ్యే పొగ, వాయువులు బయటకు పోయేందుకు తలుపులు, కిటికీలు తెరిచి ఉంచాలి.
● వీలైనంత తక్కువ సమయంలో వంట పూర్తి చేయడానికి ప్రయత్నించాలి.
● వంట గది నుంచి తరచూ బయటకురావటం, మంచి నీళ్లు తాగడం, కాసేపు అటూ ఇటూ అడుగులు వేస్తే మంచిది.
● పొగ, వాయువులను బయటకు పంపేందుకు ఎగ్జాస్ట్ ఫ్యాన్లు, చిమ్నీలు ఉపయోగించాలి.
● విద్యుత్తు ఆధారిత స్టవ్‌తో నష్టాన్ని కొంత వరకు తగ్గించుకోవచ్చు.
● ఇప్పటికే శ్వాసకోశ ఇబ్బందులున్నవారు ఇండక్షన్ స్టవ్‌లు వినియోగించడం శ్రేయస్కరం.

చిమ్నీలు మేలు..



● వంట గదిలో పొగ, గ్రీజు, మండే వాసనలను ఎగ్జాస్ట్ ఫ్యాన్లు పూర్తిస్థాయిలో తొలగించలేవు. సన్నటి గాలికోసం చిమ్నీలు మేలు.
● పొగ, ఆవిరి, గ్రీజును చిమ్నీలు ఫిల్టర్ ద్వారా సమర్థంగా సేకరించి డక్టింగ్ ద్వారా బయటకు పంపుతాయి.
● ఉపరితలాలపై మరకలు పడకుండా, పైకప్పులపై దూళి పేరుకుపోకుండా అడ్డుకుంటాయి.
● వంట గదిలో వేడి గాలి, తేమను తీసేసి... సౌకర్యవంతమైన వాతావరణం ఉండేలా చేస్తాయి.

గాలి, వెలుతురు కావాలి...



వంట గదుల చిన్నగా ఉండడం.. గాలి, వెలుతురు తక్కువగా వచ్చే పరిస్థితి ఉన్నప్పుడు మహిళలు ఎక్కువ అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంది. ఎల్‌పీజీ, వంట నూనెలు వేడి చేయడం వల్ల వచ్చే వాయువుల వల్ల మహిళలకు ఆస్తమా వచ్చే ప్రమాదం ఉంది. బయట నుంచి వచ్చే దుమ్ము ధూళితోనూ ఇంట్లో ఉండే మహిళలు అనారోగ్యం బారిన పడుతున్నారు.

– డాక్టర్ ఎం.ఎస్.గోపాలకృష్ణ, శ్వాసకోశ వ్యాధుల నిపుణులు, విజయవాడ



తొలిచూపులోనే సదభిప్రాయం ఏర్పడాలంటే..

ముఖచిత్రాన్ని చూసి పుస్తకాన్ని అంచనా వేయొద్దంటారు కానీ మనుషుల విషయంలో అది నిజం కాదు. ఇతరుల ఆకారాన్ని, హావభావాలను చూడగానే వారిపై ఓ అభిప్రాయం ఏర్పడుతుంది. దాన్ని చెరివేయడం చాలా కష్టం. అందుకే ఎదుటివారికి మన మీద తొలి చూపులోనే సదభిప్రాయం కలగాలంటే శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకోవడంతోపాటు ప్రవర్తన హుందాగా ఉండేలా జాగ్రత్త తీసుకోవాలి.

– డాన్ కో, రచయిత



గజరాజులకు విందు.. గణేశుడికి పసందు!

మలయాళం క్యాలెండర్‌లో చివరి మాసం కార్కిడకం. ఈ నెల ప్రారంభం రోజు ఏనుగులకు ఆహారం అందిస్తే గణేశుడి అనుగ్రహం లభిస్తుందని మలయాళీల విశ్వాసం. ఈ నేపథ్యంలో త్రిశ్శూరులోని శ్రీ వడక్కుంనాథన్ ఆలయం వద్ద గురువారం ఏనుగులకు ఆహారం అందించేందుకు స్థానికులు భారీగా తరలి వచ్చారు. కార్కిడకం మాసంలో రామాయణాన్ని ఎక్కువగా చదువుతారు. అందుకే దీన్ని రామాయణ నెలగానూ పిలుస్తారు. ఆత్మావలోకన సమయంగానూ కార్కిడకంను భావిస్తారు. ఈ మాసంలో చాలా మంది మలయాళీలు మాంసాహారానికి దూరంగా ఉంటారు.



మానవ ప్రయత్నం.. వరుణయాగం


నెల రోజులుగా వర్షాభావం నేపథ్యంలో నల్గొండ జిల్లా చింతపల్లి మండల కేంద్రంలోని శిర్డీ సాయిబాబా దేవాలయంలో గురువారం వరుణయాగంతో పాటు అర్చకులు నీటిలో కూర్చుని వరుణ జపం నిర్వహించారు. రైతులు, కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటుండడంతో.. వర్షాలు కురవాలని మానవ ప్రయత్నంగా వరుణయాగం నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. సాయినాథునికి సహస్ర ఘటాభిషేకం చేపట్టారు. వెయ్యి కలశాలతో పూజల అనంతరం.. నీటిలో కూర్చుని జపం చేయాలని శైవ ఆగమ పద్ధతి నిర్దేశిస్తుందని అర్చకులు వివరించారు.

– న్యూస్‌టుడే, చింతపల్లి

మా ఊరికి.. ఈ రోజుకి

గడ్చిరోలి: దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 76 ఏళ్ల తర్వాత మహారాష్ట్రలోని ఓ మారుమూల గ్రామానికి మొదటిసారిగా బస్సు సేవలు ప్రారంభమయ్యాయి. నక్సల్స్‌కు కేంద్ర స్థానమైన గడ్చిరోలి జిల్లాలోని మర్కానార్ గ్రామానికి బుధవారం బస్సు వచ్చింది. భద్రతా బలగాల వరుస ఆపరేషన్లతో ఇప్పుడు ఆ ప్రాంతంలో మావోయిస్టుల ఉనికి తగ్గింది. చాలా గ్రామాలకు రోడ్లు, తాగు నీరు సహా రవాణా సౌకర్యాలను కల్పిస్తున్నారు. తాజాగా మర్కానార్ గ్రామాన్ని రవాణా నెట్‌వర్క్‌లోకి తీసుకొచ్చారు. గ్రామానికి బస్సు రావడంతో విద్యార్థులు సహా గ్రామంలోని 1,200 మంది ప్రయోజనం పొందనున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ బస్సు మర్కానార్ నుంచి అహేరీ వరకు సేవలు అందిస్తుంది.





ఒకటి రెండై.. రెండు నాలుగై


తాడిచెట్టు అంటే నిటారుగా నిలబడి ఉన్న చెట్టు చిత్రమే గుర్తొస్తుంది. అందుకు భిన్నంగా ఉన్న ఈ తాడిచెట్టు.. ఏపీలోని పార్వతీపురం-గోపాలపురం దారిలో ఉంది. ఈ చెట్టు ముందు రెండు శాఖలుగా, ఆ తర్వాత ఒక్కో శాఖ మరో రెండు శాఖలుగా విడిపోయాయి. ఇది అరుదైనదని.. ఇందుకు మొక్క దశలో చిగురు దెబ్బతినడం లేదా జన్యు లోపం కారణం కావొచ్చని ఉద్యానశాఖ అధికారి క్రాంతికుమార్ అభిప్రాయపడ్డారు.

– న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

దంతాలు బాగుంటే.. క్యాన్సర్లు దూరమే!



దిల్లీ: పిప్పళ్లు, చిగుళ్ల వ్యాధులు యావత్ ఆరోగ్య వ్యవస్థను దెబ్బ తీస్తాయి. మధుమేహం, హృదయం-రక్తనాళ సంబంధిత వ్యాధులు, అల్జీమర్స్, ప్రసవ సమస్యలకూ దంత వ్యాధులకూ లంకె ఉంటుంది. ముఖ్యంగా చిగుళ్ల వ్యాధికీ.. తల, మెడ క్యాన్సర్లకూ సంబంధం ఉందని దిల్లీ ఎయిమ్స్ నిపుణులు తాజాగా హెచ్చరించారు. వారి అధ్యయనం లాన్సెట్‌లో ప్రచురితమైంది. జీర్ణకోశ క్యాన్సర్, క్లోమ క్యాన్సర్, రొమ్ము, ఊపిరితిత్తుల క్యాన్సర్లకూ.. చిగుళ్ల వ్యాధికీ సంబంధం ఉందని అందులో పేర్కొన్నారు. దంతాలను శుభ్రంగా ఉంచుకోకపోతే పార్ఫైరోమోనాస్ జింజివాలిస్, ప్రెవోటెల్లా వంటి హానికర బ్యాక్టీరియా నోటిలో పెరిగి తల, మెడ క్యాన్సర్లకు దారితీసే ముప్పుంటుందని తెలిపారు. ఏటా క్రమంతప్పకుండా పళ్ల పరీక్షలు చేయించుకోవడం, దంతాలు ఊడిన వెంటనే చికిత్స చేయించుకోవడం ద్వారా ఇలాంటి క్యాన్సర్లను నివారించవచ్చని వివరించారు.



అమర్‌నాథ్ యాత్రకు స్కేటింగ్ చేస్తూ వెళ్తున్న ఓ యువకుడు గురువారం అనంత్‌నాగ్ జిల్లా ఖ్వాజీగండ్‌లో ఇలా ఫొటోకు చిక్కాడు

బిచ్చగాళ్ల చేతుల్లోని పిల్లలు వారి పిల్లలేనా?

డీఎన్‌ఏ పరీక్షలతో తేల్చనున్న పంజాబ్



చండీగఢ్: బిచ్చమెత్తుకునే వారి చేతుల్లో ఉండే పిల్లలు.. వారి పిల్లలేనా, అక్రమ రవాణా ద్వారా తరలించారా అనే విషయాన్ని తేల్చేందుకు పంజాబ్ ప్రభుత్వం నడుం బిగించింది. భిక్షాటన చేస్తున్న పిల్లలు, వారి సంరక్షకులుగా ఉన్నవారికి ఎక్కడికక్కడ డీఎన్‌ఏ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించింది. భిక్షాటన చేస్తున్న బాలలతో, వారి వెంటనున్న పెద్దలకు సంబంధం లేదని డీఎన్‌ఏ పరీక్షల్లో తేలితే చట్టపరమైన చర్యలు తీసుకోనుంది. కారకులను జైలుకు పంపనుంది. భిక్షాటన లేని రాష్ట్రంగా పంజాబ్‌ను తీర్చిదిద్దే చర్యల్లో భాగంగా అక్కడి ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. బాలల అక్రమ రవాణాను అడ్డుకోవడమే దీని లక్ష్యమని ప్రభుత్వం వెల్లడించింది. పైలట్ ప్రాజెక్టుగా భిక్షగాళ్లకు డీఎన్‌ఏ పరీక్షలు చేయాలని ఐదు జిల్లాల అధికారులకు ప్రభుత్వం ఆదేశాలిచ్చింది.

గూడు కోసం బోలెడు విద్యలు!



తలకిందులుగా వేలాడుతూ గూడు కట్టుకుంటున్న పక్షులు



ఈ చిత్రంలో కనిపిస్తున్నవి 13 సెం.మీ. మాత్రమే ఉండే గీత గొంతుక పిట్ట (స్ట్రీక్ త్రోటెడ్ స్వాలో)లు. ఇవి ఒకప్పుడు కొండలు, గుట్టల్లో మాత్రమే గూళ్లు నిర్మించుకునేవి. కాలానికి తగినట్లు అవీ మారి ఇప్పుడు వంతెనలు, భవనాలకు నివాసాన్ని మార్చుకున్నాయి. నందికొట్కూరు-మల్యాల దారిలో హంద్రీ నీవా కాల్వపై ఉన్న వంతెన కింద భాగంలో గూళ్లు నిర్మించుకుంటుండగా తీసిన చిత్రమిది. మట్టిని నోటితో సేకరించి, తలకిందులుగా వేలాడుతూ ఒద్దికగా ఇళ్లు కట్టుకుంటున్న వీటిని చూస్తుంటే ప్రకృతే వీటిని సివిల్ ఇంజినీర్లను చేసిందేమో అనిపిస్తోంది!

–ఈనాడు, కర్నూలు

‘ప్యాన్.. ప్యాన్.. ప్యాన్’ అంటే హడలే



ఇంటర్నెట్ డెస్క్: దిల్లీ నుంచి బుధవారం గోవా బయలుదేరిన ఇండిగో విమానంలో పైలట్ ‘ప్యాన్.. ప్యాన్.. ప్యాన్’ అనే సందేశం పంపారు. ఆ తర్వాత వెంటనే విమానాన్ని ముంబయిలో అత్యవసరంగా దించేశారు. ‘ప్యాన్ ప్యాన్ ప్యాన్’ అనేది విమానంలో అత్యవసర పరిస్థితిని సూచించే రేడియో డిస్ట్రెస్ కాల్. అయితే ‘మేడే కాల్’ అంత తీవ్రమైనది కాదు. గగనతలంలో ఇంజిన్ వైఫల్యం తలెత్తినప్పుడు పైలట్ ఈ ‘ఎమర్జెన్సీ’ సందేశాన్ని పంపిస్తారు. ప్రాణాపాయం లేని సందర్భాల్లో ఈ సందేశం ఇస్తారు. ఈ కాల్‌తో ‘విమానంలో సమస్య తలెత్తింది.. అత్యవసరంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది’ అనే సంకేతం ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌కు వెళ్తుంది. ఈ కాల్ రాగానే ఏటీసీ వెంటనే చర్యలు చేపడుతుంది. గగనతలాన్ని క్లియర్ చేసి.. విమానం అత్యవసరంగా దిగేందుకు అవకాశం కల్పిస్తుంది.

సన్యాసులపైనా వలపు వల..

ఇంటర్నెట్‌డెస్క్: ఓ యువతి విసిరిన వలపు వలలో తొమ్మిది మంది సన్యాసులు విలవిల్లాడిపోయారు. వీడియోలు, ఫొటోలు చూపించి బెదిరింపులకు పాల్పడడంతో గత మూడు సంవత్సరాలుగా రూ.102 కోట్లు సమర్పించుకున్నారు. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం.. థాయ్‌లాండ్‌లో వెలుగుచూసిన ఈ వ్యవహారం సంచలనంగా మారింది. తొమ్మిది మంది సన్యాసులను ప్రలోభపెట్టిన ఆ మహిళకు పోలీసులు మిస్ గోల్ఫ్ అని పేరుపెట్టారు. జూన్ నెలలో బాధితుల్లో ఒకరు సన్యాసానికి దూరం కావడం, దానిపై పోలీసులు దృష్టి సారించడంతో ఆమె బండారం బయటపడింది. 2024లో మిస్ గోల్ఫ్ ఒక సన్యాసితో సంబంధాన్ని ఏర్పరచుకుంది. ఆ బంధం వల్ల ఒక బిడ్డ జన్మించిందని చెప్పి ఖర్చుల కోసం 70 లక్షల బాట్‌లు (రూ.1.85 కోట్లు) ఇవ్వాలని డిమాండ్ చేసింది. అతడిని మభ్యపెట్టినట్టే మరికొంతమంది సన్యాసులతో ఇలాగే వ్యవహరించిందని పోలీసులు దర్యాప్తులో గుర్తించారు. 80వేల ఫొటోలు, వీడియోలతో ఈ కథంతా నడిపిందని వెల్లడించారు. వారి నుంచి కొల్లగొట్టిన డబ్బును జూదానికి ఉపయోగించిందని చెప్పారు. దోపిడీ, మనీలాండరింగ్ వంటి ఆరోపణలపై ప్రస్తుతం పలు కేసుల్ని ఎదుర్కొంటోంది.

‘పాలకుండ’లో తేట తెలుగు చుక్కలు!

● మాతృభాషాభివృద్ధికి ములుకనూర్ పూర్వ విద్యార్థుల కృషి
● రచయితలకు ఏటా రూ.2 లక్షల నగదు ప్రోత్సాహం

న్యూస్‌టుడే, భీమదేవరపల్లి: ములుకనూర్... పేరు వినగానే విజయవంతంగా నడుస్తున్న సహకార, పొదుపు సంఘాలు గుర్తుకొస్తాయి. నాలుగు జిల్లాల్లోని 192 మహిళా ప్రాథమిక పాడి సహకార సంఘాలతో ఏర్పాటైన ‘ములుకనూర్ మహిళా పాడి సహకార సమాఖ్య’ స్ఫురణకు వస్తుంది. 23 ఏళ్లుగా మహిళా సాధికారతకు కృషి చేస్తున్న ఈ గ్రామం ఐదేళ్లుగా మాతృభాష సేవలోనూ తరిస్తోంది. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ఈ గ్రామ పూర్వ విద్యార్థులు తేనెలొలుకు తేట తెలుగు కథకు పట్టం కడుతున్నారు. తమ గ్రామం పేరిట ప్రజా గ్రంథాలయం, సాహితీ పీఠం ప్రారంభించి కథకులను ప్రోత్సహిస్తున్నారు.

కథల పోటీతో శ్రీకారం

పుస్తకాలను యువత వద్దకు చేర్చాలనే సంకల్పంతో ములుకనూర్ పూర్వ విద్యార్థులు 2018లో ప్రజా గ్రంథాలయాన్ని స్థాపించారు. తర్వాత విద్యార్థులకు ఏటా జిల్లాస్థాయి వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నారు. 2019లో కథల పోటీని ప్రకటించగా అనూహ్య స్పందన వచ్చింది. దాంతో తెలుగు కథకు, కథకులకు పట్టం కట్టాలనే పట్టుదలతో 2021లో




ములుకనూర్ ప్రజా గ్రంథాలయంలోని పుస్తకాలు

పూర్వవిద్యార్థి వేముల శ్రీనివాసులు మిత్రులతో కలిసి ములుకనూర్ సాహితీ పీఠం ఏర్పాటు చేశారు. ఏటా జూన్, జులైలలో కథల పోటీలు నిర్వహిస్తూ ఉత్తమ కథలకు రూ.2 లక్షల ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. ప్రథమ బహుమతికి రూ.50 వేలు, ద్వితీయకు రూ.25 వేలు, తృతీయకు రూ.10 వేలు, ప్రోత్సాహకంగా... నగదు, సెల్‌ఫోన్లు అందజేస్తున్నారు.

◆ ఇప్పటివరకు పెద్దింటి అశోక్‌కుమార్ రాసిన ‘విత్తనం’, కె.ఆనందాచారి ‘గస్సాల్’, స్ఫూర్తి కందివనం ‘డిమ్మీ’, హుమాయూన్ రాసిన ‘ఇబ్లీస్’ కథలు ప్రథమ బహుమతులు గెలుచుకున్నాయి. 2024 సంవత్సరానికి వేణు మరీదు రాసిన వైకుంఠ వాకిలి ప్రథమ బహుమతి దక్కించుకుంది. విజేతలకు ఈ నెల 27న బహుమతులను అందించనున్నారు.

3,500 మంది కథలు పంపారు

– వేముల శ్రీనివాసులు, సాహితీ పీఠం ముఖ్యసలహాదారుడు



మేం ఐదేళ్లుగా నిర్వహిస్తున్న పోటీలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిస్సా, కర్ణాటక, దిల్లీలతోపాటు అమెరికా, బోట్స్‌వానా దేశాల నుంచి 3,500 మంది రచయితలు కథలు పంపారు. వాటిలోని 300 ఉత్తమ కథలకు బహుమతులు అందించాం. ఆయా కథల సమాహారంతో నాలుగు పుస్తకాలను ముద్రించాం. మా సాహితీ పీఠాన్ని కథలకు కల్పవృక్షంగా, కథకులకు కామధేనువుగా మార్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం.

ప్రజావాణికి సరికొత్త బాణీ!



ప్రజా సమస్యల పరిష్కారానికి ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ వినూత్న ఆలోచన చేశారు. ప్రజావాణి బాక్సుల పేరుతో డబ్బాలు పెట్టి, సమస్య ఉన్న వారు వివరాలు పేపర్‌పై రాసి అందులో వేసేలా ఏర్పాటు చేశారు. వాటిని ఎమ్మెల్యే పరిశీలించి 48 గంటల్లో పరిష్కరిస్తారు. లేని పక్షంలో అందుకు గల కారణాలను వివరిస్తారు. నగరంలో ప్రస్తుతం ఈ తరహా బాక్సులు మూడు ఉన్నాయి.

– ఈనాడు, ఒంగోలు

బ్రిటన్‌లో కనీస ఓటింగ్ వయసు 16

లండన్: బ్రిటన్ పార్లమెంటు ఎన్నికల్లో కనీస ఓటింగ్ వయసును 18 నుంచి 16 ఏళ్లకు తగ్గించనున్నారు. 2029లో జరిగే తదుపరి జాతీయ ఎన్నికల్లోగా ఈ కొత్త నియమాన్ని అమలులోకి తెస్తామని ప్రభుత్వం గురువారం ప్రకటించింది. అధికారంలోకి వస్తే కనీస ఓటింగ్ వయసును తగ్గిస్తామన్న గత ఎన్నికల హామీని నిలబెట్టుకుంటూ లేబర్ పార్టీ తాజా నిర్ణయం తీసుకుంది. స్కాట్లాండ్, వేల్స్ ప్రాంతాల్లో ఇప్పటికే 16, 17 సంవత్సరాల వయసున్న వారిని స్థానిక, ప్రాంతీయ ఎన్నికల్లో ఓటు వేసేందుకు అనుమతిస్తున్నారు.

కాకతీయుల కోనేరు.. అభివృద్ధి చేస్తే అలరారు!

ఘనమైన చరిత్రకు సాక్ష్యాలుగా నిలిచే అపురూప కట్టడాలు పర్యవేక్షణ లేక శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఈ చిత్రంలో ఉన్నది నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలంలోని చింతకొమ్మదిన్నె సమీపంలో ఉన్న కోనేరు. 13వ శతాబ్దంలో కాకతీయ రాజు ప్రతాపరుద్రుడు దీనిని నిర్మించినట్లు స్థానికులు చెబుతుంటారు. పర్యవేక్షణ లేకపోవడం, గుప్త నిధుల కోసం దుండగులు తవ్వేయడంతో ఈ కట్టడం చాలా చోట్ల ధ్వంసమైపోయింది. కోనేరును శుభ్రం చేసి నీరు నిల్వ ఉంచితే అలనాటి వైభవాన్ని ముందు తరాలకు అందించేందుకు వీలవుతుందని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ గ్రామీణం



సొంతలాభం కొంతమానుకొని..



ఆదిలాబాద్ పట్టణం కోలిపుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏడేళ్ల క్రితం ఐదు తరగతుల్లో కలిపి ఉన్న విద్యార్థుల సంఖ్య 22 మాత్రమే. ఇప్పుడు ఆ సంఖ్య వందకు చేరువైంది. బడి మూతపడొద్దనే సంకల్పంతో అక్కడి ఉపాధ్యాయులు ‘సొంత లాభం కొంతమానుకొని.. పొరుగువారికి తోడుపడాలన్న’ గురజాడ వారి ఆదర్శాన్ని పుణికిపుచ్చుకుని దీన్ని సాధ్యం చేశారు. పాఠశాలకు 5 కి.మీ. దూరంలోని కేఆర్కే కాలనీలోని నిరుపేదల పిల్లలు పాఠశాలకు రావడంలేదని గుర్తించి.. వారికోసం మూడు ఆటోలను అద్దెకు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ కాలనీ నుంచి రోజూ ఆటోల్లో 46 మంది విద్యార్థులు పాఠశాలకు వస్తున్నారు. విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, చెప్పులను ఉపాధ్యాయులే సమకూరుస్తున్నారు. ఇందుకు 8 మంది ఉపాధ్యాయులు కలిసి ఏటా రూ.2 నుంచి 2.5 లక్షలు వెచ్చిస్తున్నామని ప్రధానోపాధ్యాయుడు మురళి తెలిపారు.

– ఈనాడు, ఆదిలాబాద్; న్యూస్‌టుడే, కలెక్టరేట్

పారామౌంట్ హోటల్.. ఫ్లాట్ నంబర్ 5801

- దుబాయ్‌లో మద్యం కుంభకోణం నిందితులున్న డెన్ ఇదే
- రాజభోగాలతో కూడిన అత్యంత విలాసవంతమైన జీవనం
- చాణక్య, వరుణ్ సహా వైకాపా ముఠా స్థావరం అక్కడే..
- తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితుడు శ్రవణ్‌రావు ఆధీనంలో ఆ ఫ్లాట్
- అతడితో కలిసి కొన్నాళ్లు అదే ఫ్లాట్‌లో ఉన్న వైకాపా మద్యం ముఠా





ఫ్లాట్ నంబర్ 5801





ఫ్లాట్ లోపలి భాగం

← దుబాయ్‌లోని పారామౌంట్ టవర్ హోటల్ అండ్ రెసిడెన్సీస్ భవనం

ఈనాడు, అమరావతి: పారామౌంట్ టవర్ హోటల్ అండ్ రెసిడెన్సీస్.. దుబాయ్‌లోని ప్రైమ్ ఏరియాగా పరిగణించే బిజినెస్ బే ప్రాంతంలో ఉన్న అత్యంత విలాసవంతమైన 66 అంతస్తుల భవనమిది. అందులో 1 నుంచి 34వ అంతస్తు వరకూ ఓ ఫైవ్‌స్టార్ హోటల్ నిర్వహిస్తున్నారు. 35 నుంచి 66వ అంతస్తు వరకూ నివాస ఫ్లాట్‌లు ఉంటాయి. మన రాష్ట్రంలో రూ.వేల కోట్ల విలువైన మద్యం కుంభకోణంతో భారీ మొత్తంలో సొత్తు కొల్లగొట్టి దుబాయ్‌కి పారిపోయి, అక్కడ పెట్టుబడులు, కంపెనీలు ఏర్పాటు చేసుకున్న వైకాపా ముఠా ఈ భవనాన్నే తమ డెన్‌గా చేసుకుంది. ఈ కేసులో నిందితులైన బూనేటి చాణక్య, పురుషోత్తం వరుణ్‌కుమార్‌తో పాటు మరికొంతమంది.. తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితుడైన శ్రవణ్‌రావుతో కలిసి ఈ భవనం 58వ అంతస్తులోని ఫ్లాట్ నంబర్ 5801లో కొన్నాళ్లు ఉన్నట్లు తాజాగా సిట్ దృష్టికి వచ్చింది. ఈ ఫ్లాట్ శ్రవణ్‌రావు భార్య స్వాతిరావు, హైదరాబాద్‌కు చెందిన ఆర్.కావ్యల పేరిట ఉంది. కావ్య భర్త ఆకర్ష్ కృష్ణ ఒక వ్యాపారవేత్త. శ్రవణ్‌రావు వారిని మోసగించి ఆ ఫ్లాట్‌ను తన గుప్పిట్లో పెట్టుకున్నారని, అక్కడ మద్యం కుంభకోణం నిందితులకు ఆశ్రయమిచ్చారని సిట్‌కు సమాచారమందింది. శ్రవణ్‌రావుతో కలిసి వారు అదే ఫ్లాట్‌లో ఉన్నారనే ఆధారాలను ఆకర్ష్ కృష్ణ గురువారం సిట్ అధికారులకు పంపించారు. వాటిని పరిశీలించిన సిట్.. సమగ్ర సమాచారంతో ఈ నెల 22న సిట్ కార్యాలయానికి రావాలని ఆయనను కోరింది.

దుబాయ్‌లోని ప్రధాన స్థావరం అక్కడే..

మద్యం కుంభకోణం కేసు దర్యాప్తు మొదలైన వెంటనే అందులో కీలక పాత్రధారులైన తూతేకుల ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, బూనేటి చాణక్య, సైఫ్ అహ్మద్, ముప్పిడి అవినాష్‌రెడ్డి, పురుషోత్తం వరుణ్‌కుమార్, బొల్లారం శివకుమార్, సైమన్ ప్రసన్, ప్రణోయ్ ప్రకాశ్ తదితరులందరినీ వైకాపా ముఠా దుబాయ్ పంపించేసింది. కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులకు గోల్డెన్ వీసాలు ఇప్పించింది. వారి ప్రధాన స్థావరం పారామౌంట్ హోటల్ అండ్ రెసిడెన్సీస్ భవనమేనని ఇప్పుడు బయటపడింది. శ్రవణ్‌రావు గుప్పిట్లో ఉన్న ఫ్లాట్‌తో పాటు మరికొన్ని ఫ్లాట్‌లను వారు అద్దెకు తీసుకుని ఆ భవనంలో ఉన్నట్లు సిట్‌కు సమాచారం అందింది. దీనిపై యూఏఈ ప్రభుత్వానికి లేఖ రాసి మరిన్ని వివరాలు తెప్పించాలని భావిస్తోంది.

వెలుగులోకి వచ్చిందిలా..

హైదరాబాద్‌కు చెందిన ఆకర్ష్ కృష్ణ, ఫోన్ ట్యాపింగ్ నిందితుడు శ్రవణ్‌రావు కలిసి 2023లో దుబాయ్‌లోని పారామౌంట్ టవర్ హోటల్‌లో 1,340.54 చదరపు అడుగుల విస్తీర్ణం ఉన్న ఫ్లాట్ కొన్నారు. ఆకర్ష్ కృష్ణ సతీమణి ఆర్.కావ్య, శ్రవణ్‌రావు భార్య స్వాతిరావుకు చెరిసగం వాటాలతో ఈ ఫ్లాట్ రిజిస్టరైంది. దానిని డీలక్స్ హాలీడే హోమ్స్ సంస్థకు అద్దెకు ఇచ్చారు. అయితే శ్రవణ్‌రావు తమను పూర్తిగా పక్కనపెట్టేసి స్వాతిరావు పేరుతో అద్దె ఒప్పందాన్ని చేసుకుని ఫ్లాట్‌ను తన ఆధీనంలో పెట్టుకున్నారని ఆకర్ష్ కృష్ణ సిట్ దృష్టికి తీసుకెళ్లారు. అసలు ఆ ఫ్లాట్‌లో ఎవరెవరు ఉన్నారని ఆకర్ష్ కృష్ణ వివరాలు సేకరించగా.. ఈ ఏడాది ఫిబ్రవరి 27 నుంచి ఏప్రిల్ 27 వరకూ మద్యం కేసులో నిందితులైన బూనేటి చాణక్య, వరుణ్ పురుషోత్తంతో పాటు ఆ ముఠాలోని మరికొంతమంది ఆ ఫ్లాట్‌లో ఉన్నట్లు వెల్లడైందని ఆకర్ష్ కృష్ణ సిట్ దృష్టికి తీసుకొచ్చారు.

విలాసాలకు పెట్టింది పేరు

దుబాయ్‌లోని పారామౌంట్ హోటల్ అండ్ రెసిడెన్సీస్ విలాసానికి, రాజభోగాలకు పెట్టింది పేరు. కళ్లు చెదిరిపోయే ఫినిషింగ్‌తో ఉండే ఈ టవర్స్‌లోని ఫ్లాట్‌లు వైభోగానికి చిహ్నంగా నిలుస్తాయి. రూఫ్‌టాప్ ఇన్ఫినిటీ పూల్, సినిమా థియేటర్లు, ఖరీదైన రెస్టారెంట్లు, లగ్జరీ స్పాల వంటి సకల సదుపాయాలు ఇక్కడ అందుబాటులో ఉంటాయి. ఈ టవర్‌లో నివసించాలంటే భారత కరెన్సీలో లక్షల రూపాయలు ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. అలాంటి చోట మద్యం కుంభకోణం నిందితులున్నారంటే.. వారు ఏ స్థాయిలో కొల్లగొట్టారో అర్థం చేసుకోవచ్చు.

నేడు 'ఐఎన్ఎస్ నిస్తార్' జాతికి అంకితం



డైవింగ్ సపోర్ట్ వెసల్ ఐఎన్ఎస్ నిస్తార్

విశాఖపట్నం (సింధియా), న్యూస్‌టుడే: ఆపదలో చిక్కుకునే జలాంతర్గాములను రక్షించడానికి ఆధునిక పరిజ్ఞానంతో నిర్మించిన 'ఐఎన్ఎస్ నిస్తార్' నౌకను శుక్రవారం విశాఖపట్నంలో జాతికి అంకితం చేయనున్నారు. తూర్పు నౌకాదళ ముఖ్య కార్యాలయం ఇందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది. ప్రత్యేక డైవింగ్ టీమ్, బహుళస్థ వినియోగ డెక్‌లు, హెలికాప్టర్ కలిగి ఉండటం ఐఎన్ఎస్ నిస్తార్ ప్రత్యేకతలు. హిందుస్థాన్ షిప్‌యార్డులో నిర్మించిన ఈ నౌక 10,500 టన్నుల బరువు, 120 మీటర్ల పొడవు ఉంటుంది. దీని తయారీకి 80 శాతానికిపైగా స్వదేశీ పరిజ్ఞానాన్ని వినియోగించారు. పూర్తి రిమోట్ ఆధారంగా పని చేసే అధునాతన నేవీ వర్గాలు వెల్లడించాయి. కార్యక్రమానికి కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్, భారత నేవీ అడ్మిరల్ దినేశ్ కె.త్రిపాఠి రానున్నారని నేవీ వర్గాలు పేర్కొన్నాయి.

జగన్ వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు

ఏపీ పోలీసు అధికారుల సంఘం మండిపాటు



శ్రీనివాసరావు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: పోలీసులను నేరస్తులతో, మాఫియా గ్యాంగ్‌లతో పోలుస్తూ మాజీ సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని ఏపీ పోలీసు అధికారుల సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. పోలీసుల మనోభావాలు, ఆత్మస్థైర్యం దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేయడాన్ని ఖండించింది. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆ సంఘం అధ్యక్షుడు జనకుల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి సీహెచ్ హరిప్రసాద్ మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు విధులు నిర్వహించిన పోలీసులే ప్రస్తుతం పనిచేస్తున్నారన్న సంగతి గుర్తుంచుకోవాలని హితవు పలికారు. బాధ్యత కలిగిన పదవిలో ఉంటూ పోలీసులను కించపరిచేలా మాట్లాడటం దురదృష్టకరమని పేర్కొన్నారు. పోలీసులు ఒక వ్యవస్థలో భాగంగా పని చేస్తున్నారు. వైకాపా నాయకులను బెదిరిస్తున్నారని అనడం దుర్మార్గమన్నారు. దేవాలయంలాంటి ఏపీ పోలీసు విభాగాన్ని అవమానించేలా మాట్లాడటం తగదన్నారు. డీఎస్పీలు, సీఐల దుస్తులు ఊడదీస్తామనడం, ఎమ్మెల్యేలకు ఇస్తున్నారని నిరాధార ఆరోపణలు చేయడాన్ని ఖండించారు. పోలీస్ శాఖలో ఓ ఉన్నతాధికారి మాఫియా డాన్‌తో పోలుస్తూ మాట్లాడటాన్ని ఖండించారు. ఐపీఎస్ అధికారి సిద్ధార్థ్ కౌశల్ వ్యక్తిగత కారణాలతో వీఆర్ఎస్ తీసుకుంటే, దాన్ని రాజకీయానికి వాడుకోవడం తగదని వెల్లడించారు. జగన్ పర్యటనల్లో పోలీసులపై భౌతిక దాడులు జరగడం దుర్మార్గమని వెల్లడించారు. పోలీసులు రూల్ ఆఫ్ లా నిష్పక్షపాతంగా అమలు చేస్తారని, ఏ వర్గానికి, రాజకీయ పార్టీకి కొమ్ము కాయరనే సంగతి తెలుసుకోవాలని సూచించారు.

జగన్ వ్యాఖ్యలతో మీడియా వాతావరణం కలుషితం

రాష్ట్ర మీడియా అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్

ఈనాడు, అమరావతి: వైకాపా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి వ్యాఖ్యలతో రాష్ట్రంలో మీడియా వాతావరణం కలుషితమవుతోందని, స్వయంగా ఒక దినపత్రిక, న్యూస్ ఛానల్ నడుపుతున్న ఆయన ఇతర మీడియా సంస్థలపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని రాష్ట్ర మీడియా అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేశ్‌కుమార్ అన్నారు. 'జగన్ వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. మీడియా విశ్వసనీయత పలుచనవుతుంది. అవాంఛనీయ ధోరణులు ఉంటే.. ఒక మీడియా సంస్థ యజమానిగా వాటిని పరిహరించేందుకు ఏం చేయాలో చెప్పాలి. అంతే తప్ప, అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సబబు? జగన్ ఒక మీడియా సంస్థకు యజమానే కాదు. ఓ రాజకీయ పార్టీ నేత. ముఖ్యమంత్రి వంటి ఉన్నత స్థాయి పదవి అధిష్ఠించిన వ్యక్తి మీడియాపై ఈ తరహా వ్యాఖ్యలు చేయడం వల్ల అంతిమంగా నష్టపోయేది సత్యం' అని సురేశ్‌కుమార్ గురువారం ఒక ప్రకటలో పేర్కొన్నారు.

మేం మాట నిలబెట్టుకున్నాం.. మీరు ఫలితాలు సాధించండి

- మంత్రి లోకేశ్



బాపట్ల పురపాలక ఉన్నత పాఠశాలలో నిర్మించిన నూతన భవనం

హామీ ఇచ్చిన కొన్ని నెలల్లోనే కూటమి ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన పాఠశాల భవనాన్ని నిర్మించి విద్యార్థులకు కానుకగా అందించింది. నిరుడు డిసెంబరు 7న మెగా పీటీఎంను బాపట్ల పురపాలక ఉన్నత పాఠశాలలో నిర్వహించగా పాఠశాలలోని సమస్యలను ఉపాధ్యాయులు, విద్యార్థులు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. నూతన విద్యా సంవత్సరం మొదలయ్యేలోగా పాఠశాలలో అన్ని వసతులూ కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. 6 నెలల్లోనే 24 గదులు, డైనింగ్ హాల్, ప్రయోగశాలలతో కూడిన భవనాన్ని పూర్తి చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులను ఉద్దేశించి మంత్రి లోకేశ్ ఎక్స్‌లో గురువారం పోస్ట్ చేశారు. 'ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం. మంచి ఫలితాలు సాధించి బాపట్ల పురపాలక ఉన్నత పాఠశాల పేరు నిలబెట్టాలని విద్యార్థులు, ఉపాధ్యాయులను కోరుతున్నా' అని పేర్కొన్నారు.

- న్యూస్‌టుడే, బాపట్ల

అసభ్య పదజాలంతో దూషించేవారిపై కఠిన చర్యలు

- మచిలీపట్నంలో రాష్ట్రంలోనే అతిపెద్ద పోలీస్ శిక్షణ కేంద్రం
- మంత్రులు వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి వంగలపూడి అనిత. వేదికపై వర్ల కుమార్‌రాజా, వెనిగండ్ల రాము, కొనకళ్ల నారాయణరావు, కొల్లు రవీంద్ర, యార్లగడ్డ వెంకట్రావు, రావి వెంకటేశ్వరరావు

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం: అసభ్య పదజాలంతో దూషించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటూనే సామాజిక మాధ్యమాలు, మీడియాలో వీటికి అడ్డుకట్ట వేసేలా చట్టం చేయాలని, త్వరలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో దీనిపై చర్చిస్తామని మంత్రులు వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. మచిలీపట్నంలో 46 ఎకరాల్లో ఏర్పాటు కానున్న పోలీస్ శిక్షణ కేంద్రానికి గురువారం మంత్రులు, ఎమ్మెల్యేలు శంకుస్థాపన చేశారు. అనంతరం హోంమంత్రి అనిత మాట్లాడుతూ 'రాష్ట్రంలోనే అతిపెద్ద పోలీస్ శిక్షణ కేంద్రం మచిలీపట్నంలో నిర్మాణం కానుంది. దీన్ని అత్యాధునిక వసతులతో వచ్చే మార్చి నాటికి పూర్తి చేస్తాం. శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా పోలీసు శాఖలో మౌలిక వసతులు కల్పిస్తున్నాం. సైబర్ నేరాల కట్టడికి కానిస్టేబుల్ నుంచి ఉన్నతస్థాయి అధికారుల వరకు ఇక్కడ శిక్షణ తీసుకునేలా ప్రణాళికలు రూపొందిస్తాం. ఈ ప్రాంతంలో మెరైన్ పోలీస్‌స్టేషన్‌ను పునరుద్ధరిస్తాం' అని పేర్కొన్నారు. 'నాయకులు, కార్యకర్తలతో అకారణంగా గన్నవరం తెదేపా కార్యాలయంపై దాడి చేయించి విధ్వంసం సృష్టిస్తే చర్యలు తీసుకోకూడదా? కనుసైగ చేస్తే చీకట్లో నరికేయాలని మాజీ మంత్రి పేర్ని నాని కార్యకర్తలను రెచ్చగొడితే కేసు పెట్టకూడదా' అని ప్రశ్నించారు. రూ.32 కోట్లతో రాష్ట్రంలోనే అతిపెద్ద పోలీస్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, వర్ల కుమార్‌రాజా, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, రాష్ట్ర గిడ్డంగుల ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రూ.39,509 కోట్ల పెట్టుబడులు.. 30,899 మందికి ఉపాధి!

- ఇప్పటి వరకు 8 ఎస్ఐపీబీలు.. 109 ప్రాజెక్టులు
- మొత్తం రూ.5.74 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో రూ.39,509 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఐటీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఇంధన, పర్యాటక రంగాలకు సంబంధించిన 22 సంస్థలు ఆసక్తి చూపాయి. వాటి ద్వారా 30,899 మందికి ఉపాధి కల్పించనున్నట్లు సంస్థలు ప్రతిపాదనల్లో పేర్కొన్నాయి. రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) 8వ సమావేశం ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో గురువారం జరిగింది. పరిశ్రమల శాఖ నుంచి 11, ఇంధన రంగంలో 7, పర్యాటక రంగంలో 3, ఐటీ, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు సంబంధించి ఒక్కొక్క ప్రాజెక్టుకు మండలి ఆమోదం తెలిపింది.

స్థానికులకూ లబ్ధి కలిగేలా ఉండాలి

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో ఏర్పాటయ్యే పరిశ్రమల చుట్టూ అవసరమైన అనుకూల పరిస్థితులు కల్పించాలి. దీనివల్ల ప్రాజెక్టులతో పాటు స్థానికులు, అనుబంధ సంస్థలకూ లబ్ధి కలుగుతుంది. ప్రాజెక్టులకు సమీపంలో రహదారులు, పోర్టులు, ఎయిర్‌పోర్టుల ఉంటే అక్కడ ఆర్థిక కార్యకలాపాలు అభివృద్ధి చెందుతాయి. ప్రాజెక్టులు నిర్దేశిత వ్యవధిలో పూర్తి చేసేందుకు అధికారులు పర్యవేక్షించాలి. అనుబంధ కార్యకలాపాలకు అవకాశం కల్పించాలి. ప్రత్యేకించి సేవా రంగ (సర్వీస్ సెక్టార్) ప్రాజెక్టులనూ అనుసంధానం చేయాలి. భూములు ఇచ్చిన రైతులు, స్థానికులకు ప్రయోజనం కల్పించాలి' అని సూచించారు. సమావేశంలో మంత్రులు లోకేశ్, అచ్చెన్నాయుడు, కేశవ్, టీజీ భరత్, సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేష్, వాసంశెట్టి సుభాష్, సీఎస్ కె.విజయానంద్ పాల్గొన్నారు.

పర్యాటక ప్రాజెక్టులూ కీలకం

పర్యాటక ప్రాజెక్టులకూ సమీకృత ప్రణాళికల్ని అమలు చేయాలని సీఎం ఆదేశించారు. 'పీపీపీ విధానంలో చేపట్టే వాటికి ప్రభుత్వ భూములను సేకరించుకోవాలి. శ్రీశైలంలో దేవాలయంతో పాటు భారీ నీటి ప్రాజెక్టునూ పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలి. శ్రీశైలం రహదారి విస్తరణపైనా దృష్టి పెట్టాలి. ఆతిథ్య రంగంలో కేవలం హోటళ్లు మాత్రమే కాకుండా.. అనుబంధంగా వినోద కార్యకలాపాలు, సేవల రంగానికి సంబంధించిన ప్రాజెక్టులూ తేవాలి' అని పేర్కొన్నారు.

ఎస్ఐపీబీ తాజాగా ఆమోదించిన ప్రాజెక్టులు

సంస్థ	ప్రాంతం	పెట్టుబడి (రూ.కోట్లలో)	ఉపాధి
ఫినామ్ పీపుల్ ప్రైవేట్ లిమిటెడ్	విశాఖ	205	2,500
శ్రీజా మహిళా ప్రొడ్యూసర్ కంపెనీ	చిత్తూరు	282	1,400
రెన్యూ వ్యోమన్ పవర్ లిమిటెడ్	కర్నూలు, నంద్యాల	1.800	380
రెన్యూ విక్రమ్ శక్తి ప్రైవేట్ లిమిటెడ్	కర్నూలు, నంద్యాల	3.600	760
జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ	కడప	2.000	1,380
వీపీఎస్ రామ్మోహన్ ఇండస్ట్రీస్	శ్రీకాకుళం	204	1,000
పీవీఎస్ గ్రూప్	విజయనగరం	102	500
ఆర్వీఆర్ ప్రైవేట్ లిమిటెడ్	నంద్యాల	4.708	1,200
ఐటీసీ హోటల్స్ లిమిటెడ్	విశాఖ	328	1,100
లాన్సమ్ లీజర్స్ లిమిటెడ్ ఎంటర్‌టైన్‌మెంట్స్	విశాఖ	86	720
స్టార్ టర్న్ హోటల్స్ ఎల్ఎల్‌పీ	తిరుపతి	165	280
గ్రీన్ ల్యామ్ లిమిటెడ్	నాయుడుపేట సెజ్	1,147	1,475
యాక్సెలెంట్ ఫార్మా	శ్రీసిటీ	1,358	1,770
అగస్త్య ఎనర్జీ ఇండస్ట్రీస్ లిమిటెడ్	కర్నూలు	6,933	2,138
జేఎస్‌డబ్ల్యూ ఏపీ స్టీల్ ప్లాంట్	కడప స్టీల్ ప్లాంట్	4,500 (రెండు దశల్లో)	2,500
రెన్యూ ఫొటోవోల్టాయిక్ ప్రై.లిమిటెడ్	అనకాపల్లి	3,700	1200
లారస్ ల్యాబ్స్	అనకాపల్లి	5,630	6,350
లులు ఇంటర్నేషనల్ లిమిటెడ్	విశాఖ, విజయవాడ	1,222	1,500
ఏస్ ఇంటర్నేషనల్	కుప్పంలో డైరీ యూనిట్	1,000	2,000
బ్రాండిక్స్ ఇండియా అపరల్స్	అచ్యుతాపురం సెజ్‌లో ఫుట్‌వేర్, టాయ్స్ తయారీ	-	-
వీఎస్ఆర్ సర్కాన్	శ్రీకాకుళం	39	246
అవిశా ఫుడ్స్ అండ్ ఫ్యూయల్స్	కృష్ణా జిల్లా మల్లవల్లి	500	500

★ ఇప్పటివరకు ఎస్ఐపీబీ సమావేశాల్లో పరిశ్రమల శాఖ 46 ప్రాజెక్టులు, ఇంధన రంగానికి చెందిన 41, పర్యాటక రంగంలో 11, ఐటీలో 7, ఫుడ్ ప్రాసెసింగ్‌లో 4 ప్రాజెక్టులకు ఆమోదం. వాటి ద్వారా రూ. 5,74,238 కోట్ల విలువైన పెట్టుబడులు.. 5,05,968 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

20న ఆలూరి బైరాగి, శారదల శతజయంతి సదస్సు



సదస్సు ప్రతులు ఆవిష్కరిస్తున్న బాబు ఆర్. వడ్లమూడి, హకీంజానీ, కిషోర్ కుమార్ తదితరులు

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: సాహితీ దిగ్గజాలు దివంగత ఆలూరి బైరాగి, నటరాజన్ (శారద)ల శతజయంతి సదస్సును ఈ నెల 20న నిర్వహిస్తున్నట్లు వడ్లమూడి గోపాలకృష్ణయ్య వెంకట లక్ష్మమ్మ ఫౌండేషన్ అధ్యక్షుడు బాబు ఆర్.వడ్లమూడి తెలిపారు. గుంటూరు జిల్లా తెనాలిలోని కొత్తపేటలో ఈ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. గురువారం ఆయన తెనాలిలో మాట్లాడారు. "సాహిత్య అకాడమీ, ఫౌండేషన్‌లు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సదస్సు ప్రారంభ సమావేశంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు పాపినేని శివశంకర్, పెనుగొండ లక్ష్మీనారాయణ ప్రసంగించనున్నారు. మొదటి సమావేశంలో రచయితలు కందిమళ్ల శివప్రసాద్, కొర్రపాటి ఆదిత్య, పేరిశెట్టి శ్రీనివాసరావు.. బైరాగి కవిత్వం, కథలు, నవల, నాటకం, హిందీ సాహిత్య కృషిపై పత్రాలు సమర్పిస్తారు. రెండో సమావేశంలో రచయితలు కె.శరత్‌చంద్ర జ్యోతిశ్రీ, చెరుకూరి సత్యనారాయణ.. శారద కథ, నవలా సాహిత్యంపై ప్రసంగించనున్నారు. ముఖ్యఅతిథిగా రచయిత యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, సదస్సుకు అధ్యక్షులుగా కొత్తపల్లి రవిబాబు, గుజ్జర్లమూడి కృపాచారి వ్యవహరిస్తారు'' అని వివరించారు. అనంతరం షేక్ అబ్దుల్ హకీంజానీ, తుమ్మల కిషోర్‌కుమార్, చెరుకుమల్లి సింగారావు, గరికపాటి సుబ్బారావులతో కలిసి సదస్సు ప్రతులను ఆవిష్కరించారు.

అట్లాస్ తోకచుక్క వీడియో విడుదల

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ ఇటీవల గుర్తించిన అట్లాస్ తోకచుక్క వీడియో, టైమ్-లాప్స్ చిత్రాల సమాహారాన్ని గురువారం విడుదల చేసింది. ఈ తోకచుక్కను 3ఐ/అట్లాస్ అని కూడా సంస్థ వ్యవహరిస్తోంది. ఈ తోకచుక్కను మొదటిసారిగా చిలీలోని అట్లాస్ టెలిస్కోప్ ద్వారా ఈ ఏడాది జులై 1న కనుగొన్నారు. 'ఇది మన సౌర వ్యవస్థను సందర్శించిన మూడో ఇంటర్‌స్టెల్లార్ పదార్థం మాత్రమే. సూర్యుని గురుత్వాకర్షణ శక్తి నుంచి నిష్క్రమించే ముందు దాని నిర్మాణం, రసాయన బంధాన్ని మరింత తెలుసుకునేందుకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న టెలిస్కోపులు అధ్యయనం చేస్తాయి' అని ఐఐఏలో శాస్త్ర, సాంకేతిక, సమాచార, ప్రజాసంబంధాల విద్యా (స్కోప్) విభాగాధిపతి నిరుజ్ మోహన్ రామానుజం వెల్లడించారు. లద్దాఖ్ ప్రాంతంలోని హన్లేలో ఉన్న భారతీయ ఆస్ట్రోనామికల్ అబ్జర్వేటరీలోని హిమాలయన్ చంద్ర టెలిస్కోప్‌ను ఉపయోగించి జులై 3న రాత్రి ఐఐఏ పరిశోధకులు ఈ తోకచుక్కను పరిశీలించారని ఆయన ధ్రువీకరించారు. సూర్యుని నుంచి దాదాపు 4.5 ఖగోళ యూనిట్ల (దాదాపు 670 మిలియన్ కిలోమీటర్ల) దూరంలో ఉన్న ఈ తోకచుక్క సెకనుకు 61 కి.మీ. వేగంతో ప్రయాణిస్తుందని అంచనా వేశామన్నారు. ఈ తోకచుక్క 270 మిలియన్ కి.మీ. దూరం నుంచి వెళుతుండడంతో భూమికి ఎటువంటి ప్రమాదం ఉండదని నాసా ఇప్పటికే నిర్ధారించిందని చెప్పారు.

పీజీ డెంటల్‌లో 185 సీట్లు భర్తీ

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: 2025-26 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలో పలు దంత వైద్య కళాశాలల్లో అందుబాటులో ఉన్న పీజీ దంత వైద్య (ఎండీఎస్)కు కన్వీనర్ కోటా కింద మొదటి విడత కౌన్సెలింగ్‌లో 185 సీట్లు భర్తీ అయ్యాయి. ఇంకా 13 సీట్లు ఖాళీగా ఉన్నట్లు ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి ప్రకటించారు.



అరటి పండుతో రక్తపోటు తగ్గుముఖం

సామాన్యుడి యాపిల్‌గా పిలుచుకొనే అరటి పండ్లలో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. ఇది శరీరంలో సోడియం స్థాయిలను అదుపులో ఉంచుతుంది. ఆహారంలో పొటాషియం అధిక పరిమాణంలో ఉంటే, రక్తనాళాల గోడల్లో ఒత్తిడి తగ్గుతుంది. ఫలితంగా రక్తపోటు తగ్గుముఖం పడుతుంది. అందుకే భోజనం తర్వాత అరటి పండు తీసుకోండి.

– గేబ్ ఫ్యుగ్రేజ్, లైఫ్‌స్టైల్ కోచ్

నూతన పర్యాటక విధానంతో ఆతిథ్య రంగానికి ఊతం

- రాష్ట్రంలో కొత్త హోటళ్లు రానున్నాయి
- స్టార్ హోటళ్లకు ఆస్తి పన్ను, విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలి
- ఏపీ స్టార్ హోటళ్ల సంఘం వినతి



సమావేశంలో పాల్గొన్న ఏపీ స్టార్ హోటళ్ల సంఘం అధ్యక్షుడు ఆర్.వి.స్వామి, గవర్నింగ్ బాడీ కౌన్సిల్ సభ్యుడు ప్రభుకిశోర్, ఉపాధ్యక్షుడు వెంకట్, దసపల్లా హోటళ్ల ఎండీ రాఘవేంద్రరావు, ప్రధాన కార్యదర్శి మూర్తి చిట్టూరి, సంయుక్త కార్యదర్శి పవన్‌కార్తిక్ తదితరులు

విశాఖపట్నం (జగదాంబ కూడలి), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన పర్యాటక విధానం ఎంతో బాగుందని, ముఖ్యమైన నగరాల్లో ఆతిథ్య రంగంలోకి కొత్త హోటళ్లు రానున్నాయని ఆంధ్రప్రదేశ్ స్టార్ హోటళ్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్వీ స్వామి అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన మేరకు రాష్ట్రంలోని హోటళ్లలో 50 వేల గదులు అవసరమవుతాయని, అందుకు తగ్గట్టుగానే అమరావతి, విశాఖ, తిరుపతి, విజయవాడ, ఉభయ గోదావరి జిల్లాల్లో కొత్త హోటళ్లు వస్తున్నాయన్నారు. ఒక్క అమరావతిలోనే 17 అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. గురువారం విశాఖలో అసోసియేషన్ కీలక సమావేశం నిర్వహించారు. స్వామి మాట్లాడుతూ కొత్త హోటళ్లకు రాయితీలు ఇస్తున్న తరహాలో పాత హోటళ్లకు కూడా ఇవ్వాలని కోరారు. స్టార్ హోటళ్ల నిర్వహణలో ఇబ్బందులు, అభివృద్ధికి పలు సూచనలు, సలహాలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి ఈ సంఘాన్ని నెల కిందట ప్రారంభించామని చెప్పారు. త్వరలోనే కొన్ని సమస్యలపై సీఎంను కలవనున్నామని తెలిపారు. ఈ సంఘం రాష్ట్ర గవర్నింగ్ బాడీ కౌన్సిల్ సభ్యులుగా డాల్ఫిన్ హోటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ చెరుకూరి విజయేశ్వరి, వరుణ్ నోవాటెల్ ఛైర్మన్ ప్రభుకిశోర్, ఫార్చ్యూన్ హోటల్స్ ప్రతినిధి మురళీకృష్ణ, గ్రీన్‌ట్రీ హోటల్స్ ప్రతినిధి గంగరాజు వ్యవహరిస్తున్నారన్నారు. కౌన్సిల్ సభ్యులు ప్రభుకిశోర్ మాట్లాడుతూ పర్యాటకంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి పలు రాయితీలు ఇస్తూ ప్రోత్సహిస్తున్నారన్నారు. ముఖ్యంగా బార్ లైసెన్సు రుసుం రూ.25 లక్షలకు తగ్గించడం హర్షించదగ్గ విషయమన్నారు. దసపల్లా హోటళ్ల ఎండీ రాఘవేంద్రరావు మాట్లాడుతూ హోటళ్ల అభివృద్ధికి ప్రభుత్వం మరిన్ని రాయితీలు ప్రకటించాలని, దీనివల్ల ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని అభిప్రాయపడ్డారు. సంఘ ప్రధాన కార్యదర్శి ఎస్.మూర్తి చిట్టూరి మాట్లాడుతూ త్రీస్టార్ హోటళ్లకు విద్యుత్ బిల్లు రూ.లక్షల్లో వస్తుందని.. కొన్ని రాష్ట్రాల్లో ఈ బిల్లుపై 40 శాతం రాయితీ ఇస్తున్నారన్నారు. నైపుణ్య శిక్షణ కేంద్రాలను బలోపేతం చేయడంతో పాటు జీఎస్టీ తగ్గించాలన్నారు. ప్రభుత్వ రాయితీల వల్లే భోగాపురం విమానాశ్రయం పరిసరాల్లో స్టార్ హోటళ్లు వస్తున్నాయని తెలిపారు. సంఘ ఉపాధ్యక్షుడు వెంకట్, సంఘ సంయుక్త కార్యదర్శి పవన్ కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

పోలవరంపై నేడు దిల్లీలో సమీక్ష

ఈనాడు, అమరావతి: పోలవరం ప్రాజెక్టును 2027 డిసెంబరు నాటికి పూర్తి చేయాలనే లక్ష్యం విధించిన కేంద్ర జలశక్తి శాఖ.. ఈ ప్రాజెక్టు పురోగతిపై దృష్టి సారించింది. మూడు నెలల తర్వాత ఇప్పుడు మరోసారి కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ ఈ జాతీయ ప్రాజెక్టు పురోగతి, సమస్యలు, ఇంతకుముందు నిర్ణయాలు ఎంతవరకు అమలు చేశారనే అంశాలపై సమీక్షించనున్నారు. దిల్లీలోని శ్రమశక్తిభవన్‌లో శుక్రవారం ఉదయం 11 గంటలకు ఈ సమావేశం ఉంటుంది. ఇందుకోసం పోలవరం చీఫ్ ఇంజినీర్ నరసింహమూర్తి దిల్లీ వెళ్లారు.

EENADU Vol: 51, Issue: 339 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

గల్ఫ్ నేతలతో ట్రంప్ భేటీ

• పశ్చిమాసియాలో శాంతిపై చర్చ

వాషింగ్టన్: పర్షియన్ గల్ఫ్‌లోని రెండు దేశాల నేతలతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం శ్వేతసౌధంలో భేటీ అయ్యారు. ఇజ్రాయెల్, సిరియా మధ్య తాజా ఘర్షణతో పశ్చిమాసియాలో శాంతి విషయంలో తాను ఇచ్చిన హామీపై తలెత్తిన సందేహాల గురించి చర్చించారు. బహ్రెయిన్ యువరాజు సల్మాన్ బిన్ హమద్ అల్ ఖలీఫాతో ఓవల్ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఖతార్ ప్రధాని షేక్ మహమ్మద్ బిన్ అబ్దుల్‌రహమాన్ అల్ థానీతో బుధవారం సాయంత్రం ప్రైవేటు విందులో పాల్గొన్నారు. తన కుటుంబ సభ్యులకు గల్ఫ్‌లో వ్యాపారాలు ఉన్న నేపథ్యంలో ట్రంప్.. ఆ దేశాలకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నారు. దీంతోపాటు అమెరికా సైనిక స్థావరాలు ఉన్నాయి. రెండో విడత అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టాక సౌదీ అరేబియా, ఖతార్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో ఆయన పర్యటించారు. 'వారికి ఏ అవసరం వచ్చినా సాయం చేస్తాం. అలాగే మాకే అవసరం వచ్చినా వారు సాయం చేస్తారు' అని ట్రంప్ సమావేశం అనంతరం వ్యాఖ్యానించారు.

✦ అల్ ఖలీఫాతో జరిగిన సమావేశంలో మధ్యంతర ఒప్పందం కుదిరింది. అమెరికా యుద్ధ విమానాలు, జెట్ ఇంజిన్లు, కంప్యూటర్ సర్వర్లను బహ్రెయిన్ కొనుగోలు చేయనుంది. అల్యూమినియం ఉత్పత్తి, కృత్రిమ మేధలో మరిన్ని పెట్టుబడులు పెట్టనుంది.

అద్దె సబ్సిడీకి కోతపెట్టనున్న ట్రంప్!

వాషింగ్టన్: డొనాల్డ్ ట్రంప్ దృష్టి ఈసారి అల్పాదాయ వర్గాల గృహ వసతిపై పడటంతో పేద అమెరికన్లు హడలిపోతున్నారు. అల్పాదాయ కుటుంబాల్లో నాలుగో వంతు మంది ప్రస్తుతం అమెరికా గృహ వసతి, పట్టణాభివృద్ధి (హెచ్.యు.డి) పథకం కింద అద్దె సబ్సిడీ పొందుతున్నారు. ఉదాహరణకు వాషింగ్టన్‌లోని ఒడిస్‌విల్ ప్రాంతంలో రెండు పడక గదుల అపార్ట్‌మెంట్‌కు 2,000 డాలర్ల అద్దె ఉంటుంది. అద్దె సబ్సిడీ కింద అల్పాదాయ వర్గాలు 450 డాలర్లకే అలాంటి అపార్ట్‌మెంట్‌లో ఉండగలుగుతారు. ఇలాంటి సబ్సిడీ అపార్ట్‌మెంట్లలో అల్పాదాయ వర్గాలవారు సౌకర్యంగా జీవిస్తుంటారు. ఈలోగా ఆర్థికంగా కుదుటపడి వేరే చోటికి వెళ్లిపోతారు. కానీ ఇప్పుడు ట్రంప్ సర్కారు అద్దె సబ్సిడీని రెండేళ్లకే పరిమితం చేయాలనుకోవడం వీరికి పిడుగుపాటవుతోంది. ప్రజా గృహ వసతి ప్రాజెక్టుల్లో నివసించే 10 లక్షల కుటుంబాలకు హెచ్.యు.డి. సబ్సిడీ వర్తిస్తున్నాయి. దివ్యాంగులు, వృద్ధులకు హెచ్.యు.డి. సెక్షన్ 8 వోచర్లు ఇస్తారు. వీరికి సబ్సిడీ గృహ వసతిపై కాల పరిమితి విధించరు. అల్పాదాయ వర్గాల హౌసింగ్ పథకంలో, సెక్షన్ 8 వోచర్లలో అవినీతి, మోసాలను నిరోధించడానికే కాల పరిమితిని విధించదలచామని హెచ్.యు.డి. సబ్సిడీ తాత్కాలికమే తప్ప శాశ్వతం కాదని గుర్తించాలని ఆ సంస్థ కార్యదర్శి స్కాట్ టర్నర్ తెలిపారు.

అసెంబ్లీ ప్రాంగణంలో బాహాబాహీ

ముంబయి: మహారాష్ట్ర శాసనసభ ప్రాంగణంలో గురువారం ఇద్దరు ఎమ్మెల్యేల మద్దతుదారులు బాహాబాహీకి దిగారు. ఈ ఇద్దరు ఎమ్మెల్యేలలో ఒకరు భాజపాకు చెందిన గోపీచంద్ పడాల్కర్ కాగా మరొకరు ఎన్సీపీ(ఎస్పీ)కి చెందిన జితేంద్ర అవహాద్. అయితే ఎమ్మెల్యేలు అవహాద్, పడాల్కర్‌ల మధ్య శాసనసభ భవనం ప్రవేశ ద్వారం వద్ద జరిగిన వాగ్వాదం తర్వాత మద్దతుదారుల మధ్య ఘర్షణ చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఇద్దరూ తీవ్ర స్వరంతో వాదులాడుకుంటున్న వీడియో వైరల్‌గా మారింది. ఈ ఘటనపై భాజపా ఎమ్మెల్యే పడాల్కర్ క్షమాపణ చెప్పారు. "ఇది దురదృష్టకర ఘటన. శాసనసభ స్పీకర్‌కు, శాసనమండలి ఛైర్మన్‌కు క్షమాపణ కోరుతున్నాను" అని ఆయన అన్నారు.

రేపు ఇండియా కూటమి నేతల భేటీ

దిల్లీ: పార్లమెంటు వర్షాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రతిపక్ష ఇండియా కూటమి నేతలు శనివారం వర్చువల్‌గా భేటీ కానున్నారు. దిల్లీలోని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో ఈ సమావేశం జరుగనుందని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, శివసేన (ఉద్ధవ్ వర్గం) ఎంపీ సంజయ్ రౌత్ గురువారం మీడియాకు వెల్లడించారు. కూటమిలోని భాగస్వామ్య పార్టీల ఎంపీలు.. పార్లమెంటులో లేవనెత్తాల్సిన అంశాలపై ఇందులో ప్రధానంగా చర్చించనున్నారని తెలిపారు.

ఇరాక్‌లోని షాపింగ్ మాల్‌లో భారీ అగ్ని ప్రమాదం

• 61 మంది మృతి

బగ్దాద్: ఇరాక్‌లోని ఓ షాపింగ్ మాల్‌లో ఘోర అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో 61 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో మహిళలు, చిన్నారులున్నారు. చాలా మంది కాలిన గాయాలతో మరణించగా, 14 మృత దేహాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోయాయని గురువారం అధికారులు తెలిపారు. కట్ నగరంలో వారం క్రితమే ప్రారంభమైన ఐదంతస్తుల భవనంలో బుధవారం రాత్రి మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో 45 మందిని అధికారులు కాపాడారు. మరికొందరి ఆచూకీ లభించడం లేదు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఆ భవనం, షాపింగ్‌మాల్ యజమానులపై కేసు నమోదు చేశారు.

సిరియాలో అమల్లోకి కాల్పుల విరమణ

డమాస్కస్: అమెరికా, తుర్కియే, అరబ్ దేశాల మధ్యవర్తిత్వంతో సిరియా ప్రభుత్వానికి, ఆ దేశంలోని డ్రూజ్ మైనారిటీ వర్గానికి మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం గురువారం నుంచి అమల్లోకి వచ్చింది. దీంతో సిరియా ప్రభుత్వ సేనలు.. ఘర్షణలు జరిగిన స్వైదా ప్రాంతం నుంచి వైదొలిగాయి. సిరియాలో అసద్ ప్రభుత్వం కూలిపోయిన తరువాత స్వైదాలో సున్నీ బెడోయిన్ తెగకూ, డ్రూజ్ తెగకూ మధ్య సాయుధ సంఘర్షణ, బలవంతపు అపహరణలు జరిగాయి. ఈ ఘర్షణలు, ఇజ్రాయెల్ దాడుల్లో మొత్తం 374 మంది మరణించారు.

అంతర్జాతీయ రైల్వే ఒప్పందంలో పాక్

ఇస్లామాబాద్: పాకిస్థాన్, అఫ్గానిస్థాన్, ఉజ్బెకిస్థాన్‌ల మధ్య రైల్వే లైను వేసేందుకు త్రైపాక్షిక ఒప్పందంపై మూడు దేశాలు గురువారం సంతకాలు చేశాయి. ఈ ఒప్పందంలో భాగంగా తాష్కెంట్, కాబుల్, పెషావర్ నగరాల మధ్య 4.8 బిలియన్ డాలర్ల వ్యయంతో రైల్వే లైను నిర్మించనున్నారు. ఈ రైల్వే లైను పాకిస్థాన్‌కు చెందిన రేవు పట్టణాలైన గ్వాదర్, కరాచీల వరకూ పొడిగిస్తారు.

విమాన ప్రమాదంపై అప్పుడే నిర్ధారణకు రావడం తొందరపాటే

• ఏఏఐబీ స్పష్టీకరణ



దిల్లీ: అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై అప్పుడే ఒక నిర్ధారణకు రావడం తొందరపాటే అవుతుందని విమాన ప్రమాద దర్యాప్తు బ్యూరో (ఏఏఐబీ) స్పష్టం చేసింది. దర్యాప్తు కొనసాగుతోందని, అపరిపక్వ వాదనల ప్రచారానికి దూరంగా ఉండాలని ప్రతి ఒక్కరికీ సూచిస్తున్నామని ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్న ఆ సంస్థ పేర్కొంది. 'అంతర్జాతీయ మీడియాలోని కొంత మంది.. పరిశీలన లేకుండానే పదేపదే ప్రమాద కారణాలపై తుది తీర్పులిచ్చేస్తున్నారు. ఈ చర్యలు బాధ్యతారహితమైనవి. దర్యాప్తు జరుగుతుండగా ఇటువంటివి ప్రచారం చేయడం తగదు' అని గురువారం ఏఏఐబీ డైరెక్టర్ జనరల్ జీవీజీ యుగంధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దర్యాప్తు తుది నివేదిక వచ్చేదాకా వేచి ఉండాలని సూచించారు. భారత పౌరవిమానయానం పట్ల ప్రజల్లో ఆదుర్దా, ఆందోళన కలిగించేలా కథనాలను ప్రచారం చేయడానికి ఇది సమయం కాదని స్పష్టం చేశారు.

ఇంధన స్విచ్‌ల లాకింగ్ వ్యవస్థల్లో ఎలాంటి లోపాల్లేవ్: ఎయిరిండియా

బోయింగ్ 787 విమానాల్లోని ఇంధన స్విచ్‌ల లాకింగ్ వ్యవస్థల్లో ఎటువంటి లోపాలు లేవని తేలిందని ఎయిరిండియా ప్రకటించింది. డీజీసీఏ ఇచ్చిన ఆదేశాలతో అన్ని విమానాలను తనిఖీ చేశామని, ఏ లోపాలూ లేవని వెల్లడైందని తెలిపింది. అహ్మదాబాద్ విమాన ప్రమాద నేపథ్యంలో డీజీసీఏ ఈ ఆదేశాలిచ్చింది. దీంతో తన ఇంజినీరింగ్ బృందం ద్వారా తమవద్ద ఉన్న అన్ని బోయింగ్ 787 విమానాల్లో పూర్తి స్థాయిలో తనిఖీలు చేపట్టింది.

'స్టెబిలైజర్ లోపంపైనా దృష్టి పెట్టాలి'

దిల్లీ: అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై దర్యాప్తు జరుపుతున్న ఏఏఐబీ.. విమాన స్టెబిలైజర్ లోపంపైనా దృష్టి సారించాలని పౌర విమానయానరంగ నిపుణుడు, మాజీ కెప్టెన్ ఎహ్‌సాన్ ఖలీద్ సూచించారు. దీనివల్లా విమానం కూలిపోవచ్చని అభిప్రాయపడ్డారు. స్టెబిలైజర్ ఇన్‌పుట్స్ డేటాను సేకరించేందుకు దర్యాప్తు అధికారులు.. విమాన డేటా రికార్డర్‌ను పరిశీలించాలని సూచించారు. ఒకవేళ దానిని సరిగ్గా బిగించకపోతే టేకాఫ్ సమయంలో ఇబ్బందులు తలెత్తే ప్రమాదముందని పేర్కొన్నారు. స్టెబిలైజర్ విమానం తోకభాగంలో ఉంటుంది.

అత్యవసరంగా దిగిన ఇండిగో విమానం

దిల్లీ: సాంకేతిక సమస్యతో ఓ ఇండిగో విమానం అత్యవసరంగా దిల్లీలో దిగింది. గురువారం ఉదయం దిల్లీ నుంచి ఇండిగో విమానం ఇంఫాల్‌కు బయలుదేరింది. టేకాఫ్ అయిన గంటలోపే విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో అప్రమత్తమైన పైలట్ తిరిగి దిల్లీలోని అంతర్జాతీయ విమానాశ్రయానికి మళ్లించారని అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

గాజా క్యాథలిక్ చర్చిపై ఇజ్రాయెల్ దాడి: ముగ్గురి మృతి

డెయిర్ అల్-బలా: క్రిస్టియన్లు, ముస్లింలు ఆశ్రయం పొందుతున్న గాజాలోని ఒక క్యాథలిక్ చర్చిపై ఇజ్రాయెల్ బలగాలు దాడులు చేయడంతో ముగ్గురు మరణించారు. పలువురు గాయపడ్డారు. దివంగత పోప్ ఫ్రాన్సిస్‌తో అత్యంత సన్నిహితంగా మెలిగిన ఫాదర్ గ్యాబ్రియెల్ రోమనెల్లి అనే మత గురువూ గాయపడిన వారిలో ఉన్నారు. హోలీ ఫ్యామిలీ క్యాథలిక్ చర్చిపై జరిపిన ఈ దాడిలో ప్రార్థనా స్థల ప్రాంగణం మొత్తం ధ్వంసమైంది. ఈ పరిణామం నేపథ్యంలో గాజాలో వెంటనే కాల్పుల విరమణ జరగాలని పోప్ లియో-14 మరోమారు డిమాండు చేశారు. గాజాలో సంప్రదింపులకు సయోధ్యకు, చిరకాల శాంతికి మార్గం ఏర్పడాలని ఆకాంక్షించారు. క్యాథలిక్ చర్చిపై ఇజ్రాయెల్ దాడిని ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ ఖండించారు. 'గత కొన్ని నెలలుగా ఇజ్రాయెల్ సాధారణ పౌరులపై దాడులు చేస్తోంది. ఇది ఎంత మాత్రం సమ్మతం కాదు. ఎంతటి సైనిక అవసరాలున్నా ఈ చర్య సమర్థనీయం కాదు' అని ఆమె స్పష్టం చేశారు.

అలస్కాలో 7.3 తీవ్రతతో భూకంపం

• సునామీ హెచ్చరికల జారీ, ఉపసంహరణ

వాషింగ్టన్: అమెరికాలోని అలస్కా తీరంలో 7.3 తీవ్రతతో గురువారం భూకంపం సంభవించింది. ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించిన ఎలాంటి వివరాలు వెల్లడి కాలేదు. ముందు జాగ్రత్తగా పౌరులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు సూచించారు. అమెరికా కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నం 12.37 గంటలకు భూకంపం వచ్చింది. తీరానికి 20.కి.మీ. దూరంలో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. తొలుత సునామీ హెచ్చరికలు జారీ చేసి గంట తర్వాత విరమించుకున్నారు. మరోవైపు భారత్‌లోని హరియాణాలోనూ 3.3 తీవ్రతతో భూకంపం వచ్చింది.



బంగ్లాదేశ్‌లో పదవీచ్యుత ప్రధాని షేక్ హసీనాకు మద్దతుగా చేపట్టిన ర్యాలీలో బారికేడును ధ్వంసం చేసిన ఆందోళనకారులు

బంగ్లాదేశ్ వ్యవస్థాపకుడి ఊళ్లో కర్ఫ్యూ

• ఘర్షణల్లో నలుగురి మృతి

ఢాకా: బంగ్లాదేశ్ వ్యవస్థాపకుడు షేక్ ముజిబుర్ రెహ్మాన్ సొంత పట్టణమైన గోపాల్‌గంజ్‌లో జరిగిన ర్యాలీ హింసాత్మకంగా మారి నలుగురు మరణించడంతో పోలీసులు 22 గంటలపాటు కర్ఫ్యూ విధించారు. ఘర్షణలకు సంబంధించి 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. పట్టణంలో నేషనల్ సిటిజన్ పార్టీ (ఎన్‌సీపీ) బుధవారం నిర్వహించిన ఒక ర్యాలీ సందర్భంగా ముజిబుర్ కుమార్తె అయిన మాజీ ప్రధాని షేక్ హసీనాకు చెందిన ఆవామీ లీగ్ మద్దతుదారులు పోలీసులతో ఘర్షణకు దిగారు. ఇందులో నలుగురు మృతి చెందారు.

నాటో తీరును తప్పుబట్టిన భారత్

దిల్లీ: రష్యా నుంచి ఇంధనం కొనుగోలు చేస్తే అధిక సుంకాలు విధిస్తామని నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టె చేసిన హెచ్చరికలను భారత్ తప్పుబట్టింది. ఆ సంస్థ ద్వంద్వ ప్రమాణాలను జాగ్రత్తగా గమనిస్తున్నామని స్పష్టం చేసింది. రష్యా నుంచి ఇంధనం కొనుగోలు చేయడం అనేది.. జాతీయ ప్రయోజనాలు, మార్కెట్ డైనమిక్స్ మీద ఆధారపడి ఉంటుందని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి గురువారం దిల్లీలో స్పష్టం చేశారు. 'నాటో చీఫ్ వ్యాఖ్యలు, జరుగుతున్న పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నాం. గతంలో చెప్పినట్లుగా భారత ప్రజల ఇంధన అవసరాలను తీర్చడమే అత్యంత ప్రాధాన్యాంశం. దీని కోసం మార్కెట్లలో అందుబాటులో ఉన్న అంశాలు, ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల ఆధారంగా నడుచుకుంటాం' అని రణధీర్ జైశ్వాల్ వెల్లడించారు.

పాక్‌కు గూఢచర్యం.. సైనికుడి అరెస్టు

ఇంటర్నెట్‌డెస్క్: పాకిస్థాన్ ఐఎస్ఐకు భారత సైనిక సమాచారం చేరవేస్తున్నాడనే ఆరోపణలతో పంజాబ్‌లో సంగ్రూర్ జిల్లాలోని నిహాల్‌గఢ్ గ్రామానికి చెందిన దేవీందర్ అనే సైనికుడిని పంజాబ్ పోలీసులు అరెస్టు చేశారు. జమ్మూకశ్మీర్‌లోని ఉరీలో జవానుగా దేవీందర్ విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గూఢచర్యం ఆరోపణల కేసులో ఇటీవల మాజీ సైనికుడు గుర్‌ప్రీత్ సింగ్‌ను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అతడిని విచారించగా దేవీందర్ పేరు బయటకు వచ్చిందని పోలీసులు తెలిపారు. వీరిద్దరూ 2017లో పుణెలోని సైనిక శిబిరంలో మొదటిసారిగా కలిశారని, ఆ తర్వాత సిక్కిం, జమ్మూకశ్మీర్‌లలోనూ కలిసి పనిచేశారని వెల్లడించారు.

22 నెలల ముందుగానే సైన్యానికి 6 లక్షల ఏకే 203 రైఫిళ్లు

అమేఠీ(యూపీ): ఉత్తరప్రదేశ్‌లోని కోర్వాలో స్థాపించిన ఇండో-రష్యన్ రైఫిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఐఆర్ఆర్‌పిఎల్) సంస్థ అతివేగంగా తన ఉత్పాదక లక్ష్యాలను పూర్తి చేస్తోంది. అనుకున్న సమయానికి 22 నెలల ముందు అంటే 2030 నాటికే 6.01 లక్షల ఏకే- 203 రైఫిళ్లను భద్రతా దళాలకు ఇచ్చేస్తామని ఐఆర్ఆర్‌పిఎల్ సీఈఓ-మేనేజింగ్ డైరెక్టర్ మేజర్ జనరల్ ఎస్.కె. శర్మ వెల్లడించారు. రూ 5200 కోట్ల కాంట్రాక్టులో భాగంగా 2032 అక్టోబరు నాటికి 6,01,427 ఏకే 203 రైఫిళ్లను అందజేయాల్సి ఉందని, అయితే అనుకున్న మేరకు రైఫిళ్లను 2030 నాటికే ఇచ్చేస్తామని ఆయన అన్నారు. 'ఇప్పటికే దాదాపు 48 వేల రైఫిళ్లను ఇచ్చేశాం. రెండు నుంచి మూడు వారాల్లోగా మరో 7 వేల రైఫిళ్లు అందజేస్తాం. డిసెంబరు నాటికి 15 వేల రైఫిళ్లు అదనంగా ఇస్తాం" అని ఆయన అన్నారు. రష్యా సహకారంతో ఏర్పాటైన ఈ రైఫిల్ కర్మాగారం ప్రస్తుతం 260 మందికి ఉపాధి కల్పిస్తోంది. త్వరలో సిబ్బంది సంఖ్యను 537కు పెంచనున్నారు. ఇక్కడ ఉపాధి పొందుతున్న వారిలో 90 శాతం మంది స్థానికులేనని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ఈ కర్మాగారానికి రష్యా 100 శాతం సాంకేతిక పరిజ్ఞానం బదిలీ చేసింది. కలాష్నికోవ్ రైఫిళ్ల సిరీస్‌లో ఏకే-203 అత్యాధునికమైనది.

ఆ రాష్ట్రాలపై ధిక్కరణ చర్యలు చేపడతాం

• టీచర్లను నియమించకపోవడంపై సుప్రీం ఆగ్రహం

దిల్లీ: ప్రత్యేక అవసరాలున్న పిల్లల కోసం ఉపాధ్యాయుల్ని నియమించాలన్న తమ ఆదేశాలను అమలు చేయనందుకు రాష్ట్రాలపై కోర్టు ధిక్కరణ చర్యలు చేపడతామని సుప్రీంకోర్టు హెచ్చరించింది. ఈ మార్చి 7న తాము ఇచ్చిన ఆదేశాలపై తీసుకున్న చర్యలేమిటో మూడువారాల్లోగా విడివిడిగా ప్రమాణపత్రాలు దాఖలు చేయాలని 36 రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాలకు జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ అగస్టీన్ జార్జి మసీహ్‌ల ధర్మాసనం ఈ నెల 15న ఆదేశాలు జారీ చేసింది. కనీసం డిప్యూటీ సెక్రటరీ స్థాయి అధికారి వీటిని సమర్పించాలంది. ఏ రాష్ట్రమైనా వీటిని దాఖలు చేయడంలో విఫలమైతే వాటి అదనపు ప్రధాన కార్యదర్శి/ ముఖ్య కార్యదర్శి/ విద్యాశాఖ కార్యదర్శి ఆగస్టు 29న తదుపరి విచారణ కోసం హాజరై వారిపై ఎందుకు కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోరాదో వివరణ ఇవ్వాలని స్పష్టంచేసింది. ప్రత్యేకావసరాలు ఉన్న విద్యార్థుల కోసం ఎన్ని ఉపాధ్యాయ ఖాళీలను మంజూరు చేశారనేది రాష్ట్రాలు ఈ ఏడాది మార్చి 28 లోగా తెలపాలని సర్వోన్నత న్యాయస్థానం ఇదివరకు ఆదేశించింది. తగిన అర్హతలున్నవారినే ఉపాధ్యాయులుగా తీసుకోవాలని స్పష్టంచేసింది. కొన్ని రాష్ట్రాల్లో ఇలాంటి ఉపాధ్యాయులు 20 ఏళ్లకుపైగా తాత్కాలిక ప్రాతిపదికనే కొనసాగుతున్నారని తమ దృష్టికి వచ్చినట్లు తెలిపింది.

ఉక్రెయిన్ కొత్త ప్రధానిగా యూలియా పేరు ఖరారు



కీవ్: ఉక్రెయిన్ ప్రధానమంత్రిగా డెనిస్ ష్మిహాల్ స్థానంలో యూలియా స్విరిడెంకో పేరు ఖరారైంది. దేశ ఉప ప్రధానిగా, ఆర్థిక మంత్రిగా ఉన్న ఆమెను పునర్వ్యవస్థీకరణలో భాగంగా ప్రధానిగా నియమించనున్నట్లు అధ్యక్షుడు జెలెన్‌స్కీ నాలుగురోజుల క్రితమే ప్రకటించారు. 2022లో రష్యా పూర్తిస్థాయి యుద్ధాన్ని ప్రారంభించాక ప్రభుత్వాధినేతను మార్చడం ఇదే తొలిసారి. గతంలో అమెరికాతో ఖనిజ ఒప్పందం కుదుర్చుకునే విషయంలో ఆమె మధ్యవర్తిగా వ్యవహరించారు. అగ్రరాజ్యంతోపాటు పాశ్చాత్య దేశాలతో దౌత్యంలో ఆమెకు అనుభవం ఉంది. ఇప్పుడు అమెరికా నుంచి మరిన్ని ఆయుధాలు పొందేందుకు ఉక్రెయిన్ ప్రయత్నిస్తున్నవేళ డెనిస్ నియామకం ఖరారైంది. సుదీర్ఘ యుద్ధం కారణంగా నిరుత్సాహంగా ఉన్న ప్రభుత్వ యంత్రాంగంలో కొత్తశక్తిని నింపేందుకు జెలెన్‌స్కీ తన మంత్రివర్గంలో మార్పులు చేశారని సంబంధిత వర్గాలు తెలిపాయి. కొత్త మంత్రివర్గం దేశీయ ఆయుధ ఉత్పత్తిని మరింత వేగవంతం చేసే దిశగా పనిచేయనుంది. దేశానికి అవసరమైన ఆయుధాల్లో సగభాగాన్ని దేశీయంగా ఉత్పత్తి చేసుకునే స్థాయికి మరో ఆరు నెలల్లో చేరుతామని జెలెన్‌స్కీ అంటున్నారు.



రష్యా దాడితో గురువారం ఉక్రెయిన్‌లోని నిప్రోలో ధ్వంసమైన ఓ కర్మాగారం

స్విట్జర్లాండ్‌కు వెళ్లాల్సినవి ఉక్రెయిన్‌కు..

తాము అమెరికా నుంచి కొనుగోలు చేయదలచుకున్న పేట్రియాట్ గగనతల రక్షణ వ్యవస్థల్ని ఉక్రెయిన్‌కు మళ్లించాలని అగ్రరాజ్యం నిర్ణయం తీసుకున్నట్లు స్విట్జర్లాండ్ తెలిపింది. నిజానికి 2027, 2028లలో ఇవి తమకు రావాల్సి ఉన్నాయని వెల్లడించింది.

✦ తాజా దాడుల్లో ఉక్రెయిన్‌కు చెందిన 122 డ్రోన్లను రష్యా కూల్చివేసింది. 64 డ్రోన్లను ఉక్రెయిన్‌పైకి రష్యా పంపింది. సైనికులు సహా వెయ్యిమంది మృతదేహాలను ఉక్రెయిన్‌కు రష్యా పంపింది. ఉక్రెయిన్ కూడా రష్యాకు 19 మృతదేహాలు పంపించింది.

మెడలో పాముతో పోజులు.. కాటుకు బలైన ప్రాణాలు

ఈటీవీ భారత్: పాములు పట్టడంలో నైపుణ్యమున్న మధ్యప్రదేశ్‌లోని గునా జిల్లా రాఘౌగఢ్‌కు చెందిన దీపక్ మహావర్ (42) ఓ విషనాగుతో పరాచికాలాడి.. చివరకు దాని కాటుకే బలయ్యాడు. బర్‌బట్‌పురా గ్రామంలో పాము వచ్చిందని సమాచారం అందడంతో దీపక్ వెళ్లాడు. చాకచక్యంగా పట్టుకొన్న విషనాగును మెడకు చుట్టుకొని బైకుపై బయలుదేరాడు.



మార్గమధ్యంలో ఆగి వీడియోలకు పోజులిస్తూ పామును పదే పదే చేత్తో తట్టడంతో ఒక్కసారిగా అతడి చేతిపై కాటు వేసింది. స్నేహితుల సాయంతో గునా జిల్లా ఆసుపత్రిలో చికిత్స చేయించుకొని దీపక్ ఇంటికి చేరాడు. అర్ధరాత్రి దాటాక అకస్మాత్తుగా మళ్లీ ఆరోగ్యం క్షీణించి మృత్యువాత పడ్డాడు.

జడ్జీలపై కేసు నమోదు అభ్యర్థనపై సుప్రీంకోర్టు అసహనం

దిల్లీ: సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రైబ్యునల్(క్యాట్), దిల్లీ హైకోర్టు జడ్జీలపై కేసు నమోదు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రచారం కోసం దాఖలు చేసిన అపఖ్యాతికరమైన పిటిషన్‌గా పేర్కొంది. ఈ వ్యాజ్యంలో కోర్టుకు సహకరించేందుకుగాను మాజీ న్యాయమూర్తి, సీనియర్ న్యాయవాది ఎస్.మురళీధరన్‌ను న్యాయ సహాయకుడి (అమికస్ క్యూరీ)గా నియమించింది. 'మీకు అనుకూలంగా తీర్పు ఇవ్వలేదని జడ్జీలు, ట్రైబునళ్ల సభ్యులపై కేసులు నమోదు చేయాలని ఏ నిబంధనల ప్రకారం కోరుతున్నారు?' అని పిటిషనర్ రవికుమార్‌ను ధర్మాసనం ప్రశ్నించింది. క్యాట్‌లో, దిల్లీ, అహ్మదాబాద్ హైకోర్టులలోనూ తొలుత తన పిటిషన్‌ను స్వీకరిస్తామని తెలిపి అనంతరం కొట్టివేశారని పిటిషనర్ ఆరోపించారు.

హత్యాచారం కేసులో మరణ దండన యావజ్జీవ శిక్షగా మార్పు

బాలికపై హత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి విధించిన మరణ దండనను సుప్రీంకోర్టు యావజ్జీవిత కారాగార శిక్షగా మార్చింది. ముందస్తు విడుదలకు అవకాశం లేకుండా షరతు విధిస్తూ ధర్మాసనం నిర్ణయం వెలువరించింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ట్రయల్ కోర్టు, హైకోర్టు రెండూ ఈ కేసును అత్యంత అరుదైనదిగా పేర్కొన్నప్పటికీ దర్యాప్తులో కొనుగొన్న ఇతర వివరాలను పొందుపరచలేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

ఛంగూర్ బాబా కేసులో ఈడీ సోదాలు

దిల్లీ: అక్రమంగా మత మార్పిడులకు పాల్పడుతున్న ఛంగూర్ బాబా ఆర్థిక లావాదేవీలను ఛేదించే క్రమంలో ఉత్తర్ ప్రదేశ్‌లోని బలరాంపుర్ జిల్లాలో, మహారాష్ట్రలోని ముంబయిలలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు గురువారం సోదాలు నిర్వహించారు. బలరాంపుర్ జిల్లాలో 12 ప్రాంతాలుసహా ముంబయిలోని రెండు ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. చట్టవిరుద్ధ మతమార్పిడి రాకెట్‌లో కీలక సూత్రధారి జమాలుద్దీన్ అలియాస్ ఛంగూర్ బాబాను ఇటీవల అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.

అమెరికా చిన్నారిని దత్తత పొందే హక్కు భారతీయులకు లేదు

• అందుకు యూఎస్ చట్టాలనే అనుసరించాలి

• బొంబాయి హైకోర్టు తీర్పు

ముంబయి: అమెరికా పౌరుడైన చిన్నారిని దత్తత తీసుకునే ప్రాథమిక హక్కు భారతీయులకు లేదంటూ బొంబాయి హైకోర్టు కీలక తీర్పునిచ్చింది. సంరక్షణ, భద్రతపరమైన అంశాలు లేదా చట్టపరమైన వివాదం తలెత్తని పక్షంలో బంధువులైనా సరే ఆ బిడ్డను దత్తత పొందలేరని తెలిపింది. జువెనైల్ జస్టిస్ (పిల్లల సంరక్షణ, భద్రత) చట్టం, దత్తత నిబంధనల ప్రకారం ప్రస్తుత కేసులోని చిన్నారి వీటి పరిధిలోకి రాదని జస్టిస్ రేవతి మోహితే దేరే, జస్టిస్ నీలా గోఖలే ధర్మాసనం తీర్పు ఇచ్చింది. జన్మతః అమెరికా పౌరుడైన తమ బంధువుల కుమారుడిని దత్తత తీసుకునేందుకు అనుమతించాలంటూ భారతీయ జంట దాఖలు చేసిన పిటిషన్‌ను తిరస్కరించింది. మన దేశంలోని జువెనైల్ జస్టిస్ చట్టం ప్రకారం....ఆ చిన్నారికి సంరక్షణ అవసరమని భావించినప్పుడు మినహా సాధారణ పరిస్థితుల్లో దత్తతకు అవకాశం ఉండదని హైకోర్టు స్పష్టం చేసింది. అయితే, అమెరికా పౌరుడైన ఆ చిన్నారిని దత్తత తీసుకోవడానికి తొలుత ఆ దేశంలో అక్కడి చట్టాలు, నిబంధనల ప్రకారమే ఆ ప్రక్రియను పూర్తిచేయాల్సి ఉంటుంది. ఆ తర్వాతే భారత్‌కు తీసుకురావడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని హైకోర్టు స్పష్టం చేసింది.

ఈ కేసుకు సంబంధించిన చిన్నారి 2019లో అమెరికాలో జన్మించింది. పిటిషన్ దాఖలు చేసిన దంపతులు.. నెలల వయసున్న చిన్నారిని భారత్‌కు తీసుకువచ్చారు. అప్పటి నుంచి చిన్నారి వారితోనే నివసిస్తుండగా, తాజాగా దత్తత తీసుకునేందుకు ప్రయత్నాలు చేపట్టింది. వీరి దత్తత అభ్యర్థనను నమోదు చేసేందుకు కేంద్ర దత్తత వనరుల సంస్థ (కారా) నిరాకరించింది. అదే విషయాన్ని బాంబే హైకోర్టుకు తెలిపింది.

రాబర్ట్ వాద్రాపై అభియోగ పత్రం

• రౌస్ ఎవెన్యూ కోర్టుకు సమర్పించిన ఈడీ

దిల్లీ: హరియాణాలోని శికోహ్‌పుర్ భూఒప్పందంలో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యాపారవేత్త, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ భర్త రాబర్ట్ వాద్రాపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అభియోగ పత్రాన్ని దాఖలు చేసింది. నగదు అక్రమ చలామణి నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద దిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టుకు గురువారం దీనిని సమర్పించినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. వాద్రా సంస్థ స్కైలైట్ హాస్పిటాలిటీ ప్రైవేట్ లిమిటెడ్, ఆయనతో సంబంధం ఉన్న సత్యానంద్ యాజీ, కేవల్ సింగ్‌లను, వారి సంస్థ ఓంకారేశ్వర్ ప్రాపర్టీస్‌సహా మొత్తం 11 సంస్థల పేర్లనూ ఛార్జిషీట్‌లో ఈడీ చేర్చింది. వాద్రాకు చెందిన రూ.37.64 కోట్ల విలువైన 43 స్థిరాస్తులను దర్యాప్తు సంస్థ జప్తు చేసినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈడీ వెల్లడించిన వివరాల ప్రకారం.. వాద్రా కంపెనీ.. 2008 ఫిబ్రవరిలో శికోహ్‌పుర్‌లో 3.5 ఎకరాల స్థలాన్ని ఓంకారేశ్వర్ ప్రాపర్టీ నుంచి కొనుగోలు చేసింది. దీని విలువ రూ.7.5 కోట్లుగా పేర్కొంది. నాలుగేళ్ల తర్వాత వాద్రా కంపెనీ ఆ భూమిని రియల్ ఎస్టేట్ సంస్థ అయిన డీఎల్ఎఫ్‌కు రూ.58 కోట్లకు విక్రయించింది. ఈ లావాదేవీలపై మనీలాండరింగ్ ఆరోపణలొచ్చాయి. ఈ నేపథ్యంలోనే 2018 సెప్టెంబరులో వాద్రా పేరును ఈడీ ఎఫ్ఐఆర్‌లో చేర్చింది. ఆయనతోపాటు నాటి హరియాణా ముఖ్యమంత్రి భూపిందర్ సింగ్ హుడా, రియల్ ఎస్టేట్ సంస్థ డీఎల్ఎఫ్, ఓ ప్రాపర్టీ డీలర్ పేరును ప్రస్తావించింది.

నిమిష ప్రియ కేసులో సంప్రదింపులు జరుగుతున్నాయ్

• కేంద్రం వెల్లడి

దిల్లీ: యెమెన్‌లో మరణ శిక్షను ఎదుర్కొంటున్న కేరళ నర్సు నిమిష ప్రియ కేసు సున్నితమైన అంశమని, ఈ విషయంలో యెమెన్ అధికారులతోపాటు కొన్ని స్నేహపూర్వక దేశాలతో సంప్రదింపులు జరుపుతున్నామని కేంద్రం వెల్లడించింది. పరస్పర ప్రయోజనకర ఒప్పందానికి ప్రయత్నిస్తున్నామని తెలిపింది.

కారు పోయిన 22 ఏళ్లకు పరిహారం

గాజియాబాద్: కారు చోరీకి గురైన 22 ఏళ్ల తర్వాత దాని యజమానికి పరిహారం లభించడానికి మార్గం సుగమమైంది! యూపీలోని గాజియాబాద్ వాసి పునీత్ అగర్వాల్ 2003 మార్చి 10న మారుతి ఆల్టో కారును బ్యాంకు రుణంతో కొనుగోలు చేశారు. అదేరోజు రూ.1.90 లక్షలకు తన కారుకు బీమా చేయించారు. నెల తిరగకముందే.. ఏప్రిల్ 6న కారును ఎవరో దొంగిలించుకుపోయారు. కుటుంబసభ్యులతో కలిసి హరిద్వార్ వెళ్లినప్పుడు ఇది జరిగింది. దీనిపై వెంటనే పోలీసులకు ఆయన ఫిర్యాదు చేయడంతోపాటు బీమా సంస్థకు, బ్యాంకుకు విషయం తెలిపారు. అన్నిపత్రాలూ సమర్పించినా క్లెయింను 'నేషనల్ ఇన్స్యూరెన్స్ కంపెనీ' తిరస్కరించింది. కారు రక్షణకు తగిన చర్యలు తీసుకోలేదని ఆరోపించింది. ఎన్నిసార్లు వినతులు పంపినా వాటికి స్పందనగానీ, పరిహారం గానీ రాకపోవడంతో 'గాజియాబాద్ జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్' వద్ద అప్పీలు దాఖలు చేశారు. తీర్పుచెప్పే పరిధి తమకు లేదంటూ కమిషన్ తొలుత తోసిపుచ్చింది. దాంతో ఆయన లఖ్‌నవూలోని రాష్ట్ర కమిషన్‌ను 2011లో ఆశ్రయించారు. జిల్లా కమిషన్‌కు తీర్పుచెప్పే హక్కు ఉందని అది స్పష్టం చేసింది. దరిమిలా అక్కడ విచారణ ఇన్నేళ్లు కొనసాగి అగర్వాల్‌కు అనుకూలంగా ఇటీవల తీర్పువచ్చింది. బీమా విలువలో 75 శాతానికి సమానంగా రూ.1.43 లక్షలు ఆయనకు చెల్లించాలని, మానసిక వేదన/ వ్యాజ్య ఖర్చుల కింద రూ.5,000 ఇవ్వాలని ఆదేశించింది. 45 రోజుల్లోగా చెల్లించకపోతే 6% వడ్డీ కూడా చెల్లించాలంది. ఈ తీర్పుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఆసుపత్రిలోకి చొరబడి ఐసీయూలో ఉన్న నేరస్థుడి కాల్చివేత

పట్నా: హత్య కేసులో దోషిగా తేలి శిక్ష అనుభవిస్తూ.. వైద్యం కోసం పెరోల్‌పై బయటకు వచ్చిన నేరస్థుడిని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో దుండగులు కాల్చి చంపిన ఘటన బిహార్ రాజధాని పట్నాలో చోటుచేసుకుంది. మృతుడిని బక్సర్ జిల్లాకు చెందిన చందన్ మిశ్రగా (36) గుర్తించారు. బ్యూర్ జైలులో శిక్ష అనుభవిస్తున్న చందన్ చికిత్స కోసం పెరోల్‌పై బయటకు వచ్చాడు. గురువారం ఉదయం ఆసుపత్రిలో చొరబడిన ఐదుగురు దుండగులు చందన్‌పై కాల్పులు జరిపారు. ఈ దృశ్యాలు ఆసుపత్రిలోని సీసీ టీవీ కెమెరాలో రికార్డయ్యాయి. ఘటన అనంతరం కాల్పులు జరిపిన ఐదుగురితోపాటు మరొకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ స్పందించారు. 'రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఆర్జేడీ పాలనలో 2005కు ముందు రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు జరిగాయా' అని ఆయన 'ఎక్స్'లో ప్రశ్నించారు. పట్నాలోని షాపుర్‌లో జరిగిన మరో ఘటనలో కొంతమంది దుండగులు శుభమ్ అలియాస్ బంటీ అనే వ్యక్తిని అతడి ఇంటి ముందే కాల్చి చంపారు.



ఇజ్రాయెల్ ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లో పాలస్తీనీయుల గృహాలను ఇజ్రాయెల్ సైన్యం పేల్చివేసిన నేపథ్యంలో వెలువడుతున్న దుమ్ము, పొగ

ఈనాడు సినిమా

తొలి సినిమా నుంచీ అందంతో కుర్రకారుని కొల్లగొట్టేస్తున్న కథానాయిక నిధి అగర్వాల్. ఈసారి నటనతోనూ కట్టి పడేస్తానని చెబుతోంది. ప్రేక్షకులు ఎప్పట్నుంచో ఎదురు చూస్తున్న 'హరి హర వీర మల్లు', 'ది రాజా సాబ్' సినిమాల్లో ఈమే కథానాయిక. పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా నటించిన 'హరి హర వీర మల్లు' ఈ నెల 24న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా నిధి అగర్వాల్ గురువారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.

పవన్‌తో ఒక్క సినిమా... వంద సినిమాలతో సమానం!


నిధి అగర్వాల్

పవన్‌కల్యాణ్ కథానాయకుడు కావడం తోనే ఈ సినిమా చేయడానికి ఒప్పుకున్నారా? ఈ కథ విన్నాక మీ మనసులో ఎలాంటి అభిప్రాయం కలిగింది?

పీరియాడిక్ సినిమాలో నటించాలని ప్రతి కథానాయికకీ ఉంటుంది. తెరపై తమని తాము రాకుమారిగా చూసుకోవాలనేది ప్రతి ఒక్కరూ కనే కల. అలాంటి అవకాశం నాకు ఐదేళ్ల కిందట వచ్చింది. దానికితోడు పవన్‌కల్యాణ్ కథానాయకుడు, క్రిష్ దర్శకుడు, మరపురాని సినిమాల్ని తీసిన ఎ.ఎం.రత్నం నిర్మాత... ఇలాంటి ఓ గొప్ప కలయికలో వస్తున్న సినిమాని ఎందుకు కాదనుకుంటాను? దర్శకుడు క్రిష్ మొదట నా పాత్ర గురించి చెప్పారు. ఆ తర్వాత పూర్తి కథ చెప్పారు. అప్పటికే ఈ సినిమా చేయాలని నిర్ణయం తీసేసుకున్నా. పంచమి అనే శక్తిమంతమైన పాత్రలో కనిపిస్తా. ఎన్నో కోణాలున్న పాత్ర అది. పవన్‌కల్యాణ్‌కీ నాకూ మధ్య సన్నివేశాలు చాలా బాగుంటాయి. క్రిష్ నన్ను పంచమి పాత్రకి ఎంపిక చేస్తే, జ్యోతికృష్ణ సరైన సమయానికి దర్శకత్వ బాధ్యతలు తీసుకుని సినిమాని పూర్తి చేశారు. ఈ ఇద్దరు దర్శకులూ నాకు ప్రత్యేకమే.

పవన్‌కల్యాణ్‌తో కలిసి సెట్‌లో గడిపిన క్షణాలు.. ఆయనతో కలిసి నటిస్తున్నప్పుడు ఎదురైన అనుభవాల్ని పంచుకుంటారా?

పవన్‌కల్యాణ్ నుంచి ఎన్నో విషయాల్ని నేర్చుకున్నా. ఆయన సాహిత్యాభిరుచి నాకెంతో స్ఫూర్తినిచ్చింది. ఎప్పుడూ తెలుగు పుస్తకాలతో కనిపించేవారు. సాహిత్యంపై ఆయనకున్న పరిజ్ఞానం అంతా ఇంతా కాదు. ఆయనతో కలిసి నటించడం అదృష్టంగా భావిస్తున్నా. బలమైన అభిమానగణం ఉన్న పవన్‌కల్యాణ్ నటించిన సినిమా అంటే కచ్చితంగా ఎక్కువమంది ప్రేక్షకులకు చేరువవుతుంది. ఆయనతో ఒక్క సినిమా చేసినా, వేరే వంద సినిమాలతో సమానం. ఇందులో పవన్ కల్యాణ్.. రాబిన్ హుడ్ తరహా వీరమల్లు పాత్రలో కనిపిస్తారు. రియల్‌టైమ్‌ని తీసుకుని ఓ కల్పిత పాత్ర ఆధారంగా సాగే కథ ఇది.

మొత్తంగా మీ ప్రయాణం గురించి ఏం చెబుతారు?

మంచి అవకాశాల్నే అందుకున్నాను. కొన్నిసార్లు నా ఎంపికలో తప్పు ఉండొచ్చు. కొన్ని సినిమాలు నా అంచనాలకి తగ్గట్టుగా తెరపైకి రాలేకపోవచ్చు. అంతిమంగా మాత్రం ఎప్పుడూ నా ఎంపిక మంచి సినిమాకే! వ్యక్తిగా ఎదిగినప్పుడు ఆ ప్రభావం మన నటనలోనూ కనిపిస్తుంది. కెరీర్ ప్రారంభమైన రోజులతో పోలిస్తే ఇప్పుడు పాత్రల్ని మరింత బాగా అర్థం చేసుకుంటున్నా. ఆ ప్రభావం రానున్న నా సినిమాల్లో స్పష్టంగా కనిపిస్తుంది. నటన పరంగా నాకు మంచి పేరొస్తుందని నమ్ముతున్నా.

పంచమి పాత్రలో నటిస్తున్నప్పుడు మీకెలాంటి సవాళ్లు ఎదురయ్యాయి?

పాత్రకి తగ్గట్టుగా సిద్ధం కావడానికే రెండున్నర గంటలు పట్టేది. రూ.కోటిన్నర విలువ చేసే బంగారు నగలు ధరించాల్సి వచ్చేది. ఒంటిపై బరువుగా అనిపించే నిజమైన ఆ నగలు ధరించి నటించడం అంటే ఆషామాషీ కాదు. పైగా భరతనాట్యం నేపథ్యంలో సన్నివేశాలు చేయాల్సి వచ్చేది. పీరియాడిక్ సినిమాల్లో హీరోయిన్లు ఫైట్స్ కూడా చేస్తుంటారు కదా. ఇందులో కూడా ఒకట్రెండు సన్నివేశాల్లో ఫైట్స్ చేశా. అయితే రెండో భాగంలో మాత్రం పూర్తిస్థాయిలో నాతో ఫైట్స్ చేయించాల్సిందే అని దర్శకుడిని అడిగా (నవ్వుతూ). ఇదంతా ఒకెత్తైతే, ఈ ప్రయాణంలో నా లుక్ మారిపోకుండా ఆహార నియమాలు పాటిస్తూ, వ్యాయామాలు చేస్తూ జాగ్రత్తలు తీసుకోవల్సి రావడం మరో ఎత్తు.

'హరి హర వీర మల్లు', 'ది రాజా సాబ్'... ఇలా ఒప్పుకున్న సినిమాలు సుదీర్ఘకాలం సెట్స్‌పై ఉండటం మీ కెరీర్‌పై ఎలాంటి ప్రభావం చూపించింది?

డబ్బు, గుర్తింపు కోసం నేను సినిమా రంగంలోకి రాలేదు. సినిమా అంటే ఇష్టంతో వచ్చాను. ఏడాదికి ఇన్ని సినిమాలు చేయాల్సిందే అనే లెక్కలేమీ నాకు లేవు. మంచి సినిమా అయితే చాలు అనుకుంటాను. ఈ ప్రయాణంలో కొన్నిసార్లు ఆలస్యం జరగొచ్చు. అది మన చేతుల్లో ఉండదు. అయితే అర్జంటుగా సీజీ (కంప్యూటర్ గ్రాఫిక్స్) లేని, రెండు మూడు నెలల్లో పూర్తయ్యే ఒకట్రెండు సినిమాలు చేయాలని వుంది (నవ్వుతూ).

'ది రాజాసాబ్' ప్రయాణం ఎలా సాగింది. ఆ సినిమా విశేషాలేమిటి?

'హరి హర వీరమల్లు' చిత్రీకరణ ఎంత సీరియస్‌గా సాగిందో, 'ది రాజాసాబ్' ప్రయాణం అంత సరదా సరదాగా సాగింది. ఆద్యంతం హాస్యం పంచే సినిమా 'ది రాజా సాబ్'. ప్రభాస్‌తో కలిసి నటించడం మంచి అనుభవం. ఇందులో నాతో పాటు ఇంకా ఇద్దరు కథానాయికలు కనిపిస్తారు. ఒక సినిమా విజయవంతమైందంటే, అందులోని అన్ని పాత్రలకీ పేరొస్తుంది. అందుకే ఇద్దరు ముగ్గురు కథానాయికలున్నా నాకేమీ పట్టింపులు ఉండవు.

భారతదేశ తొలి హాలీవుడ్ నటుడి బయోపిక్


సాబు దస్తగిర్


మైసూర్ సంస్థానంలో ఏనుగుల సంరక్షణ చూస్తుంటాడు ఓ పిల్లాడు. నాన్న నుంచి నేర్చుకున్న విద్యతో ఏనుగుల్ని మచ్చిక చేసుకోగలిగాడు. అడవి జంతువుల మధ్య బతకడం తప్ప బయటి ప్రపంచంతో పరిచయమే లేదు. కనీసం సినిమా అంటే ఏంటో కూడా తెలియదు. కట్ చేస్తే.. ఆ పదమూడేళ్ల కుర్రాడే అంతర్జాతీయంగా నీరాజనాలు అందుకున్న బాల నటుడు అయ్యాడు. ఆ తర్వాత ఎన్నో బ్లాక్‌బస్టర్ చిత్రాలతో హీరోగా సినీప్రియుల మనసుల్ని గెల్చుకొన్నారు. ఆయనే హాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన భారతదేశ తొలి నటుడు సాబు దస్తగిర్. 1937లో 'ఎలిఫెంట్ బాయ్' చిత్రంతో సినీరంగంలోకి అడుగుపెట్టిన సాబు 'ది థీఫ్ ఆఫ్ బాగ్దాద్', 'జంగిల్ బుక్', 'అరేబియన్ నైట్స్' లాంటి ఎన్నో చిత్రాల్లో నటించారు. ఇప్పుడీయన జీవితాన్ని తెరపైకి తీసుకురాబోతుంది నిర్మాణ సంస్థ ఆల్మైటీ మోషన్ పిక్చర్. దెబ్లీనా మజుందార్ రాసిన 'సాబు: ది రిమార్కబుల్ స్టోరీ ఆఫ్ ఇండియాస్ ఫస్ట్ యాక్టర్ ఇన్ హాలీవుడ్' అనే పుస్తకం ఆధారంగా దీన్ని తీర్చిదిద్దుతున్నారు. "సాబు కథను నిజాయతీగా చెప్పాల్సిన అవసరం ఉంది. ఆయన భారత దేశ మొట్టమొదటి హాలీవుడ్ నటుడు మాత్రమే కాదు.. సంస్కృతులు, యుగాల మధ్య వారధి. అలాంటి గొప్ప వ్యక్తి జీవితాన్ని తెరపైకి తీసుకురావడం ఓ పెద్ద బాధ్యత" అని సినీ వర్గాలు తెలిపాయి. మైసూర్ నుంచి హాలీవుడ్ ఐకాన్‌గా ఎదిగిన సాబు సినీ ప్రయాణాన్ని ఇందులో చూపించనున్నారు.

శారీరకంగా ఎంతో కష్టపెట్టిన పాటిది


పూజా హెగ్డే

"మోనికా" అంటూ 'కూలీ'లోని తన ప్రత్యేక గీతంతో ప్రేక్షకుల్ని అలరిస్తోంది పూజా హెగ్డే. ఇటీవల విడుదలైన ఈ పాటకు నెట్టింట మంచి ఆదరణ దక్కుతున్న నేపథ్యంలో పూజా ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పందించింది. తన కెరీర్‌లోనే ఎంతో శ్రమించిన గీతమది అంటూ దాని తెర వెనుక కష్టాన్ని పంచుకుంది. "మోనికా'పై అందరూ చూపిస్తున్న ప్రేమాభిమానాలకు కృతజ్ఞతలు. నా కెరీర్‌లో శారీరంగా నన్నెంతో కష్టపెట్టిన పాటిది. కాలి గాయం తర్వాత నేను చేసిన తొలి హై డ్యాన్స్ మూమెంట్స్ ఉన్న గీతమిది. విపరీతమైన వేడి, ఉక్కపోత, దుమ్ము, ఎండ మంటను ఎదుర్కొంటూ ఆ కష్టాన్ని తెరపై కనిపించనీయకుండా కేవలం గ్లామరస్‌గా ప్రేక్షకుల్ని అలరించేందుకు చాలా శ్రమించా. అంతేకాదు ఈ పాట చిత్రీకరించిన రోజు మహాశివరాత్రి. ఉపవాసంలో ఉండి షూట్‌లో పాల్గొన్నా. రేపు థియేటర్లలో ఈ పాట చూసినప్పుడు ఇది తప్పకుండా అద్భుతమైన అనుభూతిని అందిస్తుంది. మీరంతా తప్పక డ్యాన్స్ చేస్తారని మాటిస్తున్నా. ఈ టాస్క్‌లో నాకు మద్దతుగా నిలిచిన డ్యాన్సర్లకు థ్యాంక్స్" అని చెప్పుకొచ్చింది పూజా హెగ్డే. రజనీకాంత్ కథానాయకుడిగా నటించిన ఈ పాన్ ఇండియా చిత్రాన్ని లోకేశ్ కనగరాజ్ తెరకెక్కించారు. సన్‌పిక్చర్స్ సంస్థ నిర్మించింది. నాగార్జున, ఆమిర్ ఖాన్, ఉపేంద్ర, సౌబిన్ షాహిర్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. అనిరుధ్ సంగీతమందించారు.

ఆ ఫ్లాట్‌లో వింత శబ్దాల మిస్టరీ ఏంటి?



సినిమా:	'వాల్ టు వాల్'
నటీనటులు:	కాంగ్ హా న్యూల్, యోమ్ హై రాన్
విడుదల:	శుక్రవారం
ప్లాట్‌ఫామ్:	నెట్‌ఫ్లిక్స్

కథాంశం: వూ సంగ్(కాంగ్ హా న్యూల్) ఓ సాధారణ ఉద్యోగి. తన జీవితంలో సొంతంగా అపార్ట్‌మెంట్‌లో ఓ ఫ్లాట్ కొనాలనేది అతని పెద్ద కల. దీని కోసం తన పొలం కూడా అమ్మి, కొంత అప్పుచేసి మొత్తానికి ఇంటినైతే కొంటాడు. కానీ తీసుకున్న అప్పులను చెల్లించడానికి చాలా ఇబ్బందులు పడుతుంటాడు. ఇదే తరుణంలో పరిస్థితిని మరింత దిగజార్చుతూ.. పొరుగు ఫ్లాట్‌ల నుంచి వచ్చే శబ్దాలు అతణ్ని తీవ్రంగా ఇబ్బంది పెడతాయి. ఈ శబ్దాల కారణంగా అతను తరచూ పొరుగు వారితో ఘర్షణలకు దిగుతాడు. ఆ శబ్దాల వెనుక రహస్యాన్ని కనుగొనేందుకు వూ సంగ్ ప్రయత్నిస్తాడు. కానీ అదొక అంతుపట్టని మిస్టరీలా ఉంటుంది. ఇంతలో యున్ హ్వా(యోమ్ హై రాన్) అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లో నివాసితుల భద్రతలకు భంగం కలగకూడదని వూ సంగ్‌ని హెచ్చరిస్తుంది. ఆ ప్రదేశంలో ఇంత గందరగోళాలు జరుగుతున్న ఆమె మౌనంగా ఉండడమేంటి? ఆ శబ్దాలు ఎవరు చేస్తున్నారు? తెలియాలంటే 'వాల్ టు వాల్' సినిమా చూడాల్సిందే. ఈ మిస్టరీ థ్రిల్లర్‌కు కిమ్ టే జూన్ దర్శకుడు.

సైబర్ యుద్ధంలో గెలిచిన వాళ్లదే ఈసారి విజయం



సిరీస్:	'స్పెషల్ ఓపీఎస్ సీజన్ 2'
నటీనటులు:	కేకే మేనన్, సయామీ ఖేర్
విడుదల:	శుక్రవారం
ప్లాట్‌ఫామ్:	జియో హాట్‌స్టార్

కథాంశం: "ఇందు గలడు అందు లేడని సందేహము వలదు.. ఎందెందు వెతికిన అందందే గలడు".. ఈ సామెత కృత్రిమ మేధ (ఏఐ)కు సరిగ్గా సరిపోతుందేమో. జీవితంలోని ప్రతి రంగాన్ని తాకేస్తున్న ఈ ఏఐతో.. మంచి ఎంతో ముప్పు కూడా అంతే. మరి ఈ కృత్రిమ మేధను ఉపయోగించి.. ప్రత్యర్థులు మన దేశాన్ని నాశనం చేయడానికి ప్రణాళికలు రచిస్తుంటే ఊరుకుంటామా? లేదు కదా! ఇప్పుడు ఆ శత్రుమూకలకు బుద్ధి చెప్పడానికి రంగంలోకి దిగాడు రా ఏజెంట్ హిమ్మత్ సింగ్. ఈయన కథే 'స్పెషల్ ఓపీఎస్ సీజన్ 2'. నీరజ్ పాండే దర్శకత్వం వహించిన సిరీస్ ఇది. కేకే మేనన్ ప్రధాన పాత్రలో నటించారు. సయామీ ఖేర్, వినయ్ పాఠక్ కీలక పాత్రలు పోషించారు. ఇందులో హిమ్మత్ సింగ్ పాత్రలో కనిపించనున్నారు కేకే. 'ఈసారి సైబర్ యుద్ధంలో గెలిచిన వాళ్లదే విజయం" అంటూ ఇటీవలే విడుదలైన ట్రైలర్ ఆసక్తిని రేకెత్తించింది. దేశ భద్రతకు ముప్పు వాటిల్లుస్తున్న ఏఐ, సైబర్ క్రైమ్‌తో హిమ్మత్ సింగ్, అతని టీమ్ పోరాడుతుంది. మరి ఆయన ఈ డిజిటల్ యుద్ధాన్ని ఎలా ఎదుర్కొన్నారన్నదే ఈ సిరీస్.



విశ్వ రహస్యాల కోసం సాహసాలు

సిరీస్:	'స్టార్ ట్రెక్: స్ట్రేంజ్ న్యూ వరల్డ్స్ సీజన్ 3'
నటీనటులు:	అన్సన్ మౌంట్, రెబెక్కా రోమిజ్న్
విడుదల:	శుక్రవారం
ప్లాట్‌ఫామ్:	జియో హాట్‌స్టార్



కథాంశం: విశ్వంలో ఎన్నో అద్భుతాలు ఉంటాయి. కానీ వాటి గురించి ఎవరికి పూర్తిగా తెలీదు. ఎన్నో గ్రహాలు, ఉప గ్రహాలతో నిండి ఉండే ఈ విశ్వంలో భూగ్రహంపై ఉన్న జీవరాశి గురించి అందరికీ తెలుసు. అలానే మిగిలిన గ్రహాలపై ఏముందో తెలుసుకోవాలని కూడా అందరికి ఉంటుంది. ఇలా ఏర్పడినదే కెప్టెన్ క్రిస్టోఫర్ పైక్(అన్సన్ మౌంట్) బృందం. అతను సిబ్బందితో కలిసి అంతరిక్షంలో ఉత్కంఠభరితమైన మిషన్‌లను ప్రారంభిస్తాడు. ఈ బృందమంతా కలిసి ఓ ప్రమాదకరమైన అంతరిక్ష మిషన్‌ను ప్రారంభిస్తుంది. తెలియని గ్రహాలను అన్వేషించే వేటలో అనేక సవాళ్లను ఎదుర్కొంటుంది. అలా ఎన్ని అవరోధాలు ఎదురైనా టీమ్ అంతా తమ సాహసాలను కొనసాగిస్తూనే ఉంటారు. అదిరిపోయే యాక్షన్ సన్నివేశాలతో ప్రేక్షకుడిని ఉత్కంఠకు గురిచేసే ఈ సిరీస్‌లో ప్రతి ఎపిసోడ్ ప్రత్యేకంగా ఉండనుంది. ఈ సిరీస్‌కి అకీవా గోల్డ్స్‌మ్యాన్, హెన్రీ అలోన్సో మైయర్స్ దర్శకత్వం వహించారు.

మై బేబీ అమ్మ సెంటిమెంట్‌తో



సురేశ్, తమ్మారెడ్డి భరద్వాజ

అథర్వ, నిమిషా సజయన్ ప్రధాన పాత్రల్లో నెల్సన్ వెంకటేశన్ తెరకెక్కించిన తమిళ చిత్రం 'డీఎన్ఏ'. ఇప్పుడీ సినిమాని 'మై బేబీ' పేరుతో తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు నిర్మాత సురేశ్ కొండేటి. ఇది శుక్రవారం విడుదల కానున్న నేపథ్యంలో దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ ఈ చిత్ర ట్రైలర్‌ను గురువారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ట్రైలర్ చూస్తే బలమైన కథతో రూపొందిన చిత్రమని అర్థమవుతోంది. ఇది ప్రేక్షకుల ఆదరణతో మంచి విజయాన్ని అందుకోవాలని కోరుకుంటున్నా" అన్నారు. "అమ్మ సెంటిమెంట్‌తో పాటు అన్ని రకాల వాణిజ్య హంగులు ఉన్న చిత్రమిది" అన్నారు నిర్మాత సురేశ్ కొండేటి.

'పరదా'తో ఆ వాస్తవం తెలుసుకున్నా - అనుపమ



శ్రీధర్, ప్రవీణ్, అనుపమ, సురేశ్‌బాబు, సత్యదేవ్, విజయ్

"ఒక అమ్మాయి ప్రధాన పాత్రలో నటించిన సినిమా వస్తుందంటే అందరూ వెనక్కి వెళ్లిపోతారు. నిర్మాతలు, ఓటీటీ సంస్థలు, ఒక్కోసారి ప్రేక్షకులు కూడా ప్రోత్సహించడానికి ముందుకురారు. అదెంత మంచి చిత్రమైనా అంతే. దాన్ని తప్పని నేను అనట్లేదు గానీ అదే నిజం. 'పరదా' చిత్రం వల్లే ఈ వాస్తవం తెలుసుకున్నా" అన్నారు నటి అనుపమ పరమేశ్వరన్. ఆమె ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రాన్ని ప్రవీణ్ కండ్రేగుల తెరకెక్కించారు. విజయ్ డొంకాడ నిర్మించారు. దర్శన రాజేంద్రన్, సంగీత, రాగ్ మయూర్ ముఖ్య పాత్రలు పోషించారు. ఈ సినిమా ఆగస్టు 22న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే గురువారం హైదరాబాద్‌లో ఈ సినిమాలోని "యత్ర నార్యస్తు." అనే పాటను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి నిర్మాత డి.సురేశ్‌బాబు, హీరో సత్యదేవ్ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సురేశ్‌బాబు మాట్లాడుతూ.. "ఈ చిత్ర ట్రైలర్‌ను విజయ్ నాకు చూపించాడు. ఒక కొత్త రకమైన కథ చెప్పాలనే తపన కనిపించింది. మా డిస్ట్రిబ్యూషన్ నుంచి వస్తున్న ఈ చిత్రాన్ని అందరూ చూడాలని కోరుతున్నా" అన్నారు. అనుపమ మాట్లాడుతూ.. "ఇది మంచి కథా బలమున్న సినిమా. దీంట్లో డ్యాన్సులు, ఫైట్‌లు ఏమీ ఉండకపోవచ్చు గానీ, ఎన్నో ఎమోషన్స్ ఉన్నాయి" అన్నారు. ఈ కార్యక్రమంలో విజయ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

టొరంటో చిత్రోత్సవాల్లో హోమ్‌బౌండ్


జాన్వీ కపూర్

అగ్ర తారల సరసన వరుస అవకాశాలను అందుకుంటూ ప్రేక్షకుల్ని అలరిస్తోంది బాలీవుడ్ భామ జాన్వీ కపూర్. ఆమె, ఇషాన్ ఖట్టర్ 'హోమ్‌బౌండ్' సినిమాలో నటించిన సంగతి తెలిసిందే. నీరజ్ ఘైవాన్ తెరకెక్కించిన ఈ సినిమా ఇటీవలే కేన్స్‌లో ప్రదర్శితమై 9 నిమిషాల స్టాండింగ్ ఓవేషన్‌ను అందుకుంది. ఇప్పుడీ చిత్రం మరో మైలురాయిని చేరుకుంది. తాజాగా ఇది టొరంటో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ 2025కి ఎంపికైంది.

జాన్వీ కాదు.. ఆమె మీనా కుమారి!


జాన్వీ కపూర్, వరుణ్ ధావన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'సన్నీ సంస్కారి కీ తులసి కుమారి'. శశాంక్ ఖైతాన్ దర్శకుడు. ఇటీవలే ఈ చిత్రంలో జాన్వీ.. తులసి కుమారిగా కనిపించనున్నట్లు తెలుపుతూ..ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది చిత్రబృందం. "ఆమె బయట అమాయకంగా, ముద్దుగా కనిపిస్తుంది. కానీ లోపల.. ఆమె మీనా కుమారిలాగా మెలో డ్రామాటిక్‌గా ఉంటుంద"నే వ్యాఖ్యను జోడించింది.

ఈ బంధాన్ని నిలుపుకోవాలంటే ఎన్ని పాట్లో!


నిత్యా మేనన్, విజయ్ సేతుపతి

'సార్ మేడమ్'గా ప్రేక్షకుల్ని అలరించనున్నారు విజయ్ సేతుపతి, నిత్యా మేనన్. ఈ ఇద్దరూ జంటగా నటించిన ఈ చిత్రాన్ని పాండిరాజ్ తెరకెక్కించారు. సత్యజ్యోతి ఫిల్మ్స్ సంస్థ నిర్మించింది. యోగిబాబు, చెంబన్ వినోద్ జోస్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ నెల 25న రానుంది. ఈ నేపథ్యంలోనే గురువారం ఈ చిత్ర ట్రైలర్‌ని విడుదల చేశారు. "నాతో వస్తే లైఫ్ ఎలా ఉంటుందో ఆలోచించకుండా నేనే కావాలని వచ్చేశావు. మా అమ్మానాన్నే నన్నిలా చూసుకోలేదని వాళ్లనే నువ్వు తిట్టుకునే విధంగా నిన్ను చూసుకుంటా" అంటూ నిత్యతో విజయ్ చెప్పే డైలాగ్‌తో మొదలైన ట్రైలర్ ఆద్యంతం ఆసక్తిగా సాగింది. ముఖ్యంగా పెళ్లి తర్వాత వీళ్లిద్దరి మధ్య వచ్చే గొడవల్ని ట్రైలర్‌లో వినోదాత్మకంగా చూపించారు. "భార్యాభర్తల అనుబంధం చాలా అద్భుతమైనది.. అందమైనది అంటారు. కానీ, దాన్ని నిలుపుకోవడానికి పడే పాట్లున్నాయే వామ్మో ప్రాణం పోతోంది" అంటూ ఆఖర్లో విజయ్ సేతుపతి చెప్పిన డైలాగ్ ఆకర్షణగా నిలిచింది.

నవ్విస్తూ.. థ్రిల్ చేసే చిత్రమిది


ప్రవీణ్

హాస్యనటుడు ప్రవీణ్ ప్రధాన పాత్రలో ఎస్‌జే శివ తెరకెక్కించిన చిత్రం 'బకాసుర రెస్టారెంట్'. లక్ష్మయ్య ఆచారి, జనార్దన్ ఆచారి నిర్మించారు. వైవా హర్ష టైటిల్ పాత్ర పోషించారు. ఈ సినిమా ఆగస్టు 8న రానుంది. ఈ విషయాన్ని గురువారం ప్రకటించారు. ఈ సందర్భంగా దర్శకుడు శివ మాట్లాడుతూ.. "ఇదొక వినూత్నమైన కాన్సెప్ట్‌తో రూపొందిన సినిమా. ప్రతి సీన్ ప్రేక్షకులకు థ్రిల్‌తో పాటు వినోదాన్ని పంచిస్తుంది. సినిమా చూసిన ప్రతి ఒక్కరూ ఓ మంచి చిత్రం చూశామనే సంతృప్తి పొందుతారు" అన్నారు. ఈ సినిమాలో కృష్ణభగవాన్, గరుడ రామ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.



2024-25లో ఎల్ అండ్ టీ ఛైర్మన్‌కు 50% పెరిగిన పారితోషికం


ఎస్ ఎన్ సుబ్రమణ్యన్

దిల్లీ: గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్ ఎన్ సుబ్రమణ్యన్ పారితోషికం రూపేణ రూ.76.25 కోట్లు అందుకున్నారు. 2023-24లో ఆయనకు కంపెనీ చెల్లించిన రూ.51.05 కోట్లతో పోలిస్తే ఇది దాదాపు 50 శాతం ఎక్కువ. స్టాక్ ఆప్షన్లను వాడుకోవడమే సుబ్రమణ్యన్ పారితోషికం బాగా పెరగడానికి ప్రధాన కారణమని కంపెనీ వార్షిక నివేదిక ప్రకారం తెలుస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.15.88 కోట్ల విలువైన స్టాక్ ఆప్షన్స్‌ను ఆయన వాడుకోగా.. 2023-24లో అసలేమీ వాడుకోలేదు. కాగా.. కొన్ని నెలల క్రితం ఉద్యోగులు వారంలో 90 గంటల పాటు పనిచేయాలంటూ సుబ్రమణ్యన్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశం అయిన సంగతి తెలిసిందే. ఇక 2024-25లో ఎల్ అండ్ టీ పూర్తికాల డైరెక్టర్, సీఎఫ్ఓ ఆర్.శంకర్ రామన్ రూ.37.33 కోట్లు; డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్, ప్రెసిడెంట్ సుబ్రమణియన్ శర్మ రూ.44.55 కోట్ల చొప్పున పారితోషికాన్ని అందుకున్నారు.

ఆర్ఎస్ బ్రదర్స్‌లో ఆషాఢం కేజీ సేల్

హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో ఆషాఢ మాసం సందర్భంగా 'సూపర్ ఆషాఢం కేజీ సేల్'ను ఆర్ఎస్ బ్రదర్స్ ప్రకటించింది. ఇందులో భాగంగా మహిళలు, పురుషులు, పిల్లలకు సంబంధించిన లక్షలాది వెరైటీ దుస్తులను 70 శాతం వరకు తగ్గింపు ధరలకు విక్రయిస్తోంది. అలంకారీ ప్రింట్ శారీ కొనుగోలుపై 2వ చీర(రూ.3,695 విలువైన)ను రూ.39కు అందిస్తోంది. అన్ని రకాల లేడీస్ వేర్, మెన్స్‌వేర్, కిడ్స్‌వేర్‌పై ఆకర్షణీయమైన ఆఫర్లు ఉన్నాయి. ప్రతి 22 క్యారెట్ బంగారు ఆభరణాల కొనుగోలుపై గ్రాముకు రూ.200 తగ్గింపు పొందొచ్చు. పాత బంగారం ఎక్స్ఛేంజ్‌పై గ్రాముకు రూ.100 అదనంగా ఇస్తోంది. కేజీ వెండి వస్తువుల కొనుగోలుపై రూ.5,000 రాయితీని ఆర్ఎస్ బ్రదర్స్ అందిస్తోంది.

పతంజలి ఫుడ్స్ బోనస్ షేర్లు

దిల్లీ: పతంజలి ఫుడ్స్ 2:1 నిష్పత్తిలో బోనస్ షేర్లను ప్రకటించింది. దీని ప్రకారం రూ.2 ముఖవిలువ కలిగిన షేరు కలిగిన వాటాదార్లకు.. రెండు కొత్త షేర్లు లభిస్తాయి. ఈ బోనస్ షేర్ల జారీకి వాటాదార్ల అనుమతి లభించాల్సి ఉంది. ఇందుకు రికార్డు తేదీని త్వరలో ప్రకటించనున్నారు. ఈ బోనస్ ఇష్యూకు అవసరమైన నిధులను కంపెనీ నిల్వల నుంచి వినియోగించనున్నట్లు పతంజలి ఫుడ్స్ తెలిపింది. బోనస్ ఇష్యూలో భాగంగా దాదాపు 72,50,12,628 కొత్త ఈక్విటీ షేర్లను కంపెనీ జారీ చేయనుంది. బోనస్ షేర్లను కేటాయించిన తర్వాత, కంపెనీ మొత్తం షేర్ క్యాపిటల్ రూ.145 కోట్ల (36,06,31,414 షేర్ల ఆధారంగా) నుంచి రూ.217.50 కోట్ల(108,75,18,842 షేర్ల)కు పెరగనుంది. 2025 మార్చి 31న ప్రకటించిన తాజా బ్యాలెన్స్ షీటు ప్రకారం.. బోనస్ ఇష్యూకు అవసరమైన నిధులు కంపెనీ చేతిలో ఉన్నాయి. కంపెనీ వద్ద మూలధన నిల్వలు రూ.266.93 కోట్లు, సెక్యూరిటీస్ ప్రీమియం ఖాతాలో రూ.4,704.37 కోట్లు, సాధారణ నిల్వలు రూ.418.15 కోట్లు ఉన్నాయి. వచ్చే రెండు నెలల్లోగా (సెప్టెంబరు 16) ఈ బోనస్ షేర్ల ప్రక్రియను కంపెనీ పూర్తి చేసే అవకాశం ఉంది.

కోడి గుడ్లు

18న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	510
వరంగల్	512
విజయవాడ	520
గోదావరి	500
విశాఖపట్నం	540
చిత్తూరు	563

హురున్ అండర్ 30 జాబితాలో క్రైవల్య వోహ్రా, అదిత్ పలిచా

తెలుగు రాష్ట్రాల నుంచి శశాంక్ గుజ్జుల, అనుపమ్



దిల్లీ

దేశంలో 30 ఏళ్ల లోపు వయసులోనే ఆర్థిక వ్యవస్థపై గణనీయమైన ప్రభావం చూపుతున్న 79 మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తల జాబితాను అవెండస్ వెల్త్ హురున్ ఇండియా విడుదల చేసింది. గ్రోసరీ, ఆహార డెలివరీ అంకుర సంస్థ జెప్టో వ్యవస్థాపకులు క్రైవల్య వోహ్రా, అదిత్ పలిచా జాబితాలో తొలి రెండు స్థానాల్లో నిలిచారు. వీరి వయసు కేవలం 22 ఏళ్లు మాత్రమే. జాబితాలో చోటు పొందిన వారిలో ఏవీఆర్ శ్రీ స్మరణ్ (ఏవీఆర్ స్వర్ణమహల్ జువెలర్స్), అర్జున్ దేశ్‌పాండే (జెనరిక్ ఆధార్), శివ సంకేశ్వర్ (విజయానంద్ ట్రావెల్స్), రాహుల్ రావత్ (దిగంతారా), మిహిర్ మెండా (ఆర్ఎంజెడ్ బోస్టన్) ఉన్నారు.

✦ అనంత్ అంబానీ (జియో ప్లాట్‌ఫామ్స్) 11వ స్థానం, సాగర్ అదానీ (అదానీ గ్రీన్ ఎనర్జీ) 14వ స్థానం దక్కించుకున్నారు.

✦ తెలుగు రాష్ట్రాల నుంచి నెక్స్ట్‌వేవ్ సహ వ్యవస్థాపకులు శశాంక్ గుజ్జుల, పి అనుపమ్ జాబితాలో చోటు దక్కించుకున్నారు.

✦ మరో క్విక్ కామర్స్ సంస్థ స్విష్ వ్యవస్థాపకులు ఉజ్వల్ సుకేజా, శరణ్, అనికేత్ షాలు కూడా జాబితాలో ఉన్నారు.

✦ జాబితాలో చోటు దక్కించుకున్న అత్యంత పిన్న వయసు మహిళగా ఆప్టో స్కాన్‌కు చెందిన దేవికా ఘోలప్ (28) నిలిచారు. జాబితాలో ఉన్న ఇతర మహిళల్లో రాధికా మర్చంట్ (ఎన్‌కోర్ హెల్త్‌కేర్), అనన్య బిర్లా (స్వతంత్ర మైక్రోఫిన్), వృశాలీ ప్రసాద్ (పిక్సిస్), రొమిత మజుందార్ (ఫాక్స్‌టేల్) ఉన్నారు.

✦ నగరాల వారీగా చూస్తే.. 15 మంది వ్యాపారవేత్తలతో ముంబయి అగ్రస్థానంలో నిలిచింది.

టాప్ 10 అత్యంత పిన్నవయసు వ్యాపారవేత్తలు

ర్యాంకు	పేరు	కంపెనీ
1	క్రైవల్య వోహ్రా	జెప్టో
2	అదిత్ పలిచా	జెప్టో
3	ఏవీఆర్ శ్రీ స్మరణ్	ఏవీఆర్ స్వర్ణమహల్ జువెలర్స్
4	అర్జున్ దేశ్‌పాండే	జెనరిక్ ఆధార్
5	శివ సంకేశ్వర్	విజయానంద్ ట్రావెల్స్
6	ఉజ్వల్ సుకేజా	స్విష్
7	శరణ్ ఎస్	స్విష్
8	అనికేత్ షా	స్విష్
9	రాహుల్ రావత్	దిగంతారా
10	మిహిర్ మెండా	ఆర్ఎంజెడ్

3% తగ్గిన యాక్సిస్ బ్యాంక్ లాభం

దిల్లీ: ప్రైవేట్ రంగ యాక్సిస్ బ్యాంక్, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో ఏకీకృత ప్రాతిపదికన రూ.6,243.72 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో బ్యాంక్ ఆర్జించిన రూ.6,436.43 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 3 శాతం తక్కువ. మొత్తం ఆదాయం రూ.37,795.88 కోట్ల నుంచి రూ.40,401 కోట్లకు చేరింది. స్టాండలోన్ నికర లాభం రూ.6,034 కోట్ల నుంచి రూ.5,806 కోట్లకు పరిమితమైంది. నికర వడ్డీ ఆదాయం 1 శాతం పెరిగి రూ.13,560 కోట్లుగా నమోదైంది. నికర వడ్డీ మార్జిన్ 4.05 శాతం నుంచి 3.80 శాతానికి తగ్గింది.

✦ ఆస్తుల నాణ్యత చూస్తే.. బ్యాంకు స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏలు) 1.28% నుంచి 1.57 శాతానికి పెరిగాయి. నికర ఎన్‌పీఏలు కూడా 0.34% నుంచి 0.45 శాతానికి పెరిగాయి. ఫలితంగా మొండి బకాయిల కేటాయింపులు రూ.2,039 కోట్ల నుంచి రూ.3,948 కోట్లకు చేరాయి. బ్యాంకు మూలధన లభ్యత నిష్పత్తి 16.65% నుంచి 16.85 శాతానికి మెరుగుపడింది.

రూ.1,100 కోట్లను మించిన హెరిటేజ్ ఫుడ్స్ ఆదాయం

ఈనాడు, హైదరాబాద్: పాలు, పాల ఉత్పత్తుల సంస్థ హెరిటేజ్ ఫుడ్స్ రికార్డు స్థాయిలో ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి రూ.1,136.8 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలోని రూ.1,032.67 కోట్లతో పోలిస్తే ఇది 10 శాతం అధికం. ఎబిటా రూ.73.9 కోట్లు, ఎబిటా మార్జిన్ 9.1 శాతంగా ఉన్నాయి. త్రైమాసిక నికర లాభం రూ.40.54 కోట్లుగా నమోదైంది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదేకాలంలో నికరలాభం రూ.58.42 కోట్లు ఉన్న విషయం గమనార్హం. దీంతో పోలిస్తే ప్రస్తుతం నికరలాభం 31 శాతం తగ్గినట్లు అవుతోంది.



అకాల వర్షాలతో..: ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో కురిసిన అకాల వర్షాలతో పెరుగు, మజ్జిగ, ఫ్లేవర్డ్ మిల్క్, ఐస్‌క్రీమ్ వంటి విలువ జోడించిన ఉత్పత్తుల అమ్మకాలు ఆశించిన స్థాయిలో నమోదు కాలేదని హెరిటేజ్ ఫుడ్స్ పేర్కొంది. త్రైమాసిక ఆదాయంలో విలువ జోడించిన ఉత్పత్తుల వాటా క్రితం ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో 37.5 శాతం కాగా, ఈ సారి 36.1 శాతం వాటా నమోదైంది. అదే సమయంలో పాల సేకరణ ధర పెరిగింది.

రికార్డు స్థాయి ఆదాయం: 'వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోయినా రికార్డు స్థాయి త్రైమాసిక ఆదాయాన్ని ఆర్జించాం. మా బ్రాండ్ విలువ, పాల సేకరణ విధానాలు దీనికి కారణమ'ని హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బ్రాహ్మణి నారా తెలిపారు. ఏప్రిల్, మేలో విలువ జోడించిన ఉత్పత్తుల అమ్మకాలు తగ్గినందున లాభాలు తగ్గినట్లు తెలిపారు. జూన్ నుంచి మళ్లీ అమ్మకాలు పెరిగాయన్నారు. వ్యాపార పునాదులు బలంగా ఉన్నట్లు, దీర్ఘకాలిక వృద్ధి బాటలో సాగుతున్నట్లు వివరించారు.

ఎయిర్‌టెల్ వినియోగదారులకు ఉచితంగా పెర్‌ప్లెక్సిటీ సేవలు

దిల్లీ: టెలికాం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ తమ వినియోగదారులకు ఏఐ ఆధారిత సెర్చ్ ఇంజిన్ పెర్‌ప్లెక్సిటీ ప్రో ప్రీమియం సేవలను అందించనుంది. 36 కోట్ల మంది చందాదారులకు ఏడాది పాటు ఉచితంగా ఈ సేవలను అందించనున్నట్లు సంస్థ తెలిపింది. ఒక భారతీయ టెలికాం కంపెనీతో పెర్‌ప్లెక్సిటీ భాగస్వామ్యం కుదుర్చుకోవడం ఇదే మొదటిసారి. ఏఐ ఆధారిత సెర్చ్ ఇంజిన్ అయిన పెర్‌ప్లెక్సిటీ ప్రో, వినియోగదారులు అడిగే ప్రశ్నలకు వాస్తవిక సమాధానాలు ఇస్తుంది. ఈ విభాగంలో ఆధిపత్యం చెలాయిస్తున్న ఆల్ఫాబెట్‌కు పోటీ ఇవ్వాలని ఎన్‌విడియాకు చెందిన పెర్‌ప్లెక్సిటీ భావిస్తోంది. సెర్చ్ ఫీచర్లతో పెర్‌ప్లెక్సిటీ ఉచిత సేవలు ఇస్తోంది. అయితే ప్రో వెర్షన్‌లో నిపుణులు, ఇతర వినియోగదారులకు అధునాతన సామర్థ్యాలను అందించనుంది. ఏడాది పాటు ఎయిర్‌టెల్ ఖాతాదారులు (మొబైల్, వైఫై, డీటీహెచ్) రూ.17,000 విలువైన పెర్‌ప్లెక్సిటీ ప్రో సబ్‌స్క్రిప్షన్‌ను ఉచితంగా పొందొచ్చని, ఇందుకోసం ఎయిర్‌టెల్ థ్యాంక్స్ యాప్‌లో లాగిన్ కావాల్సి ఉంటుందని సంస్థ వెల్లడించింది.

విప్రో లాభం రూ.3,336.50 కోట్లు

రూ.5 మధ్యంతర డివిడెండు

దిల్లీ: దేశీయంగా నాలుగో అతిపెద్ద ఐటీ సేవల సంస్థ విప్రో ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి ఏకీకృత ప్రాతిపదికన రూ.3,336.50 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో నమోదైన రూ.3,036.60 కోట్లతో పోలిస్తే లాభం 9.8 శాతం పెరిగింది. కార్యకలాపాల ద్వారా ఆదాయం రూ.21,963.80 కోట్ల నుంచి స్వల్పంగా పెరిగి రూ.22,134.60 కోట్లకు చేరింది. త్రైమాసిక ప్రాతిపదికన అంటే ఈ ఏడాది జనవరి-మార్చితో పోలిస్తే ఏప్రిల్-జూన్‌లో విప్రో లాభం 7%, ఆదాయం 1.6 శాతం చొప్పున తగ్గడం గమనార్హం.

✦ ఏప్రిల్-జూన్‌లో మొత్తంగా 4,971 మిలియన్ డాలర్ల విలువైన ఆర్డర్లు వచ్చాయి. స్థిర కరెన్సీ రూపేణా ఆర్డర్ల విలువలో 50.7 శాతం వృద్ధి ఉంది.

✦ విప్రో వ్యాపారంలో కీలకమైన ఐటీ సేవల విభాగం ఏప్రిల్-జూన్‌లో రూ.22,080 కోట్ల ఆదాయాన్ని నమోదుచేసింది. ఏడాదిక్రితంతో పోలిస్తే ఆదాయం స్వల్పంగా 0.8 శాతమే పెరగగా.. ఈ ఏడాది జనవరి-మార్చితో పోలిస్తే 1.6 శాతం తగ్గింది.

✦ జులై- సెప్టెంబరు త్రైమాసికానికి ఐటీ సేవల విభాగ ఆదాయం 2,560 మిలియన్ డాలర్లు-2,612 మిలియన్ డాలర్ల శ్రేణిలో నమోదుకావొచ్చని విప్రో అంచనా వేసింది.



'జనవరి-మార్చి, ఏప్రిల్-జూన్‌లో మేం దక్కించుకున్న పెద్ద ఆర్డర్లతో పాటు మా చేతిలో ఇప్పటికే ఉన్న ఆర్డర్లు ఈ ఏడాది రెండో భాగంలో మమ్మల్ని బలమైన స్థితిలో ఉంచాయి'
- శ్రీని పల్లియా, సీఈఓ, ఎండీ, విప్రో

ఉద్యోగులు: ఏప్రిల్-జూన్‌లో విప్రోలో పనిచేస్తున్న మొత్తం సిబ్బంది సంఖ్య 114 తగ్గి 2,33,232కి దిగివచ్చింది. ఇదే త్రైమాసికంలో ఉద్యోగ ప్రయోజనాల కోసం రూ.13,427.50 కోట్లను వెచ్చించింది. కంపెనీ కార్యకలాపాల ఆదాయంలో ఇది 60.6 శాతానికి సమానం.

డివిడెండు: రూ.2 ముఖ విలువ గల ఒక్కో షేరుకు రూ.5 (250%)ను మధ్యంతర డివిడెండుగా కంపెనీ ప్రకటించింది. 2025 ఆగస్టు 15న లేదా ఆ లోపు ఈ డివిడెండును చెల్లించనుంది. ఏటా రెండు సార్లు డివిడెండు ఇచ్చేందుకు కంపెనీ ప్రయత్నిస్తుందని, రెండో, మూడో త్రైమాసిక ఫలితాల వెల్లడి సమయంలో వీటిపై ప్రకటన ఉంటుందని విప్రో సీఎఫ్ఓ అపర్ణ అయ్యర్ తెలిపారు.

బీఎస్ఈలో గురువారం విప్రో షేరు 0.93% నష్టపోయి రూ.260.25 వద్ద ముగిసింది.

సౌత్ ఇండియన్ బ్యాంక్ లాభం రూ.322 కోట్లు

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో సౌత్ ఇండియన్ బ్యాంక్ లాభం రూ.322 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే సమయంలో లాభం రూ.294 కోట్లతో పోలిస్తే ఇది 10% అధికం. మొత్తం ఆదాయం సైతం రూ.2,736 కోట్ల నుంచి రూ.2,984 కోట్లకు చేరుకుంది. బ్యాంకు వడ్డీ ఆదాయం రూ.2,314 కోట్ల నుంచి రూ.2,362 కోట్లకు చేరుకుంది. నిర్వహణ లాభం సైతం రూ.508 కోట్ల నుంచి రూ.672 కోట్లకు పెరిగింది. బ్యాంకు స్థూల నిరర్థక ఆస్తులు(ఎన్‌పీఏలు) 3.15 శాతానికి పరిమితమైంది. ఏడాది కిందట జూన్ చివరకు ఇవి 4.5 శాతంగా ఉన్నాయి. ఇదే విధంగా నికర ఎన్‌పీఏలు కూడా 1.44% నుంచి 0.68 శాతానికి పరిమితమయ్యాయి.

జియో ఫిన్ సర్వీసెస్ ఆదాయం రూ.619 కోట్లు

దిల్లీ: జియో ఫైనాన్షియల్ సర్వీసెస్(జేఎఫ్ఎస్ఎల్) ఏకీకృత నికర లాభం రూ.325 కోట్లుగా నమోదైంది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలోని రూ.313 కోట్లతో పోలిస్తే ఇది 4% అధికం. కంపెనీ మొత్తం ఆదాయం రూ.418 కోట్ల నుంచి రూ.619 కోట్లకు చేరుకుంది. వడ్డీ ఆదాయం రెట్టింపై రూ.162 కోట్ల నుంచి రూ.363 కోట్లకు; మొత్తం వ్యయాలు రూ.79 కోట్ల నుంచి రూ.261 కోట్లకు చేరాయి.


ఎల్‌టీఐమైండ్‌ట్రీ లాభం రూ.1,254 కోట్లు

దిల్లీ: టెక్ కన్సల్టింగ్, డిజిటల్‌సొల్యూషన్స్ కంపెనీ ఎల్‌టీఐమైండ్‌ట్రీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికంలో రూ.1,254.1 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలోని రూ.1133.8 కోట్లతో పోలిస్తే ఇది 10.6 శాతం అధికం. ఇదే సమయంలో కార్యకలాపాల ద్వారా వచ్చిన ఆదాయం 7.6% పెరిగి రూ.9,840.6 కోట్లకు చేరుకుంది. త్రైమాసికం వారీగా చూస్తే లాభం 11%, ఆదాయం 0.7% మేర వృద్ధి కనబరచాయి. జూన్ చివరకు కంపెనీ ఉద్యోగుల సంఖ్య 83,889గా నమోదైంది.

మరో వైపు ఒక్కోటీ రూ.1 విలువతో 67,252 కొత్త షేర్లను ఎంప్లాయీస్ స్టాక్ ఆప్షన్ ప్లాన్ 2021 అండ్ 2015 కింద ఎల్‌టీఐమైండ్‌ట్రీ ఎంప్లాయీ వెల్ఫేర్ ట్రస్ట్‌కు జారీ చేయడానికి కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. అర్హతగల ఉద్యోగులకు తర్వాత ఆ షేర్లు బదిలీ అవుతాయి.

దుబాయ్.. బాలి.. బ్యాంకాక్

- భారతీయులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్న పర్యాటక ప్రాంతాలివే
- జనవరి-జూన్‌పై ఓయో నివేదిక



దిల్లీ: పర్యాటక ప్రయాణాల కోసం భారతీయులు ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తున్న ప్రాంతాల్లో దుబాయి, బాలి, బ్యాంకాక్ అగ్రగామిగా ఉన్నాయని ఓయో నివేదిక తెలిపింది. ఈ ఏడాది జనవరి-జూన్ మధ్య ఓయో యాప్ ద్వారా జరిగిన బుకింగ్‌ల ఆధారంగా ఈ విషయాన్ని వెల్లడించింది. పర్యాటక ప్రయాణాల కోసం మొత్తం బుకింగ్‌లు 65 శాతం మేర పెరిగాయని 'ఓయో ట్రావెలోపీడియా 2025' పేరుతో విడుదల చేసిన నివేదికలో తెలిపింది. దీని ప్రకారం.. అత్యధిక బుకింగ్‌లు దుబాయ్‌కి వెళ్లేందుకు చేసుకున్నవే. భారతీయ కుటుంబాల నుంచి దుబాయ్‌కి బుకింగ్‌లు వార్షికంగా మూడు రెట్లు పెరిగాయి.

హనీమూన్‌కు బాలికి అధిక బుకింగ్‌లు: బాలికి జంటలు, హనీమూన్‌కు వెళ్లే వాళ్ల నుంచి బుకింగ్‌లు పెరిగాయి. ఓయో యాప్ ద్వారా ఆగ్నేయాసియా ప్రాంతాల పర్యటనలకు సగటున 5-7 రోజుల కోసం బుక్ చేసుకోగా.. పశ్చిమాసియా ప్రాంతాలకు ఇది 3-5 రోజులుగా ఉంది. ఎక్కువ దూరం ఉండే ఐరోపా, అమెరికాకు వెళ్లేందుకు సగటున 10-15 రోజుల కోసం బుక్ చేసుకున్నట్లు నివేదిక తెలిపింది. 'వీసా నిబంధనల సడలింపులు, విమాన సర్వీసుల పెంపు, విలాసవంత అనుభూతిని ఆస్వాదించాలనుకునే వారి సంఖ్య పెరగడం లాంటివి పర్యాటక బుకింగ్‌ల్లో గణనీయ వృద్ధికి కారణం అయ్యింద'ని ఓయో తెలిపింది. ఐపీఓ సన్నాహాల్లో ఉన్న ఓయోకు ఆగ్నేయాసియాలో 23, పశ్చిమాసియాలో 27 చొప్పున మొత్తంగా 50 ఖరీదైన హోటళ్లు ఉండటం గమనార్హం.

రూ.5 లక్షల కోట్లకు వైద్య పర్యాటక రంగం: భారత్‌లో వైద్య పర్యాటక రంగ విపణి 2035 కల్లా రూ.5 లక్షల కోట్లకు (58.2 బిలియన్ డాలర్లు) చేరే అవకాశం ఉందని ఓ నివేదిక తెలిపింది. ప్రస్తుతం ఇది సుమారు రూ.1.50 లక్షల కోట్లుగా (18.2 బిలియన్ డాలర్లు) ఉండగా.. ఏటా 12.3% చొప్పున వృద్ధి నమోదుకావచ్చని అంచనా వేసింది. కేపీఎంజీతో కలిసి ఫెడరేషన్ ఆఫ్ హోటల్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌హెచ్ఆర్ఏఐ) ఈ నివేదికను రూపొందించింది.

ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా చమురు దిగుమతి

రష్యా చమురు కొనుగోళ్లపై అమెరికా ఆంక్షల ప్రభావం మాపై ఉండదు: భారత్



దిల్లీ: రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలపై ఆంక్షలు, అధిక టారిఫ్‌లు విధిస్తామంటూ అమెరికా హెచ్చరించిన నేపథ్యంలో.. రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకోకపోయినా, అదేమీ తమకు పెద్ద సమస్య కాబోదని భారత్ తెలిపింది. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తమ ఇంధన గిరాకీ అవసరాలను తీర్చుకుంటామనే విశ్వాసాన్ని వ్యక్తం చేసింది. రష్యా దిగుమతులపై ఆంక్షలతో ఎదురయ్యే ఎలాంటి సవాలునైనా ఇతర దేశాల నుంచి చమురును దిగుమతి చేసుకోవడం ద్వారా భారత్ అధిగమిస్తుందని కేంద్ర చమురు శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి తెలిపారు. భారత్ తన ఇంధన అవసరాల్లో 85 శాతం వరకు దిగుమతులపైనే ఆధారపడుతున్న సంగతి తెలిసిందే. భారత్‌కు చమురు దిగుమతుల్లో పశ్చిమాసియా దేశాలదే అధిక వాటా ఉండేది. అయితే గత మూడేళ్లుగా రష్యా కూడా భారత్‌కు ప్రధాన చమురు సరఫరాదారుగా మారింది. 'ప్రస్తుతం గయానా లాంటి చాలా కొత్త సరఫరా దేశాలు మార్కెట్లో అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటికే సరఫరా చేస్తున్న బ్రెజిల్, కెనడా లాంటి దేశాల నుంచి కూడా దిగుమతులను పెంచుకుంటామ'ని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హైడ్రోకార్బన్స్ (డీజీహెచ్) సమావేశంలో మాట్లాడుతూ హర్‌దీప్ సింగ్ తెలిపారు. భారత్ తనకు చమురు దిగుమతి చేస్తున్న దేశాల సంఖ్యను పెంచుకున్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. దేశీయంగా చమురు ఉత్పత్తిని పెంచుకునేందుకు కొత్త క్షేత్రాలను అన్వేషిస్తున్నామని, వాటిని వేగంగానే ఉత్పత్తిలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని పురి వెల్లడించారు.

టొనినో లాంబోర్గినితో కైనటిక్ గ్రీన్ జట్టు

దిల్లీ: వచ్చే దశాబ్దంలో బిలియన్ డాలర్ల (సుమారు రూ.8,600 కోట్ల) టర్నోవర్ సాధించే లక్ష్యంతో ప్రపంచ మార్కెట్ల కోసం గోల్ఫ్, లైఫ్‌స్టైల్ కార్ట్‌లను విడుదల చేయడానికి ఇటలీకి చెందిన టొనినో లాంబోర్గినితో చేతులు కలిపినట్లు పుణెకు చెందిన విద్యుత్ వాహన తయారీ సంస్థ కైనటిక్ గ్రీన్ వెల్లడించింది. కైనటిక్ గ్రీన్ టొనినో లాంబోర్గిని (కేజీటీఎల్) జాయింట్ వెంచర్‌లో కైనటిక్ గ్రీన్‌కు 70 శాతం, టొనినో లాంబోర్గినికి 30 శాతం వాటా ఉండనుంది.

ఐటీ, బ్యాంకింగ్ షేర్లు పడేశాయ్

ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.3,694.31 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు: రూ.2,820.77 కోట్లు



సెన్సెక్స్ ▼375 82259
నిఫ్టీ ▼101 25111

సమీక్ష

ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో విక్రయాలు చోటు చేసుకోవడంతో సూచీలు నష్టపోయాయి. అమెరికా-భారత్ వాణిజ్య చర్చల ఫలితం కోసం మదుపర్లు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. విదేశీ నిధులు మన స్టాక్ మార్కెట్ నుంచి తరలిపోవడం కూడా సూచీలపై ప్రభావం చూపింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 15 పైసలు తగ్గి 86.07 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు 0.06 శాతం తగ్గి 68.49 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్, షాంఘై సూచీలు సానుకూలంగా ముగిశాయి. హాంకాంగ్ సూచీ నష్టపోయింది. ఐరోపా మార్కెట్లు సానుకూల ధోరణిలో ట్రేడయ్యాయి.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.31,000 కోట్లు తగ్గి, రూ.460.87 లక్షల కోట్ల (5.36 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది.

✦ సెన్సెక్స్ ఉదయం 82,753.53 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,634.48 పాయింట్లు) సానుకూలంగా ప్రారంభమైంది. 82,757.09 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ, తర్వాత నష్టాల్లోకి జారుకుంది. రోజంతా ప్రతికూలంగానే కదలాడిన సూచీ ఒక దశలో 82,219.27 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరకు 375.24 పాయింట్ల నష్టంతో 82,259.24 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సైతం 100.60 పాయింట్లు కోల్పోయి 25,111.45 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 25,238.35-25,101 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 23 నష్టపోయాయి. టెక్ మహీంద్రా 2.76%, ఇన్ఫోసిస్ 1.61%, హెచ్‌సీఎల్ టెక్ 1.2%, ఎటెర్నల్ 0.97%, ఎల్ అండ్ టీ 0.78%, టీసీఎస్ 0.74%, మారుతీ 0.70% చొప్పున తగ్గాయి. టాటా స్టీల్ 1.62%, ట్రెంట్ 0.68%, టైటన్ 0.47%, టాటా మోటార్స్ 0.41% మేర పెరిగాయి.

✦ ఎస్ఎంసీ స్క్వేర్డ్ నుంచి 100 శాతం వాటాను 120 మిలియన్ డాలర్ల (సుమారు రూ.1,029 కోట్ల)కు కొనుగోలు చేసినట్లు హెక్సావేర్ టెక్నాలజీస్ వెల్లడించింది.

✦ టెక్ మహీంద్రా జూన్ త్రైమాసిక లాభం తగ్గడంతో, బీఎస్ఈలో షేరు 2.76 శాతం తగ్గి రూ.1,563.50 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.4,218.14 కోట్లు కోల్పోయి, రూ.1,53,099.15 కోట్లకు పరిమితమైంది.

✦ అదానీ విల్మర్‌లో 20 శాతం వాటాను రూ.7,150 కోట్లకు విల్మర్ ఇంటర్నేషనల్ (సింగపూర్)కు విక్రయించినట్లు అదానీ గ్రూప్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారమిచ్చింది.

✦ ప్రయాణికుల విద్యుత్ త్రిచక్ర వాహన విభాగంలోకి జుపేరియా ఆటో ప్రైవేట్ లిమిటెడ్ గురువారం ప్రవేశించింది. 2030 నాటికి రూ.1,000 కోట్ల ఆదాయ లక్ష్యం పెట్టుకున్నామని సీఈఓ ఆయుష్ లోహియా వెల్లడించారు.

✦ ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ ఉత్పత్తి కోసం టాటా ఎలక్ట్రానిక్స్, జర్మన్ టెక్నాలజీ సంస్థ రాబర్ట్ బాష్ జీఎంబీహెచ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు గురువారం వెల్లడించింది.

✦ భారత్‌లోని బేయర్ ఫార్మా విభాగం నుంచి 7 బ్రాండ్లను కొనుగోలు చేసినట్లు కరోనా రెమిడీస్ తెలిపింది. కొనుగోలుకు వెచ్చించిన మొత్తాన్ని వెల్లడించలేదు. గుండె సంబంధిత వ్యాధుల విభాగం, మహిళల ఆరోగ్య సంరక్షణ పోర్ట్‌ఫోలియోలోని 7 బ్రాండ్లను కరోనా రెమిడీస్ సొంతం చేసుకుంది.

✦ స్మార్ట్‌వర్క్స్ కోవర్కింగ్ స్పేసెస్ షేరు ఇష్యూ ధర రూ.407తో పోలిస్తే 7.14 శాతం ప్రీమియంతో బీఎస్ఈలో నమోదైంది. చివరకు 9.36 శాతం లాభంతో రూ.445.10 వద్ద స్థిరపడింది.

నేటి బోర్డు సమావేశాలు: రిలయన్స్ ఇండస్ట్రీస్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, హిందుస్థాన్ జింక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, ఎల్ అండ్ టీ ఫైనాన్స్, బంధన్ బ్యాంక్

సంక్షిప్తంగా

✦ వ్యాపార వ్యూహంలో భాగంగా వందల మంది మేనేజర్ స్థాయి ఉద్యోగులను తొలగించబోతున్నట్లు టాటా మోటార్స్ యాజమాన్యంలోని విలాస కార్ల తయారీ సంస్థ జాగ్వార్ ల్యాండ్ రోవర్ (జేఎల్ఆర్) ప్రకటించింది.

✦ తమ ప్రతిష్ఠ, వ్యాపారానికి నష్టం కలిగించినందుకు గ్లాస్ ట్రస్ట్, ఇతరులపై బైజూస్ వ్యవస్థాపకులు బైజూ రవీంద్రన్, దివ్య గోకుల్‌నాథ్ 2.5 బిలియన్ డాలర్ల (సుమారు రూ.21,500 కోట్ల) దావా వేస్తున్నట్లు వారి న్యాయవాదులు వెల్లడించారు.

✦ వ్యాపార నిర్వహణ విభాగంలో భారతీ ఎంటర్‌ప్రైజెస్ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ సునీల్ భారతీ మిత్తల్‌ను యూకేకు చెందిన 'యూనివర్సిటీ ఆఫ్ బాత్' గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది.

✦ ఎన్‌టీపీసీ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) గుర్దీప్ సింగ్ పదవీ కాలాన్ని ప్రభుత్వం మరో ఏడాది పొడిగించింది. ఈ నెల 31న పదవీ విరమణ చేయాల్సి ఉండగా, 2026 జులై వరకు సీఎండీగా కొనసాగనున్నారు.

✦ తన అంతర్జాతీయ అనుబంధ సంస్థలతో పాటు రూ.2,293 కోట్ల విలువైన కొత్త ఆర్డర్లను దక్కించుకున్నట్లు కల్పతరు ప్రాజెక్ట్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ (కేపీఐఎల్) గురువారం తెలిపింది.

ఏప్రిల్ - జూన్ త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2025-26	నికర లాభం/(నష్టం) 2024-25	మొత్తం ఆదాయం 2025-26	మొత్తం ఆదాయం 2024-25
హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ	748.00	604.00	968.00	775.20
ఇండియన్ హోటల్స్	329.32	260.19	2102.17	1596.27
టాటా కమ్యూనికేషన్స్	190.14	332.93	5959.85	5592.32
సియట్	112.3	154.18	3529.41	3192.82
షాపర్స్‌స్టాప్	(15.74)	(22.72)	1161.08	1069.31
సన్‌టెక్ రియల్టీ	33.43	22.78	201.53	328.01
వారీ రెన్యూవబుల్ టెక్	86.39	28.16	603.19	236.35
నువోకో విస్టాస్	133.16	2.84	2872.70	2636.48

కరెంట్ అఫైర్స్

■ 'జనతా కీ కహానీ – మేరీ ఆత్మకథ' అనేది ఏ ప్రముఖుడి ఆత్మకథ? (ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ దిల్లీలో ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు.)



జ: హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ

■ వరల్డ్ జ్యూరిస్ట్ అసోసియేషన్ నుంచి ప్రతిష్ఠాత్మక 'మెడల్ ఆఫ్ ఆనర్'ను పొందిన తొలి భారత న్యాయవాదిగా ఇటీవల ఎవరు ఘనత సాధించారు?

మాదిరి ప్రశ్నలు

(డొమినికన్ రిపబ్లిక్‌లో జరిగిన వరల్డ్ లా కాంగ్రెస్ 2025లో ఈయనకు ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. బాలల హక్కుల కార్యకర్త, ప్రముఖ న్యాయవాదిగా ఈయన గుర్తింపు పొందారు.)

జ: భువన్ రిభు

■ భారత రిజిస్ట్రార్ జనరల్, సెన్సస్ కమిషనర్ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం దేశంలో 2018–20లో లక్ష సజీవ జననాలకు 97గా ఉన్న ప్రసూతి మరణాల నిష్పత్తి (ఎంఎంఆర్) 2019–21 నాటికి ఎంతకు తగ్గింది?

జ: 93

■ ప్రపంచ వలస పక్షుల దినోత్సవాన్ని ఏటా ఎప్పుడు నిర్వహిస్తారు? (ఏటా 2 సార్లు నిర్వహిస్తారు. 'క్రియేటింగ్ బర్డ్ – ఫ్రెండ్లీ సిటీస్ అండ్ కమ్యూనిటీస్' అనేది ఈ ఏడాది థీమ్.)

జ: మే, అక్టోబరు నెల రెండో శనివారం

మరింత సమాచారం

దరఖాస్తు చేశారా?



- ఎస్‌ఎస్‌సీ సీహెచ్‌ఎస్‌ఎల్ (3,131 పోస్టులు) చివరి తేదీ: 18 జులై, 2025
- నేవీ- ఐఎన్‌సెట్ 2025 (1,110 ఖాళీలు) చివరి తేదీ: 18 జులై, 2025
- ఎస్‌ఎస్‌సీ జూనియర్ ఇంజినీర్ (1,340 పోస్టులు) చివరితేదీ: 21 జులై, 2025

కుర్చీలు భవనాలై.. భవనాలు బల్లలైతే!

జనరల్ స్టడీస్ రీజనింగ్



రోజువారీ పనులు, ఉద్యోగం, షాపింగ్ తదితరాలన్నింటిలో, రకరకాల సమస్యల పరిష్కారంలో తగిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. అందుకోసం తార్కికంగా ఆలోచించగలిగిన నైపుణ్యాన్ని కలిగి ఉండాలి. ఒక నిర్ణయం తీసుకోవడానికి తర్కాన్ని హేతువుగా ఉపయోగించే ప్రక్రియను 'తార్కిక వాదం' అంటారు. ఇది అందుబాటులో ఉన్న సమాచారాన్ని విశ్లేషించి, అంచనా వేసి సరైన ముగింపు రావడానికి సాయపడుతుంది. ఆలోచనా సరళిని మెరుగుపరుస్తుంది. స్పష్టంగా, సమర్థంగా నిర్ణయాలు తీసుకోవడంలో తోడ్పడుతుంది. దీనిపై అభ్యర్థులు పట్టు పెంచుకోవాలంటే వాదనలను, ప్రకటనలను, ముగింపులను, వాటి ఫలితాలను అర్థం చేసుకోవాలి. సాధారణ సూత్రాల నుంచి నిర్దిష్ట నిర్ధారణలకు చేరుకోవడం, వాదనల్లో తరచూ చేసే తప్పులను గుర్తించడం, ఇచ్చిన వివరాలను వృత్త చిత్రాల్లో విశ్లేషించి, వాటి ఆధారంగా సమాధానాన్ని గుర్తించడం నేర్చుకోవాలి.


తార్కిక వాదం




పోటీ పరీక్షల్లో 'తార్కిక వాదం' అనే అంశం నుంచి విరివిగా ప్రశ్నలు వస్తూ ఉంటాయి. ప్రశ్నలో భాగంగా ప్రకటనలు, రెండు లేదా అంత కంటే ఎక్కువ నిర్ధారణలు ఇస్తారు. ఇచ్చిన ప్రకటనలు వాస్తవానికి విరుద్ధంగా ఉన్నప్పటికీ అవి నిజమని భావించి ప్రశ్నలకు సమాధానం గుర్తించాల్సి ఉంటుంది. నిర్ధారణలను విశ్లేషించే క్రమంలో అన్ని సందర్భాల్లో తృప్తిపరిచే దాన్నే సమాధానంగా గుర్తించాలి.

సాధారణంగా ప్రకటనలు నాలుగు రకాలు. అవి


1) అన్ని A లు B లు




2) కొన్ని A లు B లు



3) కొన్ని A లు B లు కావు



4) ఏ A కూడా B కాదు





మాదిరి ప్రశ్నలు

కింది ప్రశ్నల్లో రెండు లేదా మూడు ప్రకటనలు ఉన్నాయి. వాటికి అనుగుణంగా I, II అనే రెండు నిర్ధారణలు ఇచ్చారు. ఈ ప్రకటనలు నిజమని భావించి, ఇచ్చిన ప్రకటనల ద్వారా ఏ విధమైన నిర్ధారణకు వస్తామో తెలపండి.

నిర్ధారణ I మాత్రమే, నిజమైతే సమాధానం 1 గా


నిర్ధారణ II మాత్రమే, నిజమైతే సమాధానం 2 గా

రెండు నిర్ధారణలు నిజమైతే సమాధానం 3 గా

ఏ నిర్ధారణ నిజం కాకపోతే సమాధానం 4 గా గుర్తించండి

1. ప్రకటనలు: అన్ని కుర్చీలు భవనాలు.
   కొన్ని భవనాలు బల్లలు.
   నిర్ధారణలు: I. కొన్ని కుర్చీలు బల్లలు.
   II. కొన్ని బల్లలు కుర్చీలు.


వివరణ:



జ: 4

2. ప్రకటనలు: అన్ని పువ్వులు చెట్లు.
   అన్ని చెట్లు పండ్లు.
   నిర్ధారణలు: I. కొన్ని పండ్లు పువ్వులు.
   II. అన్ని పువ్వులు పండ్లు.


వివరణ:



జ: 3

3. ప్రకటనలు: కొందరు ఆటగాళ్లు గాయకులు.
   అందరూ గాయకులు పొడవైనవారు.
   నిర్ధారణలు: I. కొందరు ఆటగాళ్లు పొడవైనవారు.
   II. అందరూ ఆటగాళ్లు పొడవైనవారు.


వివరణ:




జ: 1

4. ప్రకటనలు: కొన్ని కూరగాయలు పండ్లు.
   ఏ పండు నలుపు కాదు.
   నిర్ధారణలు: I. కొన్ని పండ్లు కూరగాయలు.
   II. ఏ కూరగాయ నలుపు కాదు.

వివరణ:



లేదా




రెండు సందర్భాల్లో కూడా తృప్తిపరిచే నిర్ధారణను మాత్రమే సమాధానంగా తీసుకోవాలి.

జ: 1

5. ప్రకటనలు: కొన్ని గరిటెలు గడియారాలు.
   అన్ని గడియారాలు జెండాలు.
   నిర్ధారణలు: I. కొన్ని జెండాలు గడియారాలు.
   II. కొన్ని గరిటెలు జెండాలు.


వివరణ:




జ: 3

6. ప్రకటనలు: అన్ని పుస్తకాలు పెన్సిళ్లు.
   కొన్ని పెన్సిళ్లు పెన్నులు.
   నిర్ధారణలు: I. అన్ని పెన్నులు పుస్తకాలు.
   II. కొన్ని పెన్సిళ్లు పుస్తకాలు.

వివరణ:




లేదా



జ: 2

7. ప్రకటనలు: అన్ని కుక్కలు, కోతులు.
   ఏ కోతి పిల్లి కాదు.
   నిర్ధారణలు: I. ఏ కుక్క పిల్లి కాదు.
   II. ఏ పిల్లి కుక్క కాదు.


వివరణ:



జ: 3

8. ప్రకటనలు: కొన్ని ఫోన్స్, గడియారాలు.
   అన్ని గడియారాలు గన్స్.
   నిర్ధారణలు: I. అన్ని గన్స్ గడియారాలు.
   II. కొన్ని గన్స్ ఫోన్స్.


వివరణ:



జ: 2

9. ప్రకటనలు: కొన్ని స్కూటర్లు ట్రక్కులు.
   అన్ని ట్రక్కులు రైళ్లు.
   నిర్ధారణలు: I. కొన్ని స్కూటర్లు రైళ్లు.
   II. ఏ ట్రక్కు, స్కూటర్ కాదు.


వివరణ:



జ: 1

10. ప్రకటనలు: కొన్ని ఎలుకలు కుందేళ్లు.
    అన్ని ఎలుకలు దోమలు.
    నిర్ధారణలు: I. కొన్ని దోమలు కుందేళ్లు.
    II. ఏ కుందేలు, దోమ కాదు.

వివరణ:



జ: 1



రచయిత: గోలి ప్రశాంత్ రెడ్డి


అప్పటి రూప్ నాణెం.. నేటి రూపాయి!

మధ్యయుగ భారతదేశ చరిత్రలో మొగల్ సామ్రాజ్యానికి విశిష్టమైన అధ్యాయం ఉంది. ఉపఖండంలో అత్యధిక భాగాన్ని మూడు శతాబ్దాలకు పైగా పాలించిన ఆ పాలకులు దేశ సంస్కృతిని ఎంతగానో ప్రభావితం చేశారు. కళలు, వాస్తు లాంటి అంశాల్లో గొప్ప వారసత్వాన్ని, అద్భుత నిర్మాణాలను అందించారు. రాజకీయ, పాలనా ఐక్యతలో పలు ఆదర్శాలకు ఆధారంగా నిలిచిన మొగల్ సామ్రాజ్య ప్రస్థానంపై పోటీ పరీక్షార్థులకు సమగ్ర అవగాహన ఉండాలి. బాబర్ మొదలు ఔరంగజేబు వరకు మొగల్ చక్రవర్తుల పాలనాశైలి, చేసిన యుద్ధాలు, పాటించిన మతనియమాలు, నిర్మించిన కళాఖండాలు, పన్నుల వ్యవస్థను తెలుసుకోవాలి. మధ్యలో మొగల్ సామ్రాజ్యాన్ని జయించి షేర్షా అధికారం చేపట్టిన తీరు, అతడు అమలు చేసిన ఆర్థిక సంస్కరణలు, వాటి ప్రభావం గురించి వివరంగా అర్థం చేసుకోవాలి.

భారతదేశ చరిత్ర

మొగల్ సామ్రాజ్యం

1. బాబర్ ఎవరిని ఓడించి మొగల్ సామ్రాజ్యాన్ని స్థాపించాడు?
   1) దౌలత్‌ఖాన్ లోడి
   2) సికిందర్ లోడి
   3) అలమ్‌ఖాన్ లోడి
   4) ఇబ్రహీం లోడి




బాబర్

2. కాణ్వా యుద్ధం ఎవరి మధ్య జరిగింది?
   1) బాబర్ - అజయ్‌రాజ్ చౌహాన్
   2) బాబర్ - రాజ్‌మాన్ సింగ్
   3) బాబర్ - రాణా సంగ్రామ్ సింగ్
   4) బాబర్ - మేదినీ రాయి
3. హరియాణాలో పానిపట్టు వద్ద జరిగిన మొదటి పానిపట్టు యుద్ధం ఎవరి మధ్య జరిగింది?
   1) బాబర్ - ఇబ్రహీం లోడి
   2) బాబర్ - దౌలత్‌ఖాన్ లోడి
   3) బాబర్ - ఉలుగ్‌ఖాన్ లోడి
   4) బాబర్ - సికిందర్ లోడి
4. ఏ యుద్ధానంతరం బాబర్ 'ఘాజీ' అనే బిరుదు వహించాడు?
   1) పానిపట్టు యుద్ధం 2) చందేరి యుద్ధం
   3) కాణ్వా యుద్ధం 4) గోగ్రా యుద్ధం
5. బాబర్ ఏ సూఫీ శాఖను ఆదరించాడు?
   1) సుహ్రావర్ది శాఖ 2) చిష్టి శాఖ
   3) నక్షాబంది శాఖ 4) ఫిరదౌసీ శాఖ
6. కింది వారిలో స్వీయ చరిత్రల రాజకుమారుడు?
   1) ఔరంగజేబు 2) బాబర్
   3) అక్బర్ 4) హుమాయూన్
7. ఏ యుద్ధానంతరం బాబర్ బుందేల్‌ఖండ్ రాజ్యాన్ని సొంతం చేసుకున్నాడు?
   1) హాల్దిఘాట్ యుద్ధం 2) మహౌలీ యుద్ధం
   3) ధర్మాత్ యుద్ధం 4) చందేరి యుద్ధం
8. కింది వాటిలో బాబర్ సామ్రాజ్యంలో లేని ప్రాంతం?
   1) కాబుల్ 2) దిల్లీ
   3) బెంగాల్ 4) కాందహార్
9. బాబర్ సమాధి ఎక్కడ ఉంది?



   1) కాబుల్ 2) కాందహార్
   3) షాలిమర్ 4) ఆగ్రా

10. దేశంలో ఎండాకాలం, చలికాలం, వర్షాకాలం అనే మూడు రుతువులు మాత్రమే ఉన్నాయని ఎవరు పేర్కొన్నారు?
    1) కృష్ణదేవరాయలు 2) బాబర్
    3) అక్బర్ 4) గజనీ
11. బాబర్ అమితంగా ఇష్టపడిన ఫలం?
    1) మామిడి 2) ఆపిల్
    3) సపోటా 4) పనస
12. బాబర్‌ను ఇంగ్లాండ్ రాజు 7వ హెన్రీతో పోల్చిన చరిత్రకారుడు?
    1) వి.ఎ.స్మిత్ 2) ఎస్.ఆర్.శర్మ
    3) లేన్‌పూర్ 4) బేవరిడ్జ్
13. హుమాయూన్ చక్రవర్తి కాకముందు ఏ ప్రాంత గవర్నర్‌గా ఉన్నాడు?
    1) కాబుల్ 2) ఖాందేష్
    3) బదాక్షన్ 4) బెంగాల్
14. మొగలుల కాలంలో 'దీన్ ఫణ్' అంటే అర్థం?
    1) పాలనా విభాగం
    2) పేదలకు ఉచిత భోజనం
    3) గృహ కల్పన
    4) మధ్యాహ్న భోజన పథకం
15. షేర్షా, హుమాయూన్‌ల మధ్య జరిగిన యుద్ధం?
    1) బిల్‌గ్రాం 2) చౌసా
    3) మచ్చివారా 4) చునార్
16. ఏ యుద్ధానంతరం షేర్షా తన పేరుపై నాణేలను ముద్రించాడు?
    1) హాల్దిఘాట్ 2) చౌసా
    3) కనోజ్ 4) చునార్
17. హుమాయూన్ పట్టాభిషేకం జరిగిన సంవత్సరం?
    1) 1530 2) 1539 3) 1549 4) 1555
18. హుమాయూన్ అఫ్గాన్‌లపై ఏ సంవత్సరంలో యుద్ధం చేసి గెలిచాడు?
    1) 1538 2) 1539 3) 1549 4) 1555
19. ఏ యుద్ధంలో హుమాయూన్ రాజ్యాన్ని తిరిగి వశపరచుకున్నాడు?
    1) కనోజ్ యుద్ధం 2) బిల్‌గ్రాం యుద్ధం
    3) హీరట్ యుద్ధం 4) సర్-ఇ-హిండ్ యుద్ధం
20. హుమాయూన్ ఏ రాజుపై దాడి చేసి కోహినూర్ వజ్రాన్ని తెచ్చాడు?




    1) జైనులాబ్దీన్
    2) విక్రమ్‌జిత్
    3) భిమ్రాన్
    4) నాగజిత్
21. హుమాయూన్ తల్లి పేరు?
    1) మహీం సుల్తాన్ 2) గుల్‌రుక్ బేగం
    3) దిలాదార్ బేగం 4) హసీనా బేగం
22. హుమాయూన్ పూర్తి పేరు?
    1) జలాలుద్దీన్ మహమ్మద్ హుమాయూన్
    2) నసిరుద్దీన్ మహమ్మద్ హుమాయూన్
    3) అస్కర్ మహమ్మద్ హుమాయూన్
    4) బిజీర్ బదల్ షా హుమాయూన్



నసిరుద్దీన్ మహమ్మద్ హుమాయూన్

23. హుమాయూన్ కాలంలో నీటిపై తేలియాడే ఉద్యానవనం అంటే?
    1) బాగ్-ఇ-రావన్ 2) ఖుషీ-ఇ-రావన్
    3) బజర్-ఇ-రావన్ 4) ఖస్రాయి-ఇ-రావన్
24. హుమాయూన్ గురువు?
    1) జైనులాబ్దీన్ 2) ఖిలిజ్ వాద్దీన్
    3) అబ్దుల్ రహీమ్ 4) పైయాంద్ ఖాన్
25. ఏ పర్షియా రాజు హుమాయూన్ తరఫున వచ్చి వారా యుద్ధంలో పాల్గొన్నాడు?
    1) రాణా ప్రతాప్ 2) షాతమస్
    3) అఫోన్ షా 4) ఫరీదు
26. మొగల్స్‌లో మలి కాల వ్యవధి ఎవరి వల్ల ఆరంభమైంది?
    1) షేర్షా 2) మహమ్మద్ ఖాన్
    3) గురు అర్జున్ సింగ్ 4) హుమాయూన్
27. షేర్షా అసలు పేరు?
    1) ఫరీదు 2) హసన్ సూర్
    3) ఇస్లాం పాసుల్
    4) సికిందర్ షా



ఫరీదు

28. షేర్షా ఏ యుద్ధంలో బాబర్ తరఫున పోరాడాడు?
    1) చందేరి 2) కనోజ్ 3) గోగ్రా 4) బిల్‌గ్రాం
29. సూర్ వంశం లోడి వంశంలోని ఏ పాలకుడి వద్ద జాగీరుదారులుగా పని చేశారు?
    1) దౌలత్ ఖాన్ లోడి 2) సికిందర్ లోడి
    3) బహులాల్ ఖాన్ లోడి 4) ఇబ్రహీం లోడి
30. సూర్ వంశంలో చివరివాడు?
    1) హసన్ సూర్ 2) ఇస్లాం షా సూర్
    3) ఆదిల్ షా సూర్
    4) మహమ్మద్ ఆదిల్ షా సూర్
31. షేర్ ఖాన్ అనే బిరుదు షేర్షాకు ఎవరి వద్ద ఉన్నప్పుడు వచ్చింది?
    1) హసన్ ఖాన్ 2) బహర్‌ఖాన్ లోహాని
    3) జలాల్ ఖాన్ 4) జమల్ ఖాన్
32. షేర్షాపై తిరుగుబాటు చేసిన బెంగాల్ గవర్నర్ ఎవరు?
    1) మహమ్మద్ షా 2) హైబత్ ఖాన్
    3) బలాల్ ఖాన్ 4) ఖిజర్ ఖాన్
33. షేర్షాకు షేర్ ఖాన్ అనే బిరుదు రావడానికి కారణం?
    1) మొగల్ పాలకులపై దండయాత్ర - విజయాలు
    2) కనోజ్ - బిల్‌గ్రాం యుద్ధంలో విజయం
    3) మన్యంలో పులిని చంపినందుకు
    4) బెంగాల్‌లో తిరుగుబాటు అణచివేసినందుకు
34. షేర్షా సైన్యానికి సహకరించిన హిందువు?
    1) రాజామల్ల దేవ్ 2) ఉదయ్ సింగ్
    3) బ్రహ్మజిత్ గౌర్ 4) రాణా ప్రతాపరుద్ర
35. నేటికీ రూపాయిగా పిలుస్తున్న 'రూప్' నాణేన్ని మొగలుల కాలంలో ఎవరు ప్రవేశపెట్టారు?
    1) అక్బర్ 2) షేర్షా
    3) జహంగీర్ 4) ఔరంగజేబు
36. కింది వారిలో గ్రాండ్ ట్రంక్ రోడ్డు, రైత్వారీ విధానానికి పునాది వేసింది?
    1) ఇబ్రహీం సూర్ 2) హసన్ ఖాన్
    3) షేర్షా సూర్ 4) బ్రహ్మజిత్ గౌర్
37. ఇచ్చిన వాటిలో సరికాని జత ఏది?
    1) వజీర్ - ఆర్థిక శాఖ
    2) అర్జ్-ఇ-ఇమాలిక్ - గూఢచారి శాఖ
    3) దివాన్-ఇ-రసాలత్ - స్వదేశీ వ్యవహారాల మంత్రి
    4) దబీర్-ఇ-ఖాస్ - గూఢచారి శాఖ
38. కింది వారిలో సిద్ధసైన్యాన్ని మొదటగా నెలకొల్పింది?
    1) షేర్షా సూర్ 2) అక్బర్
    3) అల్లావుద్దీన్ ఖిల్జీ 4) శ్రీకృష్ణ దేవరాయలు
39. 'టణా'లను ఏర్పాటు చేసింది?
    1) అక్బర్ 2) బాబర్
    3) షేర్షా 4) హుమాయూన్
40. షేర్షా కాలంలో ప్రభుత్వానికి ఎక్కువగా ఆదాయం దేనిపై వచ్చేది?
    1) వ్యాపారం
    2) యుద్ధంలో సంపాదించింది
    3) స్వర్ణకారులపై పన్ను 4) భూమి శిస్తు
41. షేర్షా న్యాయం పరిపాలనలో దిట్ట అయినా, అప్పటి కాలంలో అమలులో ఉన్న శిక్ష?
    1) ఉరిశిక్ష 2) అంగ విచ్ఛేదన
    3) కారాగారం, కొరడా దెబ్బలు
    4) దీపాంతర వాసం
42. జంజీర్ – ఎ – ఆదిల్ అంటే?
    1) ఆసుపత్రి 2) పోలీస్ స్టేషన్
    3) న్యాయ గంట 4) ఆంతరంగిక మందిరం
43. షాజహాన్ పెద్ద కుమారుడి పేరు ఏమిటి?
    1) దారాషికో 2) ఔరంగజేబు
    3) మురాద్ 4) షుజ్
44. మొగల్ కాలంలో కానుంగో అంటే?
    1) రెవెన్యూ అధికారి 2) పోలీస్ అధికారి
    3) న్యాయ అధికారి 4) ప్రధాన మంత్రి
45. కలంజర్ యుద్ధం జరిగిన సంవత్సరం?
    1) 1537 2) 1540 3) 1539 4) 1531
46. అక్బర్ నిర్మించిన పంచ మహల్ ఏ నిర్మాణాన్ని పోలి ఉంటుంది?
    1) జైన మందిరం
    2) బౌద్ధ నిర్మాణం
    3) 1, 2 4) ఏదీకాదు



రచయిత: కాకులూరు వెంకటేశ్వర్లు

సమాధానాలు

1-4; 2-3; 3-1; 4-3; 5-3; 6-2; 7-4; 8-3; 9-1; 10-2; 11-1; 12-1; 13-4; 14-4; 15-1; 16-2; 17-1; 18-4; 19-4; 20-2; 21-1; 22-2; 23-1; 24-1; 25-2; 26-2; 27-1; 28-1; 29-3; 30-2; 31-2; 32-4; 33-3; 34-3; 35-2; 36-3; 37-2; 38-3; 39-3; 40-4; 41-4, 42-3; 43-1; 44-1; 45-4; 46-2.

పూర్ణసంఖ్య రూపంలో
చర్య అణుత



క్రియాజనకాల గాఢత తగ్గుదల రేటు లేదా క్రియాజన్యాల గాఢత పెరుగుదల రేటును 'చర్యారేటు' లేదా 'చర్యా వేగం' అంటారు. ద్రవ్యరాశి క్రియా నియమం ప్రకారం చర్యారేటు క్రియాజనకాల గాఢతకు అనులోమానుపాతంలో ఉంటుంది. చర్యారేటును క్రియాజనకాల స్వభావం, గాఢతలు, ఉత్ప్రేరకం, ఉష్ణోగ్రత, ఉపరితల వైశాల్యాలు ప్రభావితం చేస్తాయి. రసాయన చర్యలు వేర్వేరు వేగాల్లో జరుగుతాయి. పోటీపరీక్షార్థులు చర్యాక్రమాంకం, వాటి వర్గీకరణ, చర్య అణుత, మిథ్యా ఏకాణుక చర్యలపై అవగాహన కలిగి ఉండాలి.

పోటీ పరీక్షల ప్రత్యేకం
కెమిస్ట్రీ

రసాయన గతికశాస్త్రం

చర్యాక్రమాంకం

చర్యారేటు క్రియాజనకాల గాఢతకు అనులోమానుపాతంలో ఉంటుంది. చర్య జరిగేకొద్దీ క్రియాజనకాలు వినియోగమై క్రియాజనకాల గాఢత తగ్గి చర్యారేటు తగ్గుతుంది.

ఉదా: $A + B + C \longrightarrow$ క్రియాజన్యాలు అనే చర్యలో,

చర్యారేటు $= K \times [A][B][C]$

✦ ఈ సమీకరణాన్నే అవకలన రూపంలో రేటు సమీకరణం (Rate Equation) అంటారు. రేటు సమీకరణంలో ఉండే స్థిరాంకం Kను రేటు స్థిరాంకం (Rate Constant) అంటారు.

✦ రేటు సమీకరణం భేదాత్మక రూపం (Differential Form)లో క్రియాజనకాల గాఢత పదాలపై ఘాతాంకాల మొత్తాన్ని చర్యాక్రమాంకం అంటారు.

ఉదా: $A \longrightarrow B$ అనే చర్య రేటు సమీకరణం,

చర్యారేటు $= K[A]$ అయితే, చర్యాక్రమాంకం $= 1$

▮ $A + B \longrightarrow C + D$ అనే చర్య రేటు సమీకరణం,

చర్యారేటు $= K[A] \times [B]$ అయితే, చర్యాక్రమాంకం $= 1 + 1 = 2$

▮ $A + 2B \longrightarrow C + D$ అనే చర్య రేటు సమీకరణం,

చర్యారేటు $= K[A] \times [B]^2$

అయితే, చర్యాక్రమాంకం $= 1 + 2 = 3$

శూన్యక్రమాంక చర్యలు

కాంతి వికిరణ సమక్షంలో హైడ్రోజన్, క్లోరిన్‌ల సంయోగం

$H_2 + Cl_2 \xrightarrow{\text{కాంతి}} 2HCl$; చర్యారేటు $= K[H_2]^0 [Cl_2]^0$

● సూక్ష్మ విభాజిత గోల్డ్ సమక్షంలో హైడ్రోజన్ అయోడైడ్ వియోగం

$2HI \xrightarrow{Au} H_2 + I_2$; చర్యారేటు $= K[HI]^0$

ప్రథమ క్రమాంక చర్యలు

నైట్రోజన్ పెంటాక్సైడ్ ఉష్ణ వియోగం

$N_2O_5 \longrightarrow 2NO_2 + \frac{1}{2}O_2$, రేటు $= K[N_2O_5]^1$

● హైడ్రోజన్ పెరాక్సైడ్ ఉష్ణ వియోగం

$H_2O_2 \longrightarrow H_2O + \frac{1}{2}O_2$, రేటు $= K[H_2O_2]^1$

ద్వితీయ క్రమాంక చర్యలు

ఎస్టర్ క్షార జల విశ్లేషణ:

$CH_3COOC_2H_5 + NaOH \longrightarrow CH_3COONa + C_2H_5OH$

రేటు $= K[CH_3COOC_2H_5][NaOH]$

తృతీయ క్రమాంక చర్యలు

స్టానస్ క్లోరైడ్‌తో ఫెర్రిక్ క్లోరైడ్ క్షయకరణం:

$2FeCl_3 + SnCl_2 \longrightarrow 2FeCl_2 + SnCl_4$

రేటు $= K[FeCl_3]^2 [SnCl_2]^1$

● నైట్రిక్ ఆక్సైడ్ (NO), క్లోరిన్ (Cl_2) సంయోగం:

$2NO + Cl_2 \longrightarrow 2NOCl$

రేటు $= K[NO]^2 [Cl_2]$

చర్యాక్రమాంకం భిన్నాంకంగా ఉన్న చర్యలు

కొన్ని రసాయన చర్యల క్రమాంకాలు 1/2, 3/2 లాంటి భిన్నాంకాలుగా ఉంటాయి.

▮ ఆర్థో హైడ్రోజన్ పారా హైడ్రోజన్‌గా మారే చర్య:

$H_2\,(ortho) \longrightarrow H_2\,(para)$

చర్యారేటు $= K[H_2\,(ortho)]^{3/2}$

▮ వాయుస్థితిలో ఎసిటాల్డిహైడ్ వియోగం:

$CH_3CHO \longrightarrow CH_4 + CO$

చర్యారేటు $= K[CH_3CHO]^{3/2}$

మిథ్యాప్రథమ క్రమాంక చర్యలు

కొన్ని చర్యలు వాస్తవానికి ద్వియణుక చర్యలు అయినప్పటికీ పలు సందర్భాల్లో ప్రథమ క్రమాంక చర్యారేటు సమీకరణాన్ని అనుసరిస్తాయి. ఇలాంటి చర్యలను మిథ్యాప్రథమ క్రమాంక చర్యలు లేదా మిథ్యా ఏకాణుక చర్యలు అంటారు.

ఉదా: విలీన ఆమ్ల ద్రావణంలో ఇథైల్ ఎసిటేట్ జల విశ్లేషణ చర్య:

$CH_3COOC_2H_5 + H_2O \xrightarrow{H^+} CH_3COOH + C_2H_5OH$

◗ ఇది వాస్తవంగా ద్వియణుక చర్య. విలీన ద్రావణంలో నీటి గాఢత చాలా ఎక్కువ. కాబట్టి రసాయన చర్యలో దాని గాఢతలో మార్పు రాదు. అందువల్లే చర్యావేగం కేవలం ఇథైల్ ఎసిటేట్ గాఢతపై మాత్రమే ఆధారపడుతుంది. ఈ చర్య ప్రథమ క్రమాంక చర్య రేటు సమీకరణాన్ని అనుసరిస్తుంది. కాబట్టి ఇది ఒక మిథ్యా ఏకాణుక చర్య.

చర్య అణుత

క్రియాజనక అణువులు నిరంతరం ఒకదానితో మరొకటి తాడనం చెందుతూ ఉంటాయి. ఈ అణుతాడనాల వల్ల క్రియాజనక అణువులు, క్రియాజన్య అణువులుగా మారతాయి. క్రియాజన్య అణువులు ఏర్పడే తాడనంలో పాల్గొనే క్రియాజనక అణువులు లేదా అయాన్ల సంఖ్యనే 'చర్య అణుత' అంటారు.

◆ సరళమైన చర్యల్లో క్రియాజనక అణువులు ఒకే దశలో నేరుగా క్రియాజన్య అణువులుగా మారతాయి. అయితే సంక్లిష్ట చర్యల్లో అనేక మౌలిక చర్యలు వరుస క్రమంలో జరుగుతాయి. ప్రతి మౌలిక చర్యకు అణుత ఉంటుంది.

◆ మౌలిక చర్యల్లో అతి నెమ్మదిగా జరిగే చర్యను 'రేటు నిర్ధారక దశ' అంటారు.

◆ మొత్తం చర్యా వేగం, రేటు నిర్ధారక దశ వేగంపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి రేటు నిర్ధారక దశ అణుతకు అధిక ప్రాముఖ్యత ఉంది.

◆ సంక్లిష్ట చర్యలకు రేటు నిర్ధారక దశ అణుతనే మొత్తం చర్యకు అణుతగా భావిస్తారు.

ఉదా: $2NO_2 + F_2 \longrightarrow 2NO_2F$ అనే చర్యలో రెండు మౌలిక చర్యలు జరుగుతాయని భావిస్తారు. అవి:

i. $NO_2 + F_2 \longrightarrow NO_2F + F$ (నెమ్మదిగా)

ii. $NO_2 + F \longrightarrow NO_2F$ (వేగంగా)

◆ మొదటి మౌలిక చర్య నెమ్మదిగా జరుగుతుంది. కాబట్టి ఇది రేటు నిర్ధారక దశ. ఇందులో రెండు అణువులు పాల్గొనడం వల్ల పై చర్యను ద్వియణుక చర్యగా భావించవచ్చు.

◆ చర్య అణుత ఎల్లప్పుడూ 1, 2, 3 లాంటి పూర్ణ సంఖ్యగానే ఉంటుంది.

◆ చర్య అణుత ఆధారంగా రసాయన చర్యలను ఏకాణుక, ద్వియణుక, త్రియణుక చర్యలుగా వర్గీకరిస్తారు.

$PCl_5 \longrightarrow PCl_3(g) + Cl_2(g)$ (ఏకాణుక చర్య)

$H_2(g) + I_2(g) \longrightarrow 2HI(g)$ (ద్వియణుక చర్య)

$2SO_2(g) + O_2(g) \longrightarrow 2SO_3(g)$ (త్రియణుక చర్య)



రచయిత
డా. పి. భానుప్రకాష్
అసిస్టెంట్ ప్రొఫెసర్

714 Word of the Day

Palpitation

Telugu meaning: గుండెదడ, వణుకు

English meaning: The word palpitation (ప్యాల్పిటేషన్) is a noun that describes an irregular or unusually rapid heartbeat, often noticeable by the person experiencing it.

Synonyms: Flutter, Pounding

Antonyms: Calmness, Stillness

Usage: **1.** She felt a sudden palpitation after hearing the shocking news.

2. Caffeine and stress often trigger palpitation in sensitive individuals.

నోటిఫికేషన్స్

అసిస్టెంట్ మేనేజర్ ఉద్యోగాలు

పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్‌ఆర్డీఏ) వివిధ విభాగాల్లో ఆఫీసర్ గ్రేడ్-ఏ (అసిస్టెంట్ మేనేజర్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 40. దరఖాస్తు ఫీజు రూ.1000. అర్హులైన అభ్యర్థులు 2025, ఆగస్టు 6లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్ పోస్టులు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ముంబయి ఒప్పంద/రెగ్యులర్ ప్రాతిపదికన స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 33. ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ 2025 జులై 31.

మేనేజర్ పోస్టులు

కోల్‌కతాలోని శ్యాంప్రసాద్ ముఖర్జీ పోర్టు (ఎస్‌పీఎంపీకే) వివిధ విభాగాల్లో ఆఫీసర్, మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 41. దరఖాస్తు ఫీజు రూ.400. ఆన్‌లైన్ దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ 2025 జులై 30.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలకు నేడే (జులై 18) చివరి తేదీ

✦ ఎస్ఎస్‌సీ - కంబైన్డ్ హయ్యర్ సెకండరీ లెవల్ ఎగ్జామినేషన్ 2025. ఇంటర్ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు అర్హులు.


✦ ఇండియన్ నేవీ- ఐఎన్‌సెట్ 2025. టెన్త్, ఇంటర్మీడియట్, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు.

✦ ఎన్‌సీఎల్‌టీలో లా రిసెర్చ్ అసోసియేట్ పోస్టులు. డిగ్రీ (లా), పీజీలో ఉత్తీర్ణతతో పాటు కంప్యూటర్ స్కిల్స్ ఉన్నవారు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

నెల్సన్ మండేలా అంతర్జాతీయ దినోత్సవం

జులై 18
చరిత్రలో ఈనాడు



నెల్సన్ మండేలా జయంతిని పురస్కరించుకుని ఏటా జులై 18న 'నెల్సన్ మండేలా అంతర్జాతీయ దినోత్సవం'గా నిర్వహిస్తారు. మన దేశంలో గాంధీజీలాగే దక్షిణాఫ్రికాలో మండేలాను శాంతి, అహింసకు చిహ్నంగా పేర్కొంటారు. జాతివివక్షకు వ్యతిరేకంగా పోరాడి, నల్లజాతి సూరీడుగా పేరొందారు. ఈయన ఆశయాలైన అందరికీ విద్య, మానవ హక్కుల రక్షణ, లింగ సమానత్వం, పేదరిక నిర్మూలన మొదలైనవాటిని సమాజంలోకి తీసుకెళ్లడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం. నేడు మండేలా జన్మదినం సందర్భంగా ఆయన జీవితంలోని ముఖ్య విషయాల గురించి తెలుసుకుందాం..!

☛ మండేలా అసలు పేరు నెల్సన్ రోలిహ్లాహ్లా మండేలా. 1918, జులై 18న దక్షిణాఫ్రికాలోని ట్రాన్స్‌కీ ప్రాంతంలో ఉన్న ఉమ్టాటాలో జన్మించారు.

☛ ఆ రోజుల్లో దక్షిణాఫ్రికాలో జాతి వివక్ష ఎక్కువగా ఉండేది. నల్ల జాతీయులను తక్కువగా చేసేవారు. ఈయన కూడా అణచివేతకు గురయ్యారు. మండేలా దక్షిణాఫ్రికా విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రాన్ని అభ్యసించారు.

☛ 1944లో ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ (ఏఎన్‌సీ)లో చేరారు. మండేలా నిర్వహించే అనేక కార్యక్రమాలు, ఉద్యమాలపై గాంధీ ప్రభావం ఎక్కువగా ఉండేది.

☛ గాంధీజీ దక్షిణాఫ్రికాలో సత్యాగ్రహ విధానాన్ని ప్రవేశపెట్టి 100 ఏళ్లు అయిన సందర్భంగా 2007, జనవరి 29, 30 తేదీల్లో దిల్లీలో నిర్వహించిన కార్యక్రమానికి మండేలా హాజరయ్యారు.

☛ 1948లో దక్షిణాఫ్రికా నేషనలిస్ట్ పార్టీ అధికారంలోకి వచ్చింది. నల్ల, తెల్ల జాతీయులను విభజించి ఉంచడం వీరి విధానం. దీన్ని వ్యతిరేకించే ఏఎన్‌సీ పార్టీ నాయకుడైన మండేలా అనేక సమ్మెలు, ఉద్యమాలు నిర్వహించారు.

☛ 1960, మార్చి 21న జాతి వివక్షకు వ్యతిరేకంగా ఏఎన్‌సీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఆ ప్రదర్శనపై పోలీసులు కాల్పులు జరపగా, 69 మంది చనిపోగా, 180 మంది గాయపడ్డారు. అక్కడి ప్రభుత్వం ఏఎన్‌సీని నిషేధించగా, మండేలా సహా ఇతర నాయకులంతా అజ్ఞాతంలోకి వెళ్లారు. తర్వాత పోలీసులు అరెస్టు చేయగా, 1964లో జీవిత ఖైదు విధించారు. దాదాపు 27 ఏళ్లు జైలు జీవితం గడిపారు.

☛ 1993లో ఈయనకు నోబెల్ శాంతి బహుమతి లభించింది. 1994, ఏప్రిల్ 27న దక్షిణాఫ్రికాలో మొదటిసారి జరిగిన స్వేచ్ఛా ఎన్నికల్లో ఆ దేశ అధ్యక్షుడిగా ఎన్నికై, ఆ పదవి చేపట్టిన తొలి నల్ల జాతీయుడిగా రికార్డు సృష్టించారు.

☛ 1990లో ఆయనకు భారతదేశ అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్న లభించింది.


☛ ఈయన 2013, డిసెంబరు 5న మరణించారు.

☛ శాంతి, న్యాయం, అహింసపై ఆయన కృషికి గుర్తుగా ఏటా ఆయన పుట్టిన రోజైన జులై 18న 'నెల్సన్ మండేలా అంతర్జాతీయ దినోత్సవం'గా జరపాలని ఐరాస 2009లో అధికారికంగా ప్రకటించింది. 2010 నుంచి ప్రతి సంవత్సరం దీన్ని నిర్వహిస్తున్నారు.

జనరల్ స్టడీస్ - ఇండియన్ జాగ్రఫీ

పట్టణీకరణ

ప్రజలు గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వలస వెళ్లడాన్ని పట్టణీకరణ అంటారు. ప్రతిసారీ గ్రామీణ ప్రాంతాల నుంచి వలస వచ్చిన ప్రజల వల్లే పట్టణం అనేది ఏర్పడకపోవచ్చు. కొన్నిసార్లు ఉద్దేశపూర్వకంగా లేదా సహజంగా మానవ నివాసాల సాంద్రత పెరగడం వల్ల కూడా ఇవి ఏర్పడతాయి.



పట్టణీకరణ

నగరీకరణ లేదా పట్టణీకరణ అనే పదాన్ని స్పానిష్ దేశానికి చెందిన సివిల్ ఇంజినీర్ ఇల్‌డెఫాన్స్ సెర్డా (Ildefons Cerda) 1867లో తాను రచించిన General Theory of Urbanizationలో ఉపయోగించారు.

పట్టణీకరణ – కారణాలు

అన్ని రకాల భౌగోళిక ప్రాంతాల మాదిరిగా కాకుండా పట్టణ కేంద్రం అనేది సహజంగానో లేదా ఉద్దేశపూర్వకంగానో అభివృద్ధి చెందుతుంది.

▮ పట్టణ ప్రక్రియ అనేది ఆధునికీకరణ, వాణిజ్యీకరణ, పారిశ్రామికీకరణ, గ్రామీణ పట్టణ పరివర్తన లాంటి అనేక సామాజిక, ఆర్థిక కారకాలపై ఆధారపడి ఉంటుంది.

▮ పట్టణీకరణకు ఈ కారకాల వెనక చోదకశక్తులుగా పనిచేసే అనేక పుష్- పుల్ కారకాలు ఉంటాయి.

భారతదేశంలో మెగా సిటీలు; పట్టణీకరణ - సానుకూల, ప్రతికూల ప్రభావాలు; పట్టణీకరణ - విధానం, లక్ష్యాలు; స్మార్ట్ సిటీస్ మిషన్‌లోని మౌలికాంశాలు; స్మార్ట్ అనువర్తనాలు - ఉదాహరణలు మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..

The first Governor-General of Bengal was...

Current Affairs

1. B. Saroja Devi, who was fondly referred to as "Abhinaya Saraswathi," was honored with which of the following awards for her outstanding contribution to Indian cinema?
A) Padma Bhushan B) Padma Vibhushan
C) Dadasaheb Phalke Award
D) Bharat Ratna

2. Who has been appointed as the Managing Director and CEO of GIFT City in Gandhinagar for a three-year tenure?
A) Tapan Ray B) Sanjay Kaul
C) Rajesh Dayal D) Amitabh Kant

3. Who has recently taken charge as the Deputy Director General of the Bureau of Indian Standards (BIS) Southern Regional Office, becoming the first woman to hold this position?
A) Nishat Sultana Haque B) G. Bhavani
C) Meenakshi Ganesan D) Kiruthiga G

4. Which Indian state became the first to officially align with the Union Government's Cruise Bharat Mission, proposing several cruise circuits along its coastline?
A) Kerala B) Goa
C) Maharashtra D) Gujarat

5. Which team won the 15th Hockey India Sub-Junior Women National Championship 2025 - Division 'A' title?
A) Hockey Association of Odisha
B) Hockey Haryana C) Hockey Mizoram
D) Hockey Jharkhand

6. At the Lignano Meeting, part of the World Athletics Continental Tour in Italy, which distance did Ancy Sojan achieve to win the bronze medal in the women's long jump?
A) 6.44 m B) 6.54 m C) 6.36 m D) 6.71 m

7. Which franchise clinched their second Major League Cricket (MLC) title in 2025, staging a comeback in the playoffs after winning just three of their ten league matches?
A) Washington Freedom
B) San Francisco Unicorns
C) Seattle Orcas D) MI New York

General Knowledge

8. Who is the author of the Booker Prize-winning novel The Inheritance of Loss published in 2006?
A) Arundhati Roy B) Kiran Desai
C) Jhumpa Lahiri D) Anita Desai

9. The National Education Policy (NEP) 2020 was based on the recommendations of which committee?
A) Kothari Committee
B) Kasturirangan Committee
C) Mudaliar Committee
D) Yash Pal Committee

SSC Exams Special

General Awareness

10. Which of the following statements about FICCI is correct?
A) It was founded in 1947 and is based in Mumbai
B) It is India's largest and oldest trade union federation
C) It was established in 1927 and is headquartered in New Delhi
D) It functions under the Ministry of Finance, Government of India

11. The Aryabhatta Research Institute of Observational Sciences (ARIES), an autonomous research institute in India, is located in which of the following places?
A) Nainital, Uttarakhand
B) Dehradun, Uttarakhand
C) Pune, Maharashtra
D) Thiruvananthapuram, Kerala

History

12. Murshid Quli Khan, the first Nawab of Bengal, was originally born with which name?
A) Zamin Ali Quli
B) Nasiruddin Humayun
C) Surya Narayan Mishra
D) Mir Jafar

13. Who was appointed as the first Governor-General of Bengal under the Regulating Act of 1773?
A) Robert Clive B) Lord Cornwallis
C) Lord Wellesley D) Warren Hastings

14. Who is regarded as the founder of the British education system in India and also served as the chairman of the first Law Commission?
A) Charles Metcalfe
B) Lord William Bentinck
C) Lord Macaulay D) Lord Ripon

15. Which Governor-General passed the Defence of India Act, 1915, granting emergency powers during World War I?
A) Lord Chelmsford B) Lord Hardinge
C) Lord Curzon D) Lord Irwin

General Science

16. William Bragg shared the Nobel Prize in Physics in 1915 with his son Lawrence Bragg for their work in which scientific field?
A) Theory of Relativity
B) Atomic Structure
C) Crystal Structure using X-rays
D) Radioactivity

17. Charles's Law describes the relationship between which two properties of a gas?
A) Pressure and Volume
B) Volume and Temperature
C) Pressure and Temperature
D) Volume and Density

18. Which of the following is an example of a viviparous animal?
A) Frog B) Snake
C) Cow
D) Crocodile

Scan the QR code for Key

These model questions were prepared by subject experts.

మా స్థలాన్ని ఆక్రమణ చెర నుంచి విడిపించండి

తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితుడి వినతి

ఈనాడు, అమరావతి: తమ స్థలాన్ని కొందరు ఆక్రమించారు. సర్వే చేసి దాన్ని అప్పగించాలని కృష్ణా జిల్లా గన్నవరం మండలం గోపవరపుగూడేనికి చెందిన దగ్గిరాల వెంకటసుబ్బారావు వాపోయారు. తనకు న్యాయం చేయాలని కోరుతూ మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో గురువారం వినతిపత్రం సమర్పించారు. వివిధ సమస్యలతో పెద్ద సంఖ్యలో తరలివచ్చిన బాధితుల నుంచి మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యే అశోక్‌బాబు వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. తమ భూమిని తహసీల్దారు కార్యాలయ ఉద్యోగి ఒకరు ఆక్రమించారని అనంతపురం జిల్లా కుందేరు మండలం సోలసముద్రానికి చెందిన వస్సూర్పు ఫిర్యాదు చేశారు. అనకాపల్లి జిల్లా రూరల్ మండల పోలీస్ స్టేషన్‌లో స్వీపర్లు, స్కావెంజర్లుగా పని చేస్తున్న తమకు జీతాలు పెంచాలని పలువురు కోరారు.

'ఉపాధి' వేతన బకాయిలు విడుదల చేయాలని కేంద్రానికి లేఖ

ఈనాడు, అమరావతి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో శ్రామికులకు చెల్లించాల్సిన వేతన బకాయిలు రూ.2 వేల కోట్లు వెంటనే విడుదల చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. 'ఈ ఏడాది మే 15 తర్వాత నుంచి వేతనాలు చెల్లించని కారణంగా బకాయిలు పేరుకుపోయాయి. శ్రామికుల నుంచి ఒత్తిడి పెరగడంతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి కార్యాలయం కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖకు లేఖ రాసింది.

'ఎంఎస్ఎంఈ పర్యాటక ప్రాజెక్టుల' భూ కేటాయింపుపై కమిటీ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పారిశ్రామికవేత్తల(ఎంఎస్ఎంఈ) ఆధ్వర్యంలో పర్యాటక ప్రాజెక్టుల ఏర్పాటుకు భూ కేటాయింపుల కోసం ప్రభుత్వం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) మేనేజింగ్ డైరెక్టర్ చైర్మన్, కో-చైర్మన్‌గా పర్యాటక సంస్థ సీఈఓ, సభ్య కన్వీనర్‌గా ఏపీటీడీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ప్రాజెక్ట్సు) ఉంటారని పేర్కొంది. ఆర్థిక శాఖలో పీపీపీ విభాగం నిపుణుడు శాలిగ్రామ్, ట్రాన్సాక్షన్ సలహా కన్సల్టెంట్, ఏపీఐఐసీలోని పీపీపీ విభాగం జనరల్ మేనేజర్, ఇన్‌క్యాప్ చీఫ్ జనరల్ మేనేజర్, ఆర్థిక, న్యాయ నిపుణులు, టెక్నికల్ యూనివర్సిటీ ప్రతినిధిని కమిటీలో సభ్యులుగా నియమిస్తూ పర్యాటకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ ఉత్తర్వులు జారీ చేశారు.

మత్స్యకార సంక్షేమ, అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా పెదిరాజు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర మత్స్యకార సంక్షేమ, అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నియోజకవర్గానికి చెందిన కొల్లు పెదిరాజుని ప్రభుత్వం గురువారం నియమించింది. బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రెండేళ్లపాటు ఆయన పదవిలో ఉంటారని ప్రభుత్వం తెలిపింది.

జగన్ వ్యాఖ్యల్ని ప్రజలు క్షమించరు

తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు

ఈనాడు, అమరావతి: మళ్లీ అధికారంలోకి వస్తే గత ఐదేళ్ల తన పాలన కంటే ఇంకా భయంకరంగా వ్యవహరిస్తానని, రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తానని వైకాపా అధినేత జగన్ చేస్తున్న వ్యాఖ్యల్ని ప్రజలు క్షమించరని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు. పోలీసుల్ని భయపెట్టడం నాయకుడి లక్షణం కాదన్నారు. ప్రజాస్వామ్యంలో ఉంటూ ఆ ప్రజాస్వామ్యానికే హాని చేస్తానంటున్న ఆయన మాటల్ని ఎవరూ స్వాగతించరని గురువారం ఓ ప్రకటనలో దుయ్యబట్టారు. "మళ్లీ అధికారంలోకి వస్తే తెదేపా వాళ్ల పనిపడతా, పోలీసుల పనిపడతా నంటూ జగన్ మాట్లాడటం హీనం. జగన్ తాటాకు చప్పుళ్లకు తెదేపా వాళ్లు భయపడరు. ఆయన క్రిమినల్ వ్యక్తిత్వాన్ని ప్రజలు అసహ్యించుకుంటున్నారు" అని యనమల మండిపడ్డారు.

నకిలీ వీడియోలపై అప్రమత్తంగా ఉండాలి: మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: ఓ కంపెనీ తక్కువ సమయంలోనే భారీ లాభాలు ఇస్తుందని, అందులో పెట్టుబడులు పెట్టాలంటూ ఓ పాత్రికేయుడి ఇంటర్వ్యూలో ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పినట్లు ఏఐ ఆధారిత ఫేక్ వీడియో చేశారని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఇది పూర్తిగా మోసమని ఎక్స్ వేదికగా స్పష్టం చేశారు. ఇలాంటి మోసాల్ని నమ్మవద్దని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఇలాంటి వాటిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. డీప్ ఫేక్ సాంకేతికత దుర్వినియోగం చేస్తూ ప్రజల్ని మోసం చేస్తున్న వారిని వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

ఉచిత బస్ ప్రయాణంపై ఆర్టీసీ సంఘాలతో చర్చించాలి: ఎన్‌డబ్ల్యూఎఫ్

ఈనాడు, అమరావతి: ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్ ప్రయాణం అమలు చేయనున్న నేపథ్యంలో.. దానిపై ఆర్టీసీ సంఘాలతో యాజమాన్యం సమావేశం నిర్వహించాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎన్‌డబ్ల్యూఎఫ్) కోరింది. ఉద్యోగులు, ఆపరేషన్స్ సంబంధించిన సమస్యలపై చర్చించాలని, తమ సూచనలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. కొత్తగా తీసుకునే విద్యుత్ బస్సులను గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్ (జీసీసీ) విధానంలో కాకుండా, ఆర్టీసీనే నిర్వహించేలా చూడాలని పేర్కొన్నారు. ఉద్యోగుల భద్రతకు సంబంధించిన 1/2019 సర్క్యులర్ అమలు చేయాలని కోరింది. ఈ మేరకు సంస్థ ఎండీకి లేఖ రాసినట్లు ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు జిలానీ బాషా, ప్రధాన కార్యదర్శి పట్టాభిరామ్ దొర గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

సీఎం పెట్టుబడుల ప్రచారం వీడియో నకిలీది: తెలంగాణ సీఎంవో

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి 'క్వాంటం ఏఐ' అనే వెబ్‌సైట్‌ను ప్రమోట్ చేస్తున్నట్లుగా సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్న వీడియో నకిలీదని ముఖ్యమంత్రి కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. 'రూ.21 వేల పెట్టుబడి పెడితే.. రూ.2 లక్షలు సంపాదిస్తారని సీఎం చెబుతున్నట్లుగా ఆన్‌లైన్‌లో కనిపిస్తున్న ఆ వీడియో ఏఐ ద్వారా సృష్టించినదని, దాన్ని నమ్మి మోసపోవద్దని స్పష్టం చేసింది.

ఓఆర్ఆర్‌కు కావాల్సిన భూమి ఎంత?

- సేకరణకు ఎన్ని నిధులు వెచ్చించాలి?
- సమగ్ర వివరాలు సిద్ధంచేస్తున్న ఎన్‌హెచ్ఏఐ

ఈనాడు, అమరావతి: అమరావతి ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్)కు అవసరమైన భూముల వివరాలను జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) సిద్ధం చేస్తోంది. 140 మీటర్ల వెడల్పు (రైట్ ఆఫ్ వే)తో ఓఆర్ఆర్‌కు అనుమతిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకోవడంతో.. వీటికి ఎన్ని హెక్టార్ల మేరకు భూములు కావాలి? వాటి సేకరణకు ఎన్ని నిధులు వెచ్చించాల్సి ఉంటుందనేది అంచనా వేస్తూ నివేదిక రూపొందిస్తోంది.

◆ 189 కి.మీ. ఓఆర్ఆర్‌కు ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కలిపి 3,400 హెక్టార్ల మేర ప్రభుత్వ, పట్టా, ఎసైన్డ్ భూములు, 250 హెక్టార్ల అటవీ భూములు అవసరమవుతాయని అంచనా వేస్తున్నారు.

◆ గతంలో 70 మీటర్ల వెడల్పుతో అనుమతించినపుడు 1,702 హెక్టార్ల భూసేకరణకు రూ.2,665 కోట్లు, 124 హెక్టార్ల అటవీ భూములకు రూ.150 వెచ్చించాల్సి ఉంటుందని భావించారు.

◆ ఇప్పుడు భూసేకరణకు మొత్తం రూ.5 వేల కోట్లు, అటవీ భూములకు రూ.300 కోట్లు ఖర్చుచేయాల్సి వస్తుందని అంచనా వేస్తున్నారు.

◆ భూసేకరణ ఆరంభించేందుకు ఏ మేరకు నిధులు డిపాజిట్ చేయాల్సి ఉంటుందనేది కూడా నివేదికలో పేర్కొననున్నారు.

కేంద్ర మంత్రిమండలి ఆమోదం తెలిపితే.

ఇక్కడి ఎన్‌హెచ్ఏఐ అధికారులు తాజాగా రూపొందిస్తున్న నివేదికను కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ (మోర్త్)కు పంపితే.. అక్కడి ప్రాజెక్ట్ అప్రైజర్ టెక్నికల్ స్క్రూటినీ కమిటీ (పీఏటీఎస్‌సీ) పరిశీలించి సాంకేతిక అనుమతులు ఇస్తుంది. తర్వాత ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్య అప్రైజర్ కమిటీ (పీపీపీఏసీ) ఆమోదం తెలుపుతుంది. అనంతరం దీనిని కేంద్ర మంత్రివర్గ సమావేశం ముందు ఉంచి, ఆమోదం తీసుకుంటారు.

ఎన్‌హెచ్ సంఖ్య కోసం ప్రతిపాదన

ఓఆర్ఆర్‌కు కొత్తగా జాతీయ రహదారి నంబరు కేటాయించాలని మోర్త్‌కు ప్రతిపాదన పంపుతున్నారు. ఇది ఆరు జాతీయ రహదారులను అనుసంధానం చేస్తూ వెళ్తుంది. దీంతో కొత్త నంబరు కేటాయిస్తారని అధికారులు పేర్కొంటున్నారు.

8-10 ప్యాకేజీలుగా..

ఓఆర్ఆర్ ప్రాజెక్ట్‌ను 8-10 ప్యాకేజీలుగా చేపట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. మొత్తం 189 కి.మీ. మేర ఓఆర్ఆర్ ఉండగా సగటున 25 కి.మీ.కు అటూఇటుగా ఒక్కో ప్యాకేజీ ఉంటుంది. ఈ లెక్కన 8 ప్యాకేజీలు వస్తాయి. కృష్ణానదిపై ఎగువన అమరావతికి దగ్గరలోని మున్నలూరు-ముత్తాయిపాలెం మధ్య, దిగువన వల్లూరుపాలెం-వల్లభాపురం మధ్య ఒక్కో వంతెన నిర్మించనున్నారు. ఈ రెండింటినీ వేర్వేరు ప్యాకేజీలుగా చేపట్టే అవకాశం ఉందని చెబుతున్నారు. అలా అయితే మొత్తం 10 ప్యాకేజీలు అవుతాయని అంచనా వేస్తున్నారు.

ఓబీసీ రిజర్వేషన్లు, రోస్టర్ విధిగా అమలు చేయాలి

- అధికారులకు జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ ఛైర్మన్ హన్సరాజ్ ఆదేశం

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ సంస్థల్లో ఓబీసీ రిజర్వేషన్లు, రోస్టర్ అమలుతో పాటు బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని అధికారులను జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ ఛైర్మన్ హన్సరాజ్ గంగారాం అహిర్ ఆదేశించారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా గురువారం ఆయన విజయవాడలో వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థల అధికారులతో వేర్వేరుగా సమావేశమై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. "కేంద్ర పథకాలు సక్రమంగా అమలు చేయాలి. బ్యాంకు రుణాల మంజూరు, స్వయం ఉపాధి కార్యక్రమాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి" అని సూచించారు. వైద్య, ఆరోగ్య శాఖలో శాశ్వత, పొరుగు సేవల పోస్టుల్లో రిజర్వేషన్లు, రోస్టర్‌ను కేంద్ర, రాష్ట్ర విధానాల మేరకు అమలు చేస్తున్నామని వైద్య, ఆరోగ్య శాఖపై సమీక్ష సందర్భంగా కమిషన్ ఛైర్మన్‌కు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ వివరించారు. బీసీల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం చంద్రబాబు పని చేస్తున్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. 56 బీసీ కార్పొరేషన్లకు ఛైర్మన్లు నియమించి బీసీలకు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు. అనంతరం యూనియన్ బ్యాంకులో అమలవుతున్న ఓబీసీ రిజర్వేషన్లు, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, రోస్టర్ తదితర వివరాలను కమిషన్ ఛైర్మన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓబీసీ యూనియన్ నాయకులతోనూ మాట్లాడారు. మంగళగిరి ఎయిమ్స్‌లో అందిస్తున్న సేవలు, పోస్టుల వివరాలు, అమలవుతున్న రోస్టర్‌పై అధికారులు ఛైర్మన్‌కు వివరించారు. బీసీ సంక్షేమశాఖలో అమలవుతున్న రిజర్వేషన్లు, బీసీ యువతకు అందిస్తున్న విద్య, ఉద్యోగ అవకాశాలపై ఛైర్మన్‌కు ఆ శాఖ కార్యదర్శి సత్యనారాయణ వివరించగా.. సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్, ఇంజినీరింగ్, టెక్నాలజీ (సీపెట్) కార్యకలాపాలు, ఆ సంస్థ అందిస్తున్న శిక్షణ కోర్సులు, అందిస్తున్న ఉద్యోగ అవకాశాలపై అధికారులను కమిషన్ ఛైర్మన్ అడిగి తెలుసుకున్నారు.

నీళ్లిస్తే రైతులు బంగారం పండిస్తారు

ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: నీళ్లిస్తే సీమ రైతులు బంగారం పండిస్తారని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. హంద్రీ నీవా ప్రాజెక్టు ప్రధాన కాలువ సామర్థ్యాన్ని 2,200 క్యూసెక్కుల నుంచి 3,850 క్యూసెక్కులకు పెంచడంతో రాయలసీమ రైతాంగానికి మేలు జరుగుతుందని వివరించారు. సీమకు జీవనాడైన హంద్రీ నీవా ప్రధాన కాలువ విస్తరణ పనుల్ని శరవేగంగా పూర్తిచేశామని గుర్తుచేశారు. ఇదే స్ఫూర్తితో త్వరలోనే ఫేజ్-2 పూర్తి చేద్దామని పిలుపునిచ్చారు. జలహారతి కార్యక్రమంలో భాగంగా గురువారం హంద్రీ నీవాకు నీరు విడుదల చేసిన చంద్రబాబు ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. "నాకు చాలా సంతోషంగా, సంతృప్తిగా ఉంది. రాయలసీమ ప్రాంతానికి నీళ్లిచ్చి రైతన్నలకు మంచి చేస్తే కలిగే సంతోషం ఎప్పుడూ ప్రత్యేకమే. నాలుగు ఉమ్మడి జిల్లాల్లో 6 లక్షల ఎకరాలకు సాగునీరు, 33 లక్షల మందికి తాగు నీరు అందించే ప్రాజెక్టును పూర్తిచేస్తాం. ప్రతి ఎకరాకు నీరు అందించాలనే సంకల్పాన్ని అందరి దీవెనలతో నెరవేరుస్తాం. రైతన్నల సాగునీటి కష్టాలు తీర్చి వారి జీవన ప్రమాణాలు మెరుగుపరుస్తాం" అని వివరించారు.

'ఉపాధి'లో సామాజిక తనిఖీల సభలు యూట్యూబ్‌లో

- వినూత్న ఆలోచనలతో ఏపీ ముందుకు
- దక్షిణాది రాష్ట్రాల ముగింపు సదస్సులో ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్

ఈనాడు, అమరావతి: సామాజిక తనిఖీల్లో భాగంగా మండల స్థాయిలో నిర్వహించే సభలను యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేసే వినూత్న కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ త్వరలో శ్రీకారం చుడుతున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ వెల్లడించారు. ఉపాధి హామీ పథకంలో సామాజిక తనిఖీలపై మంగళగిరిలో నిర్వహించిన రెండు రోజుల దక్షిణాది రాష్ట్రాల ముగింపు సదస్సులో గురువారం ఆయన ప్రసంగించారు. 'ఉపాధి పనులపై నిర్వహించే సామాజిక తనిఖీల నుంచి గ్రామసభల వరకు అన్ని వివరాలూ వెబ్‌సైట్‌లో పెట్టి పారదర్శకతకు ప్రాధాన్యమిస్తున్నాం. వివిధ రాష్ట్రాలు అవలంబించే విధానాలు ఒక్కోచోట ఒక్కో రకంగా ఉండొచ్చు. ఉత్తమ విధానాలను ఆదర్శంగా తీసుకోడానికి ఇలాంటి సదస్సులు దోహదం చేస్తాయి' అని శశిభూషణ్‌కుమార్ అన్నారు. తెలంగాణ, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో ఉపాధి పథకం పనులపై నిర్వహిస్తున్న సామాజిక తనిఖీలకు అవలంబిస్తున్న విధానాలపై ఆయా రాష్ట్రాల అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సదస్సులో ఉప ముఖ్యమంత్రి ఓఎస్‌డీ వెంకటకృష్ణ, రాష్ట్ర సామాజిక తనిఖీల విభాగం డైరెక్టర్ జి.శ్రీకాంత్ తదితరులు ప్రసంగించారు.



దక్షిణాది రాష్ట్రాల ముగింపు సదస్సులో మాట్లాడుతున్న రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్

గ్రానైట్ మెరుపులపై నష్టాల పిడుగు!

- నాడు కోలుకోలేని దెబ్బతీసిన కరోనా
- నేడు మరిన్ని కష్టాల్లోకి నెట్టిన యుద్ధాలు
- ఎగుమతుల్లో భారీ తగ్గుదల
- పాలిషింగ్ యూనిట్లూ మూత

ఈనాడు, ఒంగోలు: గ్రానైట్ రంగాన్ని కరోనా దెబ్బతీసింది. ఇప్పుడు మారిన ప్రపంచ పరిస్థితులు మరింత కుంగదీశాయి. ఎగుమతులతో సుభిక్షంగా ఉన్న ఈ రంగం పలు దేశాల్లో ఆర్థికమాంద్యం, యుద్ధాల వల్ల అంతకంతకూ మసకబారుతోంది. మన గ్రానైట్ రాయికి ప్రధాన దిగుమతిదారు చైనా. ఆ దేశానికి చేసే ఎగుమతుల్లో 90 శాతం ముడిరాయే ఉంటుంది. చైనాలో నిర్మాణ రంగం కుదేలు కావడం, కరోనా వ్యాప్తితో ఆర్థికంగా కష్టాలు ఎదురవడంతో ఐదేళ్లుగా చైనా దిగుమతులను తగ్గించేసింది. ఒకప్పుడు 70 వేల క్యూబిక్ మీటర్ల గ్రానైట్ రాళ్లు చైనాకు ఎగుమతి కాగా, ఇప్పుడు 30 వేల క్యూబిక్ మీటర్లే అవుతున్నాయి. ఇజ్రాయెల్ దాడులు, ఇరాన్ యుద్ధమేఘాలు గ్రానైట్ రంగాన్ని మరింతగా నష్టాల్లోకి నెట్టాయి.

రవాణా ఛార్జీల భారం

ప్రకాశం జిల్లా చీమకుర్తిలో లభించే బ్లాక్ గెలాక్సీ గ్రానైట్‌కు గల్ఫ్ దేశాల్లో డిమాండ్ ఎక్కువ. యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో ఆ దేశాలకు ఎగుమతులు భారీగా తగ్గాయి. సముద్ర రవాణాకు సంబంధించి సూయజ్ కాలువ వివాదంతో రవాణా ఛార్జీలు పెరిగాయి. ఒకప్పుడు ఒక కంటెయినర్‌కు 600-700 డాలర్లు ఉన్న ఛార్జీలను ఒకేసారి 2,000 డాలర్లకు పెంచారు. ఆ భారమంతా పరిశ్రమ నిర్వాహకులపైనే పడుతోంది. నౌకాశ్రయాల్లో హ్యాండ్లింగ్ ఛార్జీలు టన్నుకు రూ.150-170 వరకు ఉండగా, ఇప్పుడు రూ.300కు చేరాయి. గతంలో గల్ఫ్ దేశాలకు సరకు పంపితే నెలలో డబ్బు అందేది. ఇప్పుడు రెండున్నర నెలలు వేచి చూడాల్సి వస్తోంది. ఈ భారాలను తట్టుకోలేక చిన్నస్థాయి పాలిష్ యూనిట్లను యజమానులు మూసివేస్తున్నారు. పాలిష్ చేసిన గ్రానైట్ పలకలు ప్రకాశం జిల్లా నుంచి చెన్నై ఓడరేవు మీదుగా నెలకు ఐదు వేల కంటెయినర్లలో ఎగుమతి అయ్యేవి. ఇప్పుడు మూడు వేల కంటెయినర్లే వెళుతున్నాయి. గ్రానైట్ రాయిని పాలిషింగ్ యూనిట్లలో బండలుగా మార్చి విక్రయిస్తుంటారు. ఈ క్రమంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షల మంది ఉపాధి పొందుతుంటారు. వీరితో పాటు చిరు వ్యాపారులు, హోటళ్లు, దుకాణాల నిర్వాహకులు నష్టపోతున్నారు. ఎగుమతులు నిలిచిపోవడం రవాణా రంగాన్నీ దెబ్బతీసింది. బాపట్ల జిల్లా పర్చూరుకు చెందిన యజమాని ఒకరు మూడు నెలల్లో నాలుగు లారీలను అమ్ముకోవాల్సి వచ్చింది.



కేటీఆర్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు నోటీసులు

ఈనాడు, హైదరాబాద్: నల్గొండ జిల్లా నకిరేకల్ పోలీసు స్టేషన్‌లో భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌పై నమోదైన కేసులపై వివరణ ఇవ్వాలంటూ తెలంగాణ ప్రభుత్వానికి ఆ రాష్ట్ర హైకోర్టు గురువారం ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులకు సంబంధించి పోలీసులు నమోదు చేసిన సాక్షుల వాంగ్మూలాలను సమర్పించాలంది. పదో తరగతి పరీక్ష ప్రశ్నపత్రం నకిరేకల్ గురుకుల పాఠశాలలో లీక్ అయిందని 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేశారంటూ అందిన ఫిర్యాదుల మేరకు కేటీఆర్‌పై కేసులు నమోదయ్యాయి. ఈ కేసులను కొట్టివేయాలని కోరుతూ కేటీఆర్ రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేయగా జస్టిస్ కె.లక్ష్మణ్ గురువారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది టి.వి.రమణ రావు వాదనలు వినిపిస్తూ... పత్రిక, వెబ్‌మీడియాలో వచ్చిన వార్తను పిటిషనర్ తన 'ఎక్స్' ఖాతాలో యథాతథంగా పోస్ట్ చేశారని తెలిపారు. అది తప్పుడు వార్త అన్న విషయం ఆయనకు తెలియదన్నారు. రాజకీయ కక్షసాధింపుతో ఆయనపై నమోదు చేసిన కేసులను కొట్టివేయాలని కోరారు. ఒకే నేరానికి సంబంధించి బహుళ ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం చెల్లదని ఇదే హైకోర్టు పలు సందర్భాల్లో ఉత్తర్వులు జారీ చేసిన విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. వాదనలను విన్న న్యాయమూర్తి... ప్రభుత్వానికి నోటీసులు జారీ చేస్తూ విచారణను ఆగస్టు 5వ తేదీకి వాయిదా వేశారు.



జెఫ్రీ ఎప్‌స్టీన్ కేసు ప్రాసిక్యూటర్‌కు ఉద్వాసన

వాషింగ్టన్: సీన్ డిడీ కూంబ్స్, జెఫ్రీ ఎప్‌స్టీన్‌లకు వ్యతిరేకంగా మన్‌హటన్ కోర్టులో వాదనలు వినిపిస్తున్న ప్రాసిక్యూటర్ మౌరీన్ కామీకి ట్రంప్ ప్రభుత్వం ఉద్వాసన పలికింది. న్యూయార్క్ దక్షిణ జిల్లాలో వెటరన్ న్యాయవాదిగా, జస్టిస్ డిపార్టుమెంటులో ప్రముఖ ప్రాసిక్యూటర్‌గా ఉన్న ఆమె ఉద్వాసనకు గల కారణాలను ప్రభుత్వం వెల్లడించలేదు. తనకు ఉద్వాసన పలకడంపై కామీ.. ఘాటుగా స్పందించారు. నిరంకుశుల ఆయుధం భయమేనని ఎఫ్‌బీఐ మాజీ డైరెక్టర్ కుమార్తె అయిన ఆమె వ్యాఖ్యానించారు. ఎప్‌స్టీన్ మహిళల అక్రమ రవాణా, లైంగిక వేధింపుల కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. అతడు 2019లో ఆత్మహత్య చేసుకున్నాడు.

22 బోగీలతో కాచిగూడ-జోధ్‌పుర్ ఎక్స్‌ప్రెస్

- 20 నుంచి నిజామాబాద్, ఉజ్జయిని మీదుగా రాకపోకలు

ఈనాడు, హైదరాబాద్: కాచిగూడ నుంచి రాజస్థాన్‌లోని జోధ్‌పుర్‌కు నడపనున్న కొత్త రైలును ఆధునిక ఎల్‌హెచ్‌బీ బోగీలతో పట్టాలు ఎక్కించాలని రైల్వేశాఖ నిర్ణయించింది. ఇందులో 7 చొప్పున స్లీపర్, థర్డ్ ఏసీ, 2 సెకండ్ ఏసీ బోగీలతోపాటు 4 జనరల్ బోగీలు, ఒకటి చొప్పున లగేజీ, దివ్యాంగుల కంపార్ట్‌మెంట్లు సహా మొత్తం 22 బోగీలు ఉంటాయి. ఈ నెల 19న కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్, కిషన్‌రెడ్డి దీన్ని ప్రారంభిస్తారు. ఆ రోజు ప్రత్యేక రైలుగా నడిపి. . 20వ తేదీ నుంచి రెగ్యులర్‌గా నడిపించాలని రైల్వేశాఖ నిర్ణయించింది. నిజామాబాద్-ముద్కేడ్-నాందేడ్-పూర్ణ-అకోలా-ఇటార్సీ-ఉజ్జయిని-అజ్మేర్ మీదుగా జోధ్‌పుర్‌లోని భగత్ కీ కోఠీ స్టేషన్‌కు చేరుకుంటుంది. ఈ ఎక్స్‌ప్రెస్ వారం మొత్తం నడుస్తుంది. రోజూ రాత్రి 11.50 గంటలకు కాచిగూడ (17605) నుంచి బయల్దేరుతుంది.

ఎఫ్‌సీఐకి 10% బ్రోకెన్ రైస్

ఈనాడు, అమరావతి: భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)కు సరఫరా చేసే బియ్యంలో 10 శాతం బ్రోకెన్ రైస్ (నూక/విరిగిన బియ్యం) ఇచ్చేందుకు రైస్ మిల్లర్లు సిద్ధంగా ఉండాలని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. విజయవాడలోని కానూరు పౌరసరఫరాల శాఖ భవనంలో గురువారం ఆయన రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. కేంద్ర నిబంధనల మేరకు తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టు కింద చేపట్టిన 10 వేల టన్నుల ధాన్యం సేకరణ విజయవంతమైందని ఆయన తెలిపారు. బ్రోకెన్ రైస్ సరఫరాలో లోపాలు లేకుండా చూడాలన్నారు. సమావేశంలో పౌరసరఫరాలశాఖ కమిషనర్ సౌరభ్‌గౌర్, పౌరసరఫరాల సంస్థ ఎండీ మనజీర్ జిలాని, అధికారులు పాల్గొన్నారు.

చంద్రబాబుతో పోటీపడలేకే జగన్ నీచ వ్యాఖ్యలు

ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

ఈనాడు, దిల్లీ: పనిలో, ప్రవర్తనలో చంద్రబాబుతో పోటీపడలేకే జగన్ ముఖ్యమంత్రిపై నీచమైన వ్యాఖ్యలకు దిగుతున్నారని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు విమర్శించారు. మూడేళ్లలో చంద్రబాబు ఎగిరిపోతాడన్న వ్యాఖ్యలు జగన్ పతనావస్థను చాటి చెబుతున్నాయన్నారు. దిల్లీలోని ఏపీ భవన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. "జగన్‌కు ఏ కోణంలోనూ చంద్రబాబుతో పోటీపడే స్థాయి లేదు. అందుకే అల్పబుద్ధితో నోటికి పని చెబుతున్నారు. పోలీసులు, మీడియా వ్యవస్థలపై అసంబద్ధ ఆరోపణలు చేస్తూ ప్రజల్లో అయోమయం సృష్టించే కుట్రకు తెర తీశారు. దేశ విదేశీ పెట్టుబడిదారులు సీఎం చంద్రబాబు సామర్థ్యం, పనితీరు పట్ల ఆసక్తి కనబరుస్తూ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తుంటే జగన్ నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. విపరీత ఆలోచనలున్న జగన్ పట్ల ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి" అని కోరారు.

ఆసియాలో తొలి క్వాంటమ్ వ్యాలీ అమరావతిలోనే

ఏపీ బయో డైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్

ఈనాడు, అమరావతి: ఆసియాలో తొలి క్వాంటమ్ వ్యాలీ వచ్చే ఏడాది జనవరి నాటికి అమరావతిలో సాకారం కానుందని ఏపీ బయో డైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ తెలిపారు. ఐబీఎం, టీసీఎస్, మైక్రోసాఫ్ట్ వంటి బడా కంపెనీలు అమరావతికి రావడం శుభపరిణామమని వెల్లడించారు. మంగళగిరిలో గురువారం ఆయన మాట్లాడారు. "నేషనల్ క్వాంటమ్ మిషన్ ఇండియాను 2024 జనవరిలోనే కేంద్రం ప్రారంభించింది. శాస్త్రీయ పరిశోధనలను ప్రోత్సహించడానికి రూ.6 వేల కోట్లు కేటాయించింది. దేశ వ్యాప్తంగా 384 సంస్థలు దరఖాస్తు చేస్తే.. అప్పటి వైకాపా ప్రభుత్వం దీన్ని పట్టించుకోనే లేదు. నేడు రాష్ట్రం.. క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ ఏర్పాటు దిశగా ముందుకెళ్తోంది. ఇది సీఎం చంద్రబాబు దార్శనికతకు మరో నిదర్శనం" అని పేర్కొన్నారు.

ఆహారం, మందుల నాణ్యతపై నిఘా

మంత్రి సత్యకుమార్ యాదవ్

ఈనాడు, అమరావతి: ఆహార పదార్థాలు, మందుల నాణ్యతపై నిఘా పెంచాలని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించారు. మంత్రిత్వ శాఖలోని వివిధ విభాగాల పనితీరుపై ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబుతో రాష్ట్ర సచివాలయంలో గురువారం సమీక్షించారు. ఆహార కల్తీలు, నాసిరకం మందుల సమస్య లేకుండా తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఐపీఎం, డీసీఏ విభాగాలకు రెగ్యులర్ హెచ్‌వోడీల నియామకం, ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ఏఐ, మెషీన్ లెర్నింగ్ లాంటి ఆధునిక సాంకేతిక ఆధారంగా డిజిటల్ వైద్యసేవలను అందించేలా వసతుల కల్పనపై చర్చించారు. హైబ్రిడ్ పద్ధతిలో యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ పథకం, పీపీపీ విధానంలో కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్వహణ, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 100 పడకల స్పెషాలిటీ ఆసుపత్రుల ఏర్పాటు వేగవంతం చేయాలని మంత్రి పేర్కొన్నారు.

ప్రపంచ ఆరోగ్యానికి భారత్ సహకారం

'భారతదేశం బొలీవియాకు 3 లక్షల మీజిల్స్ రుబెల్లా వ్యాక్సిన్ డోసులు పంపింది. ప్రధాని నరేంద్రమోదీ ప్రపంచ ఆరోగ్యానికి అందిస్తున్న సహకారానికి ఇదో నిదర్శనం' అని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారం ఎక్స్‌లో పోస్టు చేశారు. కొవిడ్ సమయంలోనూ వ్యాక్సిన్ మైత్రితో దక్షిణాది దేశాలకు అండగా నిలిచారు' అని గుర్తుచేశారు.

వ్యవసాయ శాఖలో కొలిక్కి వచ్చిన బదిలీలు

ఈనాడు, అమరావతి: వ్యవసాయ శాఖలో బదిలీలు ఎట్టకేలకు కొలిక్కి వచ్చాయి. 5 జిల్లాల వ్యవసాయ అధికారులతోపాటు 24 మంది ఏడీఏలకు సంబంధించిన బదిలీలపై గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. జూన్ 9న జారీ చేసిన ఉత్తర్వుల్లో మార్పులు చేశారు. కాకినాడ జిల్లా వ్యవసాయాధికారిగా పనిచేస్తున్న విజయ్‌కుమార్‌ను గతంలో విజయనగరానికి బదిలీ చేయగా, తాజాగా ఆయన్ను మళ్లీ కాకినాడలోనే కొనసాగించారు. అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల వ్యవసాయాధికారులు ఎస్‌బీఎస్ నాథ్, కె.రాబర్ట్‌పాల్, వీటీ రామారావును గతంలో బదిలీ చేయగా.. ఇప్పుడు మళ్లీ వారిని పూర్వస్థానాల్లోనే నియమించారు. జూన్ 9 నాటికి బదిలీల ప్రక్రియ ముగిసినా.. తర్వాత వారం వరకు సాగదీస్తూ వచ్చారు. వ్యవసాయ అధికారుల నుంచి జిల్లాల వ్యవసాయాధికారులు, జేడీఏల బదిలీల వరకు అంతా తప్పుల తడకేనన్న ఆరోపణలు వచ్చాయి. కొన్నిచోట్ల ఎమ్మెల్యేల సిఫార్సుల్ని పక్కన పెట్టి నిర్ణయాలు తీసుకోవడమూ చర్చనీయాంశమైంది.

జల వివాదాల నిపుణుల కమిటీపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలి: సీపీఎం

ఈనాడు, అమరావతి: దిల్లీలో బుధవారం జరిగిన తెలుగు రాష్ట్రాల సీఎంల సమావేశం జలవివాదాలను మరింత జటిలం చేసే విధంగా ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో విమర్శించారు. "కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ సమక్షంలో జరిగిన సమావేశం బనకచర్ల ప్రాజెక్టు వివాదాన్ని పరిష్కరించకపోగా.. గోదావరి, కృష్ణా నదీ జలాల వివాదాల తేనెతుట్టెను కదిల్చేలా ఉంది. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న దానికి భిన్నంగా ఏమి జరిగినా అది రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం చేస్తుంది. వెంటనే అఖిలపక్ష సమావేశం నిర్వహించాలి. దిల్లీలో జరిగిన సమావేశ వివరాలను, నిపుణుల కమిటీ విధివిధానాలను ప్రజలకు స్పష్టం చేయాలి" అని డిమాండ్ చేశారు.

గ్రామీణ పారిశుద్ధ్య కార్యక్రమాల్లో.. గుంటూరు జిల్లా ప్రథమం

జిల్లా పరిషత్తు (గుంటూరు), న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాల అమలులో గుంటూరు జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌టీజీఎస్ ద్వారా నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వేలో జిల్లాకు చెందిన 75 శాతం మంది ప్రజలు పారిశుద్ధ్యంపై సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర సగటు 62 శాతం కాగా, గుంటూరు జిల్లా 75 శాతం సాధించడం విశేషం. కృష్ణా జిల్లా ద్వితీయ స్థానం (72 శాతం), తూర్పుగోదావరి జిల్లా తృతీయ స్థానం (71 శాతం), పల్నాడు జిల్లా నాలుగో స్థానం (68 శాతం) పొందాయి. గుంటూరు జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు ఉండగా.. 225 గ్రామాల్లో ఐవీఆర్ఎస్ సర్వే చేశారు. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ.. జడ్పీ సీఈవో, డీపీవోలు, ఎంపీడీవోలు, ఇతర అధికారులతో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ సర్వే వివరాలను వెల్లడించారు. గుంటూరు జిల్లా అగ్రస్థానంలో నిలిచినందుకు జడ్పీ సీఈవో వి.జ్యోతిబసును, డీపీవో నాగసాయికుమార్‌ను, జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. పారిశుద్ధ్య డ్రైవ్‌లో భాగంగా వివిధ స్థాయిల అధికారులు రోజూ ఉదయం 6 నుంచి 9 గంటల వరకు గ్రామాల్లో పర్యటించి వ్యర్థాల సేకరణను పర్యవేక్షిస్తున్నారు.

బిహార్‌లో పిడుగుపాట్లకు 19 మంది మృతి

పట్నా: బిహార్‌లో గడచిన 24 గంటల్లో పిడుగుపాట్లకు 19 మంది మృతి చెందినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. నలంద, వైశాలి, బాంకా, పట్నా తదితర జిల్లాల్లో ఈ మరణాలు నమోదయ్యాయి. మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి నీతీశ్‌కుమార్ రూ.4 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

కేరళలోని 4 జిల్లాల్లో రెడ్‌అలర్ట్

తిరువనంతపురం: కేరళలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో కోజికోడ్ జిల్లాలో మట్టిచరియలు విరిగిపడి, పలుచోట్ల ఇళ్లలోకి వరదనీరు వచ్చింది. రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లోనూ లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా, పలు నదుల్లో నీటిమట్టాలు పెరిగాయి. తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిందిగా అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. వర్షాలు కొనసాగుతున్నందున భారత వాతావరణ విభాగం కాసర్‌గోడ్, కోజికోడ్, కన్నూర్, వయనాడ్ జిల్లాల్లో ఇదివరకు జారీచేసిన 'ఆరెంజ్' హెచ్చరికలను రెడ్‌అలర్ట్‌గా మార్చింది. ఈ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీవర్షాలు కురిసే అవకాశముంది. అలాగే త్రిసూర్, పాలక్కాడ్, మలప్పురం జిల్లాల ఎల్లో అలెర్ట్‌ను 'ఆరెంజ్' హెచ్చరికగా మార్పు చేశారు.

అది భాజపా 'ఎన్నికల చోరీ శాఖ'

- ఈసీపై రాహుల్ గాంధీ విసుర్లు



దిల్లీ: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పేరుతో బిహార్‌లో పెద్ద ఎత్తున ఎన్నికల రిగ్గింగ్ జరుగుతోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. ఎస్ఐఆర్ పేరుతో ఎన్నికల సంఘం (ఈసీ) ఉద్దేశపూర్వకంగా ఓటర్లను తొలగిస్తోందని మండిపడ్డారు. 'బిహార్‌లో ఓట్లను దొంగలిస్తూ ఈసీ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడింది. ఈసీ పూర్తిగా భాజపా 'ఎన్నికల దోపిడి శాఖ'గా మారిపోయింది. దీనిని బహిర్గతం చేసిన వారిపై కేసులు నమోదవుతున్నాయి' అని రాహుల్ గాంధీ ఎక్స్‌లో రాసుకొచ్చారు. ప్రత్యేక సమగ్ర సవరణలోని లోపాలను ఎత్తిచూపుతూ పాత్రికేయుడు అజిత్ అంజుమ్ తన యూట్యూబ్ ఛానెల్ ద్వారా వెలువరిస్తోన్న సిరీస్‌ను రాహుల్ ఈ సందర్భంగా పోస్టు చేశారు. హరియాణాలోని హిస్సార్‌లో దళిత యువకుడి హత్య కేసుపై స్పందిస్తూ..."న్యాయం కోరినందుకు ఆ యువకుడి కుటుంబం వేధింపులకు గురైంది. ఇది నేరం మాత్రమే కాదు. దళితులపై వివక్ష చూపే భాజపా-ఆరెస్సెస్‌ల నిజ స్వరూపాన్ని బయటపెడుతోంది' అని రాహుల్ మండిపడ్డారు.

మరోవైపు అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ జైలుకు వెళతారని రాహుల్ చేసిన వ్యాఖ్యలపై భాజపా స్పందించింది. రాహుల్ గాంధీ అవినీతి గురించి మాట్లాడుతుంటే దొంగే ఇంటికి కాపలాదారుగా బాధ్యతలు చేపట్టినట్లుగా ఉందని విమర్శించింది.

జర్నలిస్టు అజిత్ అంజుమ్‌పై కేసు విచారకరం: ఎడిటర్స్ గిల్డ్

బిహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లోని అవకతవకలపై యూట్యూబ్‌లో వీడియోలను విడుదల చేస్తున్న జర్నలిస్టు అజిత్ అంజుమ్‌పై కేసు నమోదును ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా మితిమీరిన చర్యగా అభివర్ణించింది. "అంజుమ్ రిపోర్టుల్లోని అంశాలను సమర్థించడానికి లేదా వ్యతిరేకించడానికి మేం ప్రయత్నించడం లేదు. కానీ చట్టబద్ధంగా విధులు నిర్వహిస్తున్న పాత్రికేయుడిపై కేసు నమోదు విచారకరం" అని ఎడిటర్స్ గిల్డ్ ఓ ప్రకటనలో తెలిపింది.

దేశీయ వ్యోమనౌకలోనే తదుపరి రోదసీయానం

దిల్లీ: శుభాంశు శుక్లా రోదసియానం విజయవంతమవడంతో.. భవిష్యత్ అంతరిక్ష యాత్రలకు అవసరమైన కీలక నైపుణ్యాలను, విలువైన అనుభవాన్ని భారత్ గడించినట్లయిందని కేంద్ర శాస్త్ర, సాంకేతికత శాఖ మంత్రి జితేంద్రసింగ్ అన్నారు. తదుపరి భారత వ్యోమగామి రోదసియానం కచ్చితంగా దేశీయ వ్యోమనౌకలోనే జరుగుతుందని ప్రకటించారు. "సొంత అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటుచేసుకునేందుకు భారత్ అడుగులు వేస్తోంది. 2035 కల్లా అది సాకారమవ్వొచ్చు. ఆ కేంద్రానికి భారత్ స్పేస్ స్టేషన్ అనే పేరు పెట్టాలని నిర్ణయించాం" అని జితేంద్రసింగ్ పేర్కొన్నారు. స్వదేశీ వ్యోమనౌకలో భారత్ చేపట్టబోయే అంతరిక్ష యాత్రలు సొంత స్పేస్ స్టేషన్ ఏర్పాటుకు మార్గం సుగమం చేస్తాయని చెప్పారు. శుభాంశు శుక్లా యాత్రకు పెద్దగా శాస్త్రీయ విలువేదీ లేదంటూ వస్తున్న విమర్శలను కేంద్రమంత్రి తోసిపుచ్చారు.

వాణిజ్య ఒప్పందంలో అవరోధాల పరిష్కారం దిశగా భారత్, అమెరికా

దిల్లీ: వాణిజ్య ఒప్పందానికి అవరోధంగా ఉన్న సమస్యల్ని పరిష్కరించుకునే దిశగా భారత్, అమెరికాల మధ్య సంప్రదింపులు సాగుతున్నాయని భారత విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ తెలిపారు. భారత్‌తో ఒప్పందానికి దగ్గరగా ఉన్నామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యానించిన నేపథ్యంలో గురువారం మీడియా సమావేశంలో ఆయన స్పందించారు. 20శాతం కంటే తక్కువ సుంకాల దిశగా చర్చలు సాగుతున్నట్లు తెలుస్తోంది. ప్రతీకార సుంకాల నుంచి తప్పించుకోవడానికి ఒప్పందం త్వరలో కుదురుతుందనే ఆశాభావం భారత్‌లో ఉంది. మరోవైపు తొందరపాటు ఒప్పందమేదీ ఉండబోదనీ తేల్చి చెప్పింది. 26శాతం అదనపు సుంకాన్ని ఎత్తివేయాలని భారత్ కోరుకుంటోంది.

9 బిలియన్ డాలర్ల వ్యయ నియంత్రణ బిల్లుకు సెనెట్ ఆమోదం

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన 9 బిలియన్ డాలర్ల వ్యయ నియంత్రణ బిల్లుకు సెనెట్ ఆమోదం తెలిపింది. ప్రభుత్వ మీడియాకు, విదేశీ సాయానికి సంబంధించి ఈ కోతలను ట్రంప్ ప్రతిపాదించారు. పలువురు అధికార రిపబ్లికన్ సభ్యుల ఆందోళనల మధ్య ఈ బిల్లు ఆమోదం పొందింది. తదుపరి ఆమోదం కోసం ఇది.. ప్రతినిధుల సభకు వెళ్లనుంది. డెమోక్రాట్లు ప్రతిపాదించిన పలు సవరణలపై 12 గంటలపాటు సుదీర్ఘ చర్చ, పలు మార్లు ఓటింగ్ జరిగిన అనంతరం చివరకు బిల్లు 51-48తో ఆమోదం పొందింది. పెరిగిపోతున్న దేశ అప్పులపై ఈ బిల్లు పెద్దగా ప్రభావం చూపకపోయినప్పటికీ.. ప్రభుత్వ మీడియా నుంచి అమెరికా ఆహార సహాయ కార్యక్రమాలపై భారీ ప్రభావం చూపనుంది. ప్రభుత్వ రేడియో, టీవీ కేంద్రాలకు కోతలు విధించడంపై డెమోక్రాట్లు, రిపబ్లికన్ల మధ్య సెనెట్‌లో వాగ్వాదం జరిగింది.

ఆ బిడ్డ ఆచూకీ వెంటనే కనుక్కోండి

- దిల్లీ పోలీసు ఉన్నతాధికారులకు సుప్రీంకోర్టు సూచన
- రష్యన్ మహిళపై లుకౌట్ నోటీసు జారీకి కేంద్రానికి ఆదేశం

దిల్లీ: భారతీయుడైన తండ్రికి, రష్యన్ మహిళకు పుట్టిన బిడ్డ ఆచూకీ వెంటనే కనుక్కోవాల్సిందిగా దిల్లీ పోలీసు ఉన్నతాధికారులకు గురువారం సుప్రీంకోర్టు సూచించింది. ఈ తల్లీబిడ్డలు దేశం దాటి వెళ్లకుండా లుకౌట్ నోటీసు జారీ చేయాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ మేరకు ఆమె పాస్‌పోర్టును స్వాధీనం చేసుకొని.. దేశంలోని అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాలు, ఓడరేవులను అప్రమత్తం చేయాల్సిందిగా జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీల ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. తన నుంచి విడిపోయిన రష్యన్ మహిళ వద్ద ఉన్న బిడ్డ సంరక్షణ కోసం పోరాడుతున్న తండ్రి మైనర్ అయిన బిడ్డ కస్టడీకి సంబంధించి సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాలను ఆమె పట్టించుకోలేదని న్యాయస్థానం దృష్టికి తెచ్చారు. ఈ కేసుకు సంబంధించి మే 22న సర్వోన్నత న్యాయస్థానం జారీ చేసిన ఆదేశాల్లో వారంలో మూడు రోజులు తల్లి వద్ద, మిగతా రోజులు తండ్రి వద్ద బిడ్డ ఉండాలని పేర్కొంది. పిటిషనర్ల గౌరవానికి భంగం కలగకుండా వారి ఇళ్లపై నిఘా పెట్టాలని సైతం లజపత్ నగర్, డిఫెన్స్ కాలనీ ఠాణాలను కోర్టు ఆదేశించింది. బిడ్డతోపాటు ఆమె ఆచూకీ జులై 7 నుంచీ తెలియడం లేదని గురువారం జరిగిన విచారణలో భర్త సుప్రీంకోర్టుకు విన్నవించారు. ఆమెను కోర్టు పరిధి నుంచి తప్పించే ప్రయత్నం జరుగుతోందని, జులై 4న రష్యన్ ఎంబసీ వెనుక ద్వారం నుంచి ఓ దౌత్యాధికారి ఆమెను లోపలికి తీసుకువెళ్లినట్లు తెలుస్తోందని చెప్పారు. ఆ అధికారితో ఆమెకు సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు తెలిపారు.

రష్యన్ ఎంబసీని సంప్రదించి అధికారి నివాసంలోకి వెళ్లండి

భర్త తరఫు న్యాయవాది వాదనలు విన్న ధర్మాసనం రష్యన్ ఎంబసీని సంప్రదించి జులై 4న ఆమెతోపాటు కనిపించిన అధికారి నివాసంలోకి వెళ్లేందుకు అనుమతి పొందాలని విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖను ఆదేశించింది. పరస్పర దౌత్య మర్యాదలను దృష్టిలో పెట్టుకొని భారత్‌లోని రష్యన్ ఎంబసీ అధికారులకు తాము ఎటువంటి ఆదేశాలు జారీ చేయడం లేదని న్యాయమూర్తులు పేర్కొన్నారు. ఒకవేళ పోలీసు నివేదిక ఆధారంగా వారిలో ఎవరైనా ఈ దేశ చట్టాల పరిధిని అతిక్రమించి నేరం చేసినట్లు తేలితే చట్టం తన పని తాను చేసుకుపోతుందని స్పష్టం చేశారు. ఆ మేరకు భారతీయ అధికారులు, దిల్లీ పోలీసులతో సహకరించాల్సిందిగా రష్యన్ ఎంబసీకి కోర్టు సూచించింది. మహిళ ఆచూకీ గురించి అడిగితే ఆమె తరఫు న్యాయవాది తప్పించుకునేలా, అస్పష్టమైన సమాధానాలు చెబుతున్నారని.. ఇది ఆ లాయరు నిజాయతీ ప్రవర్తనపై సందేహాలు లేవనెత్తుతున్నట్లు వ్యాఖ్యానించింది. ఈ కేసుకు సంబంధించిన స్థితి నివేదికను సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించిన ధర్మాసనం తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. తమ ఆదేశాలను సొలిసిటర్ జనరల్, అదనపు సొలిసిటర్ జనరల్‌తోపాటు దిల్లీ పోలీసు కమిషనరుకు పంపాల్సిందిగా కోర్టు ఆదేశించింది. ఈ కేసులోని రష్యన్ మహిళ 2019లో ఎక్స్-1 వీసాతో భారత్‌కు వచ్చి, గడువు ముగిసినా ఇక్కడే ఉంటోంది.



ఐదేళ్లలో 134 మంది నిందితులు స్వదేశానికి

సీబీఐ అధికారుల వెల్లడి

దిల్లీ: భారత్‌లో నేరాలకు పాల్పడి విదేశాలకు పారిపోయిన వారిలో 134 మందిని గడిచిన ఐదేళ్లలో కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) స్వదేశానికి రప్పించింది. 2010-2019 మధ్య కాలంలో కేవలం 74 మందిని మాత్రమే భారత్‌కు తీసుకువచ్చారని, 2020-2025 మధ్య ఈ సంఖ్య రెట్టింపు అయినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకూ 23 మంది నేరస్థులను దేశానికి తీసుకువచ్చినట్లు తెలిపారు. సాంకేతిక పురోగతి, ఇంటర్‌పోల్‌తో సమన్వయం, ఇతర దేశాలతో అవగాహన కారణంగానే ఇది సాధ్యమైందన్నారు. గడిచిన దశాబ్ద కాలంలో విదేశాలతో మన దౌత్యం గణనీయంగా మెరుగుపడినట్లు చెప్పారు. తాజాగా అమెరికాలో నేహాల్ మోదీ, మోనికా కపూర్ అరెస్టులు సీబీఐ విజయానికి ఉదాహరణలుగా పేర్కొన్నారు. 2024 డిసెంబరు నాటికి 65 మంది భారతీయ నేరస్థుల అప్పగింత అభ్యర్థనలు అమెరికాలో పెండింగులో ఉన్నాయి. భారత్ ఇప్పటివరకు 48 దేశాలతో నేరగాళ్ల అప్పగింత ఒప్పందాలపై సంతకాలు చేసింది.

చేతులెత్తి రోజంతా నిలబడండి

- దిల్లీ కోర్టులో వినూత్న శిక్ష

దిల్లీ: కోర్టు ధిక్కారానికి పాల్పడిన నలుగురు నిందితులకు దిల్లీ న్యాయస్థానం వినూత్న శిక్ష విధించింది. చేతులు పైకెత్తి కోర్టు హాలులో రోజంతా నిలబడాలని ఆదేశించింది. 2018కి సంబంధించిన ఓ కేసు తుది విచారణలో జ్యుడీషియల్ మేజిస్ట్రేటు సౌరభ్ గోయల్ ఈ శిక్ష విధించారు. "ఉదయం 10 నుంచి 11.40 గంటల మధ్య వేచి ఉండి, రెండుసార్లు పిలిచినా నిందితులు బెయిలు బాండ్లు సమర్పించలేదు. కోర్టు సమయం వృథా చేయడమంటే మా ఉత్తర్వులను ధిక్కరించడమే. ఐపీసీలోని 228వ సెక్షను కింద నిందితులు కోర్టు సమయం ముగిసేదాకా చేతులను నిటారుగా పైకెత్తి నిలబడాలి" అని జడ్జి తన ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ కేసు నిందితుల్లో ఇద్దరు ఇప్పటికే మృతిచెందగా.. కుల్దీప్, రాకేశ్, ఉపాసన, ఆనంద్ మిగిలారు. మధ్యాహ్నం 12.48 గంటల ప్రాంతంలో కుల్దీప్ బెయిలు బాండ్లతోపాటు దరఖాస్తును సమర్పించడంతో.. కోర్టు కస్టడీ నుంచి అతడి విడుదలకు జడ్జి అనుమతించారు.



ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ వద్ద గురువారం గంగానది ఉగ్రరూపం

125 యూనిట్ల వరకు బిహార్‌లో ఉచిత విద్యుత్తు

ఎన్నికల ముందు నీతీశ్ నిర్ణయం

పట్నా: బిహార్‌లో నెలకు 125 యూనిట్ల వరకు విద్యుత్తు సరఫరా ఉచితమేనని ప్రభుత్వం వెల్లడించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ గురువారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. "మేం అధికారంలోకి వచ్చాక అందరికీ సరసమైన ధరకు విద్యుత్తు అందిస్తున్నాం. ఇప్పుడు మరో కీలక నిర్ణయం తీసుకున్నాం. ఆగస్టు 1 నుంచి వినియోగదారులు 125 యూనిట్ల వరకు విద్యుత్తు బిల్లుల్ని చెల్లించాల్సిన అవసరం లేదు. దీనివల్ల రాష్ట్రంలో మొత్తం 1.67 కోట్ల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుంది. అలాగే పేద కుటుంబాలకు కుటీర్ జ్యోతి పథకం కింద వారి ఇళ్లపై సౌర విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటుకు అయ్యే మొత్తం ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుంది" అని వివరించారు. తాము అధికారంలోకి వస్తే 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు ఇస్తామని ఆర్జేడీ నేత తేజస్వీయాదవ్ హామీ ఇస్తున్న నేపథ్యంలో నీతీశ్ నుంచి తాజా ప్రకటన వెలువడింది.

5.76 లక్షల మందికి పలుచోట్ల ఓట్లు: ఈసీ

దిల్లీ: బిహార్‌లో 5.76 లక్షల మంది ఓటర్ల పేర్లు పలుచోట్ల నమోదై ఉన్నాయని ఎన్నికల సంఘం(ఈసీ) వెల్లడించింది. 12.55 లక్షల మందికి పైగా ఓటర్లు మరణించి ఉండవచ్చని పేర్కొంది. రాష్ట్రంలోని మొత్తం 7.90 కోట్ల మంది ఓటర్లలో ప్రస్తుతం జరుగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణలో 35.69 లక్షలకు పైగా ఓటర్ల చిరునామాలు క్షేత్రస్థాయి అధికారులకు లభించలేదని ఈసీ తెలిపింది. 17.37 లక్షల మంది ఓటర్లు శాశ్వతంగా వేరే చోటకు తరలిపోయారని, రానున్న రోజుల్లో ఈ గణాంకాలు మారుతాయని తన నివేదికలో ఎన్నికల సంఘం వివరించింది.

1563 మందిని భారత్‌కు తిప్పి పంపిన అమెరికా

దిల్లీ: ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి దాకా అమెరికా.. 1,563 మంది భారతీయుల్ని స్వదేశానికి తిప్పి పంపిందని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ గురువారం వెల్లడించారు. వారిలో ఎక్కువ మంది వాణిజ్య విమానాల్లోనే వచ్చారని తెలిపారు. భారత జాతీయత రూఢీ అయిన వారినే తిప్పి పంపుతున్నారని వివరించారు.

ఉత్తరాఖండ్ సరిహద్దుల్లో 251 అడుగుల కాషాయ జెండాలు

హరిద్వార్: రాష్ట్రానికి ఉన్న అన్ని సరిహద్దుల్లో 251 అడుగుల కాషాయ జెండాలను ఏర్పాటు చేయనున్నట్లు ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామి తెలిపారు. ఇవి ప్రపంచంలోనే ఎత్తైన ఆధ్యాత్మిక జెండాలు కానున్నాయని పేర్కొన్నారు. హరిద్వార్‌లోని గంగా నదీ తీరాన గురువారం 'ధర్మ ధ్వజ్' పేరుతో ఏర్పాటు చేయనున్న ఈ జెండాకు శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన ఈ విషయం తెలిపారు.

సిబ్బంది లేకుండా ఆహారశుద్ధి ఎలా?

- 580 ఖాళీలతో ఆహార కల్తీ కట్టడి సాధ్యమేనా!
- దశాబ్దంగా అందుబాటులోకి రాని ప్రయోగశాలలు
- ఏడాదిన్నరగా రోడ్డెక్కని 'ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్'

ఈనాడు, అమరావతి: రోజురోజుకూ పెరిగిపోతున్న ఆహార కల్తీ ప్రజారోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టేస్తోంది. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లేకపోవడం, తూతూమంత్రపు చర్యలే ఈ పరిస్థితికి కారణం. ప్రజారోగ్యంతో ముడిపడిన కీలకమైన 'ఆహార భద్రత- ప్రమాణాల శాఖ'ను నిధులు, సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ కేటగిరీల్లో 580 పోస్టులు ఖాళీగా ఉన్నా భర్తీలో ఏళ్లుగా నిర్లక్ష్యం కొనసాగుతోంది. రాష్ట్రస్థాయి ప్రయోగశాలలు సైతం అందుబాటులోకి రాలేదు. సంచార వాహనాలతో ప్రజల్లో అవగాహన పెంచి, అక్కడికక్కడే ఆహార పరీక్షలకు నిర్దేశించిన 'ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్' వాహనాలు సైతం బడ్జెట్, సిబ్బంది లేక రోడ్డెక్కలేదు. ఈ అడ్డంకులన్నీ దాటితే తప్ప కల్తీల కట్టడి సాధ్యపడదు.

చక్కదిద్దకపోతే చిక్కులే.. : అన్ని జిల్లాల్లోనూ ఫుడ్ సేఫ్టీ అధికారుల కొరత ఉంది. ఉన్న అరకొర సిబ్బందికి కోర్టు కేసులు, సమీక్షలతోనే సరిపోతోంది. ఫిర్యాదులు వస్తేనే తనిఖీలు.. లేదంటే ఆ ఊసే లేదన్నట్లు తయారైంది పరిస్థితి.

◆ రాష్ట్ర వ్యాప్తంగా ఈ శాఖలో 723 మంది సిబ్బందికిగాను ఉన్నది 143 మంది మాత్రమే. ఎన్‌ఫోర్స్‌మెంటులో 63 ఖాళీలు, 11 ప్రాంతీయ ల్యాబ్‌లలో 101 ఖాళీలు నింపాల్సి ఉంది. రాష్ట్ర విభజనలో భాగంగా 2022 ఏప్రిల్‌లో 279 పోస్టులు ఏపీకి కేటాయిస్తే.. కేవలం ఆరుగురే విధుల్లో ఉన్నారు. 2019 ఫిబ్రవరి 2న విడుదలైన జీవో 34 ప్రకారం మంజూరైన 143 పోస్టులూ వైకాపా ప్రభుత్వ నిర్వాకంతో భర్తీ కాలేదు. జిల్లాల విభజనతో పర్యవేక్షణలో సమస్యలు మరింతగా పెరిగాయి.

◆ ఐపీఎం రాష్ట్ర ప్రధాన కార్యాలయం ఉన్న మంగళగిరితోపాటు కడప, అనంతపురం, ఒంగోలు, శ్రీకాకుళం జిల్లాల్లో అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్లు లేరు. ఈ పోస్టులతోపాటు పార్వతీపురం మన్యంలో గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్, మిగిలిన జిల్లాల్లో 17 ఫుడ్‌సేఫ్టీ అధికారుల పోస్టులు తక్షణం భర్తీచేస్తే పర్యవేక్షణ పెరిగే అవకాశం ఉంది. శాంపిల్ టేకర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మినిస్టీరియల్ సిబ్బంది ఖాళీలు నింపాల్సి ఉంది.



గుంటూరులోని ఆహార భద్రత కార్యాలయం వద్ద నిరుపయోగంగా 'ఫుడ్‌సేఫ్టీ ఆన్ వీల్స్' వాహనం



తెలంగాణలోని నాచారం ల్యాబ్‌కు పంపడానికి సిద్ధం చేసిన నమూనాలు

11 ఏళ్లుగా తెలంగాణలోనే పరీక్షలు

రాష్ట్ర విభజన జరిగి దశాబ్దం దాటినా ఇప్పటికీ తెలంగాణలోని నాచారంలో ఉన్న ప్రజారోగ్య ప్రయోగశాలకే ఆహార నమూనాలను పరీక్ష కోసం పంపుతున్నారు. రాష్ట్ర విభజన తర్వాత విశాఖ, గుంటూరు తిరుపతి, తిరుమలలో రూ.20 కోట్ల చొప్పున కేటాయిస్తూ రాష్ట్రస్థాయి ల్యాబ్‌లు మంజూరైనా అందుబాటులోకి రాలేదు. దీంతో ప్రతినెలా 500కు పైగా ఆహార నమూనాలను పొరుగు రాష్ట్రానికి పంపాల్సి వస్తోంది. ఏలూరు, కర్నూలు, ఒంగోలులోని ప్రాంతీయ ల్యాబ్‌లతోపాటు జిల్లాల్లోని ప్రజారోగ్య, నీటి నాణ్యత పరీక్ష కేంద్రాల్లోనూ ఎనలిస్టులు, విశ్లేషణకు రసాయనాలు, పరికరాల కొరత, వసతి సమస్యలు వేధిస్తున్నాయి. గతేడాది మార్చిలో విశాఖ, కాకినాడ, గుంటూరు, తిరుపతి జోన్లకు నాలుగు 'ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్' సంచార వాహనాలు కేటాయించారు. ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించిన ఈ వాహనాలకు నేటికీ రిజిస్ట్రేషన్ జరగలేదు. ఎనలిస్ట్, ల్యాబ్ సహాయకుడు, డ్రైవర్ పోస్టులతోపాటు ఇంధనం, నిర్వహణ ఖర్చులకు నిధులు ఇవ్వలేదు. దీంతో ఏడాదికి పైగా అవి మూలనపడ్డాయి.



విశాఖలోని రాష్ట్ర ప్రయోగశాలకు కేటాయించిన పరికరాలు.. ఇలా స్టోర్ రూమ్‌లోనే

ఖాళీల భర్తీకి ప్రతిపాదనలు

– ఎన్.పూర్ణచంద్రరావు, జాయింట్ ఫుడ్ కంట్రోలర్ (ఇన్‌ఛార్జి), మంగళగిరి


ఏపీపీఎస్సీ ద్వారా పోస్టుల భర్తీలో జాప్యం జరుగుతున్నందున ప్రభుత్వ అనుమతితో వైద్యారోగ్యశాఖ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా ఖాళీలు నింపేలా ప్రతిపాదనలు పంపుతున్నాం. ఆగస్టు నాటికి విశాఖ ప్రయోగశాల, ఆ తర్వాత మిగిలిన ల్యాబ్‌లు అందుబాటులోకి వస్తాయి. నిర్వహణ ఖర్చులకు సబంధించి ఎఫ్ఎస్ఎస్ఏఐతో ఒప్పందం కుదుర్చుకున్నాక ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ వాహనాలను అందుబాటులోకి తెస్తాం.

మిశ్రమ ఎరువుల ధరల పెంపు

ఎరువు	పాతధర	కొత్తధర (రూపాయల్లో)
20.20.0.13	1300	1350-1400
10.26.26	1720	1850
14.35.14	1800	1900
16.16.16	1475	1600
పొటాష్	1550	1800

ఈనాడు, అమరావతి: ఖరీఫ్‌లో వ్యవసాయ పనులకు సిద్ధమవుతున్న రైతులకు చేదు కబురు. పంటల సాగులో వినియోగించే రసాయన ఎరువుల ధరలు పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ఫాస్పరస్, పొటాష్ ధరల పెరుగుదల కారణంగా మిశ్రమ ఎరువుల ధరలను కంపెనీలు పెంచేశాయి. మిశ్రమ ఎరువులతో పాటు పొటాష్ ఎరువుల్లో ధర పెంపుదల ఎక్కువగా కనిపిస్తోంది. 50 కిలోల మిశ్రమ ఎరువుల బస్తా రూ.200 నుంచి రూ.250 వరకు పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్ పరిణామాలు, రసాయన ఎరువుల తయారీలో వినియోగించే ఫాస్పరస్ ముడిసరకు ధరలు పుంజుకోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ప్రపంచ వ్యాప్తంగా వినియోగం పెరిగి డిమాండ్ ఏర్పడడం, వ్యాపార నియంత్రణలు, ఉత్పత్తిలో కొరత ఏర్పడడం, కొన్ని దేశాల మధ్య రవాణాలో వివాదాలు, నియంత్రణలు వంటి అంశాలు సైతం ఎరువుల ధరల పెరుగుదలకు కారణమవుతున్నాయి. నియంత్రణ విధానంలో భాగంగా యూరియా, డీఏపీ ధరలు మాత్రం అలాగే ఉన్నాయి. పెరిగిన ధరలు జులై 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చాయి. జూన్ నెల నుంచే రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్ వ్యవసాయ పనులు ప్రారంభం కావడంతో పెంపు ప్రభావం రైతులపై ప్రతికూలంగా మారింది. ఎరువుల ధరల పెరుగుదల ఈసారి కాస్త ఎక్కువగా ఉంది. బస్తాకు గరిష్ఠంగా రూ.250 పెరగడాన్ని రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు.

త్రిపుర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అమర్‌నాథ్‌గౌడ్



ఈనాడు, దిల్లీ: త్రిపుర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ తొడుపునూరి అమర్‌నాథ్‌గౌడ్ నియమితులయ్యారు. ప్రస్తుతం అక్కడి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్‌సింగ్ తెలంగాణ హైకోర్టుకు బదిలీ అయిన నేపథ్యంలో సీనియారిటీపరంగా రెండో స్థానంలో ఉన్న జస్టిస్ అమర్‌నాథ్‌గౌడ్‌ను తాత్కాలిక సీజేగా నియమిస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 223 కింద ఉన్న అధికారాలను అనుసరించి త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కార్యాలయ విధుల నిర్వహణ కోసం జస్టిస్ అమర్‌నాథ్‌గౌడ్‌ను నియమిస్తున్నట్లు కేంద్ర న్యాయశాఖ గురువారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఆ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులైన జస్టిస్ ఎం.ఎస్.రామచంద్రరావు బాధ్యతలు స్వీకరించేంతవరకు జస్టిస్ అమర్‌నాథ్‌గౌడ్ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి హోదాలో కొనసాగుతారని న్యాయశాఖ పేర్కొంది. ప్రస్తుతం ఝార్ఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ రామచంద్రరావును త్రిపురకు బదిలీ చేస్తూ కేంద్ర న్యాయశాఖ ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసింది. జస్టిస్ అమర్‌నాథ్‌గౌడ్ 2022 నవంబరు 11 నుంచి 2023 ఫిబ్రవరి 15 వరకు, అదే ఏడాది ఫిబ్రవరి 23 నుంచి ఏప్రిల్ 16 వరకు త్రిపుర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వర్తించారు.

నివాళి సందేశం అనువాదంలో ఫేస్‌బుక్ తప్పిదం

సంస్థ దృష్టికి తీసుకెళ్లిన కర్ణాటక సీఎం

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: నివాళి సందేశం అనువదించడంలో ఫేస్‌బుక్ చేసిన పొరపాటును కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గురువారం దాని మాతృ సంస్థ దృష్టికి తీసుకెళ్లి అప్రమత్తం చేశారు. ఇటీవల సీనియర్ నటి బి.సరోజాదేవి కన్నుమూయగా, సిద్ధరామయ్య ఆమె నివాసానికి వెళ్లి, నివాళి అర్పించారు. అనంతరం నివాళులర్పించినట్లు ఫేస్‌బుక్‌లో పేర్కొన్నారు. ఈ సందేశాన్ని కన్నడలో అనువదించిన సామాజిక మాధ్యమం సిద్ధరామయ్యే కన్నుమూశారనే అర్థం వచ్చేలా పేర్కొంది. దీనిపై సిద్ధరామయ్య, ఆయన అభిమానులు, భాషాభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది పూర్తిగా సంస్థ నిర్లక్ష్యమేనంటూ ముఖ్యమంత్రి సలహాదారుడు కేవీ ప్రభాకర్ దుయ్యబట్టారు. గురువారం సిద్ధరామయ్య ఫేస్‌బుక్ మాతృ సంస్థ 'మెటా'కు లేఖ రాసి, జరిగిన పొరపాటును సంస్థ దృష్టికి తీసుకెళ్లారు.

లొంగిపోయిన మావోయిస్టు దంపతులు

- డీకేఎస్‌జడ్‌సీ సెక్రటేరియట్ సభ్యుడు సంజీవ్, ఆయన భార్య పార్వతి
- వారిపై రూ.20 లక్షల చొప్పున రివార్డు



లొంగిపోయిన సంజీవ్, పార్వతి దంపతులను చూపుతున్న పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు

ఈనాడు, హైదరాబాద్: దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ (డీకేఎస్‌జడ్‌సీ)కి చెందిన కీలక మావోయిస్టు దంపతులు మాల సంజీవ్, పెరుగుల పార్వతి గురువారం రాచకొండ పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఇద్దరిపై రూ.20 లక్షల చొప్పున రివార్డు ఉందని, జనజీవన స్రవంతిలోకి వచ్చిన వారికి పునరావాస పథకం ఫలాలు అందేలా చూస్తామని పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అనారోగ్యం, ఇతర కారణాలతో వారు లొంగిపోయారన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా యాప్రాల్‌కు చెందిన మాల సంజీవ్ ఎలియాస్ అశోక్ ఎలియాస్ లెంగుదాదా(62) ఛత్తీస్‌గఢ్ కేంద్రంగా దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సెక్రటేరియట్ మెంబర్, చేతన నాట్య మంచ్(సీఎన్ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఉన్నాడు. జననాట్య మండలి వ్యవస్థాపక సభ్యుడిగా వ్యవహరించాడు. గద్దర్ ముఖ్య అనుచరుడిగా గుర్తింపు పొందారు. 1996లో పీపుల్స్‌వార్ మణుగూరు సాయుధ దళంలో చేరారు. డివిజన్ కమిటీ సభ్యుడిగా, రాష్ట్ర కమిటీ సభ్యుడిగా పనిచేశారు. 2002లో ములుగు జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో సంజీవ్ తప్పించుకోగా.. ఆయన భార్య విద్య మృతి చెందింది. 2007లో నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలానికి చెందిన మావోయిస్టు పార్టీ సభ్యురాలు పెరుగుల పార్వతి ఎలియాస్ ఎలియాస్ దీనా(50)ను వివాహం చేసుకున్నాడు. ఇద్దరూ కలిసి చేతన నాట్య మంచ్ ఆధ్వర్యంలో దండకారణ్యంలో సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా గిరిజనుల్ని మావోయిస్టు పార్టీ వైపు మళ్లించారు.

23 నుంచి బీఆర్క్ ప్రవేశాలు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలోని ఆర్కిటెక్చర్ వర్సిటీతోపాటు దాని అనుబంధ ప్రైవేట్ కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (బీఆర్క్) సీట్ల భర్తీ ప్రక్రియ ఈ నెల 23వ తేదీ నుంచి ప్రారంభంకానుంది. 21న దానికి సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేస్తారు. ఉన్నత విద్యామండలి కార్యాలయంలో గురువారం ప్రవేశాల కమిటీ సమావేశాన్ని ఛైర్మన్ బాలకిష్టారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు విడతల కౌన్సెలింగ్ షెడ్యూళ్లను ఖరారు చేశారు. ఆగస్టు 22 వరకు తొలి విడత, ఆగస్టు 30 వరకు రెండో విడత కౌన్సెలింగ్‌లు జరుగుతాయి. ఆ తర్వాత స్పాట్ ప్రవేశాలు నిర్వహిస్తారు. సెప్టెంబరు 1 నుంచి తరగతులు మొదలవుతాయి. కన్వీనర్ కోటా కింద మొత్తం 508 సీట్లను భర్తీ చేస్తారు.

10 లక్షల మంది బీసీలకు 'పీఎం సూర్యఘర్' కింద లబ్ధి

- ఇళ్లపై సౌర యూనిట్ల ఏర్పాటుకు నిర్ణయం
- ఎస్సీ, ఎస్టీల ఇళ్లపై రూ.5,991 కోట్లతో ఏర్పాటుకు టెండర్లు

ఈనాడు-అమరావతి, కాకినాడ: పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కింద 10 లక్షల మంది బీసీ విద్యుత్ వినియోగదారులకు అదనపు ప్రోత్సాహకాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వం 2 కిలోవాట్లకు ఇచ్చే రూ.60 వేల రాయితీకి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.20 వేలు ఇవ్వనుంది. వీటి ద్వారా సుమారు 2 వేల మెగావాట్ల సౌర విద్యుత్ అందుబాటులోకి వస్తుంది. ఇళ్లపై సౌర విద్యుత్ పలకల ఏర్పాటుకు ఇంధనశాఖ త్వరలో టెండర్లు పిలుస్తుంది. ఆ తర్వాత బీసీ వర్గాలకు చెందిన వారి నుంచి అంగీకార పత్రాలు తీసుకుని పథకాన్ని అమలు చేస్తారు. యూనిట్ ఏర్పాటుకు సగటున రూ.1.10 లక్షలు ఖర్చవుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే రాయితీ పోను...మిగిలిన రూ.30 వేలు లబ్ధిదారులు భరించాలి. ఈ మొత్తాన్నీ బ్యాంకు నుంచి రుణంగా తీసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది.

జిల్లాల వారీగా టెండర్లు

ఇళ్లపై సౌర ప్రాజెక్టు ఏర్పాటుకు ఆసక్తి చూపిన వారి నుంచి డిస్కంలు అంగీకార పత్రాలు తీసుకుని..వారి ద్వారా జాతీయ పోర్టల్‌లో దరఖాస్తు చేయిస్తాయి. యూనిట్ ఏర్పాటు, నిర్వహణ బాధ్యతలను ఎంప్యానల్ కంపెనీలకు అప్పగిస్తాయి. జాతీయ పోర్టల్‌లో నేరుగా దరఖాస్తు చేసుకున్న వారికీ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే అదనపు రాయితీ లభిస్తుంది. పథకం అమలు విధివిధానాలను ప్రభుత్వం ఖరారు చేసింది.

ఎస్సీ, ఎస్టీలకు అమలు

సూర్యఘర్ పథకం కింద ఇప్పటికే ఎస్సీ, ఎస్టీల ఇళ్లపై ఉచితంగా సౌర విద్యుత్ యూనిట్ల ఏర్పాటుకు నెడ్‌క్యాప్ టెండర్లు పిలిచింది. వారికి నెలకు 200 యూనిట్ల వరకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. సుమారు 20 లక్షల మంది ఉచిత విద్యుత్ పథకాన్ని వినియోగించుకుంటున్నారు. రూఫ్ టాప్ ప్రాజెక్టుల కోసం సుమారు 10 లక్షల మంది దరఖాస్తు చేశారు. అందులో యూనిట్ల ఏర్పాటుకు 5,99,105 మంది ఇళ్లపై వెసులుబాటు ఉందని అధికారులు గుర్తించారు. వాటి ద్వారా 1,198.21 మెగావాట్ల విద్యుత్ వస్తుందని అంచనా. దీనికి అయ్యే రూ.5,991.05 కోట్లను డిస్కంలు భరిస్తాయి. యూనిట్ ఏర్పాటుకు రూఫ్ టాప్ వినియోగించుకున్నందుకు ప్రతి నెలా రూ.200 చొప్పున ప్రభుత్వం వినియోగదారుకు చెల్లిస్తుంది.